శుక్రవారం 8-9-2023

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 356

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | BANGALORE | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



అల్‌కరాజ్ అలవోకగా...

యూఎస్ ఓపెన్ సింగిల్స్‌లో సెమీస్‌లోకి డిఫెండింగ్ చాంపియన్ - 13లో



భారత్‌లో ఫాక్స్‌కాన్ ఈవీ ప్లాంట్!

తైవాన్‌కు చెందిన చిప్ తయారీ సంస్థ యోచన - 13లో



ఆసియాన్‌తో సహకారానికి..

ఆసియాన్ కూటమి, భారత్ మధ్య మరింత సహకారానికి 12 సూత్రాల ప్రతిపాదనను ప్రధాని మోదీ తెరమీదకు తెచ్చారు.

వివరాలు 6లో ▸



ఆదిత్య-ఎల్1 సెల్ఫీ!

సూర్యుడి దిశగా దూసుకుపోతున్న ఆదిత్య-ఎల్1 కెమెరా పని మొదలుపెట్టింది. తన సెల్ఫీతో పాటు భూమిని, చంద్రుడిని క్లిక్ మనిపించింది.

వివరాలు 6లో ▸



ప్రజల దృష్టి మళ్లించేందుకు..

తొమ్మిదేళ్ల వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రధాని మోదీ తన వ్యాఖ్యలపై రాద్ధాంతం చేస్తున్నారని ఉదయనిధి మండిపడ్డారు.

వివరాలు 6లో ▸



వారి వ్యాఖ్యలను అంగీకరించం

సనాతన ధర్మంపై డీఎంకే నేతలు ఉదయనిధి, ఎ.రాజా చేసిన వ్యాఖ్యలతో తాము ఏకీభవించబోమని కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్ చెక్



మీ నిర్లక్ష్యంతోనే నవ్వుల పాలు!

- వర్సిటీల్లో 1,383 పోస్టుల భర్తీకి బాబు అస్తవ్యస్త చర్యలు
- నాడు పోస్టులలో భారీగా కోతపెట్టినా నోరెత్తని రామోజీ
- నిబంధనలు బేఖాతర్.. న్యాయ వివాదాలు తలెత్తినా మౌనమే.. నేడు నిబంధనల ప్రకారం హేతుబద్ధీకరణ
- ఏకంగా 3,295 పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నా ఏడుపే
- పోస్టులు తగ్గిపోయాయంటూ గగ్గోలు.. పలు వర్సిటీలకు అదనపు పోస్టులిచ్చినా తప్పుదోవ పట్టించేలా కథనాలు

14 లో

చందాదారులకు మార్గదర్శి బెదిరింపులు

చెప్పింది చేయండి

మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్ ఆఫీసు నుంచే కాల్స్

- దర్యాప్తునకు సహకరించవద్దని హెచ్చరికలు
- రాష్ట్రంలో తమకు తెలియకుండానే చిట్‌లు ఉన్న ఘోస్ట్ చందాదారులు 3 వేలకు పైనే
- చందాదారులు, ఏజెంట్లను నిలువునా ముంచుతున్న సంస్థ.. అప్పుల ఊబిలోకి దించి ఆస్తులు రాయించుకుంటున్న వైనం
- బాధితుల ఫిర్యాదుతో శైలజా కిరణ్ సహా ఇతరులపై మూడు కేసులు
- మార్గదర్శిలో రూ.కోటికిపైగా అక్రమ డిపాజిట్లు చేసిన వారు 800 మంది పైనే.. ఈ సొమ్ము ఎక్కడిదంటూ వీళ్లకు నోటీసులు
- మార్గదర్శి మోసాలను వెల్లడించిన సీఐడీ అదనపు డీజీ సంజయ్.. రూ.9.43 కోట్ల జగజ్జనని చిట్ ఫండ్స్ ఆస్తులు అటాచ్‌మెంట్



మాట్లాడుతున్న సీఐడీ అదనపు డీజీ సంజయ్. చిత్రంలో సీఐడీ ఎస్పీ ఫక్కీరప్ప, బాధితురాలు అన్నపూర్ణ

సాక్షి, అమరావతి: సీఐడీ దర్యాప్తునకు సహకరించవద్దని మార్గదర్శి చిట్ ఫండ్స్ చందాదారులను ఆ సంస్థ యాజమాన్యం బెదిరిస్తోందా? మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ శైలజ కిరణ్ ఆఫీసు నుంచే చందాదారులకు ఫోన్లు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతోందా? ఇంతగా బరితెగించడం నిజమేనా? దీనిపై బాధితులు ఫిర్యాదు చేస్తున్నారా? తదితర ప్రశ్నలన్నింటికీ సీఐడీ విభాగం అవునని స్పష్టం చేస్తోంది. ఘోస్ట్ చందాదారుల పేరిట అక్రమాలకు పాల్పడుతుండటాన్ని సీఐడీ ఆధారాలతోసహా వెలికి తీస్తుంటే

మిగతా 3వ పేజీలో ▶

ప్రజలందరికీ.. 'ఆరోగ్య సురక్ష'

- మరో విప్లవాత్మక కార్యక్రమం చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం
- 'జగనన్న ఆరోగ్య సురక్ష'తో మరింత మెరుగైన వైద్యం
- ఈ నెల 15 నుంచి ఇంటింటికి వెళ్లి వలంటీర్లు ప్రచారం
- 16 నుంచి ఏఎన్ఎంలు, సీహెచ్‌ఓల ఆరోగ్య సర్వే
- పరీక్షల ద్వారా ఆరోగ్య సమస్యలు గుర్తించనున్న సిబ్బంది
- 30వ తేదీ నుంచి వైద్య శిబిరాలు.. నెల పాటు నిర్వహణ
- సేవలందించనున్న స్పెషలిస్ట్ డాక్టర్లు, పీహెచ్‌సీ వైద్యులు, ఇతర సిబ్బంది
- ఉచితంగా చికిత్స, మందులు.. అవసరమైతే పెద్దాస్పత్రులకు రిఫర్



2 లో



అతిథులొస్తున్నారు

నేడు భారత్‌కు ప్రపంచ దేశాధినేతల ఆగమనం

రేపు ఢిల్లీలో ప్రారంభంకానున్న జీ-20 శిఖరాగ్ర సదస్సు

2 లో

ప్రపంచంలోని ప్రధాన దేశాల అధినేతలు నేడే ఢిల్లీలో అడుగు పెట్టనున్నారు. జీ20 శిఖరాగ్ర సదస్సులో పాల్గొని తమ వాణిని వినిపించనున్నారు. అమెరికా అధ్యక్షుడు బైడెన్ మొదలు బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ వరకు పలు దేశాల నాయకగణం నేడే హస్తినకు చేరుకోనుంది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తొలిసారి జీ20 సదస్సుకు హాజరు కావడం లేదు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సైతం ఈ భేటీకి గైర్హాజరు అవుతున్నారు.

ఏపీలో విద్యాసంస్కరణలు అద్భుతం



ఆంధ్రప్రదేశ్‌లో విద్యాసంస్కరణలు అద్భుతంగా ఉన్నాయని నోబెల్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ మైకెల్ రాబర్ట్ క్రెమర్ ప్రశంసించారు. ఆయన చికాగో యూనివర్సిటీ బృందంతో కలిసి ఏలూరు జిల్లాలో వివిధ పాఠశాలలను సందర్శించనున్నారు.


2 లో

14న ఐదు వైద్య కాలేజీలు ప్రారంభం



రాష్ట్రంలో ఐదు కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను ఈ నెల 14న సీఎం జగన్ లాంఛనంగా ప్రారంభించనున్నారు. విజయనగరం వైద్య కళాశాలను స్వయంగా.. రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల కాలేజీలను వర్చువల్‌గా ప్రారంభిస్తారు.

2 లో



గైనిక్ సర్జరీల్లోనూ రోబోలు

- లేపరోస్కోపీ సర్జరీలతో పోలిస్తే రోగికి తక్కువ నొప్పి,ఇన్ఫెక్షన్ ముప్పు
- త్రీడీ విజన్ వల్ల కచ్చితత్వం, శస్త్ర పరికరాలను అన్ని కోణాల్లో తిప్పే వీలు
- రోగి శరీరంలోని సంక్లిష్టమైన ప్రదేశాలనూ చేరుకోవచ్చు

హైదరాబాద్‌లోనూ ఈ చికిత్సా విధానం అందుబాటులోకి..

అపోలో ఆసుపత్రి డాక్టర్ అనురాధా పాండా వెల్లడి

సాక్షి, హైదరాబాద్: వైద్య రంగంలో అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రోబోటిక్ సర్జరీలు హైదరాబాద్‌లోనూ విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. పేరొందిన దాదాపు ప్రతి ఆసుపత్రీ ఈ శస్త్రచికిత్సా విధానాన్ని ఉపయోగిస్తోంది. చికిత్సా వ్యయం ఎక్కువైనప్పటికీ ఎక్కువ మంది రోగులకు నప్పే అనేక ప్రయోజనాల వల్ల రానురానూ రోబోటిక్ సర్జరీల ఎంపిక కూడా పెరుగుతోంది. విభిన్న రకాల శస్త్రచికిత్సల్లో దోహదపడుతున్న రోబోటిక్ సర్జరీ గైనకాలజీ విభాగంలోనూ ఇప్పుడిప్పుడే వేగం పుంజుకుంటోంది. ఈ నేపథ్యంలో గైనకాలజీ శస్త్రచికిత్సల్లో రోబోల వాడకం వల్ల కలిగే ప్రయోజనాల గురించి అపోలో ఆసుపత్రికి చెందిన కన్సల్టటెంట్ అబ్‌స్టెట్రిషియన్ అండ్ గైనెకాలజిస్ట్ డాక్టర్ అనురాధా పాండా మరిన్ని వివరాలు తెలియజేశారు. అవి ఏమిటంటే...

మరింత కచ్చితత్వం...

''గైనకాలజీలో రోబో అసిస్టెడ్ కీహోల్ సర్జరీని కొత్త ఆవిష్కరణగా చెప్పొచ్చు. సాధారణ లేపరోస్కిపిక్ సర్జరీలతో పోలిస్తే రోబో సాయంతో చేసే సర్జరీల్లో త్రీడీ విజన్ (త్రిమితీయ ఆకారం) ఎక్కువ కచ్చితత్వాన్ని అందిస్తుంది. శస్త్ర చికిత్సలకు ఉపయోగించే పరికరాలను 360 డిగ్రీల కోణంలో తిప్పడానికి వీలుండటం వల్ల శరీరంలో సంక్లిష్టమైన ప్రదేశాలను సైతం చేరుకోవచ్చు. ఈ శస్త్రచికిత్సా విధానంలో తక్కువ రక్త నష్టంతో పాటు నొప్పి, ఇన్ఫెక్షన్ ముప్పు కూడా తక్కువగా ఉంటుంది. తద్వారా రోగులు ఆసుపత్రిలో ఉండాల్సిన వ్యవధి కూడా తగ్గుతుంది. ఈ శస్త్రచికిత్సల్లో సర్జన్ ఒక కంప్యూటర్ కన్సోల్ నుంచి పనిచేస్తారు. తన చేతి కదలికలతో రోబోటిక్ చేతులను కదిలిస్తూ ఆపరేషన్ నిర్వహిస్తారు.



"క్లిష్టమైన హిస్టెరెక్టమీ (గర్భాశయం తొలగింపు) ఆపరేషన్లకు రోబో సాయాన్ని ఉపయోగించవచ్చు. ప్రత్యేకించి ఊబకాయంతో ఉన్న రోగి పొత్తికడుపుపై పలు శస్త్రచికిత్సలు నిర్వహించాల్సి వచ్చినప్పుడు ఈ విధానాన్ని ఉపయోగిస్తారు. కచ్చితత్వం, తక్కువ నొప్పితోపాటు చిన్న కోతల ద్వారానే శస్త్రచికిత్స చేయడానికి ఈ విధానం వీలు కల్పిస్తుంది"అని డాక్టర్ అనురాధా పాండా వివరించారు.

గైనిక్ రోబోటిక్ సర్జరీలతో ప్రయోజనాలు...

మయోమెక్టమీ అనేది గర్భాశయ కండరాల గోడ (ఫైబ్రాయిడ్) నుంచి నిరపాయకరమైన కణితులను తొలగించడానికి ఉపయోగించే ఒక ప్రక్రియ. రోబోటిక్ సర్జరీ ఫైబ్రాయిడ్ కుట్టు తొలగింపునకు కూడా వీలు కల్పిస్తుంది.

ఎండోమెట్రియోసిస్ అనేది గర్భాశయం వెలుపల గర్భాశయ లైనింగ్ వంటి కణజాలాలు పెరిగే పరిస్థితి. ఈ కణజాలాలు హార్మోన్లకు ప్రతిస్పందిస్తాయి. పీరియడ్స్ సమయంలో రక్తస్రావం, నొప్పి ఉంటుంది. ఎండోమెట్రియోసిస్ శస్త్రచికిత్స ఒక సవాలు వంటిది. దీనికోసం పెల్విస్, పెల్విక్ సైడ్ వాల్స్‌లో లోతుగా పనిచేయాల్సిన అవసరం ఉంటుంది. రోబో అసిస్టెడ్ ఎండోమెట్రియోసిస్ శస్త్రచికిత్స ద్వారా మరింత కచ్చితమైన రీతిలో అండాశయ తిత్తిని తొలగించడం సాధ్యపడుతుంది.

పేగు, మూత్రాశయం, మూత్ర నాళానికి అతుక్కొని ఉండే డీప్ ఇన్‌ఫిల్ట్రేటింగ్ ఎండోమెట్రియోసిస్ వ్యాధి చికిత్సలోనూ రోబోటిక్ సర్జరీ తక్కువ సంక్లిష్టతతో కూడుకుంటున్నదని పలు అధ్యయనాలు తెలిపాయి.

హిస్టెరెక్టమీ సర్జరీ తర్వాత కొందరిలో తలెత్తే వాల్ట్ ప్రోలాప్స్ అనే పరిస్థితిని సరిదిద్దడంలోనూ రోబోటిక్ సర్జరీ ఉపకరిస్తుంది.

ఊబకాయ రోగుల్లో శస్త్రచికిత్సలకు లేపరోస్కోపీతో పోలిస్తే రోబోటిక్ సర్జరీ వారి అనారోగ్యాన్ని, ఆసుపత్రిలో ఉండే వ్యవధిని తగ్గిస్తుంది.

లేపరోస్కోపీతో పోల్చినప్పుడు రోబోటిక్ శస్త్రచికిత్స ఎక్కువ ఖర్చుతో కూడుకున్నది. అయితే భవిష్యత్తులో ఈ చికిత్సా విధానం వాడకం మరింత విస్తృతమైతే ఈ సర్జరీల ధరలు తగ్గే అవకాశం ఉంది.



అత్యంత ఖరీదైన నివాస నగరం ముంబై

సాక్షి, అమరావతి: భారత్‌లో అత్యంత ఖరీదైన నివాస నగరంగా దేశ ఆర్థిక రాజధాని ముంబై నిలిచింది. ప్రాపర్టీ కన్సల్టెంట్ సంస్థ.. నైట్‌ఫ్రాంక్ ఇండియా రూపొందించిన 'అఫర్డబిలిటీ ఇండెక్స్'లో ఈ విషయం వెల్లడైంది. కాగా అత్యంత సరసమైన నివాస నగరంగా గుజరాత్‌లోని అహ్మదాబాద్ నిలిచింది. మరోవైపు ఢిల్లీ, బెంగళూరులను వెనక్కి నెట్టి ఖరీదైన నివాసయోగ్య నగరాల జాబితాలో హైదరాబాద్ రెండో స్థానంలో నిలవడం విశేషం. గృహ రుణాలపై వడ్డీ రేట్ల పెంపుదల ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో నివాస సముదాయాల కొనుగోలుపై ప్రభావం చూపిందని నైట్‌ఫ్రాంక్ నివేదిక వెల్లడించింది. 2023లో ఇప్పటివరకు అధిక గృహ రుణరేట్లు అన్ని చోట్లా ఈఎంఐ స్థోమతను తగ్గించాయని ఇండెక్స్ చూపిస్తోంది.

ఆదాయంలో సగం ఈఎంఐలకే..

గృహ రుణం ఈఎంఐ నిష్పత్తి ఆధారంగా ఒక నిర్దిష్ట నగరంలోని సగటు కుటుంబానికి చెందిన మొత్తం ఆదాయంపై ఆధారపడి స్థోమతను అంచనా వేస్తారు. ఒక నగరంలో 40 శాతం అఫర్డబిలిటీ ఇండెక్స్ ఉంటే ఆ నగరంలోని కుటుంబాలు వారి ఆదాయంలో 40 శాతాన్ని గృహ రుణం కోసం ఈఎంఐల రూపంలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇక్కడ 50 శాతం కంటే ఎక్కువ ఈఎంఐ చెల్లించడమంటే మోయలేని భారంగా పరిగణిస్తారు. ఈ ఏడాది ముంబైలో ఏకంగా 55 శాతం ఇండెక్స్ చూపిస్తుంటే.. ఇక్కడ ఒక సగటు కుటుంబం ఇంటిని పొందడానికి హోమ్ లోన్‌లో సగానికి పైగా ఈఎంఐకే కేటాయించాల్సి వస్తోంది. ఇలాంటి సందర్భాల్లో బ్యాంకులు సైతం తనఖా లోన్లు ఇవ్వడానికి వెనుకాడతాయి. అయితే గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరం 23% నిష్పత్తితో అత్యంత సరసమైన నివాస మార్కెట్‌గా నిలిచింది. ఆ తర్వాత పుణే, కోల్‌కతా 26% చొప్పున, బెంగళూరు, చెన్నై 28 శాతం చొప్పున ఉన్నాయి. ఇక హైదరాబాద్‌లో కొంత కాలంగా రియల్ ఎస్టేట్ పెరగడంతో అక్కడ ఇండెక్స్ 31 శాతానికి వెళ్లింది.

2021 వరకు స్థిరంగానే..

కరోనా మహమ్మారి సమయంలో ఆర్బీఐ రెపో రేట్లను దశాబ్దపు కనిష్టానికి తగ్గించింది. అంతకు ముందు దేశంలోని ఎనిమిది నగరాల్లో 2010–2021 వరకు కుటుంబ స్థోమత సూచీ స్థిరంగా ఎక్కువగా ఉన్నట్టు నైట్‌ఫ్రాంక్ గుర్తించింది. ఈ క్రమంలో 2021లో స్థోమత సూచీ తగ్గింది. గతేడాది మే నుంచి పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసేందుకు ఆర్బీఐ బెంచ్‌మార్క్ రెపోరేటును 250 బేసిస్ పాయింట్లు పెంచింది. ఇది నగరాల్లో ఆర్థిక స్థోమతపై 2.5 శాతం ప్రభావం చూపించింది. అప్పటి నుంచి ఈఎంఐ భారం 14.4 శాతం పెరిగింది.

అఫర్డబిలిటీ ఇండెక్స్‌లో ఈఎంఐ-టు-ఆదాయ నిష్పత్తి (శాతాల్లో)..

నగరం	2019	2020	2021	2022	2023
ముంబై	67	61	52	53	55
హైదరాబాద్	34	31	28	30	31
ఢిల్లీ(ఎన్సీఆర్)	34	38	28	29	30
బెంగళూరు	32	28	26	27	28
చెన్నై	30	26	24	27	28
పుణే	29	26	24	25	26
కోల్‌కతా	32	30	25	25	26
అహ్మదాబాద్	25	24	20	22	23

క్లుప్తంగా...

నేడు విశాఖకు గవర్నర్ అబ్దుల్ నజీర్

ఐదు రోజుల పాటు పర్యటన

సాక్షి, విశాఖపట్నం : గవర్నర్ అబ్దుల్ నజీర్ ఐదు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం విశాఖకు చేరుకోనున్నారు. విశాఖతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు శుక్రవారం సాయంత్రం విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని అక్కడి నుంచి నేరుగా పోర్టు గెస్ట్‌హౌస్‌కి వచ్చి రాత్రి బస చేయనున్నారు. శనివారం ఉదయం నోవాటెల్‌లో జరగనున్న సమాచార కమిషనర్ల జాతీయ సమాఖ్య సదస్సులో పాల్గొంటారు. సాయంత్రం ఏయూ స్నాతకోత్సవంలో చాన్స్లర్ హోదాలో పాల్గొననున్నారు. ఆదివారం అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యటనలో భాగంగా అరకులోని రైల్వే గెస్ట్ హౌస్‌కు చేరుకోనున్నారు. 11వ తేదీ సాయంత్రం విశాఖలోని తూర్పు నౌకాదళ ప్రధాన స్థావరాన్ని సందర్శిస్తారు. 12న రుషికొండలోని సాయిప్రియా రిసార్ట్‌లో జరిగే జైళ్ల శాఖ జాతీయ సదస్సుకు హాజరుకానున్నారు. మంగళవారం గన్నవరం చేరుకుంటారని రాజ్‌భవన్ వర్గాలు వెల్లడించాయి.

గవర్నర్‌ను కలిసిన ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులు



సాక్షి, అమరావతి: రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను రాజ్‌భవన్‌లో ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు, కమిషన్ సభ్యులు గురువారం కలిసి ఎస్టీలకు సంబంధించిన పలు అంశాలను చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీల కోసం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందని వివరించారు. ఎస్టీల హక్కుల పరిరక్షణకు సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధతో ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేశారని గవర్నర్‌కు ఎస్టీ కమిషన్ చైర్మన్ వివరించారు. ఎస్టీ కమిషన్ పనితీరు బాగుందని ఈ సందర్భంగా గవర్నర్ అభినందించారు. సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్, లిల్లీ, కె.రామలక్ష్మి, సీహెచ్ మురళీకృష్ణ, ఎం.విశ్వేశ్వరరాజు, కార్యదర్శి పద్మ పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు 250 మంది



సాక్షి, అమరావతి: వైద్య శాఖలోని డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీలో భాగంగా 250 మందితో ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఎంపిక జాబితాను విడుదల చేసింది. 590 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి గత జూలైలో బోర్డ్ నోటిఫికేషన్ ఇచ్చింది. కోర్టు కేసుల కారణంగా 5 స్పెషాలిటీల్లో 100 పోస్టుల భర్తీ పెండింగ్‌లో ఉంచారు. మిగిలినవాటి భర్తీలో భాగంగా 33 స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీల్లో క్లినికల్, నాన్-క్లినికల్‌లో అర్హులైన అభ్యర్థుల్లో 250 మందిని ఎంపిక చేశారు.

విధుల నుంచి తహసీల్దార్ తొలగింపు

తాడికొండ/గుంటూరు వెస్ట్: గుంటూరు జిల్లా తుళ్లూరు తహసీల్దార్‌గా పనిచేసిన ఆరెమండ సంజీవకుమారిని విధుల నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. తుళ్లూరులో పనిచేసినప్పుడు భూముల కుంభకోణంపై ఆరోపణలొచ్చాయి. విచారణలో అవి రుజువు కావడంతో విధుల నుంచి తొలగించారు. నదీ భూములను సాగు భూమిగా మార్చి టీడీపీ నేతల పేరుతో మార్చి ల్యాండ్ పూలింగ్‌లో తీసుకోమని ఒత్తిడి చేసిన నేపథ్యంలో ఈ కుంభకోణాన్ని 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. రాయపూడి రెవెన్యూ పరిధిలో 1/12–2బీ, 2ఏ, 16–ఏ2, 16–బీ2, 71–ఏ, 15–ఏ, 15–బీ, 17–ఏ, 225–1, 72, 96 సర్వే నంబర్లలో నదీ ప్రవాహం వెళుతోంది. ప్రవాహంలో కొట్టుకుపోయిన భూములకు చట్టవిరుద్ధంగా రికార్డులు సృష్టించి సాగు భూమిగా మార్చి సుమారు 20 ఎకరాలను టీడీపీ నేతల పేరిట నమోదు చేశారు. వీటి విలువ సుమారు రూ.30 కోట్లకు పైనే. తహసీల్దార్ ప్రైవేటు కారు డ్రైవర్ సీతారామయ్యకు సర్వే నెంబర్ 16–బీలో 21 సెంట్లను టీడీపీ నేతలు ఇచ్చారు. మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావుకు దగ్గరగా ఉండే వ్యక్తి కావడం, ఆయన సహకారంతో టీడీపీ నేతల పేరిట భూములు నమోదు చేసినట్టు ఆరోపణలొచ్చాయి. నదీతీర ప్రాంతాన్ని సాగు భూమిగా మార్చినందుకు టీడీపీ నేతలు తహసీల్దార్ కుటుంబ సభ్యులకు భూములు పంచారు. ఈ భూముల్ని సీఆర్‌డీఏకు ల్యాండ్ పూలింగ్‌కు తీసుకోమని ఒత్తిడి తీసుకురావడంతో విషయం బయటకు పొక్కింది.

■ తెలంగాణ

వచ్చే నెలలో తెలంగాణకు సీఈసీ బృందం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ ఎన్నికల నిర్వహణకు సంసిద్ధతను పరిశీలించడానికి కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) రాజీవ్‌కుమార్ నేతృత్వంలో ఎలక్షన్ కమిషనర్లు అనూప్‌చంద్ర పాండే, అరుణ్ గోయల్ బృందం వచ్చే నెల తొలి వారంలో తెలంగాణలో పర్యటించనుంది.

ఉపాధిలో 'ఎంఎస్ఎంఈ'ల రికార్డు

- ఐదు నెలల్లోనే 7.01 లక్షల మంది స్థానికులకు ఉపాధి
- ఈ ఏడాది మొత్తం ఉపాధి కల్పన లక్ష్యం 7.50 లక్షలు
- ఇప్పటికే 93 శాతం లక్ష్యాన్ని సాధించిన రాష్ట్ర ప్రభుత్వం
- చిత్తూరు, ఏలూరు, శ్రీసత్యసాయి జిల్లాలు ముందంజ
- కొత్తగా 1.50 లక్షల ఎంఎస్ఎంఈ యూనిట్ల నమోదు లక్ష్యం
- ఐదు నెలల్లోనే 97,378 యూనిట్ల ఏర్పాటు



సాక్షి, అమరావతి: ఉపాధి కల్పనలో రాష్ట్రంలోని సూక్ష్మ, మధ్య, చిన్న తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు) రికార్డు సృష్టిస్తున్నాయి. 2023–24లో ఎంఎస్ఎంఈల ద్వారా కనీసం 7.50 లక్షల మందికి ఉపాధి కల్పించాలని నిర్దేశించుకోగా కేవలం ఐదు నెలల్లోనే లక్ష్యానికి చేరువ కావడం గమనార్హం. ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన ఎంఎస్ఎంఈల ద్వారా 7,01,975 మంది స్థానికులు కొత్తగా ఉపాధి పొందినట్లు కేంద్ర ఎంఎస్ఎంఈ పోర్టల్ 'ఉద్యం' గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఆగస్టు నాటికే 93 శాతం లక్ష్యాన్ని సాధించడంతో గతేడాది తరహాలోనే రెండు రెట్లు అధికంగా ఉపాధి కల్పించే అవకాశాలున్నట్లు ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపాలకృష్ణ తెలిపారు. 2022–23లో ఎంఎస్ఎంఈల ద్వారా 1,56,252 మందికి ఉపాధి కల్పించాలని నిర్దేశించుకోగా ఏకంగా 231 శాతం అదనంగా 3,61,172 మందికి ఉపాధి కల్పించిన సంగతి తెలిసిందే.

లక్ష్యాన్ని దాటేసిన తొమ్మిది జిల్లాలు

ఎంఎస్ఎంఈ రంగంలో ఉపాధి కల్పనకు పరిశ్రమల శాఖ జిల్లాల వారీగా లక్ష్యాలను నిర్దేశించగా తొమ్మిది జిల్లాలు ఇప్పటికే లక్ష్యాన్ని దాటేసినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. చిత్తూరు, ఏలూరు, శ్రీసత్యసాయి, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, శ్రీకాకుళం, విశాఖపట్నం, కర్నూలు, వైఎస్సార్ కడప జిల్లాలు ఐదు నెలల్లోనే 100 శాతం లక్ష్యాన్ని అధిగమించాయి. చిత్తూరు జిల్లా లక్ష్యం కంటే ఇప్పటికే 317 శాతం, ఏలూరు 187 శాతం, శ్రీసత్యసాయి 151 శాతం సాధించి మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. ఈ ఏడాది 'ఉద్యం' పోర్టల్‌లో కనీసం 1.50 లక్షల ఎంఎస్ఎంఈలను నమోదు చేయాలని నిర్దేశించుకోగా ఐదు నెలల్లోనే 97,378 యూనిట్లు కొత్తగా ఏర్పాటైనట్లు అధికారులు వెల్లడించారు. ఐదు జిల్లాలు 80 శాతానికిపైగా లక్ష్యాన్ని ఇప్పటికే చేరుకున్నాయి. కొత్త యూనిట్ల ఏర్పాటు లక్ష్యంలో ఏలూరు 91 శాతం, పశ్చిమ గోదావరి 84 శాతం, ప్రకాశం 81 శాతం, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు 80 శాతం, కర్నూలు 80 శాతం లక్ష్యాన్ని చేరుకున్నాయి.

ఏపీ విద్యాసంస్కరణలు అద్భుతం

ప్రశంసించిన నోబెల్ అవార్డు గ్రహీత మైకేల్ క్రేమర్



నోబెల్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ మైకెల్ క్రేమర్‌తో కమిషనర్ సురేశ్‌కుమార్, శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో విద్యాసంస్కరణలు అద్భుతంగా ఉన్నాయని నోబెల్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ మైకెల్ రాబర్ట్ క్రేమర్ ప్రశంసించారు. ఆయన గురువారం చికాగో యూనివర్సిటీలోని డెవలప్‌మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎమిలీ క్యుపిటో బృందంతో కలిసి రాష్ట్రానికి వచ్చారు. సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్సనలైజ్డ్ అండ్ అడాప్టివ్ లెర్నింగ్ (పాల్) ప్రాజెక్టు అమలు చేస్తున్న పాఠశాలలను ఈ బృందం పరిశీలించనుంది. సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయానికి వచ్చిన ఈ బృందం పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేశ్‌కుమార్, సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావుతో విద్యాసంబంధ అంశాలపై చర్చించింది. విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను అధికారులు ఆ బృందానికి వివరించారు. ఈ బృందం మూడురోజుల పాటు ఏలూరు జిల్లాలో వివిధ పాఠశాలలను సందర్శించనుంది. ఈ సందర్భంగా పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ.. ఏపీ విద్యావ్యవస్థపై చికాగో యూనివర్సిటీ బృందం పరిశోధించడం అభినందనీయమన్నారు. ఇలాంటి పరిశోధనలు రాష్ట్రంలో విద్యాభివృద్ధికి మరింత దోహదపడతాయని చెప్పారు. రాష్ట్రంలో విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరిచేందుకు పర్సనలైజ్డ్ అండ్ అడాప్టివ్ లెర్నింగ్ (పాల్) బాగుందని సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎస్పీడీ డాక్టర్ కె.వి.శ్రీనివాసులు రెడ్డి, శామో జాయింట్ డైరెక్టర్ బి.విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలకు సీఎం జగన్ కృష్ణాష్టమి శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు సీఎం వైఎస్ జగన్ శుభాకాంక్షలు తెలుపుతూ గురువారం ట్వీట్ చేశారు. శ్రీకృష్ణ భగవానుడి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ రాష్ట్ర ప్రజలందరికీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు అని పేర్కొన్నారు.

ప్రజలందరికీ.. 'ఆరోగ్య సురక్ష'



సమీక్షలో అధికారులతో మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని

సాక్షి, అమరావతి/చిలకలూరిపేట: రాష్ట్ర ప్రజలందరి ఆరోగ్య రక్షణ లక్ష్యంగా వైఎస్ జగన్ ప్రభుత్వం మరో విప్లవాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని చేపట్టింది. ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించడం, ప్రాథమిక పరీక్షలతో ఆరోగ్య సమస్యలను గుర్తించడంతో పాటు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి స్పెషలిస్ట్ డాక్టర్లు, పీహెచ్‌సీ డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది ద్వారా చికిత్సలు, మందులను ఉచితంగా అందించబోతోంది. ఎవరైనా రోగులకు అవసరమైతే ప్రభుత్వాస్పత్రులు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేసి వైద్య చికిత్సలు చేయించనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఈనెల 15 నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది.

ఆరోగ్య సమస్యలకు 'స్పెషల్' చికిత్స..

ప్రజల ఆరోగ్య సమస్యలకు స్థానికంగానే స్పెషలిస్ట్ డాక్టర్ల ద్వారా చికిత్స అందించడమే 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమ ధ్యేయమని వైద్య, ఆరోగ్య శాఖ తెలిపింది. ఇందులో భాగంగా ఈనెల 15 నుంచి గ్రామ, వార్డు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య రక్షణపై అవగాహన కల్పిస్తారు. ఆరోగ్యశ్రీ కరపత్రాన్ని పంపిణీ చేసి.. సేవలను వివరిస్తారు. ఈనెల 16 నుంచి వైఎస్సార్ విలేజ్ క్లినిక్, వైఎస్సార్ అర్బన్ క్లినిక్‌ల పరిధిలోని గృహాలను ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు(సీహెచ్‌ఓలు) సందర్శిస్తారు. ప్రజలకు ప్రాథమిక వైద్య పరీక్షలు చేసి.. ఆరోగ్య సమస్యలను గుర్తిస్తారు. ఆ ఫలితాలను డాక్టర్లకు అందుబాటులో ఉంచుతారు. ఆరోగ్య సమస్యలున్న వారు వైద్య శిబిరాలకు హాజరయ్యేందుకు వీలుగా ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు టోకెన్ నంబర్లు ఇస్తారు. ఈనెల 30 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలను వైద్య, ఆరోగ్య శాఖ ఏర్పాటు చేయనుంది. ప్రతిరోజూ.. ప్రతి మండలంలోనూ ఏదో ఒక వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌తో పాటు ప్రతి పట్టణంలోనూ ఏదో ఒక వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తారు. నెల రోజుల పాటు ఈ శిబిరాల నిర్వహణ కొనసాగుతుంది. ఈ వైద్య శిబిరాల్లో మొత్తం 342 మంది స్పెషలిస్ట్ డాక్టర్లు సేవలందిస్తారు. అలాగే ఆయా మండలాల్లోని ఇద్దరు పీహెచ్‌సీ వైద్యులతో పాటు ఫ్యామిలీ డాక్టర్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొంటారు. 162 రకాల మందులతో పాటు 18 రకాల శస్త్రచికిత్సల వస్తువులు, 14 రకాల ఎమర్జెన్సీ కిట్లు తదితరాలను అందుబాటులో ఉంచుతారు. ఆరోగ్య సమస్యలున్న వారిని వైద్యులు పరీక్షిస్తారు. అవసరమైన వారికి ఈసీజీ వంటి వైద్య పరీక్షలు కూడా చేసి.. ఉచితంగా మందులిస్తారు. ఎవరికైనా పెద్ద చికిత్సలు అవసరమైతే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద రిఫర్ చేస్తారు.

స్థానికంగానే సూపర్ స్పెషాలిటీ సేవలు: మంత్రి రజిని

రాష్ట్ర ప్రజలకు 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం రక్షగా నిలవబోతోందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. ఇప్పటికే విప్లవాత్మక సంస్కరణలతో ప్రజారోగ్యానికి అండగా నిలిచిన సీఎం జగన్ మరో గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. గురువారం మంగళగిరిలోని వైద్య శాఖ కార్యాలయంలో ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. నెల రోజుల పాటు రాష్ట్రమంతా వైద్య శిబిరాలు నిర్వహించి.. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలందిస్తామని తెలిపారు. స్థానికంగానే సూపర్ స్పెషాలిటీ వైద్యమందిస్తామన్నారు. ఈ వైద్య శిబిరాల నిర్వహణకు ప్రభుత్వం రూ.120 కోట్ల మేర ఖర్చు చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తహశీల్దార్, ఎంపీడీవో, పీహెచ్‌సీ వైద్యాధికారులు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్, మున్సిపాలిటీ ఆరోగ్య అధికారి, యూపీహెచ్‌సీ వైద్యాధికారులు ఈ కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను నిర్వర్తిస్తారని చెప్పారు. సమీక్షలో ఉన్నతాధికారులు ఎం.టి.కృష్ణబాబు, నివాస్, మురళీధర్‌రెడ్డి, హరేంధిరప్రసాద్, డాక్టర్ వెంకటేశ్వర్, డాక్టర్ రామిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం చిలకలూరిపేట నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల వైద్యాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలకు 'జగనన్న ఆరోగ్య సురక్ష' గురించి ఆమె దిశానిర్దేశం చేశారు.

విజయవంతం చేద్దాం: సీఎస్ జవహర్‌రెడ్డి

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. వలంటీర్లు, ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు అవసరమైన శిక్షణ, ప్రచార సామగ్రి, టెస్టింగ్ కిట్లు, మందులు తదితరాలను అందజేయాలని సూచించారు. ఇంటింటి సర్వే సమయంలో సాధారణ, దీర్ఘకాలిక వ్యాధులు, గర్భిణులు, బాలింతలు, తగిన బరువు లేని పిల్లలు, క్షయ, కుష్టు, సంక్రమించని, సంక్రమించే వ్యాధులు, గిరిజన ప్రాంతాల్లో సికిల్‌సెల్, మలేరియా, డెంగీ తదితరాలతో బాధపడుతున్నవారిపై దృష్టి పెట్టాలన్నారు. శిశువులు, పిల్లలు, గర్భిణులు, బాలింతలు రక్తహీనతకు గురికాకుండా పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందజేయాలని సూచించారు. సమావేశంలో ఉన్నతాధికారులు కృష్ణబాబు, ప్రవీణ్ ప్రకాశ్, జయలక్ష్మి, కోటేశ్వరరావు, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

'గుంటూరు'కు స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ అవార్డు

- 3–10 లక్షల జనాభా విభాగంలో దేశంలో మూడో స్థానం
- అవార్డును అందించిన కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ మంత్రి

సాక్షి, న్యూఢిల్లీ: 'స్వచ్ఛ వాయు సర్వేక్షణ్-2023'లో గుంటూరు నగరం అవార్డును కైవసం చేసుకుంది. దేశంలో వాయు నాణ్యతను మెరుగుపరిచే ఉద్దేశంతో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌సీఏపీ) కింద నగరాలను ర్యాంకింగ్ చేయడానికి కేంద్ర పర్యావరణం, అటవీ-వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ అవార్డులను అందజేసింది. 2023 సంవత్సరానికి గాను 3-10 లక్షల జనాభా విభాగంలో గుంటూరు నగరం మూడో స్థానంలో నిలిచింది. 2022–23 నుండి 2025–26 ఆర్థిక సంవత్సరాలకు ఈ పథకాన్ని కేంద్ర పర్యావరణం, అటవీ-వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా 3 కేటగిరీల్లో 9 నగరాలు అవార్డులు గెలుచుకున్నాయి. గురువారం మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి భూపేంద్ర యాదవ్, మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ అవార్డులను అందించారు. దేశవ్యాప్తంగా ఈ ర్యాంకింగ్‌ల కోసం ఎంపిక చేసిన 131 నగరాల్లో, 10 లక్షల కంటే ఎక్కువ నివాసితులు ఉన్న కేటగిరీ 1 కింద 47 నగరాలు ఉంటే అందులో ఇండోర్ ప్రథమ స్థానంలో ఆ తర్వాత ఆగ్రా, థానేలు ఉన్నాయి. 3 లక్షల నుంచి 10 లక్షల మధ్య జనాభా ఉన్న కేటగిరీ 2 కింద 44 నగరాలు ఉండగా అందులో మహారాష్ట్రలోని అమరావతి తొలి స్థానంలో, మొరాదాబాద్, గుంటూరు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

అతిథులొస్తున్నారు

నేడు భారత్‌కు ప్రపంచ దేశాధినేతల ఆగమనం..

రేపు ఢిల్లీలో ప్రారంభంకానున్న జీ-20 శిఖరాగ్ర సదస్సు



జీ20 శిఖరాగ్ర సదస్సుకు దేశ రాజధాని ఢిల్లీ ముస్తాబైంది. ఈ సదస్సులో పాల్గొనేందుకు వివిధ దేశాధినేతలు నేడు హస్తినకు చేరుకొని.. తమ వాణిని వినిపించనున్నారు. ఏఏ దేశాల అధ్యక్షులు, ప్రధాన మంత్రులు శుక్రవారం ఏ సమయానికి విచ్చేస్తున్నారో ఓసారి చూద్దామా!

బ్రిటన్ :: రిషి సునాక్




జీ20 సదస్సు కోసం అందరికంటే ముందే భారత్‌కు చేరుకుంటున్న కీలక నేత రిషి సునాక్. భారతీయ మూలాలున్న బ్రిటన్ ప్రధాని అయిన సునాక్ శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట 40 నిమిషాలకు ఢిల్లీకి చేరుకుంటారు. కేంద్ర సహాయ మంత్రి అశ్వినీ కుమార్ చౌదరి ఈయనకు సాదర స్వాగతం పలకనున్నారు. 'భారత్ జీ20కి సారథ్య బాధ్యతలు వహిస్తున్న ఈ ఏడాదికాలంలో భారత ప్రధాని మోదీ చేస్తున్న కృషి అమోఘం. ఆయన నాయకత్వంలో ప్రపంచ యవనికపై భారత్ సాధిస్తున్న విజయాలు అద్వితీయం'అని రిషి సునాక్ శ్లాఘించారు.

జపాన్ :: ఫుమియో కిషిదా



సునాక్ విమానం ల్యాండ్ అయిన కొద్ది సేపటికే పాలెం విమానాశ్రయంలో జపాన్ ప్రధాని ఫుమియో కిషిదా విమానం ల్యాండ్ కానుంది. మధ్యాహ్నం 2.15గంటలకు ఆయన భారత గడ్డపై అడుగుపెడతారు. ఈయనను సైతం కేంద్ర సహాయ మంత్రి అశ్వినీ కుమార్ చౌదరి రిసీవ్ చేసుకోనున్నారు. కిషిదా భారత్‌కు రావడం ఇది రెండోసారి. ఇటీవల మార్చి నెలలో భారత్‌లో రెండు రోజులపాటు పర్యటించి ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు.

అమెరికా :: జో బైడెన్




అగ్రరాజ్యాధినేత జో బైడెన్ రాకపైనే అందరి కళ్లు. ఈయన సాయంత్రం 6 గంటల 55 నిమిషాలకు ఢిల్లీ చేరుకుంటారు. కేంద్ర సహాయ మంత్రి జనరల్(రిటైర్డ్) వీకే సింగ్ బైడెన్‌కు సాదర ఆహ్వానం పలుకుతారు. బైడెన్ సతీమణి జిల్‌కు కరోనా పాజిటివ్ రావడంతో బైడెన్ వస్తారో రారో అనే సందిగ్ధత నెలకొంది. బైడెన్‌కు చేసిన కరోనా టెస్ట్‌లో నెగెటివ్ ఫలితం రావడంతో ఆయన పర్యటన ఖాయమైంది. అయినా సరే సదస్సు సందర్భంగా ఆయన మాస్క్ ధరించే పాల్గొంటారని అధికార వర్గాలు వెల్లడించాయి.

కెనడా



అమెరికా తర్వాత ఆ దేశానికి ఉత్తరవైపు పొరుగు దేశం కెనడా తరఫున ఆ దేశ ప్రధాన మంత్రి జస్టిన్ ట్రూడో భారత్‌లో అడుగు పెడతారు. రాత్రి 7 గంటల ప్రాంతంలో ఆయన ప్రయాణిస్తున్న విమానం పాలెం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటుంది. కేంద్ర సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ జస్టిన్‌కు స్వాగతం పలుకుతారు. ఖలిస్తాన్ వేర్పాటువాదులకు చిరునామాగా నిలిచిన కెనడాలో ఇటీవల వేర్పాటువాద సంస్థలు రెచ్చిపోయాయి. భారత వ్యతిరేక కార్యక్రమాలు చేస్తూ కెనడా-భారత్ సత్సంబంధాలను క్షీణింపజేశాయి. ప్రతిపాదిత వాణిజ్య ఒడంబడికను కెనడా అర్ధంతరంగా ఆపేసింది. ఈ తరుణంలో జీ20 వేదికగా కెనడా అగ్రనేత భారత్‌లో పర్యటించడం ఇరుదేశాల మధ్య సంబంధాలను మెరుగుపరుస్తుందని భావిస్తున్నారు.

చైనా



చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వాస్తవానికి ఈ సదస్సులో పాల్గొనాలి. కానీ ఈసారి ఆయన బదులు చైనా ప్రధాని లీ కియాంగ్ వస్తున్నారు. శుక్రవారం రాత్రి ఏడు గంటల 45 నిమిషాల ప్రాంతంలో ఆయన ఢిల్లీకి చేరుకుంటారు. 'జిన్‌పింగ్ గైర్హాజరు ఊహించిందే. ఇది జీ20 కూటమి పరస్పర ఉమ్మడి నిర్ణయాలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపబోదు'అని భారత విదేశాంగ మంత్రి జైశంకర్ కుండబద్దలు కొట్టారు. మరోవైపు అరుణాచల్ ప్రదేశ్, అక్సాయ్ చిన్ ప్రాంతాలను తమవిగా పేర్కొంటూ తమ కొత్త భౌగోళిక పటాన్ని చైనా విడుదలచేయడంతో డ్రాగన్ మీద భారత్ ఆగ్రహంగా ఉంది.

జర్మనీ, ఫ్రాన్స్‌ల నేతలూ..

యురోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ రాత్రి ఏడున్నరకు ఢిల్లీలో దిగుతారు. యురోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు చార్లెస్ మైకేల్ సైతం జీ20 సదస్సుకు వస్తున్నారు. సింగపూర్ ప్రధాని లూంగ్ లీని కేంద్ర సహాయ మంత్రి మురుగన్ రిసీవ్ చేసుకుంటారు. జర్మనీ ఛాన్స్‌లర్ స్కోల్జ్ శనివారం సాయంత్రం ఆరు గంటలకు వస్తున్నారు. ఈయనను సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి భాను ప్రతాప్ సింగ్ వర్మ రిసీవ్ చేసుకోనున్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్ శనివారం మధ్యాహ్నం 12.35 నిమిషాలకు వస్తారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మహిళా మంత్రి అనుప్రియా సింగ్ పాటిల్ మేక్రాన్‌కు స్వాగతం పలుకుతారు.

క్యూ కట్టనున్న నేతలు

సౌదీ అరేబియా ప్రధానమంత్రి మహమ్మద్ బిన్ సల్మాన్ సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో ఢిల్లీకి చేరుకుంటారు. దక్షిణ కొరియా అధ్యక్షుడు సుక్ ఇయోల్ యూన్ సాయంత్రం 5.10కి వస్తున్నారు. ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దుల్ ఫతా అల్ సిసీ, ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో చేరుకుంటారు. ఇండోనేసియా అధ్యక్షుడు జోకో విడొడో రాత్రి సమయంలో రానున్నారు. టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ పదిగంటలకు చేరుకుంటారు. స్పెయిన్ అధ్యక్షుడు పెట్రో పెరిజ్ రాత్రి 10.15కు చేరుకుంటారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

14న 5 వైద్య కళాశాలల ప్రారంభం

- లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి
- సీఎం జగన్ చేతుల మీదుగా విజయనగరం కళాశాల ప్రారంభం
- అక్కడి నుంచి వర్చువల్‌గా మిగతా 4 కళాశాలలు ప్రారంభం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వరంగ వైద్య విద్యలో నూతనాధ్యాయం ఆవిష్కృతమవుతోంది. ఈ విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి వచ్చిన 5 ప్రభుత్వ వైద్య కళాశాలలను ఈ నెల 14వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్నారు. విజయనగరంలో నూతనంగా నిర్మించిన వైద్య కళాశాలను 14వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రారంభిస్తారు. అక్కడి నుంచి రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల కళాశాలలను వర్చువల్‌గా ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు.

రాష్ట్రంలో వైద్య విద్య అభివృద్ధికి ప్రతి జిల్లాకు ఒక ప్రభుత్వ వైద్య కళాశాల ఉండేలా వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.8,480 కోట్లతో 17 కొత్త కాలేజీలు నిర్మిస్తున్న విషయం తెలిసిందే. వీటిలో విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల కళాశాలల నిర్మాణం పూర్తయింది. ఈ కాలేజీల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు మొదలవుతున్నాయి. ఈ 5 కాలేజీల్లో ఒక్కో కళాశాలలో 150 చొప్పున 750 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ఎంబీబీఎస్‌లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ ద్వారా ఆల్ ఇండియా కోటా రెండు విడతల కౌన్సెలింగ్ పూర్తయింది. నూతన కాలేజీల్లో 111 ఆలిండియా కోటా సీట్లకు గాను 69 భర్తీ అయ్యాయి. రాష్ట్ర కోటాకు సంబంధించి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం తొలి విడత కౌన్సెలింగ్ పూర్తి చేసింది. ఈ కౌన్సెలింగ్‌లో 516 సీట్లు భర్తీ అయ్యాయి. ఇలా ఇప్పటి వరకు 585 సీట్లు భర్తీ అయ్యాయి. ఈ నెల 10న ఆల్ ఇండియా కోటా మూడో విడత, రాష్ట్ర కోటా రెండో విడత కౌన్సెలింగ్ జరుగుతాయి. వీటిలో మిగిలిన సీట్లు భర్తీ అవుతాయి.

వచ్చే ఏడాది మరో 5 కాలేజీలు

విజయనగరంలో వైద్య కళాశాల ప్రారంభించడానికి సీఎం జగన్ నేరుగా హాజరై, మిగిలిన నాలుగు కళాశాలలను వర్చువల్‌గా ప్రారంభిస్తారు. మరో ఐదు కళాశాలల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వీటిని వచ్చే ఏడాది ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– మురళీధర్ రెడ్డి, ఎండీ ఏపీఎంఎస్ఐడీసీ

సచివాలయ వ్యవస్థ దేశానికే తలమానికం

- నేనొక సైనికుడిగా మనస్ఫూర్తిగా ఈ విషయం చెబుతున్నా
- సీఎస్ఆర్ కమిటీ చైర్మన్ పాండా



సచివాలయ సముదాయాన్ని పరిశీలిస్తున్న పాండా తదితరులు

వేముల: ఏపీలో రూపకల్పన చేసిన సచివాలయ వ్యవస్థ దేశానికే తలమానికంగా నిలుస్తోందని కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) కమిటీ చైర్మన్ అండ్ ఇండిపెండెంట్ డైరెక్టర్ పీకే పాండా అభివర్ణించారు. వైఎస్సార్ జిల్లా వేముల మండలం వేల్పులలో మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డి, యురేనియం ప్రాజెక్టు జీఎం ఎంఎస్ రావుతో కలిసి సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన పనులను గురువారం ఆయన పరిశీలించారు. తొలుత వేల్పుల సచివాలయాన్ని సందర్శించారు. తానొక సైనికుడిగా మనస్ఫూర్తిగా చెబుతున్నానని, తన జీవితంలో వైఎస్ జగన్ లాంటి ప్రజా నాయకుడిని చూడలేదన్నారు. సచివాలయ వ్యవస్థపై ప్రశంసలు కురిపించారు. సచివాలయ సముదాయ నిర్మాణంలో సహకరించిన కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి కృషి ఎనలేనిదన్నారు. ఎంతో దూరదృష్టితో సచివాలయ వ్యవస్థను సీఎం తెచ్చారని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో ఇలాంటి వ్యవస్థ చూడలేదన్నారు. సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్, బ్యాంకింగ్, పోస్టాఫీసులను ఒకేచోట నిర్మించడం గొప్ప విషయమన్నారు. ఒడిశా ప్రభుత్వం ఇలాంటి వ్యవస్థ నెలకొల్పాలన్న ఆలోచనలో ఉన్నట్టు సమాచారం ఉందన్నారు.

క్లుప్తంగా...

సమన్వయ కేంద్రం త్వరగా ఏర్పాటు చేయాలి

సీఎస్ జవహర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సమన్వయ కేంద్రం ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి రాష్ట్ర ప్రణాళికా శాఖ కార్యదర్శి గిరిజా శంకర్‌ను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం ప్రణాళికా శాఖ అధికారులతో సీఎస్ సమావేశమై రాష్ట్రంలో యూఎస్‌డీపీ, ఎస్‌డీజీ సమన్వయ కేంద్రం ఏర్పాటు పనుల ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2015 సెప్టెంబర్‌లో ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో తీసుకున్న చరిత్రాత్మక నిర్ణయం ప్రకారం రాష్ట్రంలో 17 అంశాల్లో సుస్థిర అభివృద్ధి, 169 నిర్దేశిత లక్ష్యాల సాధనకు సమన్వయ కేంద్రం ఏర్పాటు తప్పనిసరని చెప్పారు. 2030నాటికి ఈ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాల్సి ఉందన్నారు. ఇందుకోసం రాష్ట్రంలో సమన్వయ కేంద్రాన్ని సాధ్యమైనంత త్వరగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలం

ఏపీజీఈఎఫ్ చైర్మన్ వెంకటరామిరెడ్డి



ఒంగోలు సబర్బన్: ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆంధ్ర ప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఏపీజీఈఎఫ్) రాష్ట్ర చైర్మన్ కాకర్ల వెంకట రామిరెడ్డి చెప్పారు. ఆయన గురువారం ఒంగోలులో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఏపీజీఈఎఫ్ జిల్లా కమిటీని ఆయన ప్రకటించారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. దశాబ్దాల తరబడి పరిష్కారానికి నోచుకోని ఉద్యోగుల సమస్యలను సైతం సీఎం పరిష్కరిస్తున్నారని చెప్పారు. దసరాకు డీఏ ఇస్తామని సీఎం హామీ ఇచ్చారని, పీఆర్‌సీ కమిటీని నియమించారని, త్వరలోనే ఆ కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇస్తుందని, ఉద్యోగుల ఆశలు నెరవేరుతాయని పేర్కొన్నారు. ఏపీజీఈఎఫ్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ అరవ పాల్, కోశాధికారి రామకృష్ణ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

అక్టోబర్ 15న మున్సిపల్ ఉద్యోగుల రాష్ట్ర కౌన్సిల్ భేటీ

సాక్షి, అమరావతి: పురపాలక, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది అపరిష్కృత సమస్యల పరిష్కారంపై కార్యాచరణ కోసం అక్టోబర్ 15న భీమవరంలో రాష్ట్ర కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణమోహన్ చెప్పారు. గురువారం కానూరులో కార్యవర్గ సమావేశం నిర్వహించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

‘ఏపీ జేఏసీ’ చైర్‌పర్సన్‌గా లక్ష్మి

ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర మహిళా విభాగం నూతన కార్యవర్గం ఏర్పాటు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో మహిళా ఉద్యోగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ భరోసా ఇచ్చారు. విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని ఆడిటోరియంలో గురువారం ఏపీ జేఏసీ అమరావతికి అనుబంధంగా మహిళా విభాగం రాష్ట్ర కమిటీ ప్రమాణస్వీకారోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథి వాసిరెడ్డి పద్మ మాట్లాడుతూ మహిళ ఉద్యోగులు నాయకత్వ స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. మరో ముఖ్య అతిథి, ఏపీ జేఏసీ అమరావతి స్టేట్ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు ఎక్కువగా ఉన్నారని గమనించి బలమైన మహిళా విభాగం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. గత 20 ఏళ్లుగా పరిష్కారం కాని పలు సమస్యలను సీఎం వైఎస్ జగన్ పరిష్కరించారని, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, చిరు ఉద్యోగులైన వీఆర్‌ఏలకు రూ.500 పెంపు వంటి మేళ్లు చేశారని ప్రశంసించారు. ఏపీ జేఏసీ అమరావతి స్టేట్ సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, అసోసి యేట్ చైర్మన్ టీవీ ఫణి, కోశాధికారి వీవీ మురళీకృష్ణ నాయుడులు ప్రసంగించారు. అనంతరం నూతన చైర్‌పర్సన్‌గా పారె లక్ష్మి, అసోసియేట్ చైర్‌పర్సన్‌గా సైకం శివకుమారిరెడ్డి, జనరల్ సెక్రటరీగా పొన్నూరు విజయలక్ష్మి, కోశాధికారిగా జి.పావని తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు.

21న బీసీల చలో ఢిల్లీ: కృష్ణయ్య

కాచిగూడ (హైదరాబాద్): పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోయే మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21, 22 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన గురువారం కాచిగూడలో బీసీ సంఘం కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ మహిళా బిల్లులో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించకపోతే ఆ బిల్లుకు సార్థకత ఉండదన్నారు. ఇప్పటికే రాజ్యసభ ఆమోదం పొందిన ఈ బిల్లును లోక్‌సభలో ఆమోదించాలని కోరారు.

మార్గదర్శి దందాపై విచారించాలి

అవకతవకల కేసుల్లో ప్రత్యేక కోర్టుల ఉత్తర్వులు రద్దు చేయండి

- మా కేసులను విచారణకు స్వీకరించేలా ఆదేశాలివ్వండి
- హైకోర్టుకు నివేదించిన సీఐడీ.. అప్పీళ్లు దాఖలు
- చట్ట ఉల్లంఘనలను చార్జిషీట్‌లో స్పష్టంగా పేర్కొన్నాం
- చందాదారులు చెప్పిన విషయాలను పొందుపరిచాం
- ఎగవేతలు, జాప్యం, ప్రైజ్ మొత్తాలను అట్టిపెట్టుకోవడాన్ని వివరించాం
- చెల్లింపులకు సరిపడా డబ్బు లేదనే విషయాన్నీ చెప్పాం
- భవిష్యత్ చందా పేరుతో చందాదారులను ఎలా మోసం చేస్తోందో తెలిపాం
- అన్నింటికీ ప్రాథమిక ఆధారాలను కోర్టులకు సమర్పించాం
- అయినా జాప్యానికి చాలా కారణాలుంటాయని చార్జిషీట్లు రిటర్న్
- పీపీ వాదన వినకుండానే పలు అంశాలపై గుంటూరు, విశాఖ ప్రత్యేక కోర్టులు నిర్ధారణ



సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్థిక అవకతవకలు, తప్పుడు రికార్డుల నిర్వహణ, నిధుల మళ్లింపు, ఇతర చట్ట ఉల్లంఘనలపై రామోజీ, శైలజా కిరణ్ తదితరులపై నమోదు చేసిన కేసులో తాము దాఖలు చేసిన చార్జిషీట్‌లను గుంటూరు, విశాఖపట్నంలోని డిపాజిటర్ల పరిరక్షణ చట్టం ప్రత్యేక కోర్టులు ‘రిటర్న్’ చేస్తూ గత నెల 28న జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ సీఐడీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ ఉత్తర్వులను రద్దు చేయడంతో పాటు, కేసును విచారణకు స్వీకరించేలా ఆ కోర్టులను ఆదేశించాలని కోరుతూ సీఐడీ అదనపు ఎస్పీ ఈ అప్పీళ్లను దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాల్లో మార్గదర్శి చైర్మన్ చెరుకూరు రామోజీరావు, ఎండీ శైలజా కిరణ్, ఆడిటర్ కుదరవల్లి శ్రవణ్‌లతో పాటు వైస్ ప్రెసిడెంట్లు, డైరెక్టర్లు, జనరల్ మేనేజర్లు, బ్రాంచ్ మేనేజర్లు ఇలా మొత్తం 15 మందిని ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ అప్పీళ్లపై హైకోర్టు వచ్చే వారం విచారణ జరిపే అవకాశం ఉంది.

ఒకే రోజు రెండు కోర్టులు దాదాపు ఒకే రకం ఉత్తర్వులు

మార్గదర్శి చిట్ ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్థిక అవకతవకలు, తప్పుడు రికార్డుల నిర్వహణ, నిధుల మళ్లింపు, ఇతర చట్ట ఉల్లంఘనలపై చిట్స్ అసిస్టెంట్ రిజిస్ట్రార్లు సీఐడీకి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా రామోజీరావు, శైలజా కిరణ్‌లతో పాటు మొత్తం 15 మందిపై ఐపీసీ, డిపాజిటర్ల పరిరక్షణ చట్టం, చిట్‌ఫండ్ చట్టాల కింద సీఐడీ కేసులు నమోదు చేసింది. దర్యాప్తు చేసి డిపాజిటర్ల పరిరక్షణ చట్టం కింద ఏర్పాటైన ప్రత్యేక కోర్టుల్లో చార్జిషీట్లు దాఖలు చేసింది. ఈ చార్జిషీట్లను పరిశీలించిన ప్రత్యేక కోర్టులు, సీఐడీ దాఖలు చేసిన చార్జిషీట్లను రిటర్న్ చేశాయి. గుంటూరులో ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ఉత్తర్వులు జారీ చేయగా, విశాఖపట్నంలో మెట్రో పాలిటన్ సెషన్స్ జడ్జి ఉత్తర్వులిచ్చారు. రెండు కోర్టులు కూడా ఆగస్టు 28వ తేదీనే ఉత్తర్వులు వెలువరించడం విశేషం. రెండు కోర్టులు ఇచ్చిన ఉత్తర్వులు దాదాపు ఒకే రకంగా ఉండటం గమనార్హం.

జాప్యానికి చాలా కారణాలు..

‘డిపాజిటర్ల పరిరక్షణ చట్టంలోని సెక్షన్ 5 కింద ప్రత్యేక కోర్టు తన పరిధిని వినియోగించాలంటే, నిందితులు చందాదారులకు చెల్లించాల్సిన ప్రైజ్ మొత్తాలను ఎగవేసినట్లు ఫిర్యాదుతో పాటు ప్రాథమిక ఆధారాలను కోర్టు ముందుంచాల్సి ఉంటుంది. చార్జిషీట్‌లను పరిశీలిస్తే, ఏ చందాదారు కూడా తమకు చెల్లించాల్సిన మొత్తాలను నిందితులు ఎగవేసినట్లు ఎక్కడా చెప్పలేదు. జాప్యానికి అనేక కారణాలుంటాయి. నిధుల మళ్లింపు డిపాజిటర్ల చట్టం పరిధిలోకి రాదు. భవిష్యత్తు చందా చెల్లింపుల కోసం కొంత మొత్తాలను మార్గదర్శి తమ వద్దే అట్టిపెట్టుకున్నట్లు, ఆ మొత్తాలకు వడ్డీ చెల్లిస్తామని చెప్పినట్లు కొందరు చందాదారులు తమ వాంగ్మూలాల్లో చెప్పారు. దీనిని ఎగవేతగా భావించడానికి వీల్లేదు. ప్రైజ్ మొత్తాలను ఎగవేశారనేందుకు ఆధారాలు సమర్పిస్తేనే ప్రత్యేక కోర్టు జోక్యం చేసుకోవడానికి వీలుంటుంది. కేసు విచారణకు స్వీకరించేంత ఆధారాలు ఏపీ చార్జిషీట్‌లో లేవు. అందువల్ల చార్జిషీట్‌లను రిటర్న్ చేస్తున్నాం. ఫిర్యాదుదారు సంబంధిత కోర్టును గానీ, సంబంధిత సమర్థాధికారిని గానీ ఆశ్రయించాలి’ అని రెండూ ప్రత్యేక కోర్టులు వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేశాయి.

కళ్లెదుటే చట్ట ఉల్లంఘన కనిపిస్తున్నా..

ఈ ఉత్తర్వులపై సీఐడీ తన అప్పీళ్లలో అభ్యంతరం వ్యక్తం చేసింది. ‘గడువు ముగిసి, ష్యూరిటీలు సమర్పించిన తర్వాత కూడా బ్రాంచ్ మేనేజర్లు సకాలంలో చెల్లింపులు చేయలేదని పలువురు చందాదారులు దర్యాప్తు సంస్థకు వాంగ్మూలం ఇచ్చారు. కుంటిసాకులు చెబుతూ ష్యూరిటీలను తిరస్కరించడం, అదనపు ష్యూరిటీలు సమర్పించాలని కోరడంతో పాటు ప్రైజ్ మొత్తాలను చెల్లించకుండా మార్గదర్శి ఇబ్బంది పెడుతోందంటూ చందాదారులు స్పష్టంగా చెప్పారు. తమ బ్రాంచ్ బ్యాంకు ఖాతాల్లో తమ మొత్తాలున్నాయో లేదో తెలుసుకోకుండా చందాదారులను మార్గదర్శి అధికారులు అడ్డుకున్నారు. సకాలంలో చెల్లింపులు చేయకపోవడం, చెల్లించాల్సిన ప్రైజ్ మొత్తాన్ని డిపాజిట్‌గా తమ వద్దే అట్టిపెట్టుకోవడం, తక్కువ వడ్డీ చెల్లించడం, చెల్లింపులు ఎగవేయడం వంటివన్నీ కూడా డిపాజిటర్ల పరిరక్షణ చట్టంలోని సెక్షన్ 5 కిందకే వస్తాయి. ఇన్ని ఉల్లంఘనలు స్పష్టంగా కనిపిస్తున్నా కూడా ప్రత్యేక కోర్టు మాత్రం వాటిని పట్టించుకోకుండా ప్రైజ్ మొత్తాల ఎగవేత జరిగినట్లు కనిపించడం లేదని పేర్కొనడం సరికాదు. చందాదారులకు చెల్లించాల్సిన ప్రైజ్‌మనీ చెల్లించకుండా వడ్డీ చెల్లింపు పేరుతో తమ వద్దే అట్టిపెట్టుకోవడానికి ప్రధాన కారణం ఏమిటంటే, చెల్లింపులు చేయడానికి సరిపడనంత డబ్బు లేకపోవడమే. తమ వద్ద డబ్బు లేదు కాబట్టి, చందాదారులకు చెల్లించాల్సిన డబ్బునే భవిష్యత్తులో చెల్లించాల్సిన చందాగా తమ వద్ద అట్టిపెట్టుకుని ఆ మొత్తాలను మార్గదర్శి రొటేషన్ చేస్తూ వస్తోంది. ప్రత్యేక ఖాతాల్లో చందాదారుల డబ్బు ఉంచాల్సి ఉన్నప్పటికీ, అలా ఉంచకుండా దానిని ఇతర అవసరాలకు మళ్లించేస్తోంది. ఈ విషయాలన్నింటినీ తగిన ఆధారాలతో చార్జిషీట్‌లో స్పష్టంగా పేర్కొన్నాం. చార్జిషీట్లను రిటర్న్ చేస్తూ ఇచ్చిన ఉత్తర్వుల్లో ప్రత్యేక కోర్టులు పలు అంశాలను స్పష్టంగా నిర్ధారించాయి. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినకుండానే అలా నిర్ధారించడం చట్ట విరుద్ధం’ అని సీఐడీ తన అప్పీళ్లలో వివరించింది.

ఎగవేతలపై స్పష్టంగా వాంగ్మూలాలు

‘చార్జిషీట్‌లోని అంశాలపై మినీ ట్రయల్ నిర్వహించడానికి వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. డిపాజిటర్ల పరిరక్షణ చట్టంలోని సెక్షన్ 5కు ప్రత్యేక కోర్టులు భాష్యం చెప్పాయి. అలా చెప్పి ఉండకూడదు. డిపాజిటర్ల పరిరక్షణచట్ట నిబంధనల ప్రకారం ప్రైజ్ మొత్తాల ఎగవేత శాశ్వతమా లేక తాత్కాలికమా అన్నదాని మధ్య ఎలాంటి తేడా లేదు. కేసును విచారణకు స్వీకరించకుండానే ఆయా అంశాల మధ్య తేడాలు లేవనెత్తడం సమంజసం కాదు. చార్జిషీట్‌లను లోతుగా పరిశీలిస్తే మార్గదర్శి పాల్పడిన ఉల్లంఘనలు, ఎగవేతలపై చందాదారుల వాంగ్మూలాలు చాలా స్పష్టంగా ఉన్నాయి. డిపాజిటర్ల పరిరక్షణచట్ట నిబంధనల ప్రకారం ఓ ఆర్థికసంస్థ ఉల్లంఘనలు, ఎగవేతలపై చందాదారుడే ఫిర్యాదుదారు అయి ఉండాల్సిన అవసరం లేదు. చందాదారులకు చెల్లించాల్సిన మొత్తాల ఎగవేత, చెల్లింపుల్లో జాప్యం అంశాలను ప్రత్యేక కోర్టులు పరిగణనలోకి తీసుకోలేదు. సీతంపేట బ్రాంచ్‌లో చందాదారులకు చెల్లింపులు చేయడానికి తగినంత మొత్తాలు లేవన్న విషయం చార్జిషీట్‌లో స్పష్టంగా ఉంది. ప్రత్యేక కోర్టు ఈ విషయాన్ని పట్టించుకోలేదు. చార్జిషీట్‌లో పేర్కొన్నవన్నీ ప్రాథమిక ఆధారాలే అయినప్పటికీ, వాటిని సరైన దృష్టికోణంలో ప్రత్యేక కోర్టులు చూడలేకపోయాయి’ అని సీఐడీ తన అప్పీళ్లలో పేర్కొంది. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని చార్జిషీట్‌లను రిటర్న్ చేస్తూ ప్రత్యేక కోర్టులు జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని హైకోర్టును కోరింది. తదుపరి తమ కేసును విచారణకు స్వీకరించేలా కూడా ప్రత్యేక కోర్టులను ఆదేశించాలని అభ్యర్థించింది.

విమానాశ్రయాల్లో గిరిజన ఉత్పత్తులు

- దేశంలో 13 ఎయిర్‌పోర్టుల్లో విక్రయాలు
- దేశ రాజధాని ఢిల్లీతోపాటు హైదరాబాద్ వంటి ప్రధాన నగరాల్లోనూ జీసీసీ స్టాల్స్
- ‘గిరిజన్’ బ్రాండ్ ఉత్పత్తులకు విశేష ఆదరణ



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ గిరిజన ఉత్పత్తులకు దేశవ్యాప్తంగా విశేష ఆదరణ లభిస్తోంది. గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ‘గిరిజన్’ బ్రాండ్ పేరుతో అందిస్తున్న సహజసిద్ధమైన ఉత్పత్తులకు గిరాకీ ఉంది. ప్రధానంగా అరకు వ్యాలీ కాఫీతోపాటు గిరిజన తేనె, షర్బత్, జీడిపప్పు, చిరుధాన్యాలు, త్రిఫల పౌడర్, హెర్బల్ ఆయిల్, సబ్బులు వంటి 80 ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన నగరాలు, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లలో ప్రత్యక్షంగా స్టాల్స్ ఏర్పాటు చేసిన జీసీసీ ఆన్‌లైన్ మార్కెటింగ్ ద్వారా విక్రయాలు చేస్తున్న సంగతి తెలిసిందే. దేశ రాజధాని ఢిల్లీతోపాటు అనేక నగరాల్లోను జీసీసీ ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. తాజాగా హైదరాబాద్ మెట్రో రైల్వేస్టేషన్‌లో జీసీసీ అవుట్‌లెట్ ఏర్పాటు చేశారు. దేశంలో 13 విమానాశ్రయాల్లోను గిరిజన ఉత్పత్తులను అమ్ముతున్నారు. ప్రస్తుతం విశాఖపట్నం విమానాశ్రయంలో పూర్తిగా జీసీసీ ఆధ్వర్యంలో గిరిజన ఉత్పత్తుల అమ్మకాలు సాగిస్తున్నారు. విజయవాడ విమానాశ్రయంలో జీసీసీ ఏర్పాటు చేసిన స్టాల్ విక్రయాలు నిర్వహించాల్సి ఉంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ట్రైబల్ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ట్రైఫెడ్) భాగస్వామ్యంతో అనేక అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జీసీసీ ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. జైపూర్, గోవా, త్రివేండ్రం, మహారాణా ప్రతాప్ ఎయిర్‌పోర్టు (ఉదయ్‌పూర్), కోయంబత్తూరు, పుణె, కేబీఆర్ (లద్దఖ్), మాతా దంతేశ్వరి (జగదల్‌పూర్), కొచ్చిన్, లోకప్రియ గోపీనాథ్ బోర్డోలోయ్ (గౌహతి), ప్రయాగ్‌రాజ్ విమానాశ్రయాల్లో గిరిజన ఉత్పత్తులకు మంచి ఆదరణ లభిస్తోంది.

ఇతర రాష్ట్రాల్లో రూ.85.56 లక్షల విలువైన ఉత్పత్తుల విక్రయాలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో జీసీసీ విస్తృతమైన కార్యకలాపాలు నిర్వహిస్తోంది. గిరిజనులు పండించిన ఉత్పత్తులు, సేకరించిన అటవీ ఫలసాయాలకు మంచి ధర దక్కేలా జీసీసీ దోహదం చేస్తోంది. గిరిజనుల నుంచి కొనుగోలు చేసిన వాటిని అనేక రకాల ఉత్పత్తులుగా విక్రయిస్తోంది. ఈ క్రమంలో గిరిజనులకు మరింత మేలు చేసేలా జీసీసీ సేవలు విస్తృతం చేస్తోంది. దీన్లో భాగంగానే దేశంలోని అనేక ప్రాంతాల్లో జీసీసీ అవుట్‌లెట్స్ ప్రారంభించాం. ఇతర రాష్ట్రాల్లో గతేడాది (2022–23లో) రూ.85.56 లక్షల విలువైన జీసీసీ గిరిజన్ ఉత్పత్తులు విక్రయించాం. దేశంలో ఎక్కడైనా జీసీసీ ఫ్రాంచైజీ అవుట్‌లెట్‌లు పెట్టుకునే ఆసక్తి ఉన్నవారికి ప్రోత్సాహం అందిస్తాం.

– శోభ స్వాతిరాణి, జీసీసీ చైర్‌పర్సన్

కొండకోనల్లో ‘కొత్త’ బడులు

- 763 గిరిజన గూడేల్లో పాఠశాలల నిర్మాణం
- నాడు–నేడు పథకంతో సమూల మార్పులు
- పూరిపాకలు, షెడ్లలో ఉన్న బడులకు కొత్త రూపు
- అన్నింటికీ భవనాలు, తాగు నీరు, విద్యుత్, టాయిలెట్ల ఏర్పాటు
- 817 పాఠశాలలకు రూ.46.83 కోట్లతో వసతులు

సాక్షి, అమరావతి: ‘నాడు – నేడు’ కార్యక్రమంతో రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం.. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని పాఠశాలల్లో సమూల మార్పులు తెస్తున్నారు. రవాణా సౌకర్యం లేని కొండకోనల్లో మారుమూల ప్రాంతాల్లో ఉన్న పల్లెల్లోని ఈ పాఠశాలలను ఇంతవరకు ఏ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో ఎన్నో ఏళ్లుగా ఉన్నప్పటికీ ఈ పాఠశాలలు పాకల్లో, రేకుల షెడ్లలో నడుస్తున్నాయి. చాలా తక్కువ స్కూళ్లకు భవనాలు ఉన్నప్పటికీ, అవి శిథిలమైపోయాయి. ఇలాంటి పాఠశాలలకు ప్రభుత్వం ‘నాడు – నేడు’ కార్యక్రమం రెండో దశ కింద కొత్త రూపునిస్తోంది. వీటిలో పాడుబడ్డ భవనాలను బాగు చేసి, కొత్త భవనాలు కూడా నిర్మిస్తోంది. తొలుత 20 మందికంటే ఎక్కువ విద్యార్థులున్న 763 స్కూళ్లను గుర్తించారు. వీటిలో రూ.219.69 కోట్లతో పనులు చేపట్టారు. వీటిలో అత్యధికంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 75 పాఠశాలలు ఉన్నాయి. నెల్లూరు జిల్లాలో 66, తిరుపతి 51, చిత్తూరు 42, సత్యసాయి జిల్లాలో 38 ఉన్నాయి. మిగిలిన జిల్లాల్లో 9 నుంచి 30 వరకు పాఠశాలలు ఉన్నాయి. కొత్త భవనాలు నిర్మించాల్సినవి 360 వరకు ఉండగా, మిగిలినవి మెరుగులు దిద్దాల్సినవి ఉన్నాయి. ఇప్పటికే 180 స్కూళ్ల పనులు పూర్తి చేయగా, మిగిలిన పాఠశాలల పనులు రెండు నెలల్లో పూర్తి చేయాలని పాఠశాల విద్యా శాఖ మౌలిక వసతుల కల్పన కమిషనర్ ఆదేశించారు. నాడు–నేడు మూడో దశలో ఏజెన్సీలోని 20 మంది కంటే తక్కువ విద్యార్థులున్న పాఠశాలలను ఆధునీకరించాలని నిర్ణయించారు.

817 పాఠశాలల్లో సదుపాయాలు..

ప్రతి పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్‌ను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. దీంతో నాడు–నేడు పనులు చేపట్టిన 817 పాఠశాలల్లో యుద్ధ ప్రాతిపదికన రూ.46.83 కోట్లతో ఈ సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇలాంటి పాఠశాలలు కూడా ఏజెన్సీ ప్రాంతాల్లోనే అధికంగా ఉన్నాయి. అత్యధికంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 457 ఉన్నాయి.

చెప్పింది చేయండి

▶ మొదటి పేజీ తరువాయి

బెంబేలెత్తిన మార్గదర్శి చిట్ ఫండ్స్ ఇలా బెదిరింపులకు పాల్పడుతోందని కుండబద్దలు కొట్టింది. చందాదారులు, ఏజెంట్లను మోసగిస్తూ మార్గదర్శి భారీగా అక్రమాలకు పాల్పడుతోందని పలువురు బాధితుల ఫిర్యాదుతో విశాఖపట్నం, విజయవాడ, నరసరావుపేటలో తాజాగా ఆ సంస్థపై మూడు కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో గురువారం సీఐడీ అదనపు డీజీ సంజయ్ వెలగపూడిలోని సచివాలయంలో సీఐడీ ఎస్పీ ఫక్కీరప్పతో కలసి విలేకరుల సమావేశంలో పలు వివరాలు వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఘోస్ట్ చందాదారుల పేరిట ఆర్థిక దందా

- మార్గదర్శి చిట్ ఫండ్స్ ప్రతి చిట్టీ గ్రూపులో కనీసం ఇద్దరు నుంచి ముగ్గురు చొప్పున మొత్తం మీద రాష్ట్రంలో 3 వేల మంది ఘోస్ట్ చందాదారుల పేరిట భారీగా ఆర్థిక మోసానికి పాల్పడుతోంది. ఆ 3 వేల మందికి తెలియకుండానే వారిని చందాదారులుగా చూపిస్తూ వారి పేరిట అక్రమంగా ఆర్థిక వ్యవహారాలు నిర్వహిస్తోంది. ఇతరత్రా సేకరించిన వారి గుర్తింపు కార్డులతో వ్యవహారం నడుపుతోంది. వారి సంతకాలను ఫోర్జరీ చేస్తూ తీవ్ర నేరానికి పాల్పడుతోంది.
- ఘోస్ట్ చందాదారుల పేరిట చెక్‌లు జారీ చేస్తున్నప్పటికీ, ఆ చెక్కులను మార్గదర్శి చిట్ ఫండ్స్ యాజమాన్యం వారి వద్దే అట్టిపెట్టుకుంటోంది. ఆ చెక్కుల వివరాలను రికార్డుల్లో నమోదు చేయడం లేదు. బ్యాంకులో జమ చేయడం లేదు. ఇదో అతి పెద్ద ఆర్థిక మోసం. అలాంటి 3 వేల మంది ఘోస్ట్ చందాదారుల్లో వంద మందిని సీఐడీ విచారిస్తోంది.
- దాంతో బెంబేలెత్తిన మార్గదర్శి యాజమాన్యం ఆ ఘోస్ట్ చందాదారులకు ఫోన్లు చేసి బెదిరిస్తోంది. సీఐడీ దర్యాప్తునకు సహకరించవద్దని, తర్వాత తాము అన్నీ సెటిల్ చేస్తామని.. లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తోంది. మార్గదర్శి ఎండీ శైలజ కిరణ్ తన పీఏ శశికళ ద్వారా చందాదారులకు ఫోన్లు చేసి బెదిరిస్తున్నారు.

అక్రమ డిపాజిట్లుగా నల్లధనం

- రిజర్వ్ బ్యాంక్ నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి చిట్ ఫండ్స్ అక్రమ డిపాజిట్లు సేకరిస్తోంది. దీనిపై ప్రశ్నిస్తే తిరిగి బుకాయిస్తోంది. రాబోయే నెలలకు చిట్టీ గ్రూపులకు చెల్లించాల్సిన చందాలను అడ్వాన్స్‌గా జమ చేస్తున్నారని వక్రీకరించేందుకు ప్రయత్నిస్తోంది. కానీ అసలు చిట్టీ గ్రూపులు మొదలు కాకుండానే చందాదారుల పేరిట నాలుగైదు నెలల ముందే డిపాజిట్లు సేకరించిన విషయాన్ని సీఐడీ గుర్తించింది.



- చిట్టీ గ్రూపులు మొదలు కాకుండానే ఎవరైనా చందాల మొత్తం చెల్లిస్తారా? ఎవరూ చెల్లించరు కాబట్టి అవి అక్రమ డిపాజిట్లే. రాష్ట్రంలోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారులు దాదాపు 2 వేల మందిలో రూ.కోటికి పైగా విలువైన అక్రమ డిపాజిట్లు చేసిన, చిట్టీ గ్రూపుల్లో చందాదారులుగా ఉన్న వారు ఏకంగా 800 మందికిపైగా ఉన్నారు. చాలా కంపెనీల పేరిట భారీగా అక్రమ డిపాజిట్లు సేకరించారు.
- ఆ 800 మందికిపైగా డిపాజిట్‌దారులకు సీఐడీ నోటీసులు జారీ చేసింది. అంత భారీగా డిపాజిట్లు ఎలా చేశారు.. ఆ నిధులు ఏ ఆదాయ మార్గాల ద్వారా వచ్చాయనే కోణంలో విచారిస్తోంది. విజయవాడలో ఓ బిల్డర్ ఏకంగా రూ.50 కోట్ల విలువైన చిట్టీ గ్రూపుల్లో చందాదారునిగా ఉన్నారు.
- ఇలాంటి భారీ మొత్తాల డిపాజిట్‌దారులు, చిట్టీ గ్రూపుల్లో సభ్యుల గురించి ఆదాయ పన్ను శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులకు కూడా సీఐడీ సమాచారమిచ్చింది. అక్రమ డిపాజిట్ల ముసుగులో నల్లధనం చలామణిలోకి తీసుకువస్తున్నారా అన్నది సీఐడీతోపాటు కేంద్ర దర్యాప్తు సంస్థలు పరిశీలించాల్సిన అవసరం ఉందని భావిస్తోంది.

రూ.9.43 కోట్ల జగజ్జనని చిట్ ఫండ్స్ ఆస్తులు అటాచ్

కేంద్ర చిట్ ఫండ్స్ చట్టాన్ని ఉల్లంఘిస్తూ అక్రమాలకు పాల్పడిన రాజమహేంద్రవరానికి చెందిన జగజ్జనని చిట్ ఫండ్స్‌కు చెందిన రూ.9,43,52,020 విలువైన స్థిరాస్తులను అటాచ్ చేయాలని సీఐడీ నిర్ణయించింది. వాటిలో భవనాలు, భూములు, ఖాళీ స్థలాలతో కూడిన మొత్తం 12 స్థిరాస్తులను అటాచ్ చేయనుంది. చందాదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సీఐడీ ప్రతిపాదనకు హోమ్ శాఖ ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై న్యాయస్థానం ఆమోదం కోసం సీఐడీ పిటిషన్ దాఖలు చేయనుంది. న్యాయస్థానం అనుమతి అనంతరం ఆ ఆస్తులను అటాచ్ చేస్తుంది.

మా కుటుంబాన్ని దోచేసి రోడ్డున పడేశారు

బోరున విలపించిన బొండు అన్నపూర్ణా దేవి

‘మార్గదర్శి చిట్ ఫండ్స్ మమ్మల్ని పూర్తిగా మోసం చేసి ఆర్థికంగా కుదేలయ్యేట్టు చేసింది. మా కుటుంబాన్ని రోడ్డున పడేసింది. మా ఆస్తులు, బంగారం, వృద్ధాప్యంలో అవసరాల కోసం దాచుకున్న మొత్తం అంతా మార్గదర్శి చిట్ ఫండ్స్‌కు ధారపోశాం. అయినా సరే ఇంకా మమ్మల్ని వేధిస్తూ మిగిలిన ఉన్న ఇంటిని కూడా తీసుకునేందుకు వేధిస్తోంది. మా కుమార్తె సంతకాన్ని కూడా ఫోర్జరీ చేసి మోసానికి పాల్పడింది. నా భర్త ప్రభుత్వ వెటర్నరీ వైద్యుడు. నేను కోళ్ల ఫారం నిర్వహిస్తున్నాను. నేను మార్గదర్శి చిట్ ఫండ్స్‌లో ఒక గ్రూపులో చందాదారుగా చేరాను. ఆ తర్వాత ఏకంగా 65 గ్రూపుల్లో నన్ను చందాదారుగా చేర్చింది. నిబంధనల ప్రకారం మేము ఇచ్చిన ష్యూరిటీలను కూడా గుర్తించకుండా ఉద్దేశ పూర్వకంగా మమ్మల్ని 17 చిట్టీ గ్రూపుల్లో డిఫాల్టర్‌గా చూపించింది. మా ఆస్తులు తీసుకుంది. నా భర్త జీపీఎఫ్ డబ్బులు కట్టి, పిల్లల పెళ్లి కోసం దాచుకున్న బంగారం కూడా అమ్మి చెల్లించాం. అయినా సరే ఇంకా బకాయి ఉన్నారంటూ మా ఇల్లు వేలం వేయించారు. మా ఇంటికి వచ్చి అల్లరి చేశారు. మా అమ్మాయి విదేశాల్లో వైద్య విద్య చదువుతోంది. ఆమె సంతకాన్ని కూడా ఫోర్జరీ చేసి చందాదారుగా చేర్చారు. ఆమె చిట్టీ పాట పాడినట్టు చూపించారు. రూ.9 లక్షల నష్టానికి చిట్టీ పాట పాడినట్టు చూపించి బకాయిలు మినహాయించుకుని కేవలం రూ.210 మాత్రమే ఇస్తామని రికార్డుల్లో సర్దుబాటు చేశారు. ఆ చిట్టీ గ్రూపునకు సంబంధించి వాయిదాల బకాయిలు చెల్లించాలని మమ్మల్ని వేధిస్తున్నారు. అసలు ఈ దేశంలోనే లేని మా కుమార్తె ఎలా చందాదారుగా చేరింది? ఎలా వేలం పాటలో పాల్గొంది? తను వచ్చి ఎప్పుడు సంతకం చేసింది? ఇంత దారుణంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ మమ్మల్ని మోసం చేసింది. మమ్మల్ని కుట్ర పూరితంగా అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేసిన మార్గదర్శి చిట్ ఫండ్స్ యాజమాన్యం, మేనేజర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.’

ఏజెంట్లకూ కుచ్చుటోపి

➤ మార్గదర్శి చిట్ ఫండ్స్ తమ చందాదారులు, ఏజెంట్లను కూడా మోసగిస్తోంది. కుట్ర పూరితంగా వారిని అప్పుల ఊబిలోకి నెట్టేస్తూ వారి ఆస్తులు రాయించుకుంటోంది. దీనిపై చందాదారులు, ఏజెంట్లు, ఘోస్ట్ చందాదారుల నుంచి భారీగా ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిని పరిశీలించి తగిన ఆధారాలు ఉన్న వాటిపై సీఐడీ కేసులు నమోదు చేస్తోంది.

➤ విజయవాడలో కోళ్ల ఫారం యజమాని బొండు అన్నపూర్ణా దేవి అనే మహిళను ఏకంగా 65 చిట్టీ గ్రూపుల్లో చందాదారునిగా చేర్పించి ఆమెను అప్పుల ఊబిలోకి నెట్టేశారు. కుట్ర పూరితంగా విజయవాడలోని లబ్బీపేట, గుడివాడ మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయాలు కేంద్రంగా ఈ మోసానికి పాల్పడ్డారు. విదేశాల్లో ఉన్న ఆమె కుమార్తె ప్రియాంక సంతకాన్ని కూడా ఫోర్జరీ చేశారు. ష్యూరిటీలు ఇచ్చినా సరే కొర్రీలు వేస్తూ ఆమెను డిఫాల్టర్‌గా చూపిస్తూ వారి ఆస్తులు కూడా రాయించుకున్నారు. దీనిపై ఆమె ఫిర్యాదు చేయడంతో మంగళగిరి సీఐడీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశాం. ఆమె రూ.14 కోట్ల విలువైన 65 చిట్టీ గ్రూపుల్లో చందాదారుగా ఉన్నారు. ఆమె రూ.8 కోట్లు చందా మొత్తం చెల్లించారు. కానీ చిట్టీ పాట పాడితే ఆమె చేతికి ఇచ్చింది కేవలం రూ.48 లక్షలు మాత్రమే. ఇందులో రూ.8 కోట్ల విలువైన 45 చిట్టీ గ్రూపుల్లో ఆమె రూ.1.7 కోట్లు చందా మొత్తంగా చెల్లిస్తే.. చిట్టీ పాట పాడిన తర్వాత ఆమె చేతికి ఇచ్చింది కేవలం రూ.8 వేలు. ఆమెను డిఫాల్టర్‌గా చూపిస్తూ వారి కుటుంబ ఆస్తులు కూడా రాయించుకుంటున్నారు.

➤ విశాఖపట్నం కంచరపాలెంకు చెందిన పిలక లలిత కుమారి ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగి. ఆమెను విశాఖపట్నంలోని డాబా గార్డెన్స్ మార్గదర్శి చిట్ ఫండ్స్ బ్రాంచి కార్యాలయంలో రూ.5 లక్షల చిట్టీ గ్రూపులో ఘోస్ట్ చందాదారుగా చేర్చారు. ఆ విషయం తెలిసి ఆమె చిట్ రిజిస్ట్రార్‌ను ఆశ్రయించారు. అక్కడ ఉన్న పత్రాల్లో ఉన్న సంతకాలు చూసి అవి తాను చేయలేదని ఫోర్జరీ చేశారని తెలిపారు.

➤ ఆమె చిట్టీ పాడినట్టు.. ఆమెకు చిట్టీ మొత్తం చెల్లించినట్టు కూడా రికార్డుల్లో ఉంది. అందుకు ఇద్దరు సాక్షి సంతకాలు కూడా చేశారు. తనకు తెలియకుండానే తనను చందాదారుగా చేర్చడంతోపాటు తన సంతకాలు ఫోర్జరీ చేయడంపై లలిత కుమారి విశాఖపట్నం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో విశాఖపట్నం డాబా గార్డెన్స్ మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి మేనేజర్ యలమంచిలి బాబూ రాజేంద్ర ప్రసాద్, మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఏజెంట్ కె.సంతోష్, సాక్షి సంతకాలు చేసిన జి.నరసింగరావుపై పోలీసులు కేసు నమోదు చేశారు. మార్గదర్శి చిట్ ఫండ్స్, ఎండీ శైలజ కిరణ్, ఆమె పీఏ శశికళ, విజయవాడ లబ్బీపేట బ్రాంచి మేనేజర్ బండారు శ్రీనివాస రావు, గుడివాడ బ్రాంచి మేనేజర్ వైవీవీడీ ప్రసాద్, పాతూరి రాజాజీ, పాపి నాయుడులను నిందితులుగా పేర్కొంటూ ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు.

➤ పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో మార్గదర్శి చిట్ ఫండ్స్ ఏజెంట్‌నే ఆ సంస్థ మోసం చేసింది. ఏజంట్ సంతకాన్ని బ్రాంచి మేనేజర్ ఫోర్జరీ చేశారు. ఏజంట్ ఫిర్యాదుపై సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. వివరాలు త్వరలోనే వెల్లడించనున్నారు.

తల్లిదండ్రుల్లో ఏ ఒక్కరు గానీ, లేదా వారిరువురు గానీ, ముసలి వారైతే... వారితో విసుక్కుంటూ: 'ఛీ! (ఉఫ్)' అని కూడా అనకు. వారిని గద్దించకు. వారితో మర్యాదగా మాట్లాడు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 8 సెప్టెంబర్ 2023

పార్లమెంట్ 'ప్రత్యేక' రహస్యం

ప్రత్యేకం అంటేనే సాధారణమైన దానికి భిన్నమైనది, వేరైనది అని నిఘంటువుల అర్థం. మాటలోనే ఉన్నట్టుగా ఈ నెల 18 నుంచి 22 దాకా జరగనున్న పార్లమెంట్ ఉభయసభల ప్రత్యేక సమావేశాలు అనేక రకాలుగా ప్రత్యేకంగా కనిపిస్తున్నాయి. వర్షాకాల సమావేశాలు ముగిసి, 3 వారాలైన కాక ముందే ప్రభుత్వం మళ్ళీ ప్రత్యేక భేటీ ప్రకటన చేయడం ఒక ప్రత్యేకతైతే... హఠాత్తుగా ఈ భేటీ ఎందుకు జరుపుతున్నదీ అజెండా చెప్పకపోవడం మరో ప్రత్యేకత. ఉమ్మడి పౌరస్మృతి, 'ఒకే దేశం – ఒకేసారి ఎన్నికల' చట్టం, దేశం పేరును 'ఇండియా' నుంచి 'భారత్'గా మార్చడం, మహిళా రిజర్వేషన్లు... ఇలా పలు ఊహాగానాలు వినిపిస్తున్నా పాలకపక్షం నోరు మెదపక ప్రతిపక్షాలను ఊహల్లో, అనుమానాల్లో పెట్టడం మరింత ప్రత్యేకత. ఇది అన్యాయమని విపక్షాలు ఆక్రోశిస్తున్నాయి. ఆగస్ట్ 31నే ప్రత్యేక భేటీ ప్రకటన చేసిన ప్రభుత్వం మాత్రం ప్రతిపక్ష నేత తాజాగా లేఖ రాసినా, రాజకీయాలు చేస్తున్నారంటోంది. వెరసి ప్రత్యేక భేటీ దేనికనే ఉత్కంఠ పెరుగుతోంది.

గతంలో 2019 ఆగస్ట్‌లో వర్షాకాల సమావేశాల్లో అజెండాలో లేకుండానే హఠాత్తుగా ఆర్టికల్ 370 రద్దును సభలో తెర మీదకు తెచ్చి, ప్రతిపక్షాల చేష్టలుడిగేలా చేసిన చరిత మోదీ సర్కార్‌ది. మరి ఈ సారి ఎలాంటి రాజకీయ గూగ్లీ విసిరి, వచ్చే 2024 ఎన్నికలకు కొత్త కథనంతో ముందుకు వస్తారన్నది ఆసక్తి రేపుతోంది. సహజంగానే విపక్షాల్లో ఆందోళన పెంచుతోంది. ప్రత్యేక సమావేశాలనే మాటే రాజ్యాంగ నిబంధనల్లో లేదు గనక, వాటి అజెండా ఏమిటన్నది ముందుగా చెప్పాలన్న రూలూ కనిపించదు. కానీ, గతంలో పార్లమెంట్ ప్రత్యేక భేటీని ప్రకటించినప్పుడల్లా ఆ రోజునే సమావేశాల అజెండానూ ప్రకటించడం ప్రభుత్వాలు పాటిస్తూ వస్తున్న సంప్రదాయం. ఇప్పుడు దాన్ని కూడా పాలకపక్షం తుంగలో తొక్కుతోందన్నది ప్రధాన ఆరోపణ. ఇలా జరగడం ఇదే తొలిసారని రాజ్యాంగ నిపుణులూ నిర్ధరించారు. అయితే, సమస్త పార్లమెంటరీ సంప్రదాయాలకూ తిలోదకాలిస్తున్న పాలకులు గద్దె మీదకు వస్తున్న కాలంలో విచారపడి ఉపయోగం లేదు.

ప్రత్యేక సమావేశాల్ని నిర్వహించే అధికారం ప్రభుత్వానికి లేదని ఎవరూ అనలేరు, అనరు. కానీ, ప్రజాస్వామ్య దేశంలో అందుకు అనుసరిస్తున్న విధానం మీదే రచ్చ. నిజానికి, నిర్ణీత తేదీల్లోనే పార్లమెంట్ సమావేశం కావాలంటూ మన దేశంలో కచ్చితమైన పార్లమెంటరీ క్యాలెండరంటూ ఏమీ లేదు. ఏటా 12 నెలల వ్యవధిలో కనీసం రెండుసార్లు పార్లమెంట్ భేటీ కావాలి. జనవరి చివర్నించి మే వరకు బడ్జెట్ సమావేశాలు, జూలై నుంచి ఆగస్ట్ దాకా వర్షాకాల భేటీ, నవంబర్ – డిసెంబర్లలో శీతకాల సమావేశాలంటూ ఏటా 3 సమావేశాలన్నది చిరకాల సంప్రదాయం. అయితే, తొలి రెండు దశాబ్దాల పార్లమెంట్ చరిత్రలో లోక్‌సభ ఏటా సగటున 120 రోజుల పైచిలుకు సమావేశమైతే, గత దశాబ్ద కాలంలో అది 70 రోజులకు పడిపోవడం విషాదం. సాధారణ సమావేశాల సంగతే అలా ఉంటే, అసాధారణ భేటీతో ఒరిగేదేంటో చెప్పలేం. ప్రశ్నోత్తరాల సమయం, ప్రైవేట్ సభ్యుల చర్చ లాంటివి లేని ఈ భేటీ మే 28న మోదీ ప్రారంభించిన కొత్త పార్లమెంట్ భవనంలో జరగనుందట.

చారిత్రక సంఘటనలు, మైలురాళ్ళ జ్ఞాపకార్థం భారత పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరగడం కొత్తేమీ కాదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడూ, ఆ తర్వాత క్విట్ ఇండియా ఉద్యమ స్వర్ణోత్సవం (1992), భారత స్వాతంత్ర్య రజతోత్సవం (1972), స్వర్ణోత్సవం (1997) వేళ అర్ధ రాత్రి భేటీలు జరిగాయి. ఒక చట్టం చేయడానికంటూ ప్రత్యేక సమావేశం జరిగింది మాత్రం 2017 లోనే! అదీ మోదీ హయాంలోనే! నాటి సర్కార్ ఉభయ సభల అర్ధరాత్రి భేటీలో జీఎస్టీ తెచ్చింది. మళ్ళీ ఇప్పుడు అజెండా వెల్లడించకుండా బుల్‌డోజర్ ధోరణిలో పార్లమెంట్ ప్రత్యేక భేటీ జరపాలనుకోవడమే రచ్చకు దారి తీస్తోంది. అజెండాను ప్రతిపక్షాలకు చెప్పడం ప్రోటోకాలన్నది పక్కన పెడితే, చివరకు అధికారపక్ష నేతలకూ అజెండా అస్పష్టం, దేవరహస్యంగానే మిగలడం విడ్డూరం.

ప్రజాస్వామ్యంలో పాలకులు సర్వంసహా చక్రవర్తులు కాదని గుర్తించాలి. అలా ప్రవర్తించడాన్ని ప్రజలూ హర్షించరని గ్రహించాలి. అదే సమయంలో 'వీటిపై చర్చించండి' అంటూ నిన్న గాక మొన్న వర్షాకాల సమావేశాల్లో ప్రస్తావించిన అంశాలపైనే లేఖలో రాయడమూ కాంగ్రెస్ తదితర విపక్షాల మేధాశూన్యతకు అద్దం పడుతోంది. ప్రభుత్వం ఎలాంటి అంశాన్ని తెరపైకి తెచ్చినా, దాన్ని సమర్థంగా చర్చించగల సన్నద్ధత లేకుంటే అది ప్రతిపక్షాల అసమర్థతే. మొన్నటి అవిశ్వాస తీర్మానంపై చర్చలోనూ విపక్షాల్లో ఆ బలహీనత బయటపడిందన్నది నిష్ఠురసత్యం. అయితే, శాసన నిర్మాణంలో అధికార, విపక్షాలు సమన్వయంతో సాగితేనే ప్రజాస్వామ్య రథం సజావుగా సాగుతుంది. ఒకరిపై మరొకరు అపనమ్మకంతో, అన్నిటికీ అనుమానంతో ఉంటే అది ఎన్నటికీ ప్రజాస్వామ్యానికి మేలు చేయదు. ఆ వాస్తవాన్ని ఇరుపక్షాలూ గౌరవించాలి.

ఇప్పటికే ప్రస్తుత 17వ లోక్‌సభ చరిత్రలో మునుపెన్నడూ లేనట్టు అతి తక్కువ రోజులు సమావేశమై, అధిక భాగం వాయిదాలకే పరిమితమైన అపకీర్తిని మూటగట్టుకుంది. ఈ ప్రత్యేక సమావేశాలు అయినా అందుకు మినహాయింపు కావాలని ఆశిద్దాం. అత్యాశ అనుకున్నా అది అభిలషణీయమే. అదే జరిగితే ఇవి అక్షరాలా 'ప్రత్యేక సమావేశాలు'గా గుర్తుండిపోతాయి. అయితే అందుకు రహస్య అజెండాలు, దాపరికాలు మాత్రం ఉపకరించవు. ఈ లోక్‌సభకు ఇవే ఆఖరి సమావేశాలు కావచ్చని కూడా ఊహాగానాలు వినిపిస్తున్న వేళ... కనీసం ఇప్పుడైనా అధికార, విపక్షాల్లో ఉన్న పార్టీలు ఆపాటి హుందాతనం చూపుతాయా అన్నది ప్రధానమైన పశ్న.

కొత్త విశ్వ వ్యవస్థకు ఆశాదీపం

సందర్భం



ధర్మేంద్ర ప్రధాన్

భారతదేశం సహజంగానే తన డీఎన్ఏలో ప్రతిభా భాండాగారాన్ని కలిగి ఉంది. ప్రాచీన భారతీయ శాస్త్రజ్ఞుల అద్భుతమైన కృషి ఆధునిక పరిశోధనలను కూడా ప్రభావితం చేస్తోంది. ఇప్పుడు భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా అవతరించింది. భారతదేశ పురోగమనం, ఎదుగుదల కేవలం దాని సొంత ప్రజల కోసమే కాకుండా, మనం 'ప్రపంచ కల్యాణం' అని దేన్నయితే పిలుస్తామో అటువంటి ప్రయోజనాల కోసం కూడా ఉపయోగపడాలి. భారతదేశ అధ్యక్షతన జి–20 ఇతివృత్తం అయిన 'ఒక భూమి – ఒక కుటుంబం – ఒక భవిష్యత్తు', మన ప్రాచీన విలువ 'వసుధైవ కుటుంబం'తో ముడిపడి ఉంది.

జ్ఞాన నాగరికతగా, భారతదేశం సహజంగానే తన డీఎన్ఏలో ప్రతిభ భాండాగారాన్ని కలిగి ఉంది. భారతదేశ చరిత్ర చూస్తే– గణితం, ఖగోళ శాస్త్రం, వైద్యం, తత్వశాస్త్రం, సాహిత్యంతో సహా వివిధ విజ్ఞాన రంగాల్లో గణనీయమైన కృషి చేసిన ప్రస్థానమే గోచరిస్తుంది. ప్రాచీన భారతీయ గణిత శాస్త్రజ్ఞుల సంఖ్యా సిద్ధాంతం, గణిత విశ్లేషణలో అద్భుతమైన కృషి ఆధునిక పరిశోధనలను కూడా ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. జ్ఞాన నాగరికతగా భారతదేశ చరిత్ర దాని సమకాలీన విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక వైభవాన్ని ప్రభావితం చేస్తూనే ఉంది. ఇది ప్రపంచ శ్రేయస్సుకు గణనీయమైన సహకారిగా నిలిచింది.

విశ్వ శ్రేయస్సుకు జి–20


జి–20 అధ్యక్షతలో భారతదేశం మొత్తం వర్కింగ్ గ్రూపులు లేదా మంత్రుల సమావేశాలలో జరిగిన అన్ని చర్చలను కూడా గొప్ప ప్రపంచ శ్రేయస్సు అనే బంధంతో అనుసంధానం చేసింది. ''ఒక భూమి – ఒక కుటుంబం – ఒక భవిష్యత్తు'' అనే జి–20 ఇతివృత్తం, మన ప్రాచీన విలువలైన 'వసుధైవ కుటుంబం'తో ముడిపడి ఉంది. భారతదేశ పురోగమనం, ఎదుగుదల కేవలం దాని సొంత ప్రజల కోసమే కాకుండా, మనం 'ప్రపంచ కల్యాణం' అని దేన్నయితే పిలుస్తామో అటువంటి ప్రపంచ ప్రయోజనాల కోసం కూడా ఉపయోగపడాలి.

భారతదేశ ఆర్థిక వ్యవస్థ, దాని సహజసిద్ధమైన బలం, సామర్థ్యాలను ప్రపంచం స్పష్టంగా విశ్లేషించింది. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశాన్ని 'ప్రకాశవంతమైన ప్రదేశం'గా గుర్తించింది. భారతదేశ స్థూల ఆర్థిక మూలాధారాలు చాలా బలంగా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా సంక్షోభ పవనాలు ఎదురవుతున్నప్పటికీ, భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా అవతరించింది. భారతదేశం ఇప్పుడు ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. అతి తక్కువ సమయంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే అవకాశం సుస్పష్టంగా కనిపిస్తోంది.

ఆదర్శాలతో కూడిన విద్య

విజ్ఞానం, నైపుణ్యం ద్వారా మానవ మూలధనాన్ని పెంచడం అనేది భారతదేశ సామర్థ్యానికి కీలకం. విద్య అనేది వృద్ధి, ప్రేరణలను నడిపించే, నిలబెట్టే 'మదర్–షిప్'(కేంద్రం). విద్య అనేది పౌరులను శక్తిమంతం చేసే మాతృశక్తి. దానికి అనుగుణంగా రూపొందించిన నూతన విద్యా విధానం (ఎన్ఈపీ) అన్నింటికీ మూల పత్రం. సమగ్ర జాతీయ విద్యా విధానం–2020, భారత్‌లో విద్యను సమగ్రంగా, భవిష్యత్తు మార్గదర్శకంగా, ప్రగతి శీలంగా ఒక ముందు చూపు ఉండేలా సంపూర్ణంగా రూపొందించడం జరిగింది.

బలమైన విషయ అవగాహన, స్పష్టతను నిర్ధారించడం కోసం



మాతృభాషలో నేర్చుకోవడానికి నూతన విద్యా విధానంలో ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. అయితే మాతృభాషలో విద్య అనుసంధాన భాషలను భర్తీ చేయదు, కానీ వాటికి అనుబంధంగా ఉంటుంది. ఇది జ్ఞానపరంగా తక్కువ సమస్యలను అధిగమించే విద్యార్థులతోపాటు సజావుగా చదువుకొనే విద్యార్థులకు కూడా చక్కటి విద్యా మార్గాలను అందిస్తుంది.

ఉన్నత విద్య అంతర్జాతీయీకరణ ఇప్పుడు ప్రాధాన్యతను సంతరించుకుంది. ఎన్ఈపీ–2020, భారతదేశాన్ని అత్యుత్తమ అధ్యయన గమ్యస్థానంగా మార్చడానికిగానూ, అధ్యాపకులు/ విద్యార్థుల మార్పిడి, పరిశోధన, బోధనా భాగస్వామ్యాలు, విదేశాలతో పరస్పర ప్రయోజనకరమైన ఎంఓయూలపై సంతకాలు చేయడానికి వీలు కల్పిస్తుంది. ఐఐటీ- మద్రాస్, ఐఐటీ- ఢిల్లీ ఇప్పటికే తమ విదేశీ క్యాంపస్‌లను వరుసగా జాంజిబార్–టాంజానియా, అబుదాబి–యూఏఈలలో ఏర్పాటు చేయడానికి అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకున్నాయి.

విదేశాలతో విద్యా భాగస్వామ్యం

పరిశోధనను ప్రోత్సహించడానికి పరిశ్రమ–అకాడెమియా సహకారం అనేది ఎన్ఈపీలో చేర్చిన మరొక ప్రాధాన్యత అంశం. అకడమిక్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో తొలి అడుగు నుండి పరిశోధనల వరకు సులభతరం చేయడానికి నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ఏర్పాటు అవుతోంది. భారతదేశాన్ని పరిశోధన–అభివృద్ధి హబ్‌గా మార్చడంపై దృష్టి కేంద్రీకరించడం జరిగింది. సులభతర వ్యాపారం మాత్రమే కాకుండా సులభతర పరిశోధన కూడా ఉండేలా ప్రభుత్వం గట్టి ప్రయత్నాలు చేస్తోంది.

అంతేకాకుండా, ప్రధాన దేశాలైన అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్, ఇంకా యూరప్ దేశాలతో భారతదేశం విద్యా భాగస్వామ్యాన్ని కలిగి ఉంది. ఇక్కడ భారతదేశ ప్రతిభను గుర్తించి, దృష్టిలో ఉంచుకుంటారు. ఇనిషియేటివ్ ఆన్ క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ (ఐసెట్), క్వాడ్ ఫెలోషిప్ కింద హై–టెక్నాలజీ రంగాలలో మెరుగైన సహకారాన్ని ప్రోత్సహించడం జరుగుతుంది. భారతీయ విద్యను ప్రపంచ విద్యతో సమలేఖనం చేయడంలో ప్రామాణీకరణ సహాయ పడుతుంది. జాతీయ విద్యా విధానం కింద, పాఠశాల విద్య కోసం నేషనల్ కరికులం ఫ్రేమ్‌వర్క్ విడుదల చేయడమైనది. ఇది నిర్దిష్ట అభ్యాస ప్రమాణాలు, కంటెంట్, బోధనాశాస్త్రం, మూల్యాంకనాలకు ప్రమాణాలను ఏర్పరుస్తుంది. అదేవిధంగా, విభిన్న విద్యావేత్తల అభ్యాసాన్ని అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్ పరిధిలోకి తీసుకు రావడానికి నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్ పనిచేస్తుంది.

గొప్ప శ్రామిక శక్తి

భారతదేశంలో ఇప్పుడు 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు గల 60 కోట్ల జనాభా ఉంది. 65 శాతం మంది 35 సంవత్సరాల కంటే తక్కువ వయసు గలవారు. బహుళ-క్రమశిక్షణ, బహుళ-నైపుణ్యం కలిగిన, విమర్శనాత్మకంగా ఆలోచించే, యువకులు, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న శ్రామికశక్తి సామర్థ్యాలను ఉపయోగించుకోవడం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం.

భారతదేశం ఇప్పుడు మూడవ అతిపెద్ద స్టార్ట్–అప్ పర్యావరణ వ్యవస్థ. 100 కంటే ఎక్కువ యునికార్న్‌లతో నైపుణ్యం, వ్యవస్థాపకతకు ప్రతీకగా నిలిచింది. మెట్రో నగరాల్లో మాత్రమే కాదు, భారతదేశ ఆవిష్కరణలు, స్టార్టప్‌లు టైర్ 2, టైర్ 3 నగరాలు, పట్టణాల ద్వారా కూడా ఆవిష్కారం అవుతున్నాయి.

6వ తరగతి నుండి పాఠశాల విద్యలో నైపుణ్యం ఏకీకృతం అయింది. సాంకేతికతతో నడిచే పారిశ్రామిక వాతావరణంలో నిలదొక్కుకోవడానికిగానూ పాఠశాల స్థాయి నుండే నైపుణ్యం కలిగిన మానవ శక్తిని రూపొందించడానికి సింగపూర్ స్కిల్ ఫ్రేమ్‌వర్క్ అనుసరించదగినది.

అభివృద్ధి చెందుతున్న కొత్త క్రమంలో మానవ మూలవనరుల ప్రధాన పాత్రను భారతదేశం గుర్తించింది. విద్య, నైపుణ్యంతో కూడిన వ్యక్తులు నేటి జ్ఞాన ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తారు. వారు మాత్రమే విజ్ఞాన సరిహద్దును విస్తరించడం, ఆర్థిక వృద్ధికి ఊతమివ్వడంతో పాటు, అద్భుతమైన ఆవిష్కరణలు అందించగలరు; శాస్త్రీయ ఆవిష్కరణల ద్వారా దేశ నిర్మాణానికి అసాధారణమైన సహకారాన్ని అందించగలరు.

ప్రపంచ ప్రయోజనాల కోసం ఇప్పుడు భారత దేశం ఒక పెద్ద ప్రయోగశాల. జ్ఞాన శతాబ్దం అయిన 21వ శతాబ్దంలో కొత్త సాంకేతికతలు కొత్త క్రమానికి నాంది పలుకుతాయి. భారతదేశం తన విస్తారమైన నైపుణ్య గనిని ఏర్పరచడంలో, కొత్త క్రమాన్ని రూపొందించడంలో ముందంజలో ఉంది.

వ్యాసకర్త కేంద్ర విద్యా, నైపుణ్యాభివృద్ధి – వ్యవస్థాపకత మంత్రి

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మీకేం తెలుసు?



మణిపూర్‌లోని అంతర్గత అంశాలన్నీ ఎరిగినట్టుగా మాట్లాడకుండా, కేవలం అక్కడి తప్పుడు కథనాల మీద మాత్రమే 'ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా' దృష్టి పెట్టవలసింది!

– ప్రదీప్ ఫన్‌జౌబామ్, మణిపూర్ సంపాదకుడు

ఎంత ఓర్పు!



ఈమె నా పేషెంట్ (ఫొటో షేర్ చేశారు). ఆమె, శ్రీకృష్ణుడి పట్ల ఆమె భక్తి నాకు గర్వం కలిగిస్తాయి. ఇంతకు ముందటి రికార్డును ఆమె మళ్లీ బద్దలుకొట్టింది. గోకులాష్టమి కోసం ఒక్క రోజులో 88 నైవేద్యాలు సిద్ధం చేసింది.

– పి. కామత్, కార్డియాలజిస్ట్

ఎంపిక ముఖ్యం



బాగా రాసినవి (గుడ్ రైటింగ్) చదవడం, మంచి సంగీతం వినడం... మన జీవితాలకు చాలా ముఖ్యమైనవి. ఇంకో రకంగా చెప్పాలంటే... చెడ్డ సంగీతం, చెడ్డ రాతలను పూర్తిగా విస్మరించడం మంచిది.

– హరూకీ మురకామి, రచయిత

హవ్వ!



జాతి వివక్ష, ముస్లింల మీద ద్వేషం చూపుతోందని స్వీడన్‌ను 57 ముస్లిం దేశాలు నిందిస్తున్నాయి. ఈ దేశాలే నాస్తికులను, మత విమర్శకులను, పాత్రికేయులను చంపుతాయి. ఇవే దేశాలు ముస్లింలు అక్కడి నుంచి పారిపోయేలా చేస్తాయి. ఈ దేశాల రాజ్యాంగం 7వ శతాబ్దం నాటిది. కానీ ప్రపంచంలోనే అత్యంత ప్రగతిశీల దేశమైన స్వీడన్ చట్టాలు మారాలంటాయి.

– లువాయి అహ్మద్, స్వీడన్ యాక్టివిస్ట్

అదే శిక్ష



పని చేయవనీ, రోగికి ప్రమాదం పెంచుతాయనీ తెలిసినా – ఉద్దేశపూర్వకంగా ఔషధాలు, చికిత్సలు, ఇంజెక్షన్లను వాడమని ఒత్తిడి చేసే వైద్యవృత్తిలోని వాళ్ల కోసం నరకంలో ప్రత్యేక స్థానాలు రిజర్వు చేసివుంటాయని నిజాయతీగా నమ్ముతాను.

– సునీల్ ధండ్, ఫిజీషియన్

లోటు పూరించిన విమర్శకుడు

'అద్దేపల్లి' అనే పేరు కేవలం కవిత్వానికో, సాహిత్య విమర్శకో చిరునామా మాత్రమే కాదు. వర్ధమాన కవుల పాలిట పచ్చని భుజం. నవ కవి లతలకు చేవైన ఆధారం. అప్పుడప్పుడే కలం పట్టిన రచయితలకు వెన్నుదన్ను.

కవిత్వమన్నా, కవులన్నా ఆయనకు ఎంత ప్రేమ! సాహిత్య బీజాలను దశదిశలా వెదజల్లాలని ఎంత తపన! వేల మంది ఉన్న మహాసభ అయినా... నలుగురు అంటే నలుగురే చేరిన ఓ చిన్నపాటి పిచ్చాపాటి మాటల కలబోతే కానీ... ఒకటే ధోరణి. కవిత్వం, విమర్శ, గజల్...

కవిత్వమే తానైనవాడూ తానే కవిత్వమైన వాడూ అద్దేపల్లి రామ్మోహన రావు మాస్టారు. తెలుగు కవిత్వం, విమర్శ, గజల్స్, పద్యాలు... ఇలా ఎన్నో సాహిత్య ప్రక్రియలలో గొప్ప కృషి చేసిన వారు. 'నిత్య సాహిత్య సంచారి' అని ఆయన మిత్రులు అభిమానంగా పిలుచుకుంటారు. ఏటా ఆయన పేర ఇచ్చే పురస్కారాన్ని ఈ ఏడు ఆచార్య మేడిపల్లి రవి కుమార్ అందుకోనున్నారు.

ప్రకాశం జిల్లా అద్దంకిలో జన్మించిన రవికుమార్ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖలో పనిచేసి గత ఏడాది పదవీ విరమణ చేశారు. వివిధ సాహిత్య విషయాల మీద అనేక వ్యాసాలు రాశారు. వందలాది ఉపన్యాసాలు ఇచ్చారు.



మేడిపల్లి రవికుమార్



అద్దేపల్లి రామ్మోహన రావు

మనం ఏం తినాలి, ఏం బట్ట కట్టాలి అని నిర్ణయించే స్థితికి మార్కెట్ చేరుకున్న ప్రస్తుత తరుణంలో వీరు రాసిన 'ప్రపంచీకరణ – కవిత్వం – ప్రజా జీవితం' అనే పరిశోధక వ్యాసం అమూల్యమైనదే కాక అత్యంత కీలకమైనది కూడా. భిన్న సందర్భాలలో విభిన్నమైన భావోద్వేగాలతో స్పందించి అనేకమంది కవులు రాసిన కవితలన్నింటినీ సేకరించి సునిశితంగా అధ్యయనం చేసి ప్రపంచీకరణ ప్రజా జీవితాలను ఎలా ప్రభావితం చేస్తూ శాసిస్తోందో సాకల్యంగా పట్టి చూపింది ఈ వ్యాసం.

'వచన కవిత్వంలో వర్తమాన రైతు' వ్యాసంలో ఎందరెందరో కవులు రాసిన కవితలను పరిశోధించి వాటిలోని అంతః సారాన్ని గుదిగుచ్చి వర్తమాన రైతుల స్థితిగతులనూ, ఆ స్థితిగతులు మార్చాలంటే వారు చేయాల్సిన పోరాటాన్నీ, వారి ముందున్న కర్తవ్యాన్నీ సూచించారు.

ప్రపంచీకరణ నేర్పుగా పన్నిన ఉచ్చులో చిక్కి బయట పడలేక విలవిలలాడుతున్న సంపద అసలైన సృష్టికర్తలయిన మట్టి మనుషులు, కష్టజీవుల వెతలను దృశ్యమానం చేసిన జాతశ్రీ 'కుట్ర' కథా సంకలనంపై చేసిన లోతైన విశ్లేషణ, దశాబ్దాల కాలంగా కవిత్వమే ఊపిరిగా జీవిస్తున్న 'అడిగోపుల వెంకటరత్నం' కవితా సంకలనం 'ముందడుగు'కు రాసిన ముందు మాట, తొలి దళిత కవి 'కుసుమ ధర్మన్న' సంస్మరణగా వారి కవిత్వాన్ని విశ్లేషిస్తూ రాసిన 'దొరతనాలపై ధర్మన్న ఆగ్రహం', వడ్డెర చండీదాస్ 'అనుక్షణికం'పై రాసిన విమర్శనాత్మక పరామర్శ... ఇలా వారి ఏ రచన పరిశీలించినా సుస్పష్టంగా తేలేది ఒక్కటే. వీరు ఎప్పుడూ ప్రజా పక్షం. ప్రజా పీడకులకు ప్రతిపక్షం.

వర్తమాన సామాజిక జీవితాన్ని మానవీయత అనే కొలబద్దతో అంచనా వేసి లోతుగా పరిశీలించి అనుసరించదగ్గ తత్వాన్ని వినిపించే మొహమాటం లేని విమర్శకులు ఇప్పుడు కావాలి. అటువంటివారు అరుదు. విశ్వ మానవ కల్యాణం అనే తూనిక రాళ్ళతో సాహిత్యాన్నీ, కళలనూ, జరుగుతున్న పోరాటాలనూ తూయగలిగిన సద్విమర్శకులైన మేడిపల్లి రవికుమార్ ఆ లోటును, కొరతను పూరించగలరు. వారికి అద్దేపల్లి రామమోహనరావు పేరిట నెలకొల్పిన అవార్డు రావడం ముదావహం.

– రత్నాజయ్, పెద్దాపురం

(రేపు కాకినాడలో అద్దేపల్లి రామమోహనరావు సాహిత్య విమర్శ పురస్కార ప్రదానం)

ఆత్మహత్యలను ఆపలేమా?

సందర్భం



డా॥ ఇండ్ల రామసుబ్బారెడ్డి

ప్రపంచంలో జరిగే మొత్తం ఆత్మహత్యలలో 20 శాతం మన దేశంలోనే జరుగుతున్నాయి. ప్రతి ఏటా సుమారు 2 లక్షల మంది మన దేశంలో ఆత్మహత్యలతో మరణిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏటా 10 లక్షల మందికి పైగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఒకప్పుడు మన దేశంలో మధ్య వయస్కులు, వృద్ధులు ఆత్మహత్యలు చేసుకొంటే, ఇటీవలి కాలంలో యువత, విద్యార్థులు ఈ దారుణానికి పాల్పడుతున్నారు.

కారణాల విషయానికి వస్తే, కుటుంబ సమస్యలు, భార్యాభర్తల మనస్పర్థలు, బలహీన పడుతున్న కుటుంబ బంధాలు మూడింట ఒక వంతు కారణమైతే, డిప్రెషన్, మద్యానికి బానిస కావడం, స్కిజోఫ్రీనియా, దూకుడు, ఆవేశ మనస్తత్వాలు, కేన్సర్, ఎయిడ్స్ లాంటి శారీరక, మానసిక సమస్యలు కూడా ఆత్మహత్యలకు కారణ భూత మవుతున్నాయి. స్త్రీల కంటే పురుషులే అధికంగా (4:1) ఆత్మహత్యలతో మరణిస్తుంటే, ఆత్మహత్యా ప్రయత్నాలు చేయడంలో మాత్రం స్త్రీలదే పైచేయిగా ఉంది. ఎక్కువ ఆత్మహత్యలు ఉదయం 5 గంటల నుండి 10 గంటల మధ్యే ఎక్కువగా జరగడానికి ముఖ్య కారణం మన శరీరంలో 'కార్టిసాల్' అనే స్ట్రెస్ హార్మోన్ ఆ సమయంలో అధికంగా ఉత్పత్తి కావడమే! వారసత్వంగా జీన్స్ ప్రభావం వల్ల కూడా కొన్ని కుటుంబాల్లో పలువురు ఆత్మహత్యలకు పాల్పడటం శాస్త్రీయంగా కూడా రుజువైంది.



కోవిడ్ సమయంలో మునుపటి కంటే 10 శాతం ఆత్మహత్యలు పెరిగాయి. అయితే ఇదే సమయంలో పరీక్షలు లేకపోవడం వల్ల విద్యార్థుల ఆత్మహత్యలు 25 శాతం తగ్గిపోవడమనేది ఆలోచించదగ్గ విషయం!

మూడీగా, డల్‌గా, దిగులుగా ఉండటం; కన్నీళ్ళు పెట్టుకోవడం, తిండి, నిద్ర లేకపోవడం, డైరీలో సూసైడ్ నోట్ రాయడం, అప్పగింతలు పెట్టడం, వేదాంత ధోరణితో మాట్లాడటం, విషాద గీతాలు ఎక్కువగా వినడం, వీలునామా రాయడం, మద్యం, మత్తు మందులు అధికంగా తీసుకోవడం వంటి లక్షణాలు ఆత్మహత్య ఆలోచనను మనకు పట్టిస్తాయి.

నివారణ చర్యలకొస్తే, ప్రాణాంతకమైన పురుగు మందులను నిషేధించడం, మద్యాన్ని సాధ్యమైనంత తక్కువ అందుబాటులో ఉండేలా చూడటం కాకుండా 20 ఏళ్ల లోపు వారికి మద్యం విక్రయాలు నిషేధించడం, హాస్టళ్లలో సీలింగ్ ఫ్యాన్ల బదులు, గోడ ఫ్యాన్లు వాడటం వల్ల కూడా ఆత్మహత్యలను చాలా వరకు నియంత్రించవచ్చు. అలాగే పేదలకు నగదు బదిలీ చేయడం ద్వారానూ ఆత్మహత్యలను నివారించవచ్చు. బ్రెజిల్‌లో 60 శాతం, ఇండోనేషియాలో 20 శాతం ఆత్మహత్యలు ఈ నగదు బదిలీ వల్ల తగ్గుముఖం పట్టినట్లు నిర్ధారణ అయ్యింది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇటీవల ఆత్మహత్యల శాతం తగ్గడానికి ఒక ముఖ్య కారణం 'నగదు బదిలీ' పథకాలేనని కూడా చెప్పవచ్చు.

మనదేశంలో మొట్టమొదటిసారిగా తమిళనాడు ప్రభుత్వం 18 ఏళ్ల కిందట ప్రవేశపెట్టిన పరీక్షల ఫలితాలు వెలువడిన నెల లోపలే సప్లిమెంటరీ పరీక్షలు పెట్టడమనే విధానం వల్ల విద్యార్థుల ఆత్మహత్యలు ఆ రాష్ట్రంలో గణనీయంగా తగ్గిపోయాయి. ఈ విధానాన్ని ఇప్పుడు పలు రాష్ట్రాలు అమలు చేయడం ఒక మంచి పరిణామం.

ఆత్మహత్యకు పాల్పడే వారికి 'ఎమోషనల్ ఫస్ట్ ఎయిడ్' ఇవ్వాలి. అంటే, వారి బాధలను ఓపిగ్గా వినడం, సానుభూతి చూపించడం, ధైర్యం చెప్పడం, ఓదార్చడం, నీకు మేమున్నాం అనే భరోసా కల్పించడం ద్వారా ఆత్మహత్య ప్రయత్నాలను చాలా వరకు తగ్గించవచ్చు. ప్రభుత్వం 'జాతీయ ఆత్మహత్య నివారణ' పథకాన్ని తీసుకురావాలి. ఇందులో మానసిక నిపుణులనూ, ఉపాధ్యాయులనూ, స్వచ్ఛంద సంస్థలనూ భాగస్వాములను చేసి సమాజంలో ఆత్మహత్యల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రతి పట్టణంలో ఒక 'సూసైడ్ హెల్ప్‌లైన్' ఏర్పాటు చేసి అలాంటి తలంపులున్న వారికి తక్షణ సాంత్వన కల్పించే ఏర్పాటు చేయగల్గితే ఈ ఆత్మహత్యా నివారణ దినోత్సవానికి సార్థకత లభించినట్లవుతుంది.

వ్యాసకర్త ప్రముఖ మానసిక వైద్యులు, రచయిత
మొబైల్: 93481 14948

(సెప్టెంబర్ 10 ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం)

చినమాయకు పెనుమాయ

వృకుడనే అసురుడికి ఒకనాడు నారదముని కనిపించగా, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులలో ఎవరు భక్తులకు సులభసాధ్యుడై తొందరగా వరములిచ్చి కోరికలు తీరుస్తాడో చెప్పమని వేడుకుంటాడు. బాణుడు, రావణుడు వంటి మీ జాతివారే అయిన వీరులకు అతి సులభంగా కోరిన వరములిచ్చిన మహేశ్వరుడినే నీవు కూడా ఆరాధించి, కావలసిన వరమేదో కోరుకొమ్మని సలహాయిచ్చి, తన దారిన తాను వెళ్ళిపోతాడు నారదుడు. ఘోరమైన తపస్సు చేస్తాడు వృకుడు. మెచ్చి ప్రత్యక్షమైన శంకరుడిని 'తాను ఎవడి తలపై చేయి పెడతాడో వాడి తల వేయి ఖండములై ధరపై పడాలని' వరముగా వేడుకుంటాడు. అమాయకంగా 'అలాగే!' అంటాడు పరమ శివుడు. మహదానందపడిన వృకుడు 'మరింకేమి? స్వామివారి వరప్రభావం ఎంతటిదో ఒకసారి పరీక్షించుకుంటాను!' అని శివుని శిరస్సు మీదే తన కరముంచబోతాడు. అప్పటికిగాని అపాయం అవగతం కాని పరమశివుడు, చేసేది లేక, ముందుగా వృకుడి ముందునుంచి వెళ్ళిపోవడం ఒక్కటే మార్గం అనిపించి, పరుగెట్టిపోయి హరి చెంతన చేరి, ఏదో ఒకటి చేసి ప్రమాదం నుండి తప్పించమని అడుగుతాడు. తప్పదు కదా హరికి! అయితే, అప్పుడు వృకుడిని దేహబలంతో ఎదుర్కోవడం వల్ల ఉపయోగం లేదని గ్రహించినవాడై, బుద్ధిబలంతో మాటలతోనూ, ఆ పైన మాయతోనూ ఎదుర్కొని ఆపద నుండి బయటపడాలని నిర్ణయించుకుంటాడు విష్ణువు. ముందుగా వృకుడిని మాటలలోకి దించి, ఇలా అంటాడని సందర్భానికి తగిన చమత్కారం నిండిన కందపద్యంలో చెప్పాడు అల్లాడు నరసింహకవి తన రచనయైన 'నారదీయ పురాణము' కావ్యంలో.

'శిరమంటివి కరమంటివి
వరమంటివి హరుడు పల్కు వచనంబులకున్
ధరలో నిల్కడగలదే
పరులవలె న్నేడు నిన్ను భ్రమయించె గదా.'

'శిరస్సన్నావు, చెయ్యన్నావు, చెయ్యి తలపై పెట్టగానే తలవెయ్యి ముక్కలై నేలపై పడుతుందని వరమిచ్చాడన్నావు, నమ్మగలిగే మాటలేనా ఇవి? ఈ భూమి మీద శివుడి మాటలకు స్థిరత్వం ఉన్నదా? నిన్ను కూడా మోసం చేశాడు చూశావా!' అని వృకుడి మదిలో సందేహం కలిగించి, కోపం తెప్పించడం ఈ పద్య భావం. అలా కోపంలో మతి తప్పి ఉన్న వృకుడిని' కావాలంటే నువ్వే పరీక్ష చేసుకో!' అని పురికొలిపి, 'శాంబరీ విభ్రమం' అనే మాయ కల్పించి, ఆ మాయలో వృకుడు తన తలపై తానే చెయ్యి పెట్టుకునేలా చేసి, కథను ముగిస్తాడు హరి.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, తిథి: బ.నవమి రా.8.18 వరకు, తదుపరి దశమి, నక్షత్రం: మృగశిర సా.4.04 వరకు, తదుపరి ఆరుద్ర, వర్జ్యం: రా.12.55 నుండి 2.36 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.17 నుండి 9.07 వరకు, తదుపరి ప.12.24 నుండి 1.11 వరకు, అమృతఘడియలు: ఉ.6.54 నుండి 8.32 వరకు; రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు, సూర్యోదయం: 5.50, సూర్యాస్తమయం: 6.07.

కుమార్తెకు ఆదర్శ వివాహం చేసిన ఎమ్మెల్యే రాచమల్లు



సబ్ రిజిస్ట్రార్ రామలక్ష్మి నుంచి మ్యారేజీ సర్టిఫికెట్ అందుకుంటున్న పల్లవి, పవన్‌కుమార్

ప్రొద్దుటూరు: వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తన పెద్ద కుమార్తె పల్లవికి ఆదర్శ వివాహం చేశారు. రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి కుమార్తె పల్లవి, కమ్మర లీలా గోపి పవన్‌కుమార్ అనే యువకుడు ప్రేమించుకున్నారు. వీరి కులాలు వేరు అయిప్పటికీ వారి పెళ్లికి ఎమ్మెల్యే అభ్యంతరం చెప్పలేదు. ఆయనే స్వయంగా పల్లవి, పవన్ కుమార్‌లను గురువారం స్థానిక బొల్లవరంలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి తీసుకువెళ్లి సంప్రదాయ ప్రకారం పెళ్లి చేశారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వారికి రిజిస్టర్ మ్యారేజీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ తన కుమార్తె ఎంబీఏ చదివేటప్పుడు పవన్‌కుమార్‌ను ప్రేమించిందని తెలిపారు. తన కుమార్తె ఇష్టప్రకారం మనస్ఫూర్తిగా ప్రేమ వివాహం చేశానని చెప్పారు. పవన్‌కుమార్ తండ్రి ఆర్టీసీలో మెకానిక్‌గా పనిచేస్తున్నారని, ఇష్టపడిన అబ్బాయితో కుమార్తె వివాహం చేశానన్న తృప్తి తనకు ఉందని వివరించారు. వాస్తవానికి ఈ వివాహాన్ని ఘనంగా చేయాలని భావించానని, అయితే తన కుమార్తె ఇందుకు అంగీకరించకపోవడంతో నిరాడంబరంగా జరిపించానని ఎమ్మెల్యే చెప్పారు.

రూ.2 వేల నోట్ల మార్పిడి కేసులో ఇద్దరి అరెస్ట్



నిందితులతో పోలీసులు

బొమ్మలసత్రం: రూ.2 వేల నోట్ల మార్పిడి కేసులో రూ.2.20కోట్లతో ఉడాయించిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ మహేశ్వరరెడ్డి స్థానిక తాలుకా పోలీస్టేషన్‌లో గురువారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీలో నివాసముంటున్న శ్రీనివాసరెడ్డి ప్లాట్లు కొనుగోలు చేసి విక్రయిస్తుంటాడు. వరప్రసాద్ అనే మధ్యవర్తి ఇతన్ని కలిసి గుంతకల్లుకు చెందిన కొందరి వద్ద రూ.3 కోట్లు రూ.2 వేల నోట్లు ఉన్నాయని, వాటిని తమకు రూ.500 నోట్లు రూ.2.20 కోట్లు ఇస్తే చాలని ఆశచూపాడు. దీంతో అతను తనకు తెలిసిన వారి నుంచి రూ.500 నోట్లు మొత్తం రూ.2.20 కోట్లు సమకూర్చి జూలై 22న నంద్యాల శివారు రైతునగరం వద్దనున్న జాతీయరహదారి వద్దకు వెళ్లాడు. అప్పటికే కారులో సిద్ధంగా ఉన్న విశాఖపట్నానికి చెందిన శోభన్ బాబు, శ్రీకాకుళంకు చెందిన చిన్నబాబు మరో నలుగురు కలిసి శ్రీనివాసరెడ్డితో మాటలు కలిపారు. ఇంతలో మరో ఇద్దరు పోలీస్ వాహనంలో సైరన్ వేసుకుని రావడంతో శ్రీనివాసరెడ్డి కంగారుపడ్డాడు. నిందితులు అతని చేతిలో ఉన్న నగదు బ్యాగును లాక్కుని కారులో పరారయ్యారు. శ్రీనివాసరెడ్డి తేరుకునేలోగా అక్కడ ఎవరూ కనిపించకుండాపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఫాస్ట్‌ట్రాగ్ అకౌంట్ ద్వారా ఇద్దరు నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.70 లక్షలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

లే'టేస్ట్' ట్రెండ్..!

ఉద్యోగం చేస్తూనే నాటుకోళ్లు, కౌజుపిట్టలు, కొర్రమీను చేపల పెంపకం

ఆరు సెంట్ల స్థలంలో ఆర్గానిక్ పద్ధతిలో సాగు

అదనపు ఆదాయం ఆర్జిస్తున్న సివిల్ ఇంజినీర్

మండపేట: నాటుకోడి... కౌజుపిట్ట... కొర్రమీను... ఇదీ ఇప్పుడు ట్రెండ్.. అటు రెస్టారెంట్లలో అందరి దృష్టి వీటిపైనే ఉంటోంది. ఇటు పెంపకంలోనూ వీటిపైనే యువత ఎక్కువగా ఆసక్తి చూపుతోంది. కొందరు ఉద్యోగం చేస్తూనే తమకున్న ఆసక్తి మేరకు కొద్దిపాటి స్థలంలో గేదెలు, ఆవులు, నాటుకోళ్లు, కౌజుపిట్టలు, కొర్రమీను చేపలు వంటివి ఒకేచోట పెంచుతూ అదనపు ఆదాయం పొందుతున్నారు. ఇదే తరహాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం పాలతోడు గ్రామానికి చెందిన పిల్లా విజయ్‌కుమార్ కేవలం ఆరు సెంట్ల స్థలంలో నాటుకోళ్లు, కౌజుపిట్టలు, కొర్రమీను చేపలను ఆర్గానిక్ పద్ధతిలో పెంచుతున్నాడు.
నెలకు రూ.40వేల వరకు ఆదాయం పొందుతున్నాడు. డిప్లొమా సివిల్ ఇంజినీరింగ్ చదివిన విజయ్‌కుమార్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో సివిల్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. చిన్నతనం నుంచి పశుపోషణ, కోళ్ల పెంపకంపై ఆసక్తి కలిగిన అతను తన సొంతూరులో ఆరు సెంట్ల స్థలంలో నాలుగేళ్ల కిందట మూడు గేదెలు, రెండు ఆవులతో డెయిరీఫాం, నాటుకోళ్ల పెంపకం ప్రారంభించాడు. డెయిరీఫాం బాగానే ఉన్నా కార్మికుల సమస్యతో దానిని మధ్యలోనే ఆపేశాడు. అనంతరం కోళ్ల పెంపకంపై దృష్టి పెట్టాడు. భీమవరం నుంచి మేలుజాతి కోడిపుంజులు, పెట్టలను తీసుకువచ్చి గుడ్లు ఉత్పత్తి చేయించి ఆర్గానిక్ తరహాలో పెంచడం ప్రారంభించాడు. ఆ తర్వాత హోటళ్లలో కౌజుపిట్టలకు మంచి గిరాకీ ఉందని గుర్తించి... రెండేళ్లుగా వాటిని కూడా పెంచుతున్నాడు. అంతటితో ఆగకుండా గతంలో ఏర్పాటుచేసిన డెయిరీ ఫాంలో పశువుల కోసం నిర్మించిన నీటి తొట్టెలలో ఏడాది నుంచి కొర్రమీను చేపల పెంపకం ప్రారంభించాడు. హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తూనే వారానికి ఒకసారి ఒకసారి వచ్చి అన్నీ చూసుకుని వెళతాడు. ఆయనకు కుటుంబ సభ్యులు సాయం చేస్తున్నారు. యూట్యూబ్ వీడియోల ఆధారంగా ఎప్పటికప్పుడు మెళకువలు తెలుసుకుంటూ కోళ్లు, చేపలు, కౌజుపిట్టల పోషణ చేస్తున్నాడు. యూట్యూబ్‌లో చూసి గుడ్లను పొదిగించేందుకు ఇన్వర్టర్‌పై పని చేసే ఇంక్యుబేటర్‌ను సొంతంగా ప్లేవుడ్‌తో తయారు చేసుకున్నాడు. దానిలోనే కోడిగుడ్లు, కౌజుపిట్ట గుడ్లు పొదిగిస్తున్నారు.



ఇంక్యుబేటర్‌లోని నాటుకోడి పిల్లలు



రూ.75,000 విలువైన కోడిపుంజు



కౌజుపిట్టలు

ఆదాయం బాగుంది



నాటుకోళ్లు, కౌజుపిట్టలు, కొర్రమీనుల పెంపకం లాభసాటిగా ఉంది. వీటిని పూర్తి ఆర్గానిక్ పద్ధతుల్లో పెంచుతాం. గుడ్ల ఉత్పత్తికి వినియోగించే కోడి పుంజు రూ.75 వేలు కాగా, పెట్ట రూ.25 వేలు చొప్పున భీమవరంలో కొనుగోలు చేశా. ప్రస్తుతం వందకు పైగా కోళ్లు, 2,500 నుంచి 3,000 వరకు కౌజుపిట్టలు, 1,000 నుంచి 1,200 వరకు కొర్రమీను చేపలు పెంచుతున్నాం. మేత, ఇతర ఖర్చులు పోనూ ప్రతి నెలా రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు ఆదాయం వస్తోంది.

– పిల్లా విజయ్‌కుమార్, పాలతోడు, మండపేట మండలం

దుర్గమ్మ పంచహారతుల సేవలో జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

అమ్మవారిని దర్శించుకున్న పలువురు హైకోర్టు న్యాయమూర్తులు



ఆలయ ప్రాంగణంలో జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాతో న్యాయమూర్తులు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా దంపతులు గురువారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను దర్శించుకున్నారు. దర్శనానికి విచ్చేసిన జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా దంపతులకు ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ స్వాగతం పలికారు. జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా వెంట హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఏవీ. శేషసాయి దంపతులు, జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్, జస్టిస్ జ్యోతిర్మయి దంపతులు ఉన్నారు. అమ్మవారి పంచహారతుల సేవలో పాల్గొన్న అనంతరం దుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, సబ్ కలెక్టర్ అదితిసింగ్, ఆలయ పాలక మండలి సభ్యులు చింతా సింహాచలం, నంబూరి రవి పాల్గొన్నారు.

ఆళ్లగడ్డలో ఎన్ఐఏ సోదాలు

- అదుపులో మహిళ ?

ఆళ్లగడ్డ(నంద్యాల): జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారుల బృందం ఆళ్లగడ్డలో సోదాలు నిర్వహించింది. ఇటీవల ఎన్ఐఏ అధికారులు బెంగళూరులో అదుపులోకి తీసుకున్న యూనస్ భార్య ఆళ్లగడ్డలోని పాత మసీదు సమీపంలో నివాసం ఉంటున్న సమాచారంతో ఎన్ఐఏ ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది. గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో స్థానిక పోలీసులతో కలిసి అనుమానితురాలి ఇంటికి చేరుకున్న అధికారులు ఆమెతో పాటు కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఇంటితో పాటు పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. యూనస్‌కు సన్నిహితంగా ఉన్న బంధువులు, స్నేహితుల వివరాలపై ఆరా తీశారు. సుమారు 3 గంటల పాటు విచారణ జరిపిన అధికారులు ఓ మహిళను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కాగా గత నాలుగు నెలల క్రితం బెంగళూరులో జరిగిన ఉగ్రవాద దాడుల ఘటనకు సంబంధించి నంద్యాలకు చెందిన యూనస్‌కు టెర్రరిస్ట్ గ్రూపులతో సంబంధాలు ఉన్నాయనే అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

తిరుమలలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి

- నేటి సాయంత్రం ఉట్లోత్సవం నిర్వహణ
- శ్రీవారిని దర్శించుకున్న ఒడిశా గవర్నర్



తిరుమలలో ఉట్టి కొడుతున్న స్థానికులు

తిరుమల/సాక్షి, తిరుపతి: తిరుమలలో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. గోగర్భం డ్యామ్ చెంత ఉన్న ఉద్యానవనంలో కాళీయమర్దనుడు అయిన శ్రీకృష్ణునికి ఉదయం పంచాభిషేకాలు చేసి ఉట్లోత్సవం నిర్వహించారు. ఆ తరువాత ప్రసాద వితరణ చేపట్టారు. శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి వద్ద రాత్రి 8–10 గంటల నడుమ ఉగ్ర శ్రీనివాసమూర్తి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు, శ్రీకృష్ణస్వామివారికి ఏకాంతంగా తిరుమంజనం, ద్వాదశ ఆరాధన నిర్వహించారు. ప్రబంధ శాత్తుమొర, గోకులాష్టమి ఆస్థానాన్ని ఘనంగా చేపట్టారు. కాగా, శుక్రవారం తిరుమలలో సాయంత్రం ఉట్లోత్సవం నిర్వహించనున్నారు. దీన్ని బంగారు తిరుచ్చిపై మలయప్పస్వామి వారు, మరో తిరుచ్చిపై శ్రీకృష్ణస్వామివారు తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ తిలకించనున్నారు. ఈ కారణంగా ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది. కాగా, ఒడిశా గవర్నర్ గణేషీ లాల్ గురువారం శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనాలను, అధికారులు ప్రసాదాలను అందజేశారు. కాగా, గోవిందకోటి కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. చిన్నారులు, యువతలో సనాతన ధర్మం, మానవీయ విలువలు, మానవ సంబంధాల గురించి అవగాహన, ఆసక్తి పెంచడానికి టీటీడీ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తిరుపతిలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు గురువారం గోవింద కోటి రాయడాన్ని ప్రారంభించారు.

బాబూ.. నీకు పోటీ చేసే అర్హత లేదు

1,075వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



తాడికొండ: రాయలసీమలో హైకోర్టు ఏర్పాటును వ్యతిరేకిస్తున్న చంద్రబాబుకు ఆ ప్రాంతంలో పోటీచేసే అర్హత లేదని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,075వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో గురువారం పలువురు మాట్లాడారు. అవినీతి సొమ్ముతో అమరావతి పరిసర ప్రాంతంలో ముందస్తు పెట్టుబడులు పెట్టిన బాబు ఆయన సామాజిక వర్గ ప్రయోజనాల కోసమే అమరావతి రాజధాని అంటూ దొంగ ఉద్యమం చేస్తున్నాడని, మరి ఉత్తరాంధ్ర, రాయలసీమ సంగతేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. బాబు కుప్పంలో చిత్తుచిత్తుగా ఓడిపోవడం ఖాయమన్నారు. వ్యవస్థలను మేనేజ్ చేసి స్కామ్‌లు చేసిన చంద్రబాబు, స్కీములతో ప్రజలను దోచుకున్న రామోజీరావు అండ్ కోను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం జగన్‌ని రాజకీయంగా ఎదుర్కోలేక చంద్రబాబు వ్యక్తిగతంగా తులనాడుతున్నాడన్నారు. మాదిగాని గురునాథం, పెరికే వరప్రసాద్, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం పాల్గొన్నారు.

తమిళ మత్స్యకారుల్ని రక్షించిన కోస్ట్‌గార్డు బృందం

- బోటు ఇంజిన్ ఫెయిలవడంతో 6 రోజుల పాటు సముద్రంలో నరకయాతన
- మత్స్యకారులను సురక్షితంగా విశాఖ తీరానికి తీసుకొచ్చిన తీరగస్తీ దళం



మహారాణిపేట: ఇండియన్ కోస్టు గార్డ్ నౌక పదిమంది తమిళనాడుకు చెందిన మత్స్యకారులను రక్షించింది. గురువారం వీరిని విశాఖ ఫిషింగ్ హార్బర్‌కు తీసుకొచ్చింది. తమిళనాడుకు చెందిన గణపతి పెరుమాల్ బోటు ఆగస్టు 24వ తేదీన కాసిమేడు నౌకాశ్రయం నుంచి చేపల వేటకు బయలుదేరింది. చెన్నైకి నార్త్ ఈస్టు నుంచి 240 మైళ్ల దూరంలో వేట చేస్తుండగా సెప్టెంబర్ ఒకటో తేదీన బోటు మరమ్మతుకు గురైంది. గణపతి పెరుమాల్ ఫిషింగ్ బోటు (ఐఎన్‌డి–టిఎన్–02,ఎంఎం–2591) బోటులో శరవణన్ (28), ఎం.శరవణన్ (26), ఎస్.రాజు(40), ఫరూక్ (30), ఎస్.రవి (37), సెన్థిల్ (40), ఎ.పురాయ్ రాజ్ (29), గణేష్‌న్(47), రవికుమార్ (39), వెలు (45) చిక్కుకున్నారు. పదిమంది మత్స్యకారులు నరకయాతన అనుభవించారు. ఆరు రోజుల పాటు తినడానికి తిండి లేక, తాగడానికి మంచినీరు లేక అల్లాడిపోయారు. సముద్రంలో అలల తాకిడికి, చల్లని గాలులకు కొంత మంది అనారోగ్యానికి గురయ్యారు. ఈ విషయమై తమిళనాడు మత్స్యశాఖ అధికారులు పంపిన సమాచారం మేరకు కోస్ట్ గార్డ్ నౌక ఆయూష్ రంగంలోకి దిగింది. కోస్టు గార్డ్ నౌక పది మంది మత్స్యకారులను విశాఖ తీసుకొచ్చి మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ విజయకు సురక్షితంగా అప్పగించారు. బోటు మరమ్మతులు జరుగుతున్నాయి.

నకిలీ మందుల గుట్టురట్టు

- నిఘావేసి పట్టుకున్న ఔషధ నియంత్రణ మండలి అధికారులు
- విజయవాడలో రూ.కోటి విలువైన మందులు స్వాధీనం

లబ్బీపేట (విజయవాడ తూర్పు):మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ప్రభుత్వ కంపెనీల మందుల పేరుతో తయారైన నకిలీ మందుల గుట్టును ఔషధ నియంత్రణ శాఖ అధికారులు రట్టు చేశారు. ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి, భవానీపురంలోని రెండు షాపుల్లో రూ.కోటి విలువైన నకిలీ మందులను గుర్తించారు. వీటిని హైదరాబాద్ నుంచి విజయవాడకు తరలించినట్టు నిర్ధారించారు. వివరాలివి... ప్రముఖ కంపెనీలైన సన్ ఫార్మా, లూపిన్, వింటాస్, అలెకమ్, గ్లెన్‌మార్క్ వంటి కంపెనీలకు చెందిన మందులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుంది. ఇవి బ్రాండెడ్ ఫార్మా మందులు కావడంలో రిటైల్‌గా విక్రయిస్తే 20 నుంచి 25 శాతం మాత్రమే లాభం ఉంటుంది. డిమాండ్ దృష్ట్యా వాటి పేరుతో నకిలీ మందులు మార్కెట్‌లోకి ప్రవేశ పెట్టేందుకు సిద్ధమైనట్లు ఔషధ నియంత్రణ శాఖ అధికారులకు సమాచారం అందింది.

పక్కా ప్రణాళికతో నిఘా వేసి..

నకిలీ మందులకు అడ్డుకట్ట వేసేందుకు ఔషధ నియంత్రణ శాఖ అధికారులు పక్కా ప్లాన్ రూపొందించారు. 15 రోజులుగా డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ కోట అనిల్‌కుమార్ పర్యవేక్షణలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అన్వేష్ రెడ్డి నిఘా వేశారు. హైదరాబాద్ నుంచి తరలివచ్చిన నకిలీ మందులను వన్‌టౌన్, గొల్లపూడిలోని లక్ష్మీపద్మావతి మెడికల్స్, నాగలక్ష్మి మెడికల్స్ స్టోర్స్‌లో ఉన్నట్టు గుర్తించారు. వాటి విలువ రూ.కోటి వరకూ ఉంటుందని అంచనా వేశారు. నకిలీ మందులను హైదరాబాద్ నుంచి నకిలీ మందులు వచ్చాయని, విజయవాడతోపాటు గుంటూరు, నెల్లూరు కూడా తరలించినట్టు తెలిసింది. ఉత్తరాఖండ్‌తో తయారైన నకిలీ మందులు హైదరాబాద్ రాగా.. అక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నట్టు ఔషధ నియంత్రణ శాఖ అధికారులు నిర్ధారణకు వచ్చారు. కాగా, గుంటూరులోని ఈశ్వర్ మెడికల్స్‌లోనూ నకిలీ మందులను గుర్తించారు. రెండు మందుల షాపులపై ఔషధ నియంత్రణ శాఖ డీజీ కె.రఘురామిరెడ్డి ఆదేశాల మేరకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బి.అన్వేశ్‌రెడ్డి విజయవాడ భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారిపై పలు సెక్షన్ల కింద క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

బోనులో చిక్కిన మరో చిరుత

- గత రెండు నెలల్లో బోనులో చిక్కిన 5 చిరుతలు
- మరో 2 చిరుతలు సంచరిస్తున్నట్లు అధికారుల వెల్లడి



తిరుమల: తిరుమల మొదటి ఘాట్ రోడ్డులోని ఏడో వ మైలు వద్ద నరసింహస్వామి ఆలయం సమీపంలో అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన బోనులో మరో చిరుత చిక్కింది. బుధవారం అర్ధరాత్రి తర్వాత రాత్రి పన్నెండు, ఒంటి గంట మధ్య ప్రాంతంలో అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన బోనులో చిరుత చిక్కినట్లు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తెలిపారు. ఆయన టీటీడీ అధికారులతో కలిసి చిరుత చిక్కిన ప్రాంతాన్ని గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..అటవీశాఖ అధికారుల సహకారంతో 300 మంది అటవీ సిబ్బంది నిరంతర పర్యవేక్షణలో అలుపెరగకుండా ఆపరేషన్ చిరుత కొనసాగిందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా టీటీడీ ఈవో ధర్మారెడ్డి నేతృత్వంలో నిరంతర కృషి జరుగుతోందని, ఈ కారణంగానే చిరుతను పట్టుకున్నామని తెలిపారు. అలిపిరి, శ్రీవారి మెట్టు నడక మార్గాల్లో వెళ్లే భక్తులకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని, భక్తుల భద్రత విషయంలో రాజీ పడేది లేదన్నారు. కాగా, తిరుమలలోని స్పెషల్ టైప్ కాటేజీ సమీపంలో, నరసింహ స్వామి ఆలయం సమీపంలో చిరుతలు సంచరిస్తున్నాయి. పై రెండు ప్రాంతాల్లో 2 చిరుతలు సంచరిస్తున్నట్లు ట్రాప్ కెమెరాల ద్వారా అధికారులు గుర్తించారు.

ఏఎన్‌యూ పాలకమండలి నియామకం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (ఏఎన్‌యూ) పాలకమండలి సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. సభ్యుల నియామకంలో సామాజిక న్యాయానికి, మహిళల ప్రాతినిధ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. వర్సిటీ కళాశాలల సీనియర్ ప్రొఫెసర్ కేటగిరీలో ఆచార్య ఎం.జగదీష్ నాయక్, ప్రిన్సిపాల్ కేటగిరీలో వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.స్వరూపరాణి, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్ కేటగిరీలో గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్. జ్యోత్స్న కుమారి, అధ్యాపకుని కోటాలో ఆచార్య కె.సుమంత్ కుమార్, అనుబంధ కళాశాలల అధ్యాపకుని కోటాలో డాక్టర్ షాహేదా అక్తర్, పరిశ్రమలు, వ్యవసాయం, ట్రేడ్ కామర్స్, ఎడ్యుకేషన్, పబ్లిక్ లైఫ్, లీగల్ ప్రొఫెషన్ అండ్ సోషల్ వర్క్ కేటగిరీలో సీహెచ్‌ఏపీ రామేశ్వరరావు, ఇందిరా రాధా , వీ.వెంకటేశ్వర్లు , క్లీటస్ డైసీ సభ్యులుగా నియమితులయ్యారు.

లవ్‌జిహాద్‌లో చిక్కుకున్నా.. సాయం చేయండి

- ప్రధాని, డీజీపీకి బెంగళూరు యువతి వినతి

బనశంకరి: బెంగళూరులో ఓ యువతి లవ్‌జిహాద్ లో చిక్కుకున్నానంటూ 'ఎక్స్'ద్వారా ప్రధానికి, నగర పోలీస్ కమిషనర్, డీజీపీకి ట్యాగ్ చేస్తూ సహాయం చేయాలని వేడుకుంది. గుప్తా భరత్ అనే పేరు ఉన్న ఖాతా ద్వారా గురువారం వరుస ట్వీట్లు చేసింది. 'నేను లవ్ జిహాద్‌లో చిక్కుకుపోయా, నాపై అత్యాచారానికి పాల్పడ్డారు, బలవంతంగా అసహజ లైంగిక దాడికి పాల్పడ్డారు. నేను ప్రమాదకరస్థితిలో ఉన్నాను, అత్యవసరంగా నాకు నగర పోలీసుల సహాయం కావాలి'అని ఆ యువతి పేర్కొంది. 'కశ్మీరు యువకుడు ఫేస్‌బుక్ ద్వారా పరిచయమయ్యాడు, మా మధ్య నగదు లావాదేవీలు జరిగాయి, వివాహం చేసుకుంటానని నమ్మించి డబ్బు తీసుకుని మోసగించాడు, అతని వల్ల నాకు ప్రాణభయం ఉంది'అని తెలిపింది. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పోలీసులు బాధిత యువతికి సూచించారు. యువతి బెళ్లందూరులో నివసిస్తున్నట్లు తేలింది. తూర్పు విభాగం అదనపు పోలీస్ కమిషనర్ రమణ్ గుప్తా మాట్లాడుతూ.. పోలీసులకు ఫిర్యాదు చేసే విషయాన్ని ఆలోచిస్తున్నట్లుగా ఆమె చెప్పిందన్నారు. యువతి ఐటీ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నట్లు తెలిసిందని, ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఘటన బెంగళూరులో జరిగిందా, మరెక్కడైనా జరిగిందా అనేది తెలియాల్సి ఉందని వివరించారు.

రిజిస్ట్రేషన్ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

- ప్రజలకు వేగవంతమైన, సులభతరమైన, అవినీతి రహిత సేవలు
- అత్యాధునిక కార్డ్ ప్రైం సాఫ్ట్‌వేర్ వినియోగం
- ఈ–స్టాంపింగ్, సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లతో సులభంగా ప్రక్రియ
- ఆన్‌లైన్‌లోనే దస్తావేజుల సమర్పణ, ఫీజుల చెల్లింపు
- వినియోగదారులే దస్తావేజులు తయారు చేసుకోవచ్చు
- టైం స్లాట్‌తో సులభంగా రిజిస్ట్రేషన్
- రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్ ద్వారా వచ్చే దస్తావేజుకు పూర్తిస్థాయి చట్ట భద్రత
- ఫిజికల్ డాక్యుమెంట్‌తో సమానంగా డిజిటల్ డాక్యుమెంట్‌కు గుర్తింపు
- కోరిన వారికి ఈ స్టాంప్‌పై డిజిటల్ సిగ్నేచర్‌తో ఫిజికల్ డాక్యుమెంట్

సాక్షి, అమరావతి: రిజిస్ట్రేషన్లలో ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా, నాణ్యమైన సేవలు అందించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో అధికారులు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ వ్యవస్థలో సాంకేతికతను జోడించి విప్లవాత్మక మార్పులు తెచ్చారు. ఆన్‌లైన్‌లో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ సేవలను విస్తృతంగా అందించనున్నారు. అత్యాధునిక కార్డ్ ప్రైం సాఫ్ట్ వేర్, ఈ–స్టాంపింగ్, గ్రామ/వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలతో మరింత సులభతరమైన రిజిస్ట్రేషన్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. ఇప్పటికే 23 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దీనిని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఈ తరహా సేవలు అందుబాటులోకి తేనున్నారు.

కార్డ్ ప్రైం ద్వారా సులభతరమైన రిజిస్ట్రేషన్

రిజిస్ట్రేషన్ దస్తావేజులు ఇకపై ఆన్‌లైన్‌లో సమర్పించే వెసులుబాటు కల్పించారు. కార్డ్ ప్రైం అప్లికేషన్ ద్వారా వినియోగదారులు దస్తావేజులను వారే స్వయంగా రూపొందించుకోవచ్చు. రిజిస్ట్రేషన్ ఛార్జీలు సైతం సొంతంగా కాలిక్యులేట్ చేసుకుని ఆన్‌లైన్‌లోనే చెల్లించే సదుపాయం కల్పించారు. అనుకూలమైన సమయాల్లో రిజిస్ట్రేషన్ టైం స్లాట్ బుక్ చేసుకోవచ్చు. ఆ సమయానికి వెళ్లి వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చు. ఈ–సైన్ సౌకర్యంతో డాక్యుమెంట్స్‌కు మరింత భద్రత ఉంటుంది. ఎటువంటి అవినీతికి తావు లేకుండా పూర్తి పారదర్శకతతో రిజిస్ట్రేషన్ జరుగుతుంది. వ్యవసాయ భూములకు రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే రెవెన్యూ రికార్డుల్లోనూ పేరు మార్పు జరుగుతుంది. ఆధునిక సాంకేతికత ద్వారా ఫోర్జరీ, నకిలీ డాక్యుమెంట్లను నిర్మూలించవచ్చు.

ఈ-స్టాంపింగ్‌తో వేగంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ

ఈ–స్టాంపింగ్‌తో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరింత వేగంగా జరుగుతుంది. స్టాంప్ డ్యూటీ, ఇతర ఛార్జీలు ఆన్‌లైన్‌లో చెల్లించొచ్చు. ఈ స్టాంపింగ్‌తో స్టాంపుల కృత్రిమ కొరత, నకిలీలు, పాత తేదీల స్టాంపులకు చెల్లు చీటీ పాడినట్లు అవుతుంది. స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ (ఎస్‌హెచ్‌సీఎల్) బ్రాంచ్‌లు, స్టాంపు వెండార్లు, కామన్ సర్వీస్ సెంటర్ల (సీఎస్‌సీ)లో ఈ స్టాంపింగ్ సేవలు అందుబాటులోకి వస్తాయి. రాష్ట్రవ్యాప్తంగా 2,500 కేంద్రాల ద్వారా ఈ– స్టాంపులను విక్రయిస్తారు.

అపోహలు వద్దు - దుష్ప్రచారాలను నమ్మొద్దు

రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్ ద్వారా జనరేట్ అయ్యే రిజిస్ట్రేషన్ దస్తావేజుకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ – 2000 మేరకు పూర్తి స్థాయి చట్ట భద్రత ఉంటుంది. డిజిటల్ రిజిస్టర్డ్ డాక్యుమెంట్ అందుబాటులోకి వస్తుంది. ఫిజికల్ డాక్యుమెంట్‌తో సమానంగా డిజిటల్ రిజిస్టర్ డాక్యుమెంట్‌కు గుర్తింపు ఉంటుంది. ఈ–సైన్ ద్వారా మరింత భద్రత ఉంటుంది. ఆన్‌లైన్‌లోనే డాక్యుమెంట్ ఒరిజినాలిటీ వెరిఫై చేసే అవకాశం ఉంది. ఆన్‌లైన్ వెరిఫికేషన్‌తో నకిలీ డాక్యుమెంట్లకు చెక్ పెట్టవచ్చు. బ్యాంకులు, ఇతర సంస్థలు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లోనే వెరిఫై చేసుకునే సందుపాయం ఉంది. నూతన విధానంలో అత్యంత భద్రతా ప్రమాణాలతో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ రూపొందుతుంది. నూతన విధానంలో సాక్షులు లేకుండా రిజిస్ట్రేషన్లు అనేది పూర్తి 'అవాస్తవం'. ఈ ఆధార్ ద్వారా సాక్షుల సంతకాల సేకరణ అనేది 'వాస్తవం'. నూతన రిజిస్ట్రేషన్ విధానంలో ఫిజికల్ డాక్యుమెంట్ ఇవ్వరనేది పూర్తి అవాస్తవం. ఫిజికల్ డాక్యుమెంట్ కావాలన్నవారికి ఈ స్టాంప్‌పై డిజిటల్ సిగ్నేచర్ ప్రింట్ చేసి ఇస్తారు. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ సత్వర సేవలకు రాచబాటగా కొత్త విధానం అమలు జరుగుతుంది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల''కు సంబంధించిన సూచనలు, ఫిర్యాదులకు 'జగనన్నకు చెబుదాం 1902 టోల్ ఫ్రీ నంబర్'ను వినియోగించుకోవచ్చు.

ఐరిస్‌తో వేలిముద్రల సమస్యకు పరిష్కారం

ఈ సిగ్నేచర్ కోసం వేలిముద్రలు పడటంలేదనే ఫిర్యాదులు రావడంతో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ తక్షణ చర్యలు చేపట్టింది. ఈ సమస్య పరిష్కారానికి ఐరిస్ యంత్రాలు కొనుగోలు చేసింది. అవసరమైతే మరికొన్ని కొనేలా ఆదేశాలు ఇచ్చింది. రిజిస్ట్రేషన్ సమయంలో వేలిముద్రలు పడకపోయినా ఐరిస్ (కళ్లు) ద్వారా ఆ పక్రియను పూర్తి చేయవచ్చు.

గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు..

దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో సైతం పూర్తిస్థాయిలో రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. తొలి విడతగా 1,680 సచివాలయాలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుగా అప్‌గ్రేడ్ చేస్తారు. అనంతరం మిగిలిన సచివాలయాల్లో కూడా సేవలను విస్తరిస్తారు. తద్వారా ప్రజల చెంతకే అన్ని రిజిస్ట్రేషన్ సౌకర్యాలు వస్తాయి. స్టాంప్ విక్రయ సేవలు, ఈసీ (ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్), సీసీ, హిందూ మ్యారేజ్ రిజిస్ట్రేషన్, మార్కెట్ వాల్యూ అంచనా వంటి అన్ని సేవలు ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి. ఇప్పుడు రిజిస్ట్రేషన్లూ మొదలవుతున్నాయి.

క్లుప్తంగా...

విదేశీ అతిథుల కోసం అనువాదకులు

న్యూఢిల్లీ: జీ20 సదస్సు కోసం వచ్చి ఢిల్లీ దుకాణాల్లో, ముఖ్యంగా చాందినీ చౌక్ ప్రాంతంలో షాపింగ్ చేసే విదేశీ అతిథుల సౌకర్యం కోసం అక్కడి వర్తకులు మరో అడుగు ముందుకేశారు. షాపింగ్ సమయంలో భాషా భేదంతో ఇబ్బంది పడకుండా ఉండేందుకు అనువాదకు(ట్రాన్స్‌లేటర్)లను సిద్ధంచేస్తున్నారు. ఇంగ్లిష్, ఫ్రెంచ్, స్పానిష్ ఇలా జీ20 దేశాల్లో మాట్లాడే భాషలను అనర్గళంగా మాట్లాడి అనువదించగల 100 మంది మహిళా అనువాదకులను అక్కడి వర్తకులు రంగంలోకి దింపుతున్నారు. వీరు అందుబాటులో ఉండటంతో ఇకమీదట విదేశీ అతిథులు షాపింగ్ వేళ ఎలాంటి ఇబ్బందులు పడరని వర్తకులు చెబుతున్నారు. ఈ అనువాదకులు నిజానికి నూతన వ్యాపార వ్యవస్థాపకులు(ఎంట్రప్రెన్యూవర్స్). వీరిలో ఫ్యాషన్ డిజైనర్లు, సెలూన్, బొటిక్ యజమానులు, బ్లాగర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లు ఉన్నారు. 'వీరంతా ఇంగ్లిష్, ఫ్రెంచ్, స్పానిష్, జర్మనీ తదితర భాషలను అనర్గళంగా మాట్లాడగలరు. 8, 9, 10 తేదీల్లో ట్రేడర్లకు, అతిథులకు అనుసంధానకర్తలుగా మెలుగుతారు' అని వీరితో భాగస్వామ్యం కుదుర్చుకున్న ది చాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ(సీటీఐ) చైర్మన్ బ్రిజేష్ గోయల్ చెప్పారు. 'ట్రేడర్లకు సాయపడే వాలంటీర్ల జాబితాను ఇప్పటికే కేంద్ర విదేశాంగ శాఖకు పంపాం. వీరు విదేశీ అతిథులకు అందుబాటులో ఉండి సాయపడతారు. దేశంలోనే షాపింగ్‌కు చిరునామాగా నిలిచే చాందినీ చౌక్‌లో విదేశీయుల సందడి మరింత పెరగనుంది' అని గోయల్ పేర్కొన్నారు.

నేడే మోదీ- బైడెన్ చర్చలు

న్యూఢిల్లీ: జీ 20 శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు భారత్ వస్తున్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం సాయంత్రం ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. ఇరుదేశాల మధ్య ప్రపంచ, వ్యూహాత్మక స్థాయి భాగస్వామ్యాన్ని మరింతగా దృఢతరం చేసుకోవడమే చర్చల ప్రధాన అజెండా కానుంది. స్వచ్ఛ ఇంధనం, వర్తకం, హై టెక్నాలజీ, రక్షణ వంటి రంగాల్లో ప్రస్తుత పరస్పర సహకారాన్ని సమీక్షించి దాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంతో పాటు ప్రపంచం ఎదుర్కొంటున్న పెను సమస్యలను అధిగమించే మార్గాలపై నేతలు దృష్టి సారిస్తారు. బైడెన్ శుక్రవారం సాయంత్రమే ఢిల్లీ చేరుకుంటారు. ఆదివారం జీ 20 సదస్సు ముగియగానే వియత్నాం బయల్దేరతారు. మోదీ, ఇతర నేతలతో ఈ వారాంతంలో ఫలప్రదమైన చర్చల కోసం బైడెన్ ఉత్సుకతతో ఎదురు చూస్తున్నారని వైట్ అండ్ హౌజ్ ప్రెస్ కార్యదర్శి కరిన్ జీన్ పియరీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చివరిసారిగా 2020లో భారత్‌ను సందర్శించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.

జిన్‌పింగ్ ఎందుకు రావట్లేదు?

చుట్టుముట్టిన ఆర్థిక అనిశ్చితి ! సమస్యను మరింత పెంచిన హౌజింగ్ సంక్షోభం



జీ20 సదస్సుకు కయ్యాలమారి చైనా అంతగా ప్రాధాన్యత ఇవ్వట్లేదా ?. అందుకే అధ్యక్షుడు జిన్‌పింగ్ తనకు బదులు ప్రధాని లీ కియాంగ్‌ను పంపించారా ?. ఇలాంటి ప్రశ్నలకు అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు తలో విశ్లేషణ చెబుతున్నారు. జీ20 కూటమి ఆవిర్భావం తర్వాత చైనా అధ్యక్షులు ఒకరు శిఖరాగ్ర సదస్సులో పాల్గొనకపోవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఇంతటి ప్రతిష్టాత్మకమైన సదస్సుకు హాజరుకాకుండా జిన్‌పింగ్ చైనాలోని ఉండి ఏం చేస్తున్నారు? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. 2020 మే నెల నుంచి భారత్‌తో సరిహద్దు వెంట ఇరుదేశాల సైనికులు బాహాబాహీకి దిగడం, భారీగా సైన్యం మొహరింపు వంటి తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఇంకా కొనసాగుతుండటం వల్లే జిన్‌పింగ్ ఆగ్రహంతో సదస్సుకు రావట్లేదని చాలా మంది భావిస్తున్నారు. అసలు కారణం అది కాదని మరో వాదన బలంగా వినిపిస్తోంది. అదే అదుపు తప్పుతున్న చైనా ఆర్థిక పరిస్థితి.

జిన్‌పింగ్ ధనవంతుల కుటుంబంలో పుట్టాడు. అప్పుడే వచ్చిన సాంస్కృతిక విప్లవం ధాటికి ఆయన తండ్రి పేదవాడిగా మిగిలిపోయాడు. దీంతో జిన్‌పింగ్ బాల్యంలో కష్టాలు చూశాడు. పొలంలో సాధారణ కూలీగా పనిచేశాడు. ఆరేళ్ల ఇబ్బందులు పడ్డాడు. అయితే బలీయమైన చైనాకు అధ్యక్షుడిగా ఇప్పుడు ఎదుర్కొంటున్న సమస్యలతో పోలిస్తే ఆనాటి కష్టాలు గడ్డిపరకతో సమానమే. 'చైనా రాజ్య విస్తరణ వాదం, దక్షిణ చైనా సముద్రంపై గుత్తాధిపత్యం, ప్రపంచ వస్తూత్పత్తి మార్కెట్‌కు ఏకైక దిక్కుగా మారాలన్న వ్యూహాలతో చైనా చాలా ప్రపంచ దేశాలకు శత్రువుగా మారింది. ఇలాంటి తరుణంలో చైనాతో కలిసి జీ20 వేదికను కలిసి పంచుకునేందుకు తోటి దేశాలు విముఖత చూపుతున్నాయి' అని మేథో సంస్థ కార్నేగ్ చైనా డైరెక్టర్ పాల్ హెనెల్ వ్యాఖ్యానించారు. ఆ అప్రతిష్ట పోగొట్టుకునేందుకే ' సదస్సు విజయవంతం అవడానికి అందరితో కలిసి పనిచేస్తాం' అని బీజింగ్ తాజాగా ప్రకటించింది. 'విదేశీ పర్యటనకు పక్కనబెట్టి స్వదేశ సమస్యలపై జిన్‌పింగ్ దృష్టిపెట్టారు. దేశ రక్షణకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి పొరుగు దేశాలతో కయ్యానికి దిగారు. ఆర్థిక వ్యవస్థ సమస్యల్లో చిక్కుకోవడంతో జిన్‌పింగ్‌కు తలనొప్పి పెరిగింది' అని సింగపూర్‌లోని నేషనల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆల్‌ఫ్రెడ్ వూ వ్యాఖ్యానించారు.

దెబ్బకొట్టిన హౌజింగ్ రంగం

ఇటీవల దశాబ్దాల కాలంలో ఎన్నడూలేనంతగా పలు సమస్యలు చైనాలో తిష్టవేశాయి. కుటుంబాలు తమ ఖర్చులను తగ్గించుకున్నాయి. కర్మాగారాల్లో ఉత్పత్తి తగ్గిపోయింది. వ్యాపారవేత్తలు నూతన పెట్టుబడులకు ముందుకు రావట్లేదు. ఎగుమతులు దిగజారాయి. ఆగస్టులో ఎగుమతులు గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 8.8 శాతం తగ్గాయి. దిగుమతులు 7.3 శాతంపెరిగాయి. నిరుద్యోగిత భారీగా పెరగడంతో ప్రభుత్వం తాజా గణాంకాలు బహిర్గతంచేయడం మానేసింది. ఆస్తుల మార్కెట్ విలువ భారీగా పతనమైంది. ప్రధాన డెవలపర్లు చేతులెత్తేసి దివాలాను ప్రకటించారు. దీంతో రియల్ ఎస్టేట్ రంగం సంక్షోభంలో చిక్కింది. 40 ఏళ్ల భవిష్యత్ అభివృద్ధి మోడల్‌ను ఈ అంశాలు తలకిందులుచేసేలా ఉన్నాయి. ప్రాపర్టీ రంగంపై అతిగా ఆధారపడటం, అత్యంత కఠినమైన కోవిడ్ ఆంక్షల విధానాలు దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీశాయని నిపుణులు భావిస్తున్నారు. రుణాల పునాదిపై నెలకొల్పిన అభివృద్ధి మోడల్ ఈ పరిస్థితికి మరో కారణం. దేశం అప్పులు పెరిగిపోయాయి. 2023 తొలి త్రైమాసికంలో అప్పులు-జీడీపీ నిష్పత్తి రికార్డు స్థాయిలో 279 శాతంగా నమోదైందని బ్లూమ్‌బర్గ్ విశ్లేషించింది. రుణాలు అతిగా తీసుకొచ్చి మౌలిక వసతులపై ఖర్చుచేసిన పాపం ఇప్పుడు పండిందని మరో వాదన. హౌజింగ్ బుడగ బద్ధలైంది. చైనా ఆర్థిక వ్యవస్థ 25 శాతం ప్రాపర్టీ మార్కెట్‌పైనే ఆధారపడింది. ఇన్నాళ్లా కేవలం చైనాపై ఆధారపడిన విదేశీ బ్రాండ్లు ఇప్పుడు చైనాతోసహా ఇతర(చైనా ప్లస్ స్ట్రాటజీ) దేశాలకు ప్రాధాన్యత ఇవ్వాలనే వ్యూహాన్ని అనుసరిస్తున్నాయి. దీని వల్ల ప్రధానంగా లాభపడేది ఇండియానే. ఆపిల్, టెస్లా మొదలుకొని నైక్ వరకు అన్ని ప్రధాన సంస్థల తయారీకేంద్రాలు చైనాలోనే ఉన్నాయి. కార్మికులకు అధిక జీతభత్యాలు, అమెరికాతో వాణిజ్య యుద్ధం నేపథ్యంలో విదేశీ సంస్థలు చైనాకు బదులు వేరే దేశాల వైపు చూస్తున్నాయి. **- సాక్షి, నేషనల్ డెస్క్**

ఆర్మీలో అవిధేయత?

చైనా ఆర్మీలో పెరిగిన అవినీతి, పాలక పార్టీ పట్ల తగ్గిన విధేయతపై జిన్‌పింగ్ భయపడుతున్నారని ఆసియా పాలసీ సొసైటీ ఇన్‌స్టిట్యూట్‌లో జాతీయ భద్రతా విశ్లేషకుడు లైల్ మోరిస్ చెప్పారు. చైనా సైన్యంలో అణ్వస్త్ర సామర్థ్య రాకెట్ విభాగంలోని జనరల్, డెప్యూటీ జనరల్‌లను తొలగించడాన్ని ఆయన ఉటంకించారు. తనకు నమ్మకస్తుడైన విదేశాంగ మంత్రి క్విన్ గాంగ్‌ను జిన్‌పింగ్ తప్పించడంతో పార్టీ వర్గాల్లోనూ తీవ్ర అసంతృప్తి రేగింది. జిన్‌పింగ్ పాలనా సామర్థ్యానికి ఈ ఘటనలు మాయని మచ్చలని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇలాంటి సమస్యలు ఇంకొన్ని పెరిగితే డ్రాగన్ దేశంలో కమ్యూనిస్ట్ పార్టీ పాలనకు తెరపడే ప్రమాదముందని కొందరు సీనియర్ నేతలు ఆందోళన వ్యక్తంచేశారు. ఇన్ని సమస్యలు ఇంట్లో పెట్టుకునే జిన్‌పింగ్ చైనాను వదలి బయటకు రావట్లేదనే విశ్లేషణలు వెల్లువెత్తుతున్నాయి.

78 భిన్న వాయిద్యాలతో సంగీత సౌరభం!

న్యూఢిల్లీ: జీ20 శిఖరాగ్ర సదస్సు కోసం విచ్చేసిన ప్రపంచ నేతలకు వీనుల విందైన సంగీతం వినిపించేందుకు వాయిద్యకారులు సిద్ధమయ్యారు. భారతీయ సంగీత వారసత్వ సంపద ఎంతటి గొప్పదో ప్రత్యక్షంగా చూపేందుకు సమాయత్తమయ్యారు. శాస్త్రీయ సంగీతంతోపాటు సమకాలీన సంగీతంలో వినియోగించే భిన్న వాద్య పరికరాలతో సంగీత విభావరి అతిథులను ఆకట్టుకోనుంది. గాంధర్వ ఆతిథ్యం బృందం 'భారత వాద్య దర్శనం' పేరిట గొప్ప ప్రదర్శన ఇవ్వనుంది. జీ20 దేశాధినేతలకు సెప్టెంబర్ తొమ్మిదో తేదీన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఇచ్చే విందులో ఈ సంగీత కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. సంతూర్, సారంగి, జల్ తరంగ్, షెహనాయ్ ఇలా దేశవ్యాప్తంగా విభిన్న ప్రాంతాల్లో ప్రఖ్యాతిగాంచిన మొత్తం 78 రకాల వాద్య పరికరాల నుంచి ఉద్భవించే అద్భుతమైన సంగీతం ఆహుతులను అలరించనుంది. 'సంగీత మార్గంలో భారత్ సాగించిన సామరస్య ప్రయాణం తాలూకు అపురూప జ్ఞాపకాలను ఇప్పుడు మరోసారి గుర్తుచేస్తాం' అని ఆహ్వాన ప్రతి సంబంధ బ్రోచర్ కాన్సెప్ట్ నోట్‌లో పేర్కొన్నారు. ఈ ప్రదర్శన విలాంబిత్ లయతో మొదలై మధ్య లయలో కొనసాగి ధృత లయతో ముగుస్తుంది. ఈ వాయిద్య పరికరాల సమ్మేళనంలో 34 హిందుస్తానీ సంగీతం తాలూకు వాద్య పరికరాలు, 18 కర్ణాటక సంగీత సంబంధ పరికరాలు, 26 జానపద సంబంధ పరికరాలు వినియోగిస్తున్నారు. 11 మంది చిన్నారులు, 13 మంది మహిళలు, ఆరుగురు దివ్యాంగులు, 26 మంది యువకులు, 22 మంది నిష్ణాతులుసహా 78 మంది కళాకారులు ఈ వాద్య పరికరాలను వాయిస్తారు. తమ ప్రాంత విశిష్ట వారసత్వ సంగీత సంపదను ఘనంగా చాటుతూ భిన్న ప్రాంతాలకు చెందిన కళాకారులు తమ సంప్రదాయక వేషధారణలో వేదకాలంనాటి పరికరాలు, గిరిజనుల, జానపదుల పరికరాలతోపాటు లలిత సంగీతం తాలూకు పరికరాలు వాయిస్తారు.



జీ20 ఇతివృత్తంతో ఇండియా గేట్ వద్ద కటౌట్

10న ప్రధానితో మాక్రాన్ భేటీ

న్యూఢిల్లీ: జీ20 శిఖరాగ్ర భేటీకి హాజరవుతున్న ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఈ నెల10న ప్రధాని మోదీతో సమావేశం కానున్నారు. శిఖరాగ్రం ఆఖరి రోజైన ఆదివారం ఫ్రాన్స్ అధ్యక్షుడు ప్రధానితో సమావేశమవుతారని అధికారులు తెలిపారు. ఆయన బ్రెజిల్ అధ్యక్షుడు లులా డ సిల్వా, ఇండోనేసియా అధ్యక్షుడు విడోడో, సౌదీ యువరాజు సల్మాన్‌తోనూ చర్చలు జరుపుతారు.

తీర్మానాలపై ఎన్నో ఆశలు

న్యూఢిల్లీ: జీ20 శిఖరాగ్ర సదస్సులో విస్తృత చర్చల తర్వాత దేశాధినేతలు ప్రపంచ శ్రేయస్సు కోసం ఎలాంటి తీర్మానాలు చేయనున్నారనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. జూలైలో జీ20 దేశాల పర్యావరణశాఖ మంత్రుల సదస్సులో శిలాజ ఇంధనాల వినియోగాన్ని దశలవారీగా తగ్గించడంపై చర్చలో ఏకాభిప్రాయం కుదరనే లేదు. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సామర్థ్యాన్ని 2030 నాటికల్లా 11 టెరావాట్లకు తేవడం, అభివృద్ధి చెందుతున్న దేశాలకు తక్కువ వడ్డీకే రుణాలు ఇవ్వడం వంటి అంశాల్లోనూ ఉమ్మడి నిర్ణయం తీసుకోలేకపోయాయి. శిలాజ ఇంధనాలకు బదులు మరో ఇంధన వనరులకు మారడం, బహుళ అభివృద్ధి బ్యాంకు(ఎండీబీ)లో సంస్కరణలు వంటి అంశాల్లో కనీస ఉమ్మడి నిర్ణయాలైనా దేశాధినేతలు తీసుకుంటారేమోనని పలు రంగాల వర్గాలు ఆశగా చూస్తున్నాయి. 'అభివృద్ధి చెందుతున్న దేశాలకు మేలు చేకూర్చేలా తక్కువ వడ్డీకి రుణాలు అందేలా ఎండీబీలో సంస్కరణలు తేవాలన్న చర్చ జీ20 శిఖరాగ్ర సదస్సు స్థాయిలో జరగడం ఇదే తొలిసారి. సంస్కరణలు వాస్తవ రూపం దాల్చితే ఎంతో మేలు' అని క్లైమేట్ యాక్షన్ నెట్‌వర్క్ సంస్థలో గ్లోబల్ పాలసీ విభాగం నేత ఇంద్రజిత్ బోస్ ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే ఇక్కడో సమస్య ఉంది. అభివృద్ధి చెందుతున్న దేశాలు తాము అందుకున్న నిధులను పర్యావరణ మార్పులు తదితరాలను ఎదుర్కొనేందుకు ఖర్చుచేస్తాయి. గ్రాంట్స్‌గా కాకుండా రుణాలు, పెట్టుబడుల రూపంలో ఈ నిధుల్ని అందుకుంటాయి. వీటిని తిరిగి చెల్లించాలి. కానీ ఆ దేశాలకు ఆ స్తోమత ఉండదు. దీంతో ఈ దేశాలను ఆదుకునేందుకు సంపన్న దేశాలు వెనుకంజ వేస్తున్నాయి. 2011-20కాలంలో ఇలాంటి దేశాలకు కేవలం 5 శాతం నిధులే దక్కాయి. ఈ నేపథ్యంలో గత వాగ్దానాలు, తీర్మానాలకు కట్టుబడేలా ఈసారైనా జీ20 దేశాలు ఉమ్మడి నిర్ణయాలు తీసుకుంటాయో లేదో చూడాలి.

మరింత సహకారానికి 12 సూత్రాలు



ఆసియాన్ వేదికపై మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్‌తో ప్రధాని మోదీ

- ఇది ఆసియా శతాబ్దం
- ప్రపంచ వృద్ధికి మనమే ఊతం
- ఆసియాన్-భారత్ సదస్సులో మోదీ
- కలిసి సాగుతామంటూ సంయుక్త ప్రకటన

జకార్తా: 10 దేశాలతో కూడిన ఆసియాన్ కూటమి, భారత్ మధ్య మరింత సహకారానికి 12 సూత్రాల ప్రతిపాదనను ప్రధాని నరేంద్ర మోదీ తెరమీదకు తెచ్చారు. కనెక్టివిటీ మొదలు వర్తకం, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ దాకా పలు అంశాల్లో పరస్పర సహకారం పెంపునకు ఎంతగానో అవకాశాలు ఉన్నాయని పునరుద్ఘాటించారు. కరోనా అనంతరం మరింత క్రమశిక్షణతో కూడిన ప్రపంచం కోసం పాటుపడదామని పిలుపునిచ్చారు. ఇండోనేషియా రాజధాని జకార్తాలో గురువారం ఆసియాన్ -భారత్ వార్షిక శిఖరాగ్ర సదస్సును ఉద్దేశించి మోదీ మాట్లాడారు. మల్టీ మోడల్ కనెక్టివిటీ, ఆగ్నేయాసియా, పశ్చిమాసియా, యూరప్‌లతో భారత్‌ను అనుసంధానిస్తూ ఆర్థిక కారిడార్ తదితరాలను ప్రస్తావించారు. శాంతి, ప్రగతి, పరస్పర వృద్ధే లక్ష్యంగా ఆసియాన్ -భారత్ భాగస్వామ్య కార్యాచరణను పటిష్టంగా ప్రణాళిక అమలు చేయాలని ఇరుపక్షాలు నిర్ణయించాయి. సముద్ర వర్తకంలో పరస్పర సహకారాన్ని, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింతగా పెంచుకోవాలని పేర్కొన్నాయి. ఈ మేరకు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. ఇండో పసిఫిక్ ప్రాంతంలో నిరంతర కనెక్టివిటీ, బ్లూ ఎకానమీ, ఆహార భద్రత మొదలుకుని అంతరిక్షం దాకా అన్ని రంగాల్లోనూ భారత కృషికి, ప్రయత్నాలకు ఆసియాన్ పూర్తి మద్దతుంటుందని ప్రకటన పేర్కొంది. అలాగే పరస్పర వర్తకం, పెట్టుబడుల ద్వారా ఆహార భద్రత, పౌష్టికాహారం తదితర రంగాల్లో సహకారాన్ని మరింతగా పటిష్టపరచుకోవాలని మరో సంయుక్త ప్రకటనలో నిర్ణయించాయి. ఉగ్రవాదం, దానికి నిధులు తదితరాల మీద ఉమ్మడి పోరు జరపాలని నిర్ణయించారు. మరింత స్వేచ్ఛాయుత ఇండో పసిఫిక్ దిశగా ప్రగతి సాధనలో కలిసి రావాల్సిన అవసరం ఉందని మోదీ అభిప్రాయపడ్డారు. సదస్సుకు సహాధ్యక్ష హోదాలో ఆయన మాట్లాడారు. '21వ శతాబ్దం ఆసియాకు సొంతం. ఇది మన శతాబ్దం'' అని పేర్కొన్నారు.

ఆ ప్రతిపాదనల్లో కొన్ని...

- కనెక్టివిటీ, డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్, వర్తకం, ఆహార భద్రత నుంచి బ్లూ ఎకానమీ దాకా వంటి పలు రంగాల్లో మరింత సహకారం
- ఉగ్రవాదం, దాని ఆర్థిక మూలాల మీద ఉమ్మడి పోరు
- దక్షిణాది ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలను అంతర్జాతీయ వేదికల మీద లేవనెత్తడం
- ఆసియాన్-భారత్ డిజిటల్ ఫ్యూచర్ నిధి
- ఆసియాన్, ఈస్ట్ ఏషియా ఆర్థిక, పరిశోధన సంస్థ (ERIA) పునరుద్ధరణ, దానికి మరింత మద్దతు
- భారత్‌లో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏర్పాటు చేస్తున్న గ్లోబల్ సెంటర్ ఫర్ ట్రెడిషనల్ మెడిసిన్‌లో భాగం కావాలంటూ ఆహ్వానం
- విపత్తులను తట్టుకునే మౌలిక సదుపాయాల కల్పన యత్నాల్లో భాగస్వామ్యం
- జన్ ఔషధీ కేంద్రాల ద్వారా పేదలకు అందుబాటు ధరల్లో మందులు అందించడంలో భారత అనుభవాన్ని అందిపుచ్చుకోవడం
- ఆసియాన్-భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమలును నిర్ణీత కాలావధిలో సమీక్షించుకోవడం

30 ఏళ్ల బంధం

- వ్యూహాత్మక భాగస్వామ్య కూటమి ఏర్పాటు దిశగా ఆసియాన్- భారత్ చర్చలు 1992 నుంచే మొదలయ్యాయి.
- 1995 కల్లా పూర్తిస్థాయి రూపు సంతరించుకున్నాయి.
- 2002 నాటికి శిఖరాగ్ర సదస్సు స్థాయి భాగస్వామ్యంగా రూపుదాల్చాయి.
- ఆసియాన్ సభ్య దేశాలతో కొన్నేళ్లుగా భారత సంబంధాలు ఊపు మీదున్నాయి. రక్షణ, భద్రత, పెట్టుబడులు, వర్తకం తదితర రంగాల్లో సహకారం పెరుగుతూ వస్తోంది.

ఆ పది దేశాలు...

ఆసియాన్ కూటమి పది దేశాల సమాహారం. అంతర్జాతీయంగా శక్తిమంతమైన కూటముల్లో ఇదొకటి. దాని సభ్య దేశాలు...

- ఇండోనేషియా, మలేషియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయిలాండ్, బ్రూనై, వియత్నాం, లావోస్, మయన్మార్, కాంబోడియా.

- ఆసియాన్ కూటమిలో చర్చా భాగస్వాములుగా భారత్, అమెరికా, చైనా, జపాన్, ఆస్ట్రేలియా వంటి దేశాలున్నాయి.

ప్రజల దృష్టి మళ్లించేందుకు మోదీ యత్నం

- తొమ్మిదేళ్ల వైఫల్యాలను కప్పిపుచ్చుకునే కుట్ర ఇది
- వ్యాఖ్యల కేసులన్నిటినీ చట్టపరంగా ఎదుర్కొంటా
- తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ స్పష్టీకరణ



చెన్నై: సనాతన ధర్మకు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలపై బీజేపీ చేస్తున్న తీవ్ర ఆరోపణలపై డీఎంకే నేత, తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ ఎదురుదాడి ప్రారంభించారు. ప్రధాని మోదీ సహా కాషాయ పార్టీ నేతలు తన వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. వ్యాఖ్యలపై దాఖలైన కేసులన్నిటినీ చట్టపరంగానే ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. మణిపూర్‌లో నెలలుగా కొనసాగుతున్న హింసపై విమర్శలను ఎదుర్కోలేని ప్రధాని మోదీ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు తన వ్యాఖ్యలపై రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు. బుధవారం జరిగిన కేబినెట్ భేటీలో ప్రధాని మోదీ, మంత్రులు సనాతన ధర్మపై ఉదయనిధి చేసిన వ్యాఖ్యలపై చర్చించిన విషయం తెలిసిందే. 'ప్రజలకిచ్చిన వాగ్దానాలను తొమ్మిదేళ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విస్మరించింది. ప్రజల సంక్షేమం కోసం బీజేపీ ఫాసిస్ట్ ప్రభుత్వం చేసిందేమీ లేదు. దీనిని కప్పిపుచ్చుకునేందుకే బీజేపీ నేతలు 'జనహననం'అంటూ నా వ్యాఖ్యలను వక్రీకరించారు. తమను తాము రక్షించుకునేందుకు దీనిని ఒక ఆయుధంగా వాడుకుంటున్నారు'అని గురువారం ఉదయనిధి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాము ఏ మతానికీ వ్యతిరేకం కాదని ప్రతి ఒక్కరికీ తెలుసునన్నారు. 'మణిపూర్‌లో ఆగని హింసపై సమాధానం ఇవ్వాల్సి వస్తుందనే భయంతోనే మోదీజీ స్నేహితుడు అదానీని వెంటేసుకుని ప్రపంచ దేశాల్లో తిరుగుతున్నారు. మణిపూర్ హింసలో 250 మందికిపైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు..మోదీ ప్రభుత్వం 7.5 లక్షల కోట్ల అవినీతికి పాల్పడింది. వీటన్నిటినీ మరుగుపరిచేందుకే మోదీ, ఆయన బ్యాచ్ సనాతన వ్యాఖ్యలను వాడుకోవాలనుకుంటున్నారు. ప్రజల అమాయకత్వమే వారి రాజకీయాలకు పెట్టుబడి. 'అని విమర్శించారు. 'ఈ రోజుల్లో సాధువులు కూడా ప్రచారం కోరుకుంటున్నారంటూ తన తలపై రూ.10 కోట్లు ప్రకటించిన సాధువుపై ఉదయనిధి వ్యాఖ్యానించారు. అంతా త్యాగం చేసిన ఆ సాధువుకు రూ.10 కోట్లు ఎలా వచ్చాయంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

అమానవీయ విశ్వాసాలపైనే..: స్టాలిన్

సనాతన ధర్మంపై తన కొడుకు, మంత్రి ఉదయనిధి చేసిన వ్యాఖ్యలపై రేగుతున్న దుమారంపై సీఎం స్టాలిన్ స్పందించారు. సనాతన ధర్మంలో భాగమైన అమానవీయ సిద్ధాంతాలపైనే ఉదయనిధి మాట్లాడారని చెప్పారు. వీటి ఆధారంగా ప్రతిపక్ష ఇండియా కూటమిలో విభేదాలు సృష్టించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు.

డీఎంకే వ్యాఖ్యలను ఒప్పుకోం

న్యూఢిల్లీ: సనాతన ధర్మంపై డీఎంకే నేతలు ఉదయనిధి స్టాలిన్, ఎ.రాజా చేసిన వ్యాఖ్యలతో తాము ఏకీభవించబోమని కాంగ్రెస్ పేర్కొంది. అన్ని మతాలకు సమాన గౌరవం(సర్వధర్మ సమభావ) భావననే తమ పార్టీ విశ్వసిస్తుందని స్పష్టం చేసింది. కాంగ్రెస్ మీడియా విభాగం చీఫ్ పవన్ ఖెరా స్పందిస్తూ..'సమధర్మ సమభావమనే దానినే కాంగ్రెస్ ఎల్లప్పుడూ విశ్వసిస్తుంది, ప్రతి మతం, ప్రతి విశ్వాసాలకు ఇందులో సముస్థానం ఉంటుంది. ఎవరూ ఎవరినీ తక్కువగా చూడరు. ఇలాంటి వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ కూడా సమ్మతించదని అన్నారు.

విద్వేషాలు తొలిగేదాకా యాత్ర: రాహుల్

విద్వేషాలు తొలిగిపోయి భారత్ ఏకమయ్యేదాకా తన యాత్ర కొనసాగుతుందని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ అన్నారు. భారత్ జోడో యాత్ర ప్రారంభమై గురువారం ఏడాది పూర్తయిన సందర్భంగా రాహుల్ స్పందించారు. నాలుగు వేల కిలోమీటర్ల పైచిలుకు సాగిన తన పాదయాత్ర తాలూకు వీడియో ఫుటేజిని ఎక్స్‌లో పంచుకుంటూ.. 'ఈ యాత్ర కొనసాగుతుంది. ఇది నా ప్రామిస్' అని రాహుల్ పేర్కొన్నారు. భారత్ జోడోయాత్రలో రాహుల్ 12 బహిరంగ సభల్లో, 100 పైచిలుకు రోడ్డు కార్నర్ మీటింగ్‌లలో, 13 విలేకరుల సమావేశాల్లో పాల్గొన్నారు.



ఆదిత్య పంపిన సెల్ఫీలో కనిపిస్తున్న వెల్సీ, సూట్ అనే పేలోడ్లు

ఆదిత్య సెల్ఫీ..!

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): సూర్యుడి దిశగా దూసుకుపోతున్న ఆదిత్య-ఎల్1 కెమెరా పని మొదలుపెట్టింది. తన సెల్ఫీతోపాటు భూమి, చంద్రుడిని కూడా క్లిక్ మనిపించింది. ఈ మేరకు ఆదిత్య-ఎల్1 నుంచి అందుకున్న ఫొటోలను బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయం గురువారం సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో విడుదల చేసింది. ఆదిత్య-ఎల్1లో అమర్చిన కెమెరా ఈనెల 4న తీసిన సెల్ఫీలో వీఈఎల్‌సీ (విజిబుల్ ఎమిషన్ లైన్), ఎస్‌యూఐటీ(సోలార్ అల్ట్రావయొలెట్) పరికరాలు కనిపిస్తున్నాయి. అదే కెమెరా భూమి, చంద్రుడి ఫొటోలను కూడా తీసింది. ఆదిత్య-ఎల్1లో అమర్చిన ఏడు వేర్వేరు పేలోడ్లలో వీఈఎల్‌సీ, ఎస్‌యూఐటీలు కూడా ఉన్నాయి. ఆదిత్య-ఎల్1 భూమికి 15 లక్షల కిలోమీటర్ల దూరంలోని లగ్రాంజియన్ పాయింట్1(ఎల్1)లోని తన నిర్దేశిత కక్ష్యలోకి చేరుకున్నాక సూర్యుడి చుట్టు పరిభ్రమిస్తూ వీఈఎల్‌సీ పేలోడ్‌ద్వారా రోజుకు 1,440 ఫొటోలను తీసి భూని యంత్రిత కేంద్రాలకు విశ్లేషణ నిమిత్తం పంపించనుంది.



ఆదిత్య పంపిన భూమి, చంద్రుడు ఫొటో

అనారోగ్యంతో తుర్కియే గుహలో చిక్కుబడిన అమెరికా అన్వేషకుడు

ఇస్తాంబుల్: తుర్కియేలోని ఓ గుహలో వెయ్యి మీటర్ల లోతులో అనారోగ్యంతో చిక్కుకుపోయిన అమెరికాకు చెందిన మార్క్ డికే(40)ను సురక్షితంగా వెలుపలికి తీసుకువచ్చేందుకు అంతర్జాతీయంగా ప్రయత్నాలు మొదలయ్యాయి. అంతర్జాతీయ అన్వేషణలో భాగంగా తుర్కియేలోని టారస్ పర్వతాల్లో ఉన్న మోర్కా గుహల్లోకి మార్క్ డికే వెళ్లారు. మోర్కా గుహ లోతు 1,276 మీటర్లు కాగా, మార్క్ డికే 1,120 మీటర్ల లోతులోని బేస్‌క్యాంప్‌లో ఉన్నారు. జీర్ణాశయంలో రక్తస్రావం కారణంగా ముందుకు వెళ్లలేని స్థితిలో ఉండిపోయారని యూరోపియన్ కేవ్ రెస్క్యూ అసోసియేషన్ ప్రకటించింది. ఆయనకు అనేక అంతర్జాతీయ గుహాన్వేషణల్లో పాలుపంచుకున్న అనుభవం ఎంతో ఉంది. గుహల్లో చిక్కుకుపోయిన వారిని రక్షించడంలో స్వయంగా ఆయన సిద్ధహస్తుడని వివరించింది. సాధారణ పరిస్థితుల్లో అనుభవజ్ఞులైన గుహాన్వేషకులకే అక్కడికి వెళ్లేందుకు 15 గంటలు పడుతుందని టర్కిష్ కేవింగ్ ఫెడరేషన్ వివరించింది. మార్క్ డికే కోసం ఆరు యూనిట్ల రక్తం పంపించామని టర్కీ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉందని తెలిపింది. డికేను కాపాడేందుకు తుర్కియే, అమెరికాతోపాటు హంగరీ, బల్గేరియా, ఇటలీ, క్రొయేషియా, పోలాండ్ దేశాలకు చెందిన 150 మంది నిపుణులను రప్పిస్తున్నట్లు యూరోపియన్ కేవ్ రెస్క్యూ అసోసియేషన్ తెలిపింది. ఎంతో క్లిష్టమైన ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు కొన్ని రోజుల వరకు పట్టవచ్చని చెబుతున్నారు.

సాక్షి 24|7
తమిళనాడు
TAMILNADU
శుక్రవారం । 8 । సెప్టెంబర్ । 2023

జనవరి నుంచి చెన్నై- బెంగళూరు ఎక్స్‌ప్రెస్ వే

• కేంద్రం మంత్రి నితిన్ గడ్కారీ వెల్లడి

సాక్షి,చెన్నై : చెన్నై – బెంగళూరు ఎక్స్‌ప్రెస్ వే జనవరి ఒకటో తేదీ నుంచి ఉపయోగంలోకి రానుందని కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కారీ తెలిపారు. గురువారం రాత్రి చెన్నై నందంబాక్కంలో జరిగిన కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ, చెన్నై – బెంగ ళూరు ఎక్స్‌ప్రెస్ వే జనవరి నుంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. తద్వారా ఈ రెండు మహా నగరాల మధ్య ప్రయాణ సమయం మరింతగా తగ్గుతుం దన్నారు. ఈ మార్గంలో లగ్జరీ బస్సులు, ఎలక్ట్రిక్ బస్సులు నడుపుతామని ఆయన పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

9 మంది జాలర్లను రక్షించిన కోస్ట్‌గార్డ్



కొరుక్కుపేట: సముద్రంలో చిక్కుకున్న చెన్నైకి చెందిన ఫిషింగ్ బోట్, అందులోని తొమ్మిది మంది జాలర్లను ఇండియన్ కోస్ట్ గార్డ్ రక్షించిం ది. వివరాలు.. కాశిమేడుకు చెందిన గణపతి పెరుమాళ్ పడవలో గత వారం జాలర్లు వేటకు వెళ్లారు. అకస్మాత్తుగా వీరు సముద్రంలో గల్లం తయ్యారు. వీరికోసం భారత కోస్ట్ గార్డ్, హెలి కాప్టర్లు, విమానం, పడవలు గాలింపు చేపట్టా యి. చెన్నైకు 240 నాటికస్ మైళ్ల దూరంలో జాలర్ల బోటును గుర్తించాయి. ఇందులోని జా లర్లను రక్షించి అతి కష్టమీద బుధవారం విశా ఖపట్నం ఒడ్డుకు తీసుకువచ్చారు. వైద్య పరీక్షల అంతరం ఎట్టకేలకు గురువారం విశాఖపట్నం నుంచి బోటును సురక్షితంగా తమిళనాడు మత్స్యశాఖ అధికారులకు అప్పగించారు.

పోలూరు-ఆలంగాయం రోడ్డుపై గజరాజు హల్‌చల్



వేలూరు: తిరువణ్ణామలై జిల్లా జవ్వాది కొండ ప్రాంతాల్లోని ఒంటి కొమ్ము అటవీ ఏనుగు తరచూ పంటలపై తరచూ దాడి చేస్తున్న విష యం తెలిసిందే. కాగా గురువారం ఉదయం పోలూరు నుంచి ఆలంగాయం వెళ్లే రోడ్డులో ఈ ఏనుగు హల్‌చల్ చేసింది. జమునామరత్తూరు నుంచి వస్తున్న ప్రభుత్వ బస్సును అడ్డుకుంది. డ్రైవర్ చాకచక్యంగా బస్సును వెనుక వైనక్కి తీసుకురావడంతో ప్రమాదం తప్పింది. మిగి లిన వాహనదారులు భయాందోళనతో పరుగు లు తీశారు. సుమారు గంట పాటు ఏనుగు నిల బడి ఉండడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలి చిపోయాయి. తర్వాత అటవీ అధికారులు ఆ ఏనుగును అడవిలోకి తరమడంతో వాహనదా రులు ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉండగా రాత్రి వేళ ఈ ఏనుగు జమునారమత్తూరు ప్రాం తాల్లో సంచరిస్తుండడంతో స్థానికులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.

బైకు - కారు ఢీ

• ముగ్గురు మృతి
• మరో ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు, బైకు

అన్నానగర్: సాయల్‌కుడి సమీపంలో బుధ వారం రాత్రి డ్యాన్స్, పాటల ప్రదర్శనను చూడడానికి వెళ్తుండగా బైకు–కారు ఢీకొనడం తో విద్యార్థి సహా ముగ్గురు మృతి చెందారు. వివరాలు.. రామనాథపురం జిల్లా సాయల్‌కుడి సమీపంలోని కడుగు సంద్దై చత్రం గ్రామానికి చెందిన సోనాయిముత్తు కుమారుడు ఈసేం ద్రన్ (17) ప్లస్– 2 చదువుతున్నాడు. ఇతడు మునియస్వామి కుమారుడు అన్బరసు(20). షణ్ముగవేల్ కుమారుడు లింగేశ్వరన్ (22)తో కలిసి మేలెచెల్వనూర్ గ్రామంలో బుధవారం రాత్రి స్వామివారి ఉత్సవాన్ని చూసేందుకు బైక్‌పై వెళ్లారు. వీరి బైక్‌ను ఈసీఆర్ రోడ్డులో రామనాథపురం బుత్తనేందల్ గ్రామానికి చెం దిన బాలమురుగన్ (45), అతని భార్య షణ్ముఖ వల్లి, కుమారుడు హరిపాల (14) వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఈసేం ద్రన్, అన్బరసు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన లింగేశ్వరన్‌ను అంబులె న్స్‌లో రామనాథపురం ప్రభుత్వ ఆస్పత్రికి తర లిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. కారులోని ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిని కూడా రామనాథపురం ప్రభుత్వ వైద్య కళాశా లలో చేర్పించారు. కడలాడి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నటి విజయలక్ష్మికి వైద్య పరీక్షలు



విజయలక్ష్మి (ఫైల్)

సాక్షి, చెన్నై : దర్శకుడు, నామ్ తమిళర్ కట్చి నేత సీమాన్‌పై నటి విజయ లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదులో భాగంగా కోర్టు ఆదేశా లతో ఆమెకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిం చారు. సీమాన్ కారణంగా ఆమె పలుమార్లు గర్భం దాల్చినట్టు, అబార్షన్ జరిగినట్టు ఇచ్చిన ఫిర్యాదులో భాగంగా వాస్తవాలను వెలుగులోకి తెచ్చేందుకు గాను.. గురువారం కీల్పాకం ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేశారు. కాగా సీమాన్ తనను మోసంచేశారంటూ దశాబ్ద కాలంగా విజ యలక్ష్మి చేస్తున్న పోరాటం గురించి తెలిసిందే. తాజాగా ఆమె ఈ అంశంపై పోలీసులను ఆశ్ర యించారు. దీంతో గురువారం ఉదయం వలసర వాక్కం పోలీసులు గట్టి భద్రత నడుమ విజయ లక్ష్మిని కీల్పాకం ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆమెకు అక్కడి వైద్యుల బృందం కొన్ని గంటల పాటు వైద్య పరీక్షలు నిర్వహించింది. ఈ నివేదికను కోర్టుకు సమర్పించనున్నారు.

ఉదయ నిధికి స్టాలిన్ అండ!



తనయుడు ఉదయనిధితో ముఖ్యమంత్రి స్టాలిన్

సనాతన ధర్మం వివాదంపై ఎట్టకేలకు డీఎంకే అధ్యక్షుడు , సీఎం ఎంకే స్టాలిన్ గళం విప్పారు. తన తనయుడు, మంత్రి ఉదయ నిధికి వ్యతిరేకంగా ప్రధాని నరేంద్రమోదీ సైతం స్వరం పెంచడంతో ఆయన తీవ్రంగా స్పందించారు. ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకోకుండా, సనాతనం ముసుగులో మతం పేరిట చలి కాచుకోవద్దని ఆయన హితవు పలికారు. విషప్రచారంలో రాజకీయ లబ్ధి పొందలేరని వ్యాఖ్యానించారు.

• ప్రధాని వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి మండిపాటు
• పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచన
• సనాతనం ముసుగులో చలి కాచుకోవడం తగదని హితవు
• కేసుల్ని చట్టపరంగా ఎదుర్కొంటా మన్న మంత్రి ఉదయనిధి

సాక్షి, చెన్నై : రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి ఉదయ నిధి స్టాలిన్ సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా దుమారం రేపిన విషయం తెలిసిందే. ఆయనకు వ్యతిరేకంగా అనేక ఫిర్యాదులు, కేసులు నమోదు అవుతున్నాయి. కాగా ఈ విషయంలో ఆందోళనలు ఉధృతం చేస్తూ బీజేపీ, హిందూ సంఘాలు దూకుడు పెంచాయి. అదే సమయంలో ఈ వ్యవహారంపై ఉదయ నిధి సైతం తనదైన శైలిలో స్పందిస్తూ వస్తున్నారు. దేశ వ్యాప్తంగా రచ్చ జరుగుతున్నా సీఎం స్టాలిన్ మాత్రం ఇన్నాళ్లూ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. ఈ నేపథ్యంలో తాజాగా ప్రధాని నరేంద్ర మోదీ ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని ఉదయ నిధికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడంతో తనయుడు, తన కేబినెట్ మంత్రికి మద్దతుగా గురువారం స్టాలిన్ ప్రతిస్పందించారు.

ప్రకటన రూపంలో ప్రధానికి కౌంటర్

ఉదయనిధి స్టాలిన్ ప్రసంగానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియకుండా ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతున్నట్టుందని తన ప్రకటనలో సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. చెన్నైలో తమిళనాడు ప్రోగ్రెసివ్ రైటర్స్, ఆర్టిస్ట్స్ అసోసియేషన్ తరపున సనాతన వ్యతిరేక సదస్సు జరిగిందని గుర్తు చేశారు. ఇందులో మంత్రి ఉదయనిధి సనాతనం పై కొన్ని వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. వెనుకబ డిన సామాజిక వర్గం, షెడ్యూల్డ్ కులాలు, గిరిజన, స్త్రీ వ్యతిరేక ' సనాతన్ సిద్ధాంతాలను గుర్తు చేస్తూ వీటిని నిర్మూలించాలని మంత్రి వ్యాఖ్యలు చేసినట్లు స్టాలిన్ వివరించారు. అయితే, ఇదే సమయంలో ఉదయనిధి ఏ ఒక్క మతం విశ్వాసాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించలేదని స్పష్టం చేశారు. కులం పేరుతో, శాస్త్రాల పేరుతో అణచివేతకు గుర వుతున్న ప్రజల హక్కులు, సమానత్వం కోసం ఎం దరో మేధావులు వినిపించిన గళాన్ని గుర్తు చేశారు. చంద్రునిపైకి చంద్రయాన్‌ను విజయవంతంగా పం పుతున్న ఇలాంటి సమయంలోనూ కుల వివక్ష చూపుతుండడం తగని ఇదే విషయాన్ని ఉదయనిధి వెల్లడించాలని తెలిపారు. తమిళనాడులో బాల్య వివాహాలను సమర్థిస్తూ గవర్నర్ వ్యాఖ్యానిం చడాన్ని గుర్తు చేస్తూ, ఇది బాల్య వివాహాల చట్టా లను వ్యతిరేకం కాదా? అని ప్రశ్నించారు. మహిళ లను అవమానించే విధంగా మరెన్నో వ్యాఖ్యలను వేదికలెక్కి మాట్లాడడం తప్పు కాదా..? అని ప్రశ్నిం చారు. సమాజంలో జరుగుతున్న అణచి వేతలకు వ్యతిరేకంగానే ఉదయ నిధి స్పందించారని , ఇలాం టి విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ , సనాతనం గురించి ఆలోచించే వారిని నిర్మూలిం చాలని పేర్కొనట్టు గుర్తు చేశారు.

మణిపూర్ అల్లర్లను పక్కదారి పట్టించేందుకే..

మణిపూర్ ఘటనలను పక్క దారి పట్టించేందుకు, కాగ్ వెలుగులోకి తెచ్చిన కోట్ల రూపాయాల అక్ర మాల గురించి చర్చను తెర మరుగు చేయడం కోసమే సనాతన ధర్మం పేరుతో కొందరు నాట కాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. దేశ వ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేకంగా అన్ని పార్టీలు ఏకం కావడం ప్రధాని మోదీని ఇరకాటంలో పడేసిందన్నారు. అం దుకే ఏదో ఒక రకంగా కుట్రలతో ప్రజల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నారని ఆరో పించారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ సామా జిక వ్యవస్థ గురించి ఇటీవల చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తు చేస్తూ, అవసరం అయితే, ఉదయ నిధి వ్యాఖ్యలపై ఆయన వద్ద వివరణ కావాలంటే తీసుకోండని హితవు పలికారు. రాజకీ యాల కోసం మతపరమైన భావాలను రెచ్చగొట్టి లబ్ధి పొందే చిల్లర రాజకీయాలు మానుకోవాల న్నారు. బీజేపీ నుంచి దేశాన్ని కాపాడుకోవడం కోసం డీఎంకే ఎంత వరకైనా వెళ్లేందుకు సిద్ధంగా ఉందని హెచ్చరించారు.

కేసులను చట్టపరంగానే ఎదుర్కొంటా..

తనపై నమోదు అవుతున్న కేసులను చట్ట పరం గా ఎదుర్కొంటానని ఓ ప్రకటనలో ఉదయ నిధి స్పష్టం చేశారు. వాస్తవంగా చెప్పాలంటే, ప్రజల అమాయకత్వం బీజేపీ నాటకాలకు మూలధనంగా మారిందన్నారు. తాము ఏ మతానికి వ్యతిరేకంగా కాదన్న విషయం అం దరికి తెలుసు అని గుర్తు చేశారు. అన్ని మతా లను తాము గౌరవిస్తామని స్పష్టం చేశారు. ఈసందర్భంగా వడి వేలు నటించి 23వ పులికేశి చిత్ర కథను గుర్తు చేస్తూ ప్రస్తుతం బీజేపీ ఆ చిత్రం కథ తరహాలో నాటకాలను రక్తి కట్టిస్తు న్నదని విమర్శించారు. తన తలకు బేరం పెట్టిన స్వామిజీ దిష్టిబొమ్మలు, పోటోల దగ్ధం, నిరస నలు వంటి కార్యక్రమాలతో సమయాన్ని వృధా చేసుకోవద్దు అని యువజన నేతలకు పిలుపు నిచ్చారు. ఇదిలా ఉండగా, మంత్రులు ఉదయ నిధి, శేఖర్‌బాబులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గవర్నర్‌ను కలిసి బీజేపీ నేతలు విజ్ఞప్తి చేశారు.

వక్రీకరణలతో విష ప్రచారం..

ఉదయ నిధి వ్యాఖ్యలకు అబద్ధాలు జోడిస్తూ.. వక్రీక రించి ప్రచారం చేస్తున్నారని, ఇందులో బీజేపీ కీలక పాత్రం పోషిస్తోందని సీఎం స్టాలిన్ విమర్శించారు. ఉత్తరాది వరకు ఈ వ్యవహారం విస్తరించేలా చేశారని, కేంద్ర మంత్రులు, బీజేపీ ముఖ్యమం త్రులు ముందుగా ఉదయ నిధి ఏం మాట్లాడారో తెలుసుకుని విమర్శలు చేయాలని హితవు పలికారు. హోంమంత్రి అమిత్ షా, రక్షణశాఖ మంత్రి రాజ్‌నా థ్‌సింగ్ వంటివారూ తప్పుడు ప్రచారం చేయడం శోచనీయమని విమర్శించారు. ఉత్తరప్రదేశ్‌కు చెం దిన ఆధ్యాత్మికవేత్త తమ మంత్రి ఉదయనిధి చిత్ర పటాన్ని తగల బెట్టడమే కాకుండా ఆయన తలకు రూ. 10 కోట్లు ప్రకటించాడని గుర్తు చేస్తూ, ఆయ నపై ఎందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఉదయ నిధిపై కేసులు పెడుతున్నారని, సనాతనానికి వ్యతిరేకంగా మాట్లాడితే ప్రతీకారం తీర్చుకుంటారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎది వాస్తవమో..? ఏది కాదో..? తెలుసుకోకుండా బాధ్యత గల పదవిలో ఉన్న ప్రధాని సైతం విమర్శలు చేయడం దురదృష్ట కరం అన్నారు.

హత్యకేసులో నిందితుడిపై పోలీసు కాల్పులు

• తప్పించుకునే ప్రయత్నం చేయడంతోనే ఫైరింగ్
• తిరుప్పూర్ ఎస్పీ స్వామినాథన్ వెల్లడి

సాక్షి, చెన్నై: తమ ఇంటి వద్ద మద్యం తాగడాన్ని ప్రశ్నించిన ఒకే కుటుంబానికి చెందిన నలుగుర్ని హతమార్చిన కేసులో ప్రధాన నిందితుడిపై గురు వారం పోలీసు కాల్పులు జరిగాయి. కాగా ముద్దాయి తప్పించుకునే క్రమంలోనే కాల్పులు జరపాల్సి వచ్చిందని తిరుప్పూర్ ఎస్పీ స్వామినాథన్ తెలి పారు. వివరాలు.. రెండు రోజుల క్రితం తిరుప్పూర్ జిల్లా పల్లడం కళ్లల్ కెనరు ప్రాంతానికి చెందిన సెం థిల్‌కుమార్, అతడి సోదరుడు మోహన్‌ను, తల్లి పుష్పవతి, పిన్ని రత్నమ్మాల్‌ను మద్యం మత్తులో ముగ్గురు వ్యక్తులు అతి దారుణంగా హతమార్చిన విషయం తెలిసిందే. తమ ఇంటి వద్ద మద్యం తాగ డాన్ని ప్రశ్నించినందుకు నిందితులు ఈ ఘాతుకా నికి ఒడి గట్టారు. ఈ కేసు తిరుప్పూర్ జిల్లాలో కల కలం రేపింది. నిందితుల్లో ఒకడైన చెల్లముత్తును ఇప్పటికే పోలీసులు అరెస్టు చేశారు. అతడి కాళ్లు విరి గిన స్థితిలో కట్లు కట్టించారు. అరెస్టు సమయంలో జారి పడడంతోనే అతడి కాళ్లు విరిగినట్టు పోలీసులు



గాయపడిన నిందితుడిని ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

పేర్కొన్నారు. ఇక ప్రధాన నిందితుడు వెంకటేషన్, అతడి స్నేహితుడు ముత్తయ్య పోలీసు స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయారు. ఈ పరిస్థితుల్లో వెంకటేషన్ రెండు కాళ్ల మోకాలి భాగం వద్ద తుపాకీ తూటాలు దిగిన స్థితిలో పోలీసులు గురువారం ఉదయం ఆస్పత్రికి తరలించారు. తూటాలను తొలగించి రెండు కాళ్లకు కట్లు వేశారు. ఘటనా స్థలానికి తీసుకెళ్లి విచారిస్తుం డగా తప్పించుకునే ప్రయత్నం చేశాడని, అందుకే కాల్పులు జరపక తప్పలేదని డీఎస్పీ సౌమ్య పేర్కొ న్నారు. నిందితుడికి పోలీసులు సరైన శిక్ష వేశారని హతుల బంధువులు పేర్కొంటున్నారు. తిరుప్పూర్ ఎస్పీ స్వామినాథన్ పేర్కొంటూ, ఈ కేసులో నింది తులను పట్టుకున్నామని, విచారణ వేగవంతం చేశా మన్నారు. ఓ నిందితుడికి కాళ్లు విరగడం, మరో నిం దితుడికి తుపాకీ తూటాలు దిగడం గురించి ప్రశ్నిం చగా, తప్పించుకునే ప్రయత్నం చేశారని, కాల్పులు తప్పలేదని , దీనిని మరీ పెద్దది చేయాల్సిన అవ సరం లేదని స్పష్టం చేశారు.

మొండి బకాయిలున్న వారి ఆస్తుల జప్తు?

• కొత్త చట్టం ప్రయోగించనున్న అధికారులు

సాక్షి, చెన్నై : చెన్నై కార్పొరేషన్ పరిధిలో సక్రమంగా పన్ను చెల్లించని గృహ యజమానులపై కన్నెర్ర చేస్తూ కొత్త చట్టాన్ని ప్రయోగించేందుకు రెవెన్యూ అధికా రులు సిద్ధమయ్యారు. తాజాగా వారి ఆస్తులను జప్తు చేయడానికి చర్యలు చేపట్టారు. వివరాలు.. చెన్నై కార్పొరేషన్ పరిధిలో 13 లక్షల మేరకు గృహ యజమానులు ఉన్నారు. వీరి వద్ద నుంచి ఆరు నెల లకు ఒక పర్యాయం ఆస్తి పన్ను వసూలు చేస్తున్నారు. ఈ సంవత్సరానికి రూ. 1,600 కోట్లు ఆస్తి పన్ను వసూలే లక్ష్యంగా నిర్ణయించారు. సుమారు మూడు లక్షల మేరకు గృహ యజమానులు ఆస్తి వివరాలను సక్రమంగా సమర్పించక పోగా, పన్ను చెల్లింపుల లోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఇటీవల చేప ట్టిన సర్వేల తేలింది. వీరి కారణంగా రెండేళ్లకు పైగా ఆస్తిపన్ను బకాయిలు సమారు రూ.200 కోట్లు మేరకు పేరుకుపోయినట్లు తేలింది. ఇవే కాకుండా మరెన్నో వందల కోట్ల మొండి బకాయిలు ఉన్నట్టు వెలుగు చూసింది. ఈ నేపథ్యంలో ఆస్తుల వివరాలను సక్ర మంగా సమర్పించని వారి ఆస్తులను జప్తు చేయాలని తాజాగా నిర్ణయించారు. పాత బకాయిలను ఈనెలా ఖరులోపు చెల్లించాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆస్తుల జప్తు కోసం కార్పొరేషన్ చట్టం లో మార్పులు తీసుకొచ్చినట్లు అధికారులు గురు వారం వెల్లడించారు. ఇదిలా ఉండగా, ఈ ఏడాది ఇప్పటి వరకు ఆస్తిపన్ను రూ. 605 కోట్లు మాత్రమే వసూలైందని అధికారులు తెలిపారు.

మరో మూడు మార్గాల్లో మెట్రో విస్తరణ

సాక్షి, చెన్నై: మెట్రో ఫేజ్–2 పనులు ముగియగానే, మరో మూడు మార్గాల్లో విస్తరణ పనులు చేపట్టేం దుకు మెట్రో యాజమాన్యం సిద్ధమవుతోంది. ఇం దుకు సంబంధించిన కసరత్తుపై అధికారులు దృష్టి సారించారు. వివరాలు.. చెన్నైలో మెట్రో ఫేజ్ –1 పనులు ముగిసి రైలు సేవలు సాగుతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఫేజ్ –2 పనులు శరవేగంగా జరు గుతున్నాయి. ఇందులో లైట్ హౌస్ – పూందమల్లి, మాధవరం – షోళింగనల్లూరు, మాధవరం – సిరుచ్చేరి సిప్ కాట్ మార్గాలు ఉన్నాయి. ఈ మూడు మార్గాల్లో 119 కిలోమీటర్ల దూరం పనులను 2028 నాటికి ముగించి, రైళ్ల ను పట్టాలెక్కించాలని టార్గెట్‌గా పెట్టుకున్నారు. ఈ పనులు ముగిసే నాటికి ముం దుగానే మరోమూడు మార్గాల్లో విస్తరణ పనులు చేప ట్టేందుకు కసరత్తు ప్రారంభించారు. ఇందులో సిరుచ్చేరి – కిలాంబాక్కం, పూందమల్లి – పరం దూరు, కోయంబేడు – ఆవడి మార్గాలు ఉన్నాయి. కిలాంబాక్కంలో ప్రస్తుతం భారీ బస్ టెర్మినల్ రూపు దిద్దుకుంటున్న విషయం తెలిసిందే. మరికొన్ని నెలల్లో ఇది ఉపయోగంలోకి రానుంది. ఇక్కడికి రవాణాను మరింత సులభతరం చేస్తూ విస్తరణ పనులు చేపట్టను న్నారు. అలాగే, పరందూరులో రెండో విమా నాశ్రయం పనులపై దృష్టి పెట్టి ఉన్న విషయం తెలిసిందే. ఇక్కడకు రవాణా సౌకర్యాలు కల్పించే విధంగా మెట్రో సేవలను అందుబాటులోకి తీసుకు రాబోతున్నారు. చెన్నై నగర శివారులోని ఆవడి కార్పొరేషన్ పరిసరాలు అభివృద్ధి పరంగా దూసుకెళ్లి ఉన్నాయి. ఇక్కడి ప్రాంతాలను చెన్నై నగర రవాణా లోకి కలిపే విధంగా మెట్రో సేవలను అందుబాటు లోకి విస్తరణ ద్వారా తీసుకు రాబోతున్నారు.

చెన్నై కలెక్టర్‌గా రష్మీ సిద్ధార్థ్ జాగ్డే

సాక్షి, చెన్నై: చెన్నై జిల్లాకు కొత్త కలెక్టర్‌గా రష్మీ సిద్ధార్థ్ జాగ్డేను నియమించారు. ఈ మేరకు సీఎస్ శివదాస్ మీన గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న అరుణను నీలగిరి కలెక్టర్‌గా బదిలీచే శారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్పీ అమ్రిత్‌ను భూ పరి పాలనా విభాగం జాయింట్ కమిషనర్‌గా నియ మించారు. ఇక ఆహారం, పౌర సరఫరాల శాఖ అద నపు కార్యదర్శిగా ఉన్న రష్మీ సిద్ధార్థ్ జాగ్డేను చెన్నైజి ల్లాకు కేటాయించారు.

బాలికపై లైంగిక దాడి

అన్నానగర్: ధర్మపురి సమీపంలో 15 ఏళ్ల బాలికపై కుప్పూరుకు చెందిన మేస్త్రీ గణేషన్ (25) ఇటీవల లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ధర్మపురి ఆల్ మహిళా పోలీస్ స్టేషన్‌లో బాధిత బాలిక ఫిర్యాదు చేసింది. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

ధరల పెరుగుదలపై సీపీఎం సమర భేరి

• రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు

సాక్షి, చెన్నై: ధరల కట్టడిలో కేంద్రం విఫలమైందని పేర్కొంటూ గురువారం రాష్ట్రవ్యాప్తంగా సీపీఎం నేతృత్వంలో నిరసనలు హోరెత్తాయి. రైల్‌రోకో, రైల్వే స్టేషన్ల ముట్టడి కార్యక్రమాలు పెద్దఎత్తున సాగాయి. వివరాలు.. ఆకాశాన్ని అంటుతున్న నిత్యావసర వస్తువుల ధరల కట్టడి, సామాజిక భద్ర తతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాల కల్పన, కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ సీపీఎం నేతృత్వంలో రాష్ట్రవ్యా ప్తంగా ఆందోళనలు పెద్దఎత్తున సాగాయి. ఈ మేరకు చెన్నై, మదురై, కోయంబత్తూరు, తిరునల్వే లి, తిరుచ్చి, నాగపట్నం, తిరువారూర్, కడలూరు లలో నిరసనలు హోరెత్తాయి. రైల్వే స్టేషన్ల ముట్టడి ప్రయత్నాలు జరిగాయి. రైల్‌రోకోకు పలు చోట్ల యత్నించారు. ఫలితంగా పోలీసులతో వాగ్వాదం, తోపులాటలు చోటు చేసుకున్నాయి. ఆందోళన కారులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. కోయంబత్తూరు మేట్టుపాళయం రైల్వే స్టేషన్ ముట్టడి ప్రయత్నం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. మదురైలో ఎంపీ వెంకటేషన్ నేతృత్వంలో నిరస నలు హోరెత్తాయి. రైల్వే స్టేషన్‌లోకి పెద్దఎత్తున సీపీ ఎం నాయకులు, కార్యకర్తలు దూసుకు రావడంతో కట్టడి చేయలేని పరిస్థితి పోలీసులకు ఏర్పడింది. ఈ సమయంలో వాగ్వాదం, తోపులాటలు తీవ్ర ఉత్కంఠను రేపింది. చెన్నైలో సీపీఎం రాష్ట్ర కార్య దర్శి బాలకృష్ణన్ నేతృత్వంలో నిరసన కారులు గిం డి రైల్వే స్టేషన్‌లోకి దూసుకెళ్లారు. ఎలక్ట్రిక్ రైలును అడ్డుకుని ట్రాక్ మీద బైటాయించారు. దీంతో ఎల క్ట్రిక్ రైళ్ల సేవలకు ఆటంకం తప్పలేదు. ఎట్టకేలకు ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేశారు.



చెన్నైలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ధరల కట్టడిలో బీజేపీ పాలకులు పూర్తిగా విఫలమ య్యారని బాలకృష్ణన్ ధ్వజమెత్తారు. ఎన్నికల ముం దు ఓ మాట, అధికారంలోకి వచ్చిన తర్వాత మరోమాట అన్నట్టుగా వ్యవహరిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి రానున్న ఎన్నికల్లో ప్రజలు గుణ పాఠం చెప్పాలన్నారు. చెన్నైలో తొమ్మిది చోట్ల నిర సనలు జరిగాయి.

వేలూరులో..

వేలూరు: అధిక ధరలు పెంచడాన్ని ఖండిస్తూ సీపీ ఎం నాయకుల వేలూరులోని అన్నా రోడ్డులో రాస్తా రోకో నిర్వహించడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దయానిధి ఆధ్వర్యంలో నిర్వ హించిన రాస్తారోకోలో కార్యకర్తలు మాట్లాడుతూ ధరలు పెరుగుదలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కాగా రాస్తారోకో చేస్తున్న 50 మంది కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసి ఓ ప్రైవేటు కల్యాణ మండ పంలో ఉంచారు. ఈ ధర్నాలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు రామచంద్రన్, జిల్లా కమిటీ సభ్యులు నాగేంద్రన్, సురేంద్రన్, తాలుకా కార్యదర్శి శ్రీమతి పాల్గొన్నారు.

తిరువళ్లూరులో..

తిరువళ్లూరు: దేశవ్యాప్తంగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ఉదయం రాస్తా రోకో, జిల్లా తపాలా కేంద్రం ముట్టడి వంటి ఆం దోళన కార్యక్రమాలను నిర్వహించారు. తిరువ ళ్లూరులో జరిగిన ఆందోళనకు సీపీఎం పార్టీ డివిజన్ కార్యదర్శి తమిళరసు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు సౌందరరాజన్ హాజరై ప్రసంగించారు. సౌందరరా జన్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పెంచిన ధరల కారణంగా నిరుపేదల జీవితాలు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందిం చి పెంచిన ధరలను తగ్గించడంతో పాటు రెండు కోట్ల మందికి ఉపాధి కల్పించాలని నినాదాలు చేశారు. ఊత్తుకోట, గుమ్మిడిపూండి, పూందమల్లి, ఆవడిలోనూ సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిం చారు. అనుమతి లేకుండా ఆందోళన చేశారన్న నెపంతో జిల్లా వ్యాప్తంగా 627 మందిని అరెస్టు చేసి సాయంత్రం విడుదల చేశారు.



వేలూరులో...



తిరువళ్లూరులో...

10 నుంచి జోనల్ స్థాయి క్రీడా పోటీలు



విలేకరులతో మాట్లాడుతున్న టీమ్ ఆర్గనైజర్ సమీ నకుజా

వేలూరు: ఈశా ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ నుంచి వాలాజలో జోనల్ స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తు న్నట్లు ఈశా గ్రామోత్సవం టీమ్ ఆర్గనైజర్ సమీ నకు జా తెలిపారు. వేలూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈశా గ్రామోత్సవం ఈ సంవత్సరం దక్షిణ భారతదేశంలోనే నిర్వహిస్తున్నా మని మొదటి దశ పోటీలు పూర్తి కాగా ఈనెల 10వ తేదీన జోనల్ స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నామ న్నారు. ఇందులో తిరువళ్లూరు, కాంచిపురం, వేలూరు, రాణిపేట, తిరు పత్తూరు, పుదుచ్చేరి, విల్లుపురం, తిరువణ్ణామలై, క్రిష్ణ గిరి వంటి పది జిల్లాల నుంచి మొత్తం 600 మందికి పైగా క్రీడా కారులు పాల్గొంటారన్నారు. ఇందులో పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్ పోటీ లు, కబడీ పోటీలు నిర్వహిస్తామన్నారు. వాలీబాల్ పోటీల్లో 28 జ ట్లు, త్రోబాల్ పోటీల్లో 10 జట్లు, కబడీ పోటీల్లో పురుషులు, మహిళల విభాగంలో ఆరు జట్లు పా ల్గొంటాయన్నారు. ఈ పోటీలు ఉదయం 8 గంట లకు ప్రారంభమై సాయంత్రం వరకు జరుగుతాయ న్నారు. ఈ పోటీలను చూసేందుకు వచ్చే సామాన్య ప్రజలకు మధ్యాహ్నం వినోద క్రీడలు నిర్వహిస్తామ న్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన జట్లను జాతీ య స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఇందు లోని విజేతలకు రూ 55 లక్షల విలువ చేసే బహు మతులను ఇవ్వనున్నట్లు తెలిపారు.

చెన్నై శుక్రవారం । 8 । సెప్టెంబర్ । 2023 సాక్షి

క్లుప్తంగా

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు


పుష్పాలంకరణలో చిన్నికృష్ణుడు


యాగ పూజలు చేస్తున్న అర్చకులు

వేలూరు: వేలూరు, తిరువణ్ణామలై జిల్లాల్లో శ్రీకృష్ణాష్టమిని ఘనంగా నిర్వహించారు. కృష్ణాష్టమి సందర్భంగా శ్రీకృష్ణ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం వేలూరులోని శ్రీకృష్ణుడి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అదేవిధంగా వాలాజలోని ధన్వంతరి ఆరోగ్య పీఠంలో వెలసిన నవనీత చిన్ని కృష్ణుడికి సాయంత్రం గంటలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లోకక్షేమం కోసం హోమ పూజలు చేశారు. 7 గంటలకు శ్రీనవనీత కృష్ణుడికి ప్రత్యేక అలంకారం, ఆరాధన పూజలు జరిగాయి. అదేవిధంగా వేలూరు, తిరువణ్ణామలై జిల్లాల్లోని శ్రీకృష్ణుడి ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

గంజాయి సాగుచేస్తున్న రైతు అరెస్ట్

అన్నానగర్: కల్వరాయన్ మలైలో కలపలో అంతర పంటగా గంజాయి సాగు చేసిన ఓ రైతును గురువారం పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. పెరియపాలపూండి ప్రాంతంలో కల్వరాయన్మలై రకం గంజాయి సాగు చేస్తున్నట్లు కరియలూర్ పోలీసులకు రహస్య సమాచారం అందింది. దీంతో సబ్ ఇన్ స్పెక్టర్ గుణశేఖరన్ నేతృత్వంలో పోలీసులు గురువారం వేకువజామున అక్కడికి చేరుకుని తోటలో సోదాలు నిర్వహించారు. ఆ సమయంలో కలప పంటలో అంతర్ పంటగా గంజాయి సాగు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించి తోట యజమాని ఆండీ(65)ను అరెస్టు చేశారు. తర్వాత గంజాయి మొక్కలను కూడా పోలీసులు పెకిలించి ధ్వంసం చేశారు.

సహజ వ్యవసాయం గొప్ప విజయం

- డీఎంకే ఎంపీ కనిమొళి
- విజయ్‌కుమార్‌కు ఎంఎస్ స్వామినాథన్ అవార్డు



కనిమొళి నుంచి అవార్డు అందుకుంటున్న విజయ్‌కుమార్

కొరుక్కుపేట: ఆంధ్రప్రదేశ్‌లో 14 శాతం మంది రైతులు సహజ వ్యవసాయం వైపు మొగ్గు చూపడం గొప్ప విజయమని డీఎంకే పార్టీ ఎంపీ కనిమొళి కరుణానిధి ప్రశంసించారు. ఈ మేరకు రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ ఈస్ట్ ఖమ్మం కెవిన్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో 2023 పెరిరక్షణకు పాటుపడుతున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయం, సహకార శాఖ మాజీ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ఆర్‌వైఎస్ఎస్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్ కుమార్‌కు ఎంఎస్. స్వామినాథన్ అవార్డ్ ఫర్ ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్- 2023లో పాల్గొన్న ఎంపీ కనిమొళి చేతులమీదుగా ప్రదానం చేశారు. కనిమొళి మాట్లాడుతూ విచక్షణారహితంగా ప్రకృతి విధ్వంసం ఆగాలని, దీని కోసం రాష్ట్ర, జాతీయ స్థాయిలో విధానాలు మారాలని ఆమె అన్నారు. అంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 14 శాతం మంది రైతులు సహజ వ్యవసాయం వైపు మొగ్గు చూపడం గొప్ప విజయమని, ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వాన్ని అభినందించారు. సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రైతుల తరఫున అవార్డును స్వీకరించిన మాజీ ఐఏఎస్ అధికారి టి.విజయ్‌కుమార్ తన స్పందనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 14శాతం మంది రైతులు సైన్స్ మద్దతుతో సహజ వ్యవసాయానికి మారారని అన్నారు. ఏపీ ప్రభుత్వం అందించిన ఆదరణ వల్ల పాక్షిక వర్షాధార ప్రాంతాల్లో కూడా రైతులు ఏటా మూడు పంటలు పండించగలిగారని తెలిపారు. గౌరవ అతిథిగా ఎస్.స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సౌమ్య పాల్గొని వాతావరణ మార్పులపై మాట్లాడారు. కెవిన్‌కేర్ అధ్యక్షుడు సి.కె.రంగనాథన్, క్లబ్ అధ్యక్షుడు బాబు కృష్ణమూర్తి, కార్యదర్శి రేవతి, డైరెక్టర్ రాజేష్ ఎస్.సుంద్రాణి, అవార్డు కమిటీ చైర్‌పర్సన్ రూపా పాల్గొన్నారు.

కోలాహలం..మేరీ మాత రథోత్సవం

కొరుక్కుపేట: నాగపట్నంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వేలాంకని ఆలయంలో గురువారం రాత్రి మేరీ మాత రథోత్సవం అత్యంత కనులపండువగా సాగింది. వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. మేరీమాత ఊరేగింపులో క్రైస్తవ గీతాలను ఆలపిస్తూ ముందుకుసాగారు. రథోత్సవ భద్రత కోసం 3,500 మంది పోలీసులను మోహరించారు. నాగై జిల్లాలోని హోలీ మదర్ ఆఫ్ హెల్త్ చర్చి ప్రపంచ ప్రసిద్ధి చెందింది. ఇక్కడ వార్షిక ఉత్సవం ప్రతి ఆగస్టు 29న ధ్వజారోహణంతో ప్రారంభమవుతుంది.ఉత్సవాల్లో ప్రధాన ఘట్టం రథోత్సవం గురువారం రాత్రి జరుగనుంది. ఈ సందర్భంగా తంజావూరు జిల్లా బిషప్ దేవదాస్ సారథ్యంలో సాగిన ఈ వేడుకలకు భక్తులు పోటెత్తారు. చెన్నై బీసెంట్‌నగర్‌లోని మేరీమాత రథోత్సవం వైభవంగా జరిగింది.

రాహుల్ జోడో యాత్రకు ఏడాది


ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దురైచంద్రశేఖర్

- కాంగ్రెస్ శ్రేణుల ర్యాలీ

తిరువళ్లూరు: రాహుల్‌గాంధీ చేపట్టిన జోడో యాత్రకు ఏడాది పూర్తయిన నేపథ్యంలో తిరువళ్లూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జిల్లా అధ్యక్షుడు దురైచంద్రశేఖర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం గాంధీ విగ్రహం వద్దకు ర్యాలీ రాగా ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే దురైచంద్రశేఖర్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ చేపట్టిన జోడో యాత్రతో కాంగ్రెస్ కార్యకర్తల్లో ఉత్తేజం వచ్చిందన్నారు. త్వరలోనే జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో రాహుల్ చేపట్టిన జోడో యాత్ర కాంగ్రెస్‌ను అధికారంలోకి తెస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అనంతరం బీజేపీ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నినాదాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గోవిందరాజన్, మోహన్‌దాస్, పార్టీ నేతలు వెంకటేషన్, రఘురామన్, జాన్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏకాటూరు ఆనందన్ పాల్గొన్నారు.

వయోభారంతో ఏనుగు మృతి


ఏనుగు కళేబరం

అన్నానగర్: మసినగుడి సమీపంలోని అడవిలో ఆడ ఏనుగు మృతి చెందింది. దీనిపై అటవీశాఖ విచారణ చేపట్టింది. వివరాలు.. నీలగిరి ముదుమలై టైగర్ రిజర్వ్‌లో భాగమైన మసినకుడి, సింగర సిగూరు అటవీ ప్రాంతాల్లో అడవి ఏనుగులు, పులులు, చిరుతపులు సహా అటవీ జంతువులు పెద్దసంఖ్యలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం సింగర సిగూరు అటవీ ప్రాంతంలో అటవీ సిబ్బంది గస్తీ వెళ్లా రు. అప్పుడు ఓ అడవి ఏనుగు చనిపోయి పడి ఉండడంతో రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ వెంకటేష్, డిప్యూటీ డైరెక్టర్ అరుణ్, ఫారెస్టర్ దయానందన్ ఆధ్వర్యంలో ఏనుగు కళేబరాన్ని తరలించా రు. అనంతరం వెటర్నరీ డాక్టర్ రాజేష్ కుమార్ పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం ము ఖ్య అవయవాలను సేకరించి ప్రయోగశాలకు తరలించారు. వయోభారం కారణంగానే 50 ఏళ్ల వయసున్న ఆడ ఏనుగు మరణించి ఉంటుందని భావిస్తున్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలి


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ కుమరవేల్ పాండియన్

వేలూరు: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి దేశాభివృద్ధికి దోహద పడాలని కలెక్టర్ కుమరవేల్ పాండియన్ అన్నారు. వేలూరు జిల్లా కన్నియంబాడి ప్రభుత్వ పాఠశాలలో మా పాఠశాల మిలరుం పాఠశాల అనే పథకాన్ని ఆయన ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల ప్రాంగణంతోపాటు తరగతి గదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇందుకు విద్యార్థులు, టీచర్‌లు సంయుక్తంగా పనిచేసి రాష్ట్ర స్థాయిలో ఆదర్శ పాఠశాలగా తీసుకురావాలని చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని తల వెంట్రుకలను సక్రమంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటే మీరు చదివే పాఠశాలతో పాటు మీరు కూడా అభివృద్ధి చెందగలరన్నారు. అనంతరం విద్యార్థులతో పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఆర్కాడు ఎమ్మెల్యే ఈశ్వరప్పన్, విద్యాశాఖ సీఈఓ మణిమొయి, పాఠశాల హెచ్ఎం గోపినాథన్, యూనియన్ చైర్మన్ దివ్య, వైస్ చైర్మన్ గజేంద్రన్, యూనియన్ కార్యదర్శి కలైచంద్రన్, సర్పంచ్‌లు సెల్వి, జ్యోతిలక్ష్మి, శివకుమార్ పాల్గొన్నారు.

తెలుగు పురస్కారాలకు దరఖాస్తులు

కొరుక్కుపేట: రాష్ట్రేతర ప్రాంతాల్లో వున్న తెలుగు సంస్థల ద్వారా తెలుగువారి మధ్య ఐక్యత, భాష, సాహిత్య, సాంస్కృతిక సంబంధాల కోసం కృషిచేస్తున్న రాష్ట్రేతర తెలుగు సమాఖ్య (రాతెస) రానున్న డిసెంబర్ 23, 24 తేదీల్లో జాతీయ స్థాయి కార్యక్రమాలు తెలుగు విజ్ఞాన సమితి - బెంగళూరు వారి సౌజన్యంతో నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో 16 రాష్ట్రాల ప్రతినిధులు, రచయితలు, కళాకారులు పాల్గొనున్నారు. ఈ సందర్భంగా ఇక నుంచి 7 జాతీయ పురస్కారాలను ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా తెలుగురత్న, సంగీత, నాట్య, నాటక, సాహిత్య, శిక్షక , మహిళా రత్న పురస్కారాల కోసం వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న రాష్ట్రేతరులు దరఖాస్తు చేసుకోవాలని కోరింది. పురస్కార గ్రహీతలకు రూ.10 వేల నగదు, జ్ఞాపికతో పాటు రైలు రవాణా ఖర్చులను ఇవ్వనున్నట్లు ప్రకటనలో పేర్కొంది. వివరాలకు 9445360139 నంబర్‌లో సంప్రదించవచ్చునని కోరారు.

చెన్నైలో పెరిగిన భూగర్భ జలాలు

కొరుక్కుపేట: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా చెన్నైలో భూగర్భజలాలు పెరుగుతున్నాయి. చెన్నై నగరంతోపాటు శివారు ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చెన్నైలోని పలు ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగాయని మెట్రో వాటర్ బోర్డు అధికారులు తెలిపారు. మెట్రో డ్రింకింగ్ వాటర్ బోర్డు నివేదిక ప్రకారం గత జూన్ నుంచి చెన్నైలో 544.7 మి.మీ వర్షం కురిసింది. ఇది గతేడాది కంటే 66 శాతం ఎక్కువ. చెన్నైలోని భూగర్భ ప్రాంతాల్లో నీటిమట్టం గణనీయంగా పెరిగింది. ఇందులో తిరువికానగరంలో అత్యధికంగా 1.74 మీటర్ల పెరుగుదల నమోదైంది. ఆ తర్వాత కోడంబాక్కంలో 1.41 మీటర్ల మేర నీటిమట్టం పెరిగింది. అదేసమయంలో అంబత్తూరులో అత్యల్ప భాగం కావడంతో నీటిమట్టం 0.70 మీటర్ల మేర తగ్గింది. ఎడతెరిపి లేకుండా వర్షాలు వల్ల చెన్నైకి తాగునీటిని అందించే సరస్సుల నీటిమట్టం పెరిగింది. దీంతో ఇళ్లకు పైపుల ద్వారా మెట్రో తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ ఏడాది ప్రతిరోజూ 1038 మిలియన్ లీటర్ల తాగునీటిని పైపుల ద్వారా సరఫరాచేస్తున్నారు. దీంతో ఇళ్లలోని బోరుబావుల ద్వారా నీటిని తెచ్చుకునేందుకు ఖర్చు తగ్గిందని, దీంతో భూగర్భ జలాలు పెరుగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు.

వెబ్ సిరీస్‌కు రజనీ క్లాప్




గ్యాంగ్స్ వెబ్ సిరీస్ ప్రారంభోత్సవం

తమిళసినిమా: నటుడు రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం జైలర్ సంచలన విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. తర్వాత ఆయన పెద్ద కూతురు ఐశ్వర్య రజనీకాంత్ దర్శకత్వం వహిస్తున్న లాల్ సలామ్ చిత్రంలో ముఖ్య పాత్రను పోషించారు. షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణానికి కార్యక్రమాలు జరుపుకుంటుంది. కాగా రజనీకాంత్ తన తర్వాత చిత్రానికి సిద్ధమవుతున్నారు. జైభీమ్ చిత్రం జ్ఞానవేల్ దర్శకత్వం వహిస్తున్న చిత్రంలో రజనీకాంత్ నటించనున్నారు. లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించనున్న ఈ చిత్రం త్వరలో సెట్‌పైకి వెళ్లనుంది. కాగా తాజా గా రజనీకాంత్ రెండవ కూతురు సౌందర్య వెబ్‌సిరీస్‌ను రూపొందించడానికి సిద్ధమయ్యారు. ఇంతకుముందు తండ్రి రజనీకాంత్ కథానాయకుడిగా కోచ్చడైయాన్ అనే యానిమేషన్ చిత్రాన్ని, ధనుష్ కథానాయకుడిగా వేలై ఇల్లా పట్టాదారి-2 చిత్రాలకు దర్శకత్వం వహించారన్నది గమనార్హం. కాగా తాజాగా అమెజాన్‌ప్రైమ్ ఓటీటీ సంస్థతో కలిసి ఒక వెబ్ సిరీస్ రూపొందిస్తున్నారు. దీనికి గ్యాంగ్స్ అనే టైటిల్ నిర్ణయించారు. నోవా అబ్రహం దర్శకత్వం వహిస్తున్న ఈ వెబ్ సీరీస్‌లో నటుడు అశోక్‌సెల్వన్ కథానాయకుడిగా నటిస్తున్నారు. పూజాకార్యక్రమం గురువారం చెన్నైలో ప్రారంభించారు. ఇందులో రజనీకాంత్ పాల్గొని ముహూర్తం షాట్‌కు క్లాప్‌కొట్టి యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

కోలీవుడ్ టాక్స్

విజయ్‌కు విలన్‌గా బాలీవుడ్ సూపర్‌స్టార్?


అమీర్‌ఖాన్


విజయ్

తమిళసినిమా: బాలీవుడ్ సూపర్‌స్టార్స్ ఇప్పుడు దక్షిణాదిలో నటించడానికి ఆసక్తి చూపుతున్నారు. అలా వారు ప్రతి నాయకులుగా నటించడానికి వెనుకాడడం లేదు. సంజయ్‌దత్ కన్నడ చిత్రం కేజీఎఫ్-2లో విలన్‌గా నటించారు. నటుడు వివేక్ ఒబెరాయ్ వివేగం చిత్రంలో అజిత్‌కు విలన్‌గా నటించారు. నటుడు జాకీష్రాఫ్ వంటి మరికొందరు దక్షిణాది చిత్రాల్లో నటించి మెప్పించారు. తాజాగా సామాజిక మాధ్యమాల్లో ఒక ఇంట్రెస్టింగ్ న్యూస్ వైరల్ అవుతోంది. నటుడు విజయ్ లియో చిత్ర షూటింగ్ పూర్తి చేసి తర్వాత చిత్రానికి సిద్ధమవుతున్నారు. అది ఆయన నటించే 68వ చిత్రం. వెంకట్ ప్రభు దర్శకత్వం వహించనున్న ఈ చిత్రాన్ని ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ భారీ ఎత్తున నిర్మించడానికి సన్నాహాలు చేస్తోంది. ఇందులో భారీ తారాగణం నటించబోతున్నట్లు సమాచారం. త్వరలోనే సెట్‌పైకి వెళ్లనుంది. ఈ చిత్రంతో పాటు ఈ సంస్థ జయంరవి హీరోగా తనీఒరువన్ 2 చిత్రాన్ని నిర్మించనుంది. దీనికి మోహన్‌రాజా దర్శకత్వం వహించనున్నారు. ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో స్ప్రెడ్ అవుతున్న న్యూస్ ఏమిటంటే ఈ రెండు చిత్రాలలో ఒకదానిలో బాలీవుడ్ సూపర్ స్టార్ అమీర్‌ఖాన్‌ను విలన్‌గా నటింపజేయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. కాగా విజయ్‌కు విలన్‌గా అమీర్‌ఖాన్‌ను నటింపజేసే అవకాశం ఉన్నట్లు టాక్. అయితే ఇందులో నిజం ఎంతో తెలియాల్సి ఉంది. అసలు ప్రతినాయకుడిగా నటించడానికి అంగీకరిస్తారా అనే ప్రశ్న తలెత్తవచ్చు. అయితే లియో చిత్రంలో సంజయ్‌దత్ విజయ్‌తో ఢీకొంటున్నారు. ఇక విశ్వనటుడు కమలహాసనే ఇప్పుడు ప్రభాస్ హీరోగా నటిస్తున్న తెలుగు చిత్రంలో ప్రతి నాయకుడిగా నటిస్తున్నారన్నది గమనార్హం. ఇక్కడ ఏదైనా జరగవచ్చు.

హీరోగా మరో వారసుడు


కుమారుడు దేవ్‌తో చరణ్‌రాజ్

తమిళ సినిమా: సినీ ప్రముఖుల వారసులు ఎక్కువగా సినీ రంగంపైనే మక్కువ చూపుతుంటారు. ఆ విధంగా పలువురు హీరోల వారసులు హీరోలు గానే పరిచయం కావడం చూస్తున్నాం. అదేబాటలో ఎప్పుడు నటుడు చరణ్‌రాజ్ తన వారసుడిని కథానాయకుడిగా పరిచయం చేసే పనిలో ఉన్నారు. తమిళం, తెలుగు, కన్నడ భాషల్లో నటించి పేరు తెచ్చుకున్న నటుడు చరణ్‌రాజ్. ఈయనకు ఇద్దరు కుమారులు. అందులో పెద్దకుమారుడు దేవ్‌ని కథానాయకుడిగా పరిచయం చేయాలని చాలాకాలంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అది ఇప్పటికి కార్యరూపం దాల్చుతోంది. ఇందులో నటి సుస్మిత, ప్రియదర్శిని హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. చరణ్‌రాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఆయన ఒక కీలకపాత్రను పోషిస్తున్నారు. మత్స్యకార యువకుడికి మార్వాడి యువతకు మధ్య జరిగే ప్రేమ నేపథ్యంలో ఈ చిత్రం కథ ఉంటుందని సమాచారం. కాగా చరణ్‌రాజ్ 1999 దర్శకుడిగా అవతార్మెత్తి అన్నన్ తంగచ్చి అనే చిత్రాన్ని రూపొందించారు. మళ్లీ ఇన్నాళ్లకి మెగాఫోన్ పట్టడం విశేషం. ఈయన తన వారసుడ్ని కథానాయకుడిగా నిలబెట్టే ప్రయత్నమే ఈ చిత్రం అని భావించవచ్చు. దీనికి కుప్పన్ అని టైటిల్ నిర్ణయించారు దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాలంటే కొద్ది రోజులు ఆగాల్సిందే.

చేదు అనుభవాలు ఎదురయ్యాయి!


కృతిసనన్

తమిళసినిమా: సినిమా రంగంలో రాణించడానికి ప్రతిభ ఉంటే చాలదు. కృషి, శ్రమ, అన్నింటికీ మించి అదృష్టం చాలా ముఖ్యం. అయినా ఒక్కోమెట్టు ఎక్కాలంటే ఎన్నో అవమానాలను, చేదు అనుభవాలు ఎదుర్కోకతప్పదు. ముఖ్యంగా హీరోయిన్లు ఇలాంటి సంఘటనలు ఎదుర్కొంటుంటారు. బాలీవుడ్ నటి కృతిసనన్ ఇలాంటి అవమానాలను ఎదుర్కొందట. దక్షిణాది చిత్రాల్లో నటించడానికి ఎక్కువ ఆసక్తి చూపే ఈ బాలీవుడ్ బ్యూటీ ఇంతకుముందే తెలుగులో మహేష్‌బాబు సరసన నేనొక్కడినే చిత్రంలో నటించింది. ఇటీవల ప్రభాస్ కథానాయకుడిగా నటించిన ఆదిపురుష్ చిత్రంలో సీతగా నటించింది. ఆ చిత్రం ఆశించిన విజయాన్ని సాధించలేదు. దీంతో కృతిసనన్‌కు పెద్దగా గుర్తింపు రాకపోయినా ఈమె హిందీలో నటించిన మిమి చిత్రానికిగాను జాతీయ ఉత్తమ నటి అవార్డును తెచ్చిపెట్టింది. అలాంటి నటి ఇటీవల ఒక ఇంటర్వ్యూలో నటిగా తన తొలి రోజులను గుర్తు చేసుకుంది. మొదట్లో మోడల్‌గా చేస్తూనే నటిగా అవకాశాల కోసం ప్రయత్నించానని చెప్పింది. ఇందుకు చాలా అవమానాలను ఎదుర్కొన్నానని చెప్పింది. చిన్న ఉదాహరణ చెప్పాలంటే ఒక డాన్స్ సన్నివేశంలో నటిస్తున్నప్పుడు నృత్య దర్శకుడు పొరపాటు చేశానని కోపంతో దుర్భాషలాడి మనసును నొప్పించిలోని చెప్పింది. అలాగని తాను వెనుకడుగు వేయలేదని, నటిగా తన పయనాన్ని పట్టుదలతో కొనసాగించానని పేర్కొంది. ఆ తరువాత ఆ డాన్స్ మాస్టర్‌తో కలిసి పనిచేసినట్లు చెప్పింది.

సూర్య సరసన నజ్రియా


నజ్రియా

తమిళసినిమా: సూర్య సరసన మలయాళ బ్యూటీ నజ్రియా నటించడానికి సిద్ధమవుతున్నట్లు తాజా సమాచారం. సూర్య ప్రస్తుతం శివ దర్శకత్వంలో కంగువ అనే భారీ చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. స్టూడియో గ్రీన్ సంస్థ, యువి క్రియేషన్స్ సంస్థ కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ముమ్మరంగా జరుగుతోంది. ఇప్పటికే సగానికి పైగా షూటింగ్ పూర్తిచేసుకుంది. కాగా సూర్య తర్వాత వెట్రిమారన్ దర్శకత్వంలో వాడివాసల్ చిత్రంతోపాటు, తన సొంత నిర్మాణ సంస్థ 2డీ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలోనూ చిత్రం చేయడానికి సిద్ధమవుతున్నారు. 2డీ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలో నటించే చిత్రానికి సుధా కొంగర దర్శకత్వం వహించనున్నారు. వీరి కాంబోలో ఇంతకుముందు సూరరైపోట్రు వంటి విజయవంతమైన చిత్రం వచ్చిన విషయం తెలిసిందే. కాగా తాజాగా మరోసారి ఈ సక్సెస్‌ఫుల్ కాంబో రిపీట్ కానుంది. ఇందులో సూర్యకు జంటగా అదితిశంకర్ నటించనున్నట్లు ప్రచారం జరిగింది. తాజాగా నజ్రియాను ఎంపికచేసినట్లు సమాచారం. అయితే ఇందులో ఈమెను అదితిశంకర్‌కు బదులుగా ఎంపిక చేశారా లేక మరో పాత్రలో నటించనున్నారా అనేది తెలియాల్సి ఉంది. కాగా నజ్రియా ఇంతకుముందు తమిళంలో రాజారాణి చిత్రాల్లో నటించిన విషయం తెలిసిందే. అయితే ఫాహద్ ఫాజిల్ ను పెళ్లిచేసుకున్న తర్వాత నటనకు దూరమయ్యారు. అయితే ఇటీవల మళ్లీ నటించడం మొదలు పెట్టారు. తెలుగులో నానీకి జంటగా అంటే సుందరానికి చిత్రంలో నటించారు. అదేవిధంగా మలయాళంలోను నటిస్తున్నారు. తమిళంలోనూ చాలా గ్యాప్ తర్వాత నజ్రియా మళ్లీ రీఎంట్రీ అవుతున్నారన్నమాట.

క్లుప్తంగా

యువతి అవయవదానం

అన్నానగర్: రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్ డెడ్ అయిన యువతి అవయవాలను కుటుంబసభ్యులు దానం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని పిచ్చాటూరు పక్కనే ఉన్న రామాపురం గ్రామానికి చెందిన సంపత్ కుమార్తె కీర్తి (21) బీకాం గ్రాడ్యుయేట్. చెన్నైలోని అరుంబాక్కంలో ఉంటూ ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తుంది. తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి పక్కనే ఉన్న పాదిరివేడు సమీపంలోని కరాడిపుత్తూరు గ్రామంలో 3వ తేదీన జరిగిన వివాహ వేడుకకు కీర్తి బంధువు రాబర్ట్ (21)తో కలిసి వెళ్లింది. తర్వాత రాబర్ట్‌తో కలిసి బైకులో తిరిగి ఇంటికి బయలుదేరింది. కరాడిపుత్తూరు వంతెన సమీపంలో వెళుతుండగా బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. రాబర్ట్‌కు స్వల్పగాయాలయ్యాయి. కీర్తి తీవ్రంగా గాయపడింది. కీర్తిని చెన్నైలోని రాజీవ్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. బుధవారం కీర్తి బ్రెయిన్ డెడ్ అయ్యింది. ఆమె కుటుంబసభ్యుల అంగీకారంతో అవయవాలను దానం చేశారు.

మహిళా ఎస్‌ఐకి బెదిరింపులు

తిరువొత్తియూరు: రిజిస్ట్రేషన్ నంబర్ లేకపోవడంతో బైక్‌లో వచ్చిన వారిని నిలిపి విచారించిన సమయంలో మహిళ ఎస్‌ఐను ఇద్దరు వ్యక్తులు బెదిరించారు. తిరుపత్తూర్ టౌన్ ఎస్‌ఐ వెన్నెల, పోలీసులు మంగళవారం రాత్రి బస్‌స్టేషన్ సమీపంలో వాహన తనిఖీలు చేస్తున్నారు. ఆ సమయంలో ఏరికోడి వెళ్లే మార్గంలో రిజిస్ట్రేషన్ లేని ఒక బైక్‌లో ఇద్దరు వచ్చారు. అనుమానంతో పోలీసులు ఇద్దరని నిలిపి విచారించారు. విచారణలో వారు కోట్టై వీధికి చెందిన ఖలీబుల్లా (35), ధోని అబుబక్కర్ (27) అని తెలిసింది. బైక్ పత్రాలు చూపించాలని ఎస్‌ఐ కోరగా ఆమెను బెదిరించి పరారయ్యారు. దీనిపై ఇన్‌స్పెక్టర్ వెన్నెల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు.

ఆవిన్ పాలు నేలపాలు

తిరువొత్తియూరు: ఆవడి సమీపంలో లారీ అదుపుతప్పి బోల్తా పడి ఆవిన్ పాలు నేలపాలయ్యాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ అదృష్టవశాత్తు తప్పించుకున్నారు. కొరటూరు పాల్ డిపో నుంచి ఆవడి వెల్లానూర్ ప్రైవేట్ కళాశాలకు ఆవిన్ పాల ప్యాకెట్ల లోడుతో లారీ ఒకటి బుధవారం బయలుదేరింది. తిరుముల్లవాయల్ ఎస్.ఎం.నగర్ పోలీస్‌స్టేషన్ క్వార్టర్స్ వద్ద అర్ధరాత్రి 2 గంటల సమయంలో వెళుతోంది. రోడ్డుపై పశువులు పడుకుని ఉండడంతో వాటిని తప్పించేందుకు డ్రైవర్ లారీని పక్కకు తిప్పాడు. దీంతో లారీ అదుపుతప్పి రోడ్డుపై బోల్తా పడింది. డ్రైవర్, క్లీనర్ అదృష్టవశాత్తు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఈ ఘటనలో ఆవిన్ పాల ప్యాకెట్లు రోడ్డుపై పడి నేలపాలయ్యాయి. విషయం తెలిసి సంఘటన స్థలానికి వచ్చిన పోలీసులు లారీని పక్కకు తొలగించారు. ఆవడి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురాతన వినాయక విగ్రహం లభ్యం



లభ్యమైన విగ్రహం

అన్నానగర్: నరికుడి సమీపంలో గురువారం పురాతన గణేశుడి విగ్రహం లభ్యమైంది. విరుదునగర్ జిల్లా కారియాపట్టి, నరిక్కుడి సమీపంలోని ఎగవాని గ్రామంలో పురాతన గణేశ విగ్రహం ఉందన్న సమాచారంతో గురువారం పాండియనాడు కల్చరల్ సెంటర్ పురావస్తు శాస్త్రవేత్తలు చెల్లపాండియన్, తామరైకన్నన్, అరుప్పుకోట్టై శ్రీధర్ వెళ్లి పరిశీలించారు. ఈ వినాయకుడి విగ్రహం మూడున్నర అడుగుల పొడవు, 2 అడుగుల వెడల్పుతో ఉంది. శ్లోకం ఎడమవైపునకు వంగి కనిపిస్తుంది. మొత్తం 4 చేతులు ఉన్నట్లు గుర్తించారు. వీటిని పరిరక్షించడం, ఈ చరిత్రను మన భావితరాలకు అందించడం మన ప్రతి ఒక్కరి ప్రధాన కర్తవ్యం అని తెలిపారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

తిరువళ్లూరు: అతిగా మద్యం తాగి ఓ వృద్ధుడు గుమ్మిడిపూండి సమీపంలో మృతిచెందాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతి జిల్లా తడ, రామాపురం గ్రామానికి చెందిన బాలకృష్ణన్(72). ఇతను అతిగా మద్యం తాగి స్పృహ తప్పాడు. దీంతో బాలకృష్ణన్‌ను అతడి కుమారుడు మురుగన్ గుమ్మిడిపూండి సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మురుగన్ ఇచ్చిన పిర్యాదు మేరకు గుమ్మిడిపూండి పోలీసులు కేసు దర్యాప్తు జరిపారు.

యువకుడు ఆత్మహత్య

తిరువళ్లూరు: కుటుంబసమస్యలతో జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి అన్నవరం ప్రాంతానికి చెందిన ధాధ కమారుడు దక్షణమూర్తి(28). ఇతను వరి కోత మిషన్ డ్రైవర్‌గా ఊత్తుకోటలో పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో కుటుంబంలో తరచూ సమస్యలు రావడంతో మనస్తాపానికి గురై దక్షణామూర్తి పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఆలస్యంగా విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నై రాజీవ్‌గాంధీ వైద్యశాలకు తరలించారు. అక్కడ చిక్సిత పొందుతూ దక్షణమూర్తి మృతిచెందాడు. మృతుడి సోదరుడు చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఊత్తుకోట పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



వంతెనలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: రహదారుల శాఖ తరపున రూ. 434.65 కోట్లతో నిర్మించిన కొత్త వంతెనలు, రోడ్లను గురువారం సీఎం స్టాలిన్ ప్రారంభించారు. ఇందులో రహదారులు, చిన్న హార్బర్ల శాఖ నేతృత్వంలో నామక్కల్ జిల్లాలో రూ. 280 కోట్లతో మోహనూర్ – నామక్కల్ – సేంతమంగళం – రాశిపురం రోడ్డు, చెన్నై తిరువొత్తియూరు వద్ద బకింగ్ హామ్ కెనాల్‌పై రూ. 58. 64 కోట్లలో ఏర్పాటు చేసిన నాలుగు రోడ్ల మార్గంగా వంతెన ఉంది. అలాగే తిరుప్పూర్ జిల్లాలో నాలుగు లైన్లతో రూ.53. 40 కోట్లతో ఏర్పాటు చేసిన పల్లడం – తారాపురం రోడ్డు, కోయంబత్తూరు సిటీ, కోయంబత్తూర్–మెట్టుపాళయం రోడ్ – గణపతి మణియ కరంపాలెం రోడ్డు జంక్షన్‌లోని నాలుగు మార్గాలతో ఏర్పాటు చేసిన బ్రిడ్జి ఉన్నాయి. వీటిని సీఎం స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సచివాలయం నుంచి ప్రారంభించారు. అలాగే సాంఘిక సంక్షేమ శాఖ నేతృత్వంలో చెన్నై కామరాజర్ మార్గంలో రూ.9.82 కోట్లతో నిర్మించిన డైరెక్టర్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ ఆఫీస్ బిల్డింగ్‌ను సీఎం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి గీతా జీవన్, సీఎస్ శివదాస్ మీన తదితరులు పాల్గొన్నారు.

డెల్టాలో పంట నష్టంపై సమీక్ష

ఇదిలా ఉండగా డెల్టా జిల్లాల్లో కర్ణటక నుంచి కావేరి జలాల విడుదల కాక ఎండిపోతున్న కురువై పంటపై అధికారులు పరిశీలన జరిపి నివేదికలు సిద్ధం చేశారు. దీనిపై వ్యవసాయ మంత్రి తోపాటు సీనియర్‌మంత్రులు, అధికారులతో సీఎం స్టాలిన్ గురువారం సమీక్షించారు. కాగా నష్టపోయిన రైతులను ఆదుకునే విధంగా పరిహారం ప్రకటించే అవకాశం ఉందని భావిస్తున్నారు. అలాగే సీఎం స్టాలిన్ ఈనెల 9వ తేదీ ఢిల్లీ వెళ్లనున్నారు. జీ20 దేశాల మహానాడులో భాగంగా అన్ని దేశాల ప్రతినిధులు, రాష్ట్రాల ముఖ్యమంత్రులకు రాష్ట్రపతి విందు ఇవ్వనున్నారు. ఈ వేడుక నిమిత్తం స్టాలిన్‌కు ఆహ్వానం వచ్చింది. ఈ కార్యక్రమానికి హాజరై 10వ తేదీ చెన్నైకు సీఎం తిరుగు ప్రయాణం కానున్నారు. ఇదిలా ఉండగా, సనాతన ధర్మం వివాదం ప్రస్తుతం జరుగుతున్న నేపథ్యంలో సీఎం స్టాలిన్ ఢిల్లీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ విందుకు హాజరయ్యే ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులను సీఎం స్టాలిన్ కలుస్తారా? లేదా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

కువైట్ నుంచి చెన్నైకి తమిళనాడు యువకులు

కొరుక్కుపేట: కువైట్‌లో పనికి వెళ్లి తిండి, వసతి, జీతం లేక ఇబ్బంది పడుతున్న రాష్ట్రానికి చెందిన 19 మంది యువకులను రక్షించి గురువారం ఉదయం విమానంలో చెన్నైకి తీసుకొచ్చారు. చెన్నై విమానాశ్రయంలో వారికి మంత్రి సెంజీ మస్తాన్ పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. ఆ యువకులకు మంత్రి మస్తాన్ కలిసి ధైర్యం చెప్పారు. మంత్రి మాట్లాడుతూ తమిళనాడులోని వివిధ జిల్లాల్లో నకిలీ ఏజెంట్ల చేతిలో మోసపోయి తగిన జీతం, పని, ఆహారం, వసతి లేకుండా కువైట్‌లో వెళ్లిపోయిన 19 మంది తమిళనాడు యువకులపై కేంద్ర విదేశాంగశాఖ ద్వారా తమిళనాడు విదేశీ సంక్షేమ శాఖ తగిన చర్యలు తీసుకుని వెనక్కి తీసుకొచ్చిందన్నారు.

హత్య కేసులో నలుగురు లొంగుబాటు

కొరుక్కుపేట: చెన్నై మొగుప్పేర్ రెడ్డి పాలయంలో గతనెల 5వ తేదీన అమాముక నేతను ఒక ముఠా నడిరోడ్డుపై హత్య చేసింది. ఈ హత్యకు సంబంధించి నిందితులను పట్టుకునేందుకు తిరుమంగళం అసిస్టెంట్ కమిషనర్ వరదరాజన్ నేతృత్వంలో ఆరు ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో నిందుతులు నలుగురు బుధవారం అర్ధరాత్రి ఎగ్మూర్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయారు. తిరువారూర్ జిల్లా ముత్తుపేట్టై కోవిలూరు గ్రామానికి చెందిన రమేష్ (38), ఈదు వీరజగన్ (30), శివసుబ్రమణియన్ (28) సుధాకర్ లొంగిపోయారు.

ప్రతిభ చాటుకున్న విద్యార్థినులు



రంగోళి పోటీల్లో విద్యార్థినులు

కొరుక్కుపేట: విద్యార్థినుల్లో ప్రతిభాపాటవాలను వెలికితీసే ఉద్దేశంతో ఏర్పఏర్పాటు చేసిన రెండు రోజుల ఈషా –2023 కల్చరల్ ఫెస్ట్ గురువారం ప్రారంభమైంది. తొలిరోజు గురువారం ఆఫ్ స్టేజ్ ఈవెంట్లుగా కుక్ విత్ కోమలి, ఫ్లవర్ ఆర్నమెంటేషన్, పుల్లా డిజైన్ రంగోళితో పాటు కృష్ణ జయంతి డెకరేషన్, వినాయక చవితి డెకరేషన్ పోటీల్లో విద్యార్థినులు ఎంతో ఉత్సాహంగా పోటీపడుతూ తమదైన ప్రతిభ ను చాటుకున్నారు. పలువురు న్యాయ నిర్ణేతలు పాల్గొని విజేతలను ఎంపిక చేసి బహుమతులను ప్రదానం చేశారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



నాగుల గోపాలయ్యను సత్కరిస్తున్న నరసారెడ్డి, కృష్ణ

కొరుక్కుపేట: చెన్నై టి.నగర్‌లోని కేసరి మహోన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు నాగుల గోపాలయ్యగారు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా కెన్సస్ గ్రూప్ అధినేత, సంఘ సేవకులు కె. నరసారెడ్డి, విశిష్ట అతిథి కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాలలతో సత్కరించారు. ఉపాధ్యాయులకు నరసారెడ్డి విలువైన బహుమతులు అందజేశారు. గురువు అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానం అనే వెలుగును నింపేవారని గురువుల సేవలను కొనియాడారు.

కాలువలో పడి వృద్ధుడి దుర్మరణం

తిరువొత్తియూరు: చెన్నై నంగనల్లూరులో వర్షపు కాలువ నీటిలో బైకుతో సహా పడిన వృద్ధుడు మృతి చెందారు. వివరాలు.. నంగనల్లూరు 18వ వీధిలో వర్షపు నీరు వెళ్లేందుకు కాలువ తవ్వే పనులు కొన్ని నెలలుగా చేపడుతున్నారు. ఇక్కడ తవ్విన గుంతల్లో వుల్లగరం ప్రాంతానికి చెందిన జయరాజు (84) బుధవారం ద్విచక్రవాహనంపై వెళ్తూ ప్రమాదవశాత్తూ పడిపోయాడు. స్థానికులు ఆయన్ని సమీపంలో ఉన్న ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ పరిశీలించిన డాక్టర్లు మృతిచెందినట్లు తెలిపారు.

చర్చిలో రూ.58 లక్షల మోసం

– మహిళా ఉద్యోగినిపై కేసు నమోదు

తిరువొత్తియూరు: కోవై సమీపంలోని ఓ చర్చిలో రూ.58 లక్షలు మోసానికి పాల్పడిన మహిళా ఉద్యోగిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కోవై గౌండం పాలయం డీపీఎస్ నగర్‌లో చర్చి వుంది. ఇక్కడ ప్రిన్స్‌బోస్ (47) అనే అతను కోశాధికారి. చర్చిలో బన్నీ మద్దైకి చెందిన శైలజ 11 సంవత్సరాలుగా అకౌంటెంట్‌గా ఉంది. చర్చికి వచ్చే వారు కానుకలు చెల్లిస్తుంటారు. ఈ నగదును దేవాలయ బ్యాంకు ఖాతాలో శైలజ జమ చేస్తూవచ్చారు. ఈ క్రమంలో కోశాధికారి ప్రిన్స్‌బోస్, అకౌంటెంట్ శైలజ రాసిన ఆదాయం, ఖర్చులు లెక్కలు చూడగా ఆ సమయంలో 2012వ సంవత్సరం మొదలుకు ఇప్పటి వరకు అకౌంట్ ఖాతాలో రాయకుండా రూ.58 లక్షలు చేతివాటం ప్రదర్శించినట్లు తెలిసింది. పోలీసులు అకౌంటెంట్ శైలజపై కేసు నమోదు చేశారు.

కనులపండువగా గోకులాష్టమి వేడుకలు



సప్తగోకులంలో పూజలు చేస్తున్న పాలకమండలి చైర్మన్ అంజూరు తారకశ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో గురువారం గోకులాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని బిక్షాల గాలిగోపురం వద్ద ఉన్న సప్తగోకులం, దక్షిణ గాలిగోపురం వద్ద ఉన్న సప్తగోకులం, భరద్వాజతీర్థంలో ఉన్న గోశాలలో గోమాతలకు సంప్రదాయ పూజలు నిర్వహించారు. గోశాలలో ఉన్న గోవులకు విశేష అలంకారాలు చేసి పూజలు చేశారు. అనంతరం గోమాతలకు నైవేద్యం సమర్పించారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ గోమాతలను పూజిస్తే ముక్కోటి దేవతలను పూజించిన ఫలం దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు వెంకటసుబ్బయ్య, నూకరత్నం, కృష్ణారెడ్డి, సురేష్‌రెడ్డి, సుదర్శన్‌నాయుడు, ఆలయ వేదపండితులు, అర్చకులు తితరులు పాల్గొన్నారు.

తండ్రి మృతి..మనస్తాపంతో కొడుకూ..

అన్నానగర్: నాగర్‌కోయిల్‌లో బుధవారం తండ్రి మృతితో షాక్‌కు గురైన కుమారుడు మరణించాడు. కన్యాకుమారి జిల్లా నాగర్‌కోయిల్ ఈగ కాలనీ 4వ వీధికి చెందిన సుబ్రహ్మణ్య పిళ్లై (76). ఇతని భార్య సేదులక్ష్మి. వీరికి నాగమ్మాళ్ (52) అనే కుమార్తె, పరమశివన్ (48) అనే కుమారుడు ఉన్నారు. పరమశివన్ నాగర్‌కోయిల్‌లోని ఓ బట్టల దుకాణంలో పని చేసేవాడు. ఇతనికి కూర్తలవడివు అనే భార్య, సేదు లక్ష్మి (18), ఆదిశ (11) అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ స్థితిలో నెల రోజుల క్రితం సుబ్రమణ్య పిళ్లై హఠాత్తుగా అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ సుబ్రమణ్యం పిళ్లై మృతిచెందాడు. దీంతో పరమశివుడు తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. బుధవారం సాయంత్రం సుబ్రమణ్య పిళ్లై అంత్యక్రియల అనంతరం పరమశివన్ ఇంట్లో ఉండగా గుండెపోటుకు గురయ్యాడు. బంధువులు వెంటనే ఆచారిపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే పరమశివన్ మృతిచెందాడు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 75,804 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 32,198 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.39 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

త్రికోణమితిలో అద్భుత ప్రదర్శన

- 163 మంది విద్యార్థులకు ఘన సత్కారం



విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేస్తున్న పాన్‌రాజ్

పళ్లిపట్టు: త్రికోణమితిలో అద్భుత ప్రదర్శన కనబరిచిన 163 మంది విద్యార్థులను అబ్దుల్ కలాం సైన్స్ అడ్వైజర్ పాన్‌రాజ్ ఘనంగా సత్కరించారు. వివరాలు.. పళ్లిపట్టుకు చెందిన గణితం మాస్టర్ రాజేష్ బాబు విద్యార్థులను గణితంలో ప్రోత్సహించి ఉచితంగా ట్యూషన్ తరగతులు నిర్వహిస్తున్నారు. గణితంలో ప్రత్యేక ప్రతిభ కనబరిచే విధంగా త్రికోణమితిలో ఒక సెమ్‌కు 50 పద్ధతుల్లో సమాధానం కనిపెట్టే పద్ధతికి సంబంధించి ప్రభుత్వం, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 250 మందికి పది రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ఇందులో 163 మంది విద్యార్థులు త్రికోణమితి సెమ్‌కు 50 పద్ధతుల్లో సమాధానాలు కనుగొని ఆకట్టుకున్నారు. విద్యార్థుల గణిత మేధాశక్తిని గుర్తించి అబ్దుల్ కలాం బుక్ ఆఫ్ రికార్డ్, యూనివర్సల్ బుక్ ఆఫ్ రికార్డ్, లింకన్ బుక్ ఆఫ్ రికార్డుల సంస్థల ద్వారా అవార్డులకు ఎంపిక చేశాయి. పళ్లిపట్టు వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సైన్స్ అడ్వైజర్ డాక్టర్ పాన్‌రాజ్ చేతుల మీదుగా గణితం మాస్టర్ రాజేష్ బాబు, 163 మంది విద్యార్థులను ఘనంగా సత్కరించి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పాన్‌రాజ్ మాట్లాడుతూ.. పూర్వకాలంలో ఒక ప్రశ్నకు ఒక సమాధానం మాత్రం ఉండేదని అయితే, సాంకేతిక విప్లవంతో ఒక ప్రశ్నకు పలు సమాధానాలు వేర్వేరు పద్ధతుల్లో కనుగొంటున్నట్లు వెల్లడించారు. ఇది మానవ మేధాశక్తి పురోగతికి నిదర్శనమన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అన్నానగర్: నాగర్‌కోవిల్ సమీపంలో గురువారం వేకువజామున టెంపోలో కేరళకు అక్రమంగా తరలిస్తున్న నాలుగు టన్నుల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కన్యాకుమారి జిల్లా నాగర్‌కోయిల్, యాంటీ ఫుడ్ స్మగ్లింగ్ యూనిట్ సీఐ బేబీ ఇజాకి నేతృత్వంలో పోలీసులు గురువారం వేకువజామున కలియాల్ ఫారెస్ట్ ఇన్వెంటరీ కార్యాలయం ముందు వాహనాలను తనిఖీ చేశారు. తనిఖీల్లో టెంపోను చేయగా అందులో నాలుగు టన్నుల రేషన్ బియ్యం బస్తాలు ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు టెంపో సహా రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేరళకు అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించిన టెంపో డ్రైవర్ మహారాజన్ (29), క్లీనర్ వినోద్‌బాబు (27)ను పోలీసులు అరెస్టు చేశారు.

గుండెపోటుతో కండక్టర్ మృతి

అన్నానగర్: చెన్నై పళవంతాంగల్, ప్రాంతానికి చెందిన పొన్నుసామి మణికంఠరాజా (37) సిటీ బస్ కండక్టర్. త్వరలో ఇతను కొత్తగా కట్టుకున్న ఇంట్లో గృహ ప్రవేశం జరగనుంది. దీంతో మణికంఠరాజు తన బంధువులకు గృహ ప్రవేశ ఆహ్వాన పత్రిక ఇవ్వటానికి విక్రవాండికి వెళ్లాడు. బుధవారం రాత్రి ప్రభుత్వ బస్సులో చెన్నై తిరిగి బయలుదేరాడు. ఉదయం బస్సు కోయంబేడు బస్టాండ్‌కి వచ్చిన మణికంఠరాజా బస్ సీటులోంచి దిగలేదు. బస్సు డ్రైవర్‌కు అనుమానం వచ్చి దగ్గరకు వెళ్లి చూడగా మణికంఠరాజా మృతి చెంది ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్ విజయ భాస్కర్, పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి మణికంఠ రాజా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కీల్పాకంకి తరలించారు. ఈ ఘటన గురించి పోలిసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. గుండెపోటుతోనే అతడు మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు.

లారీ ఢీకొని ఇద్దరి మృతి

అన్నానగర్: బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటన ఊటీ–మెట్టుపాళయం రహదారిపై చోటుచేసుకుంది. కోయంబత్తూరు జిల్లా ఒండిపుదూర్ ప్రాంతానికి చెందిన సెల్వరాజ్. ఇతని భార్య సుగుణ(42). వీరికి శివశంకరి (15) అనే కుమార్తె, యువన్ శంకర్ (2) అనే కుమారుడు ఉన్నారు. మనస్పర్థల కారణంగా కొంతకాలంగా దంపతులు విడివిడిగా ఉంటున్నారు. దీంతో సుగుణ ఒండిపూదూరులో ఒంటరిగా చిన్న హోటల్ నడుపుతోంది. దీంతో ఏడాది క్రితం చెన్నైకి చెందిన రాజా(45) సుగుణ నిర్వహిస్తున్న హోటల్‌లో పనిలో చేరాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ పరిస్థితిలో కృష్ణజయంతి రోజు ప్రభుత్వ సెలవు దినం కావడంతో సుగుణ పిల్లలతో కలిసి ఊటీకి వెళ్లాలని నిర్ణయించింది. దీని ప్రకారం సుగుణ, ఆమె ఇద్దరు పిల్లలు, రెస్టారెంట్ వర్కర్ రాజా బైక్‌లో ఊటీకి వెళుతున్నారు. గురువారం ఉదయం 5 గంటలకు బయలుదేరి 8.30 గంటలకు ఊటీ–కూనూర్ మధ్య మందాడ ప్రాంతం వద్ద వెళుతుండగా ఆ సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ అదుపుతప్పి రాజా నడుపుతున్న బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజా, బాలిక శివశంకరి అక్కడికక్కడే మృతిచెందారు. సుగుణ, అతని కుమారుడు యువన్ శంకర్ అదృష్టవశాత్తూ సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఊటీ ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతిపై సామూహిక లైంగికదాడి

కొరుక్కుపేట: తూత్తుకుడిలో ప్రియుడితో ఒంటరిగా ఉన్న యువతిని కిడ్నాప్ చేసి ఇద్దరు యువకులు సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. తూత్తుకుడి కేవీకే నగర్‌కు చెందిన 25 ఏళ్ల యువతి. నాలుగు నెలల కిందట తాళ్లముత్తునగర్‌కు చెందిన ఓ యువకుడితో ఇన్‌స్టాగామ్‌లో పరిచయం ఏర్పడింది. ఈక్రమంలో బుధవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో తూత్తుకుడి థర్మల్ నగర్ ప్రాంతంలో సీఐఎస్ఎఫ్ షెల్టర్ సమీపంలోని ఏకాంత ప్రదేశానికి వీరిద్దరూ వేర్వేరు బైక్‌లపై వచ్చి ఏకాంతంగా కలుసుకున్నారు. ఆ సమయంలో బైక్‌లో వచ్చిన ఇద్దరు వ్యక్తులు యువతి, ప్రియుడిపై దాడి చేసి యువకుడిని తరిమికొట్టారు. ఆ తర్వాత యువతిని బైక్‌పై తీసుకెళ్లారు. అనంతరం సౌత్ బీచ్‌రోడ్డులోని రైల్వే ట్రాక్ ప్రాంతానికి తీసుకెళ్లి. అక్కడ ఇద్దరూ లైంగికదాడికి పాల్పడి పరారయ్యారు. బాధిత యువతి తూత్తుకుడి మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు.

అత్తను హతమార్చిన కోడలు అరెస్ట్

అన్నానగర్: మగవాళ్లతో మాట్లాడొద్దు అన్నందుకు అత్తగారిని కడతేర్చిన కోడలిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఈ ఘటన విల్లుపురం జిల్లా సెంజీ సమీపంలో చోటుచేసుకుంది. కంబదూర్ మదురపాండ్యన్‌కులం గ్రామానికి చెందిన మునియన్. ఇతని భార్య చిన్నపాప (63). వీరికి ముగ్గురు కుమారులు. మునియన్ చనిపోవడంతో చిన్నపాప తన 3వ కుమారుడు భాస్కర్‌తో కలిసి ఉంటోంది. భాస్కర్‌కు భార్య సంగీత (30), ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. భాస్కర్‌కు నాలుగేళ్ల క్రితం ప్రమాదంలో ఎడమ కాలు తెగిపోయింది. దీంతో సంగీత కూలీ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించేది. ఈక్రమంలో సంగీత మగవాళ్లతో ఎక్కువగా మాట్లాడేది. ఇది చూసి చిన్నపాప పలుమార్లు సంగీతను మందలించింది. ఈ విషయమై బుధవారం వారి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఆగ్రహించిన సంగీత తన అత్త చిన్నపాపను దుడ్డు కర్రతో దాడి చేసింది. ఇందులో తీవ్రంగా గాయపడిన చిన్నపాప అక్కడికక్కడే మృతిచెందింది. సెంజీ సబ్ సూపరింటెండెంట్ కవిన్నా, సీఐ పార్థసారథి, ఎస్ఐ నవనీతకృష్ణన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చిన్నపాప మృతదేహాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ముండియంబాక్కం ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంగీతను అరెస్టు చేశారు.

రెండు ద్విచక్రవాహనాల ఢీ

– ఇద్దరు దుర్మరణం

అన్నానగర్: కుణ్ణం సమీపంలో బుధవారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందారు. అరియలూరు జిల్లా కొడుంగూరుకు చెందిన సెల్వం. ఇతని కుమారుడు శక్తివేల్ (23). ఆండిమడం పడమర వీధికి చెందిన ఇతని బంధువు మురుగన్ కుమారుడు దయానిధి(20). కళాశాల విద్యార్థులు. వీరిద్దరు ద్విచక్రవాహనంలో బుధవారం రాత్రి అరియలూరు నుంచి పెరంబలూరుకు వెళ్లారు. పెరంబలూరు – అరియలూరు రహదారిపై పెరాళీ టోల్ ప్లాజా సమీపంలో ముందు వెళ్తున్న లారీని శక్తివేల్ అధిగమించేందుకు ప్రయత్నించాడు. అదేసమయంలో అరియలూరు జిల్లా కడకూర్ గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు సంపత్ (65) వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో సంపత్, శక్తివేలు అక్కడికక్కడే మృతిచెందారు. ప్రమాదంలో గాయపడ్డ దయానిధిని పెరంబలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలిసి మరువత్తూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పెరంబలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

9 నుంచి జాతీయ సంగీత, సాహిత్య నృత్యోత్సవాలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: మహతి కళాక్షేత్రంలో ఈ నెల 9, 10, 11 తేదీల్లో శ్రీకృష్ణ దేవరాయ జాతీయ సంగీత, సాహిత్య, నృత్యోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు రంగస్థలి వ్యవస్థాపక అధ్యక్షుడు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి తెలిపారు. ఆయన గురువారం రంగస్థలి కార్యాలయంలో జాతీయ సంగీత, సాహిత్య, నృత్యోత్సవాల పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయ కళలను రక్షించుకోవడంతోపాటు కళాకారులను ప్రోత్సహించే దిశగా ప్రతి ఏటా రంగస్థలి జాతీయ స్థాయిలో సంగీత, సాహిత్య, నృత్యోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది నిర్వహించే ఉత్సవాల్లో రాష్ట్రం నుంచే కాక తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి వందలాది కళాకారుల బృందాలు పాల్గొననున్నట్టు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉత్సవాలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, కార్యదర్శి కేఎస్.రాజా, వెంకటేష్, సుబ్రమణ్యం రెడ్డి, కేశవులరెడ్డి, చంద్రబాబు పాల్గొన్నారు.

ఉదయనిధి స్టాలిన్‌ను బర్తరఫ్ చేయాలి



మాట్లాడుతున్న వీహెచ్‌పీ కేంద్రీయ ప్రధాన కార్యదర్శి మిలింద్ పరాండే

తిరుపతి సిటీ : తమిళనాడు క్రీడాశాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్‌ను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని వీహెచ్‌పీ కేంద్రీయ ప్రధాన కార్యదర్శి మిలింద్ పరాండే డిమాండ్ చేశారు. ఆయన గురువారం జాతీయ సంస్కృత వర్సిటీలో మీడియాతో మాట్లాడారు. దేశంలో మెజారిటీ హిందూ ప్రజలు పాటిస్తున్న సనాతన ధర్మంపై ఉదయనిధి స్టాలిన్ విచక్షణారహితంగా మాట్లాడడం దారుణమన్నారు. ఆయనపై సుమోటుగా కేసు నమోదు చేయాలని సుప్రీం కోర్టుకు విన్నవించారు. ఈ నెల 30 నుంచి అక్టోబర్ 14 వరకు దేశవ్యాప్తంగా శౌర్య జాగరణ యాత్ర నిర్వహించి యువకులను దేశ రక్షణ, దేశభక్తి పట్ల చైతన్యవంతులను చేస్తామని తెలిపారు.

క్లుప్తంగా...

11న విశాఖలో జైళ్ల శాఖ జాతీయ సదస్సు

సాక్షి, విశాఖపట్నం: మరో జాతీయ స్థాయి సదస్సుకు విశాఖ ఆతిథ్యమిస్తోంది. జైళ్ల శాఖ ఉన్నతాధికారుల 8వ జాతీయ సదస్సు ఈ నెల 11న జరగనుంది. దీనికి ముఖ్యఅతిథిగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్‌కుమార్ మిశ్రా హాజరుకానున్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఉన్న జైళ్ల శాఖ ఉన్నతాధికారులు ఈ సదస్సులో పాల్గొననున్నారు. జైళ్లలో తీసుకురానున్న సంస్కరణలు, ఖైదీల్లో పరివర్తనను తీసుకువచ్చేందుకు అమలు చేస్తోన్న కార్యక్రమాలపై ఈ సదస్సులో చర్చిస్తారు. ఆయా జైళ్లలో ప్రస్తుతం అమలవుతోన్న కార్యక్రమాలపై ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్స్ ఇవ్వనున్నారు.

రాజమహేంద్రవరం జైలుకు టీడీపీ రౌడీమూకలు

- భీమవరంలో అరాచకం సృష్టించిన 39 మందికి రిమాండ్
- అందరూ ఇతర జిల్లాలవారే...

సాక్షి, భీమవరం: పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పట్టణంలో మంగళవారం నారా లోకేశ్ నిర్వహించిన యువగళం పాదయాత్ర సందర్భంగా అరాచకం సృష్టించిన టీడీపీ రౌడీమూకల్లో 39 మందిని అరెస్టు చేయగా, వారిని రిమాండ్ నిమిత్తం గురువారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సెంట్రల్ జైలుకు తరలించారు. భీమవరం పట్టణ శివారు ఇందిరమ్మ కాలనీ వద్ద యువగళం వాలంటీర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం స్థానికులపై విచక్షణారహితంగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన విషయం తెలిసిందే. యువగళం సభ్యులు తమ వెంట తెచ్చుకున్న కర్రలు, రాళ్లతో లోకేశ్‌ను చూడడానికి వచ్చిన ప్రజలను సైతం వెంటాడి చితకబాదారు. పట్టణ పోలీసులు కేసు నమోదుచేసి 39 మందిని అరెస్టు చేసి గురువారం తెల్లవారుజామున భీమవరం సెకండ్ ఏజేఎఫ్‌జీఎం కోర్టులో హాజరుపరిచారు. నిందితులకు న్యాయమూర్తి 15రోజులు రిమాండ్ విధించారు. దీంతో వారిని రాజమహేంద్రవరం జైలుకు తరలించినట్లు భీమవరం టూటౌన్ సీఐ అడబాల శ్రీను చెప్పారు. అరెస్టు అయిన వారంతా అన్నమయ్య, అనంతపురం, కర్నూలు, పల్నాడు, చిత్తూరు, ఎన్టీఆర్, గుంటూరు, ప్రకాశం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్, శ్రీకాకుళం, కృష్ణా జిల్లాలకు చెందినవారు కావడం గమనార్హం.

ప్రకృతి వ్యవసాయానికి అంతర్జాతీయ గుర్తింపు

జైవిక్ అవార్డు అందుకున్న మంత్రి కాకాణి



అవార్డు అందుకుంటున్న మంత్రి కాకాణి

సాక్షి, అమరావతి: ఇంటర్నేషనల్ క్యాపిటెన్స్ సెంటర్ ఫర్ ఆర్గానిక్ అగ్రికల్చర్ 2023 సంవత్సరానికి దేశవ్యాప్తంగా నిర్వహించిన జాతీయ 'జైవిక్ ఇండియా' పోటీల్లో ప్రథమ స్థానం పొందిన ఆంధ్రప్రదేశ్‌కు అవార్డును ప్రదానం చేశారు. గురువారం రాత్రి నోయిడాలో బయోఫాక్ ఇండియా నేచురల్స్ ఎక్స్‌పోలో జరిగిన వేడుకలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అవార్డును అందుకున్నారు. ఉత్తమ ప్రకృతి వ్యవసాయ మహిళా రైతు కేటగిరీలో బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం చిమటావారి పాలేనికి గన్నమశెట్టి పద్మజ, ఉత్తమ ఎఫ్‌పీఓ కేటగిరీలో పల్నాడు జిల్లా అత్తలూరు గ్రామానికి చెందిన అత్తలూరుపాలెం ఆర్గానిక్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ తరఫున పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎఫ్‌పీఓ ఎండీ సురేంద్రబాబు అవార్డులను అందుకున్నారు. మంత్రి కాకాణి మాట్లాడుతూ వరుసగా రెండేళ్లు రాష్ట్రానికి జైవిక్ అవార్డులు రావడం ఆనందంగా ఉందన్నారు. రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ పి.విజయ్‌కుమార్, టీమ్ హెడ్ ప్రభాకర్ పాల్గొన్నారు.

పీసీబీ సీఈఈగా భాస్కరరావు

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ (సీఈఈ)గా ఎన్‌వీ భాస్కరరావును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకూ ఈ బాధ్యతలు నిర్వర్తించిన కె.వెంకటేశ్వరరావు పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్‌గా ఉన్న భాస్కరరావుకు పదోన్నతి కల్పించి ఆ బాధ్యతలు అప్పగించారు.

మహిళలకు విజన్ ఎక్కువ.. అందుకే బాబును ఓడించారు..

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

చిత్తూరు కార్పొరేషన్: మహిళలకు విజన్ ఎక్కువని, అందువల్లే గత సార్వత్రిక ఎన్నికల సమయంలో టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన పసుపు-కుంకుమ సొమ్ములు తీసుకుని వారు చంద్రబాబును ఓడించారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. గురువారం సీపీఐ బస్సు యాత్ర చిత్తూరుకు చేరుకుంది. మహిళలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పురుషుల కంటే మహిళలకు విజన్ ఎక్కువన్నారు. అక్కినేని వనజ పాల్గొన్నారు.

- గ్రేటర్ విశాఖలోని మాధవధార ప్రాంతంలో గతేడాది ఓ బిల్డర్ నాలుగు అంతస్తుల అపార్ట్‌మెంట్ నిర్మించారు. విశాలమైన రోడ్లు, తాగునీటి సదుపాయం, ఎస్టీపీలు, లిఫ్ట్, పార్కు లాంటి సదుపాయాలు కల్పించారు. సమీపంలోనే పెద్ద షాపింగ్ కాంప్లెక్స్, మార్కెట్, రవాణా సదుపాయాలున్నాయి. భూమి ధర, బిల్డర్ మార్జిన్ కూడా కలిపి ఒక్కో ఫ్లాట్‌ను చ.అడుగు రూ.2 వేల చొప్పున విక్రయించారు.
- 2016-17లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పట్టణ పేదల కోసం నిర్మించే టిడ్కో ఇళ్లకు 300 చ.గ విస్తీర్ణంలో ఫ్లాట్‌కు రూ.2.60 లక్షల చొప్పున ధర నిర్ణయించారు. బ్యాంకు రుణం నెలకు రూ.3 వేల చొప్పున 20 ఏళ్లు చెల్లించాలని (దాదాపు రూ.7.20 లక్షలు) షరతు పెట్టారు. నిర్మాణానికి టెండర్లను పిలిచి సగటున చ.అడుగు రూ.2,203.45 చొప్పున అప్పగించారు. అదే ఏడాది మార్కెట్‌లో నిర్మాణ ధర చ.అడుగుకు రూ.1,000 మాత్రమే ఉండగా చంద్రబాబు మాత్రం సగటున అదనంగా రూ.1,203.45 చొప్పున వసూలు చేశారు. ప్రభుత్వం చేపట్టే నిర్మాణాలకు మార్కెట్ ధర కంటే తగ్గాల్సింది పోయి భారీగా పెంచేశారు. టీడీపీ ప్రభుత్వంలో 7,42,01,820 చ.అడుగుల విస్తీర్ణంలో చేపట్టిన టిడ్కో నిర్మాణాల్లో రూ.8,929.81 కోట్ల మేర అక్రమాలకు పాల్పడ్డారు.
- 2017లో కాకినాడలోని నాగమల్లితోట జంక్షన్‌లో ఓ వ్యక్తి తనకున్న 300 చ.గజాల స్థలాన్ని అపార్ట్‌మెంట్ నిర్మాణానికి ఇచ్చారు. ఐదు అంతస్తుల్లో (జీ+5) పది ఫ్లాట్లు కట్టారు. చెక్క పని, ఇంటీరియర్ వర్క్ లాంటి అన్ని సదుపాయాలతో చ.అడుగుకు రూ.1,000 లోపే ఖర్చయ్యింది.

టిడ్కోలో 'డబుల్' దోపిడీ!

పేదల ఇళ్లలోనూ పేలాలు ఏరుకున్న చంద్రబాబు

- చ.అ. ఖర్చు రూ.1,000 దాటని ఇళ్లకు సగటున రూ.2,203గా నిర్ణయం
- 2017లో రెండింతలు ధర పెంచి కాంట్రాక్టులు కట్టబెట్టిన వైనం
- ఉచితంగానే ఇసుక.. తక్కువ ధరలో సామగ్రి ఇచ్చినా సరే..
- 2,08,160 ఇళ్ల కాంట్రాక్టుల్లో రూ.8,929.81 కోట్ల మేర అక్రమాలు
- రివర్స్ టెండర్లతో చ.అ. రూ.1,655కే ముందుకొచ్చిన నిర్మాణ కంపెనీలు



సాక్షి, అమరావతి: మాజీ సీఎం చంద్రబాబు హయాంలో విచ్చలవిడిగా సాగిన దోపిడీ, ప్రజాధనం లూటీకి టిడ్కో ఇళ్లే నిలువెత్తు సాక్ష్యం. ఈ నిర్మాణాలకు కేటాయించిన స్థలం ప్రభుత్వానిది.. ఇసుక ఉచితం.. నిర్మాణ అనుమతులకు ఎలాంటి ఫీజులూ లేవు. వసతులు, సదుపాయాలు కల్పించాలన్న నిబంధన కూడా టెండర్లలో లేదు. అలాంటప్పుడు మార్కెట్ రేటు కంటే టిడ్కో ఇళ్ల నిర్మాణ ధర తగ్గాల్సింది పోయి రెట్టింపు కావడం అక్రమాలకు నిదర్శనంగా నిలుస్తోంది. నిరుపేదల కోసం చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లోనూ అవినీతికి పాల్పడటం విస్మయం కలిగిస్తోంది.

ఎనిమిది కంపెనీలకు కాంట్రాక్టు..

పట్టణాల్లో సొంత ఇల్లు లేని సుమారు 5 లక్షల మందికి జీ ప్లస్ 3 విధానంలో ఇళ్ల నిర్మాణానికి 2016లో టిడ్కో ప్రాజెక్టును ప్రారంభించారు. ప్రభుత్వ స్థలాల్లో 300, 365, 415 చ.అ. విస్తీర్ణంలో కట్టే టిడ్కో ఇళ్లకు నాటి మార్కెట్ ధర కంటే రెండింతలు పైగా నిర్మాణ వ్యయాన్ని పెంచేశారు. కంపెనీని బట్టి చ.అడుగుకు రూ.2,534.75 నుంచి రూ.2034.59 మధ్య నిర్మాణ వ్యయంగా నిర్ణయించారు. సగటున చ.అడుగు నిర్మాణ ధర రూ.2,203.45 చొప్పున టెండర్లు అప్పగించారు. అంటే బయట మార్కెట్ కంటే అదనంగా రూ.1203.45 పెంచారు. తొలి విడతలో 2,08,160 టిడ్కో యూనిట్లను 7,42,01,820 చ.అ. విస్తీర్ణంలో నిర్మించే కాంట్రాక్టును ఎనిమిది కంపెనీలకు కేటాయించారు. నిజానికి అప్పుడు పట్టణాల్లో ప్రైవేట్ అపార్ట్‌మెంట్లను చ.అడుగు రూ.1,000 లోపే నిర్మిస్తుండటం గమనార్హం. టిడ్కో ఇళ్లకు నాడు ఇసుక ఉచితం. సిమెంట్, స్టీల్, ఇతర నిర్మాణ సామగ్రి ధరలు కూడా తక్కువే కాబట్టి వ్యయం తగ్గాల్సింది పోయి రెట్టింపైంది. టిడ్కో ఇళ్లను షీర్ వాల్ టెక్నాలజీలో నిర్మిస్తున్నందున గరిష్ఠంగా చ.అడుగు నిర్మాణ వ్యయం రూ.1000కి మించదని ఈ విధానంలో ఎన్నో ఏళ్లుగా అపార్ట్‌మెంట్లు కడుతున్న కంపెనీల ప్రతినిధులు స్పష్టం చేస్తున్నారు.

రివర్స్ టెండర్లతో ఖజానాకు ఆదా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు రివర్స్ టెండరింగ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానంలో 2020 ఏప్రిల్‌లో 54,056 టిడ్కో యూనిట్లకు చ.అ. నిర్మాణానికి సగటున రూ.1,655.31 చొప్పున టెండర్లు ఖరారయ్యాయి. చంద్రబాబు సర్కారు నిర్ణయించిన దానికంటే చ.అడుగుకు రూ.548.14 తక్కువ ధరకు టెండర్లు చేయడంతో ఖజానాకు దాదాపు రూ.321 కోట్లు ఆదా అయ్యాయి. పైగా ఈ నిర్మాణాలకు ఇసుక ఉచితం కాదు. సిమెంటు, ఇనుము, ఇతర నిర్మాణ సామగ్రి, కూలీల రోజువారి వేతనాలు అన్నీ గత ప్రభుత్వ హయాం కంటే ఎక్కువే ఉన్నా ధర తగ్గించి పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకొచ్చారు. టిడ్కో ఇళ్ల నిర్మాణ ప్రాజెక్టును చంద్రబాబు బృందం తమ అవినీతికి ఆదాయ వనరుగా మార్చుకున్నదనేందుకు ఇది నిదర్శనం.

ఇంటికి రూ.2 వేలు.. ఫ్లాట్‌కి రూ.1,500



సాధారణంగా వ్యక్తిగత ఇల్లు, అపార్ట్‌మెంట్ నిర్మాణాల ధరల్లో వ్యత్యాసం ఉంటుంది. ఇంటికి అయిన ఖర్చులో అపార్ట్‌మెంట్‌కు సుమారు 25 నుంచి 30 శాతం ఖర్చు తగ్గుతుంది. ఇప్పుడు వ్యక్తిగత ఇల్లు నిర్మాణ ధర చ.అ రూ.2 వేలు ఉంటే అపార్ట్‌మెంట్‌లో చ.అ. రూ.1500 వరకు ఉంది. ఇవన్నీ ఎక్కువ మంది కోరుకునే ప్రాంతాల్లో చెబుతున్న సరాసరి ధరలు. అదే పట్టణాలకు దూరంగా నిర్మిస్తే గరిష్ఠంగా రూ.700 నుంచి రూ.900 మించదు.

– వీవీఎస్ యుగంధర్, భవన నిర్మాణ సంస్థ యజమాని, కాకినాడ

రూ.1,200 మించదు



కొన్నేళ్లుగా నిర్మాణ రంగంలో ఉన్నా. టిడ్కో ఇళ్లు ప్రారంభించినప్పుడు కాకినాడలో అపార్ట్‌మెంట్లు కట్టా. స్థలంతో కలిపి అన్ని సదుపాయాలతో అద్భుతంగా తీర్చిదిద్దిన ఫ్లాట్లను చ.అడుగు రూ.1,900 నుంచి రూ.2,000 మధ్యనే ఇచ్చాం. అలాంటిది ప్రభుత్వ స్థలంలో ఉచిత అనుమతులు, ఉచితంగా ఇసుక ఇస్తే చ.అడుగుకు గరిష్ఠంగా రూ.800 మాత్రమే అవుతుంది. టిడ్కో ఇళ్లకు అప్పుడు ఇన్ని వసతులు కూడా లేవు. అన్ని వసతులతో అద్భుతంగా కడితే చ.అ రూ.1,200కి మించే అవకాశం లేదు.

– బసవా ప్రసాద్, బిల్డర్(కాకినాడ)

అక్రమాలు జరిగినట్లే..



పట్టణంలో ఒక అపార్ట్‌మెంట్ కట్టాలంటే ఫీజుల రూపంలో చ.అడుగుకు రూ.270 వరకు చెల్లించాలి. ఫౌండేషన్, గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణానికి అధికంగా ఖర్చవుతుంది. స్థలంతో కలిపి 2016–17లో విశాఖలో మేం కట్టిన అపార్ట్‌మెంట్‌లో చ.అ. రూ.2వేల నుంచి రూ.2200కే ఇచ్చాం. అన్ని వసతులు కల్పించాం. పేరున్న కంపెనీల వస్తువులనే వాడాం. టిడ్కో ఇళ్ల నిర్మాణానికి అన్ని అనుమతులను ప్రభుత్వం ఉచితంగానే ఇస్తుంది. నాడు ఇసుక కూడా ఉచితం. ఇంటీరియర్ సొబగులు లేవు. మౌలిక సదుపాయాలు లేవు. ఇలాంటి నిర్మాణాల్లో చ.అ రూ.700కి మించి ఖర్చుకాదు. ఆ ధర దాటిందంటే అక్రమాలు జరిగినట్టే.

– బర్కత్ అలీ, బిల్డర్ (విశాఖపట్నం)

ఇప్పుడూ అంత ధర లేదు



ఎన్నో ఏళ్లుగా కాకినాడలో నిర్మాణాలు చేస్తున్నాం. అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ల ధర అన్ని సదుపాయాలు, స్థలంతో కలిపి ఇప్పుడైతే చ.అ. రూ.1500 నుంచి రూ.2 వేల వరకు ఉంది. విశాఖలో మరో రూ.2 వందలు ఎక్కువ ఉంది. నాలుగైదేళ్ల క్రితం అయితే ఇందులో సగం కూడా లేదు. ప్రభుత్వ ప్రాజెక్టులైతే ఫీజులు ఉండవు కాబట్టి రూ.వందల్లోనే ఉండాలి.

– ఎం.గంగబాబు, బిల్డర్ (కాకినాడ)

టీడీపీ అధికారంలో ఉండి ఉంటే.. అమరావతి పక్కన బ్యారేజీ కట్టేవాడిని

- ఐదారు నెలల్లో జమిలి ఎన్నికలు
- టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు



కళ్యాణదుర్గం/గుత్తి : ఐదారు నెలల్లో జమిలి ఎన్నికలు రానున్నాయని, అధికారంలోకొచ్చేది టీడీపీయేనని ఆ పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు చెప్పారు. ఆయన గురువారం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో వ్యవసాయ సంక్షోభంపై స్థానిక రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో వేరుశనగ రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి ఆదుకున్నట్టు చెప్పారు. తర్వాత ఇన్సూరెన్స్ తీసుకొచ్చామన్నారు. హంద్రీనీవా నుంచి బీటీపీ కళ్యాణదుర్గంలోని 114 చెరువులకు నీరివ్వడానికి కుందుర్పి లిఫ్ట్ ఇరిగేషన్ చానల్ ద్వారా 2,223 పంపులు, 11 లిఫ్ట్ ఇరిగేషన్‌లు పెట్టి నీరివ్వడానికి ప్రణాళిక రచించామని, 26 శాతం పనులు పూర్తిచేసినట్టు చెప్పారు. అయితే గత నాలుగున్నరేళ్లుగా పరికరాలను గాలికొదిలేశారని ఆరోపించారు. టీడీపీ అధికారంలో ఉండి ఉంటే గోదావరి నీళ్లను వైకుంఠపురం వరకు తెచ్చి అమరావతి పక్కన బ్యారేజీ కట్టి, అక్కడి నుంచి లిఫ్ట్ చేసి ఆ నీళ్లు నేరుగా నాగార్జున సాగర్ రైట్ మెయిన్ కెనాల్‌కు ఇచ్చి, సాగర్ కింద 160 టీఎంసీలు పొదుపు చేసేవారమని, ఆ నీటిని కూడా రాయలసీమకు ఇచ్చే వాళ్లమన్నారు. అంగళ్లు, పుంగనూరు సాగునీటి ప్రాజెక్టులపైన యుద్ధభేరి మోగించి ప్రజా చైతన్యం కోసం ముందుకెళ్లి అవినీతి, అశ్రద్ధను బయటపెడితే.. తనపైనే దాడి చేసి, హత్యాయత్నం కేసు పెట్టినట్టు చెప్పారు. అనంతపురం జిల్లాలో 80 శాతం తక్కువ వర్షపాతం ఉందని, 5.77 లక్షల ఎకరాలు సాగు చేయాల్సి ఉండగా.. 3 లక్షల ఎకరాల్లో కూడా పంట సాగు జరగలేదన్నారు. వేసిన పంట కూడా ఎండిపోయిందని, రాష్ట్రంలో 34 లక్షల ఎకరాల్లో పంట వేయలేదని.. అయినా సీఎం ఇప్పటివరకు సమీక్ష చేయలేదని చెప్పారు. టీడీపీ అధికారంలో ఉండి ఉంటే జూన్ 2000 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేవాళ్లమన్నారు. ఇదిలా ఉండగా, చంద్రబాబుతో జరిగిన ముఖాముఖిలో మాట్లాడేందుకు రైతులకే అవకాశం ఇవ్వకపోతే ఎలా? అంటూ పలువురు రైతులు టీడీపీ నేతలను నిలదీశారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధిస్తుందని, అప్పుడు అనంతపురాన్ని హార్టికల్చర్ హబ్ చేస్తానంటూ గుత్తిలో బాబు ష్యూరిటీ–భవిష్యత్ గ్యారెంటీ సభలో చంద్రబాబు చెప్పారు. కుమార్తెల మీద ప్రేమతో సీఎం జగన్ రూ. 40 కోట్లు ప్రజా ధనాన్ని వెచ్చించి లండన్‌కు వెళ్లారని ఆరోపించారు. పేదలపై ఈ డబ్బు ఖర్చు పెడితే వారి జీవితాలు మారుతాయని చెప్పారు.

బాబూ.. సీఎంపై తప్పుడు మాటలా!

- సీఎం పుట్టుకపై మాట్లాడిన తప్పుడు మాటలను వెనక్కు తీసుకోవాలి
- లేదంటే మీ సభను అడ్డుకుంటాం
- మీడియాతో ఎంపీ గోరంట్ల మాధవ్
- చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం
- అడ్డుకున్న పోలీసులు.. ఎంపీ హౌస్ అరెస్టు



అనంతపురం క్రైం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టుకే తప్పుడు పుట్టుక అని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను తక్షణం వెనక్కి తీసుకోవాలని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ డిమాండ్ చేశారు. తప్పు జరిగిందని చంద్రబాబు ముక్కును నేలకు రాసి గుంజీలు తీయాలని, లేకపోతే జిల్లాను దాటనివ్వబోమన్నారు. చంద్రబాబు చేపట్టబోయే కళ్యాణదుర్గం, గుత్తి సమావేశాన్ని, సభను అడ్డుకుంటామన్నారు. అనంతపురంలోని తన నివాసంలో గురువారం ఎంపీ మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు మాటలను చూస్తే ఆయన పూర్తిగా ఫ్రస్టేషన్‌లో ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు. చంద్రబాబు స్త్రీ జాతిని కించపరిచేలా మాట్లాడారన్నారు. దివంగత సీఎం వైఎస్సార్ సతీమణి వైఎస్ విజయమ్మను రాష్ట్ర ప్రజానీకం తల్లిగా, దేవతగా భావిస్తారని, ఆలాంటి ఆమెను కించపరిచేలా మాట్లాడడం చంద్రబాబు దిగజారుడు రాజకీయాలకు దర్పణమన్నారు. రాష్ట్రంలోని మహిళలందరూ చంద్రబాబును చెప్పుతో కొట్టినా తప్పులేదన్నారు. మహిళా లోకం బాబును క్షమించదని.. పార్టీలకతీతంగా మహిళలు ముసలి చంద్రబాబును తరిమికొట్టాలన్నారు.

దొంగ ఓట్ల గురించి మాట్లాడడం విడ్డూరం

దొంగ ఓట్ల సృష్టికర్త, ఓటుకు నోటు కేసులో తెలంగాణలో పట్టుబడి, తేలుకుట్టిన దొంగలా హైదరాబాద్‌ను వదిలేసిన చంద్రబాబు.. నేడు దొంగ ఓట్ల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎంపీ అన్నారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రం ప్రశాంతంగా ఉందని, ఈ తరుణంలో చంద్రబాబు శాంతిభద్రతలకు విఘాతం కల్గించేందుకు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. ఇక చంద్రబాబు తనను పోలీసులు అరెస్టు చేయవచ్చని చెప్పడాన్ని చూస్తే ఆయన నేరం చేసినట్లు నిర్ధారణకొచ్చినట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు.

ఎంపీని అడ్డుకున్న పోలీసులు

సీఎంపై చంద్రబాబు చేసిన వ్యాఖ్య లను నిరసిస్తూ పార్టీ శ్రేణులతో కలిసి ఎంపీ ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు చిత్రపటాన్ని దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం కళ్యాణదుర్గంలో చంద్రబాబు సభను అడ్డుకునేందుకు వెళ్తున్న ఆయన్ను సీఐ ప్రతాప్‌రెడ్డి తదితరులు అడ్డుకుని ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా భద్రతను ఏర్పాటుచేశారు.

అవినీతిపరులను అరెస్టు చేయకుండా ముద్దు పెట్టుకుంటారా?

చంద్రబాబుపై ఎమ్మెల్యే కొడాలి నాని ఫైర్



గుడివాడ రూరల్ : అవినీతి పనులు చేసే చంద్రబాబును అరెస్టుచేయకుండా ముద్దు పెట్టుకుంటారా అని మాజీమంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని మండిపడ్డారు. కృష్ణాజిల్లా గుడివాడలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఐటీ నోటీసులపై ఎందుకు చంద్రబాబు నోరు విప్పడంలేదని ప్రశ్నించారు. పాలు అమ్మితే రూ.పదివేల కోట్లు ఆదాయం ఎలా వచ్చిందని నిలదీశారు. పాలు, పిడకలు అమ్మి దేశంలో ఎవరూ ఇంత ఆదాయం సంపాదించలేదన్నారు. దోచుకున్న డబ్బును వైట్ చేసేందుకు చంద్రబాబు పాల వ్యాపారం మొదలు పెట్టి డ్రామాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అభివృద్ధి అంతా తానే చేశానని, ఏ ముఖ్యమంత్రి చేయలేదని ఎప్పుడూ గొప్పలు చెప్పుకోవడాన్ని చంద్రబాబు ఇకనైనా మానుకోవాలని కొడాలి నాని సూచించారు. హైదరాబాద్‌ను తాను కట్టానని చెప్పే చంద్రబాబుకు అక్కడ డిపాజిట్ కూడా వచ్చే పరిస్థితిలేదని, పిట్టలదొర లేని లోటును చంద్రబాబు భర్తీ చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా చంద్రబాబు పిచ్చి వాగుడు మానుకోవాలని నాని హితబోధ చేశారు.

బాబు అవినీతికి అడ్డాగా అమరావతి

కేవలం రూ.600 కోట్ల పనుల్లోనే రూ.118.98 కోట్ల ముడుపులు

- మొత్తం కాంట్రాక్టు పనులపై దర్యాప్తు చేస్తే వేల కోట్ల బాగోతం బయటపడటం ఖాయం
- రాష్ట్ర సంపదను దోచేసిన ఆయన్ను అరెస్టుచేసి, విచారించాలి
- ఎంపీ నందిగం సురేష్ డిమాండ్



సాక్షి, అమరావతి : అధికారం ఉన్నప్పుడు అమరావతి రాజధానిపై చంద్రబాబుకు ఎలాంటి ప్రేమలేదని.. దాన్ని అవినీతికి అడ్డాగా మార్చుకున్నాడని ఎంపీ నందిగం సురేష్ ఆరోపించారు. కేవలం రూ.600 కోట్ల పనుల్లోనే కాంట్రాక్టర్ల నుంచి రూ.118.98 కోట్లను ముడుపులుగా చంద్రబాబు దండుకున్నట్లు ఐటీ నోటీసులతో వెల్లడైందన్నారు. అదే ఐదేళ్లలో చేపట్టిన మొత్తం కాంట్రాక్టు పనులపై విచారిస్తే చంద్రబాబు వేలాది కోట్ల ముడుపులు బాగోతం బయటపడటం ఖాయమన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గజదొంగ చంద్రబాబుకు భవిష్యత్తు కళ్ల ముందు కన్పిస్తోందని.. తనను అరెస్టుచేయడం ఖాయ మన్నది ఆయనకే అర్థమవుతోందన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ క్యాపిటల్ అంటూ బాబు పదేపదే ఊదరగొడుతుండటాన్ని బట్టి చూస్తే.. అది చంద్రబాబు అక్రమార్జనకు అడ్డాగా మారిందన్నది ఐటీ నోటీసులతో నిరూపితమైందన్నారు. అమరావతిలో అసైన్డు భూములను చంద్రబాబు గ్యాంగ్ దోచేశారని ఎంపీ పునరుద్ఘాటించారు. ఒక్క కొడుకు ఉన్న చంద్రబాబు లక్షలాది కోట్ల రాష్ట్ర సంపదను దోచేస్తే.. ఐదు కోట్ల మంది రాష్ట్ర ప్రజల భవిష్యత్తు ఏం కావాలని నిలదీశారు.

వాళ్లెవరూ నోరు విప్పడంలేదు

ఇక రాష్ట్ర సంపదను దోచేసిన చంద్రబాబును తక్షణమే అరెస్టుచేసి, విచారించాలని నందిగం సురేష్ డిమాండ్ చేశారు. చంద్రబాబుకు ఐటీ నోటీసులను ఖండిస్తూగానీ స్వాగతిస్తూగానీ ఎల్లో మీడియా, పవన్‌కళ్యాణ్, సీపీఐ రామకృష్ణ, నారాయణలు నోరుమెదపడం లేదన్నారు. అలాగే, ఈ అంశాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి సాధారణ విషయంగా పరిగణిస్తుండటాన్ని చూస్తే.. ప్రజా ప్రయోజనాల కంటే తన మరిది ప్రయోజనాలే తనకు ప్రాధాన్యమని ఆమె చెప్పకనే చెప్పారంటూ ఎద్దేవా చేశారు. వీటి నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే యువగళం పాదయాత్రలో రౌడీలతో లోకేష్ అలజడులు సృష్టిస్తున్నారని ఎంపీ మండిపడ్డారు.

నోరు అదుపులో పెట్టుకో బాబూ..

- సీఎం జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదు
- యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్



అనంతపురం క్రైం : ''14 ఏళ్లు సీఎంగా పనిచేసిన నువ్వు ప్రజలకు చేసిందేమీ లేదు. అలవిగాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోనే వెబ్‌సైట్‌లో లేకుండా చేసిన చరిత్ర నీది. టీడీపీ పార్టీ పుట్టుకే తప్పుడు పుట్టుకేమో. నోరు అదుపులో పెట్టుకో చంద్రబాబు.. లేకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదు' అని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్ హెచ్చరించారు. అనంతపురం జిల్లా పర్యటనలో భాగంగా రాయదుర్గంలో చంద్రబాబు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను హరీష్‌యాదవ్ గురువారం మీడియా సమక్షంలో ఖండించారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే ఆదర్శవంతమైన పాలననందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నోరుపారేసుకోవడం బాబు నీచ రాజకీయాలకు నిదర్శనమన్నారు. సీఎం జగన్ పాలనపై ప్రజల్లో ప్రగాఢ విశ్వాసం నెలకొందని, దీన్ని జీర్ణించుకోలేని చంద్రబాబు ఎలాగైనా గద్దెనెక్కేందుకు కుట్రపూరితమైన వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో విధ్వంసకాండ సృష్టించేందుకు నీచ రాజకీయాలకు ఒడిగడుతున్నారని ఆయన చెప్పారు. తనను అరెస్టు చేస్తారంటూ ముందుగానే చెప్పుకుంటూ ప్రజల నుంచి సానుభూతి పొందాలని చూస్తున్నారని, చట్టం తన పని తను చేసుకుపోతుందన్నారు. రానున్న ఎన్నికల్లోనూ టీడీపీకి ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారన్నారు. సీఎంపై చేసిన వ్యాఖ్యలను చంద్రబాబు తక్షణం వెనక్కి తీసుకోవాలన్నారు.

బాబుది సానుభూతి నాటకం

- ప్రభుత్వాలకు, చట్టాలకు అలాంటి మొహమాటాలేవీ ఉండవు
- వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి రవిచంద్రారెడ్డి



సాక్షి, అమరావతి : ఐటీ శాఖ నోటీసుల వ్యవహారంలో జైలు కెళ్లడం ఖాయమని తెలిసే.. తనను రెండ్రోజుల్లో అరెస్టు చేస్తారంటూ సానుభూతి కోసం చంద్రబాబు నాటకమాడుతున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కనుమూరి రవిచంద్రారెడ్డి ఎద్దేవా చేశారు. తనను అరెస్టు చేస్తారని తానే చెబితే అప్పుడైనా వృద్ధుడినైన తనను అరెస్టు చేయరన్నది చంద్రబాబు ఆశ అని.. కానీ ప్రభుత్వాలకు, చట్టాలకు అలాంటి మొహమాటాలు ఏమీ ఉండవని స్పష్టంచేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ హరియాణ మాజీ సీఎం ఓంప్రకాష్ చౌతాలా అవినీతికి పాల్పడితే. 87ఏళ్ల వయస్సులో అరెస్టుచేసి జైలుకు పంపారని.. అదే రీతిలో ఆంధ్రా చౌతాలా చంద్రబాబుతోపాటు లోకేశ్ కూడా జైలుకెళ్లడం ఖాయమని తేల్చిచెప్పారు. ఐటీ నోటీసులు జారీచేయడంపై హిందూస్తాన్ టైమ్స్ కథనాన్ని ప్రచురించినప్పటి నుంచి చంద్రబాబు, లోకేశ్, ఎల్లో మీడియా తేలుకుట్టిన దొంగల్లా గిలగిలా కొట్టుకుంటున్నారన్నారు. దీనిపై రామోజీరావు, రాధాకృష్ణ, టీవీ5 నాయుడు, దత్తపుత్రుడు, పురంధేశ్వరి, కాంగ్రెస్, సీపీఐ నారాయణ, రామకృష్ణలు గాంధారుల్లా వ్యవహరిస్తు నోరుమెదపడం లేదన్నారు. వీటి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే లోకేశ్ యువగళం యాత్రలో శాంతిభద్రతల సమస్యలు సృష్టిస్తున్నారని రవిచంద్రారెడ్డి చెప్పారు.

తప్పు చేశారు కాబట్టే బాబుకు భయం

- చట్టం దృష్టిలో చంద్రబాబు అయినా మరో బాబు అయినా ఒక్కటే
- మంత్రి అంబటి రాంబాబు



సాక్షి ప్రతినిధి, గుంటూరు : చట్టం దృష్టిలో చంద్రబాబునాయుడు అయినా మరో బాబు అయినా ఒక్కటేనని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. గుంటూరు జిల్లా కలెక్టరేట్‌లో గురువారం నీటిపారుదల శాఖ సలహా మండలి, వ్యవసాయ శాఖ సలహా మండలి ఉమ్మడి సమావేశం జరిగింది. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబుకి ఐటీ శాఖ నోటీసులపై మీడియా అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిస్తూ.. చంద్రబాబు తప్పు చేశారు కాబట్టే ఆయనకు భయమేస్తోందన్నారు. చంద్రబాబును అరెస్టుచేస్తారని ఆయనకు కలవచ్చినట్లుంది అంటూ ఎద్దేవా చేశారు. చట్టానికి అడ్డం వస్తే ఆయన్ని అరెస్టు చేస్తారని.. లేకపోతే చేయరని అంబటి చెప్పారు. ప్రాథమిక ఆధారాలు లేనిదే ఎవరి మీద ఏ విధమైన కేసులు పెట్టరన్నారు. చంద్రబాబు తనను అరెస్టుచేస్తారని సానుభూతి పొందే మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోందని తెలుగుదేశం నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై మంత్రి స్పందిస్తూ.. అసలు రాష్ట్రంలో చంద్రబాబే పెద్ద రాక్షసుడని, లోకేశ్ పిల్ల రాక్షసుడని, మరో వ్యక్తి దత్త రాక్షసుడని ఎద్దేవా చేశారు. చంద్రబాబు దొంగైనా పవన్‌కళ్యాణ్ నోరు విప్పడని.. ఆయన హీరోనే అంటారని.. వాళ్లిద్దరికీ ఉన్న బంధం.. సంబంధం అలాంటిదన్నారు. చంద్రబాబు రూ.118 కోట్లు ముడుపులు తీసుకున్నట్లు ఆధారాలున్నా పవన్‌కళ్యాణ్ నోరు విప్పరని అంబటి రాంబాబు వ్యాఖ్యానించారు.

ఫ్యాషన్

హ్యాండ్స్ అప్...



పార్టీలో అందరినీ ఆకట్టుకోవాలంటే ఏదైనా ప్రత్యేకత చూపాల్సిందే అనుకుంటోంది నవతరం. ఇక వెస్టర్న్ స్టైల్ పార్టీలో అయితే ఆ హంగామా మామూలుగా ఉండదు. ప్లెయిన్ డ్రెస్సులకు స్పెషల్ అట్రాక్షన్‌గా యంగ్‌స్టర్స్‌ని అమితంగా ఆకట్టుకుంటున్నాయి డిటాచబుల్ హ్యాండ్ కఫ్స్. పార్టీలోనే కాదు క్యాజువల్ వేర్‌గానూ వీటిని ధరించవచ్చు. చూసినవారు థంబ్స్ అప్ ఇవ్వకుండా ఉండలేరు.





ఎంబ్రాయిడరీ కఫ్స్...
కాంబినేషన్ లేదా పూర్తి కాంట్రాస్ట్‌లో ఉండే డిటాచబుల్ ఎంబ్రాయిడరీ హ్యాండ్ కఫ్స్ ఏ ప్లెయిన్ డ్రెస్‌కైనా నప్పుతాయి. స్పెషల్ లుక్‌తో ఆకట్టుకుంటాయి. ట్రైబల్, మిషన్, మిర్రర్ ఎంబ్రాయిడరీ వీటిలో ప్రధానంగా కనిపిస్తుంటాయి. ఎంబ్రాయిడరీ డిజైన్‌ను బట్టి ధర ఉంటుంది.

జ్యువెలరీ కఫ్స్..
సంప్రదాయ వేడుకలు ముఖ్యంగా పెళ్లి వంటి వేడుకలలో ధరించడానికి అనువైన జ్యువెలరీ హ్యాండ్ కఫ్స్ కూడా మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఇమిటేషన్ జ్యువెలరీ నుంచి డైమండ్ హ్యాండ్ కఫ్స్ వరకు ఉన్నాయి.







ఫ్లోరల్ కఫ్స్
టీనేజర్స్, పిల్లలు ముచ్చట పడి ధరించేందుకు వీలుగా ఫ్లోర్ హ్యాండ్ కఫ్స్ అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు లేస్, క్రోచెట్ అల్లికల హ్యాండ్ కఫ్స్‌ను కూడా తమ ప్రాధాన్యతలను బట్టి ఎంచుకోవచ్చు.







ట్రావెల్ కఫ్స్
ప్రయాణాలలో ఫోన్‌తో పాటు కొంత డబ్బు కూడా అదీ ఎలాంటి బ్యాగ్ అవసరం లేకుండా వెంట తీసుకెళ్లాలంటే ఈ ట్రావెల్ హ్యాండ్ కఫ్స్ మంచి ఉపయుక్తంగా ఉంటాయి.







ఉత్సవ సమయం



● రేష్మ ఖాతు

ముంబైలో గణేశ్ నిమజ్జనం రోజున వేలాది విగ్రహాలు సముద్రం వైపు కదులుతాయి. వాటిలో భారీ విగ్రహాలు అందరినీ ఆకట్టుకుంటాయి. ఆ విగ్రహాల్లో దాదాపు సగం రేష్మ ఖాతు తయారు చేసినవే. తండ్రి మరణించాక గణేశుడి విగ్రహాల తయారీ పరంపరను భుజానికెత్తుకుంది రేష్మ. ఇవాళ ముంబైలో ఆమె నంబర్ 1 గణేశ శిల్పి.

ఆమె తీర్చిన గణేశులు



'మనల్లందరిని దేవుడు తయారు చేశాడు. కాని ఆ దేవుణ్ణి తయారు చేసే అవకాశం ఎంత మందికి వస్తుంది' అంటుంది రేష్మ ఖాతు.

నలభై ఏళ్ల రేష్మ ఖాతును ముంబైలో 'మూర్తికార్' అని పిలుస్తారు. అంటే దేవుని మూర్తుల రూప శిల్పి అని అర్థం. 'ఇవాళ మా నాన్న నన్ను చూస్తే చాలా ఆశ్చర్యపోయి ఉండేవాడు' అంటుందామె తండ్రి విజయ్ ఖాతును తలుచుకుని. ఎందుకంటే తండ్రి జీవించి ఉండగా ఆమె ఎప్పుడూ ఆయన వర్క్‌షాప్‌లోకి పెద్దగా అడుగు పెట్టేది కాదు. ఇవాళ ఆ వర్క్‌షాప్‌కు ఆమే సర్వస్వం. 'ముంబైలోనే కాదు దేశ విదేశాల్లోనే మా నాన్న విజయ్ ఖాతు చాలా ప్రఖ్యాతుడు. ఇవాళ మనం చూస్తున్న గణేశ్ విగ్రహాల భిన్న రూపాలకు అయనే ఆద్యుడు. గతంలో గణేశుడు విగ్రహం అంటే అందరూ కూర్చుని ఉన్న మూర్తే తయారు చేసేవారు. మా నాన్న గణేశుడి చేతులకు, కాళ్లకు కదలికలు తెచ్చాడు' అంటుంది రేష్మ. 2017లో విజయ్ ఖాతు మరణించాక ఆయన శిల్ప సామ్రాజ్యాన్ని రేష్మ సమర్థంగా నిర్వహిస్తోంది.

సినీ దర్శకురాలు అవుదామని

రేష్మ ఖాతు కుటుంబం తాతల కాలం నుంచి గణేశ్ విగ్రహాల తయారీలో ఉంది. ఆ శిల్పాల తయారీ రేష్మకు సర్వం తెలిసినా తాను మాత్రం సినీ దర్శకురాలు కావాలని ఆ కోర్సులు చేసింది. అయితే తండ్రి హఠాత్ మరణంతో మొత్తం కార్ఖానా స్తంభించింది. 'మా నాన్న చనిపోయాక ఆయన విలువ మరింత తెలిసింది. ఎందరో మండపాల నిర్వాహకులు నా దగ్గరకు వచ్చి ప్రతి ఏటా వినాయక చవితికి మీ దగ్గరే విగ్రహాలు తీసుకెళ్లేవాళ్లం... ఇక మీదట కూడా అలాగే చేస్తాం అని చెప్పేవారు. ముంబైలో ప్రఖ్యాతమైన లాల్‌బాగ్, ఖేత్‌వాడి, చందన్‌వాడి, తులసివాడి మంటపాల్లో ప్రతి ఏటా మేము తయారు చేసిన విగ్రహాలే పెడతారు. వీరందరినీ చిన్నబుచ్చడం నాకు నచ్చలేదు. మా మేనమామ నాతో– నువ్వు చేయగలవమ్మా అన్నాడు. ధైర్యంగా మా నాన్న సీట్‌లో కూచున్నాను' అంటుంది రేష్మ.

మగవాళ్లకు నచ్చలేదు

గత ఐదారేళ్లుగా రేష్మ విజయవంతంగా గణేశ్ విగ్రహాల తయారీని కొనసాగిస్తున్నా ఇంకా ఆ సంగతి మింగుడుపడని మగవారు ఉన్నారు. 'మా ఫ్యాక్టరీలో శిల్పులు, మౌల్డర్లు, మేనేజర్లు అందరూ నేను బాస్‌గా రావడం చూసి ఆశ్చర్యపోయారు. కొందరు చాలా ఏళ్లుగా మా నాన్న సీట్ మీద కన్నేసి ఉంచారు. వారంతా నేను రావడంతో సహాయ నిరాకరణ చేశారు. నేను శిల్పి కూతురిని. శిల్పం చేయడం నా జీన్స్‌లో ఉంది. నేనే రంగంలో దిగి కొత్త విగ్రహాలు ఎలా చేయాలో సూచనలు ఇస్తూ సరైన దారిలో కార్ఖానాను పెట్టేసరికి తల వొంచారు' అంటుంది రేష్మ.

పార్వతీదేవి చేతుల్లో గణేశుడు తయారైన చందాన ముంబైలో ఒక స్త్రీ చేతుల మీదుగా ప్రతి వినాయక చవితికి విగ్రహాలు తయారవుతాయి. పూజలు అందుకుంటాయి. గణేశుడి మూర్తుల తయారీలో ఒక స్త్రీ ఈ విధాన ముందుండటం తప్పక సంతోషపడాల్సిన విషయం.

ఈభాష్ రేష్మ

స్ఫూర్తి

జై కొట్టాల్సిందే!

అస్సాంకు చెందిన కనిక భర్త అనారోగ్యంతో చనిపోయాడు. కనికకు భవిష్యత్ చీకటిగా కనిపించింది. తాను ఎలా బతకాలి? అనే ఆందోళన మొదలైంది. ధైర్యం ఉంటే అదే దారి చూపిస్తుంది అంటారు. డీలా పడకుండా ధైర్యంగా ఉండడం నేర్చుకుంది. అయిదు వందల రూపాయల పెట్టుబడితో వర్మికంపోస్ట్ వ్యాపారానికి శ్రీకారం చుట్టిన కనిక ఇప్పుడు లక్షాధికారి అయింది...



● కనిక



● వర్మీ కంపోస్ట్ తయారీలో...

పెళ్లయిన మూడు సంవత్సరాలకు అస్సాంలోని బోర్జాహర్ గ్రామానికి చెందిన కనికా తలుక్దార్‌కు బిడ్డ పుట్టింది. బిడ్డ మూడు నెలల వయసులో ఉన్నప్పుడు భర్త అనారోగ్యంతో చనిపోవడం కనికను విషాదసాగరంలోకి నెట్టింది. కళ్ల ముందు పసిపాపే కనిపిస్తుంది. భవిష్యత్ మాత్రం మసకబారిపోయింది.

ఆ సమయంలో వర్మికంపోస్ట్ రూపంలో ఒక వెలుగు కిరణం కనిపించింది.

కొన్ని సంవత్సరాల క్రితం కృషి విజ్ఞాన కేంద్ర(కేవీకే) నిర్వహించిన ఒక వర్క్‌షాప్‌లో వర్మికంపోస్ట్, చేపల పెంపకం, కోళ్ల పెంపకం...మొదలైన వాటి గురించి తెలుసుకుంది కనిక. వర్క్‌షాప్ తాలూకు విషయాలు గుర్తు తెచ్చుకుంటున్నప్పుడు వర్మికంపోస్ట్ తయారీ సులభం అనిపించింది. ఎందుకంటే ఆవు పేడలాంటి ముడిసరుకులు సేకరించడానికి తాను పెద్దగా కష్టపడనక్కర్లేదు.

ఎక్కడికీ వెళ్లనవసరం లేకుండా తన చుట్టుపక్కల అందుబాటులో ఉన్న వనరులతోనే వర్మికంపోస్ట్ తయారు చేయవచ్చు.

2019లో నార్త్ ఈస్ట్ అగ్రికల్చర్ టెక్నాలజీ ఎంటర్‌ప్రెన్యూర్స్ హబ్ రెండు నెలల ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌లో పాల్గొనడం కనికకు ఎంతో ఉపకరించింది. శిక్షణలో భాగంగా వర్మివాష్‌ను తయారు చేయడం నేర్చుకుంది. ఇది వర్మికంపోస్ట్ నుంచి తయారుచేసే ద్రవసారం. సాధారణ వర్మికంపోస్ట్ కంటే ఎక్కువ నత్రజని, భాస్వరం..మొదలైనవి ఇందులో ఉంటాయి.

అయిదు వందల రూపాయల పెట్టుబడితో వ్యాపారంలోకి అడుగు పెట్టింది కనిక. కృషి విజ్ఞాన కేంద్ర ఉచితంగా వానపాములను అందించింది.

'జై వర్మికంపోస్ట్' బ్రాండ్‌తో వర్మికంపోస్ట్, వర్మివాష్ అమ్మకానికి రెడీ అయింది. తయారీ సంగతి సరే, మరి కొనేవారు ఎవరు? రసాయన ఎరువులకు అలవాటు పడిన రైతులకు వర్మికంపోస్ట్ నచ్చుతుందా?

అందుకే తన ఉత్పత్తికి తానే ప్రచారకర్తగా మారింది.

వర్మికంపోస్ట్ వాడకం వల్ల నేలకు జరిగే మేలు ఏమిటో ఊరూరా తిరుగుతూ ప్రచారం చేసింది. ఆమె శ్రమ వృథా పోలేదు. వ్యాపారం అడుగుల స్థాయి నుంచి పరుగుల స్థాయికి చేరుకుంది. పేడ కోసం మొదట రెండు ఆవులను కొన్న కనిక ఆ తరువాత నాలుగు ఆవులను ఒకేసారి కొనగలిగే స్థాయికి చేరింది.

ఒకప్పుడు 'జై' కంపెనీ ఒక సంవత్సరంలో 800 కిలోల వర్మికంపోస్ట్‌ను ఉత్పత్తి చేసేది. ప్రస్తుతం అది నెలకు 35 టన్నుల స్థాయికి చేరుకుంది. అస్సాం అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్‌తో పాటు మేఘాలయా, అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్‌లో ఎన్నో నర్సరీలు జై ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నాయి.

వ్యాపారంలో ఎలాంటి అనుభవం లేకపోయినా అద్భుత విజయం సాధించిన కనిక ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది. విద్యార్థుల కోసం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (అస్సాం) ప్రతి నెల కనికతో అవగాహన తరగతులు నిర్వహిస్తోంది.

'ఇది కలలో కూడా ఊహించని విజయం. ఎలా బతకాలో అని భయపడిన నేను ఎంతో మందికి ఉపాధి కల్పించగలుగుతున్నాను. ఎలా బతకాలో తెలియక ఒకప్పుడు ధైర్యం కోల్పోయిన నేను ఇప్పుడు ఎంతోమందికి ధైర్యం చెబుతున్నాను. ఈ విశాలమైన ప్రపంచంలో మన కోసం ఎన్నో అవకాశాలు ఉంటాయి. వాటిలో ఒకటి అందిపుచ్చుకున్నా మన జీవితమే మారిపోతుంది' అంటుంది నలభై అయిదు సంవత్సరాల కనికా తలుక్దార్.

వంటిల్లు

ఎగ్ స్పెషల్

ఎన్నో పోషకాలున్న కోడి గుడ్డుకు కూరగాయ ముక్కలు, కాసింత మసాలా జోడించారంటే రుచి అమోఘంగా ఉంటుంది. అందుకే ఘుమ ఘుమలాడే గుడ్డు రుచులతో వచ్చేసింది ఈ వారం వంటిల్లు...


చికెన్ ఖీమా బుర్జి



కావలసినవి: చికెన్ ఖీమా – పావుకేజీ; గుడ్లు – మూడు; ఉల్లిపాయ – ఒకటి; పచ్చిమిర్చి – రెండు; మిరియాల పొడి – టేబుల్ స్పూను; గరం మసాలా – టీస్పూను; పసుపు – అరటీస్పూను; జీలకర్ర పొడి – పావు టీస్పూను; ఆవాలు – టీస్పూను; మినప గుళ్లు – టీస్పూను; కరివేపాకు – రెండు రెమ్మలు; నూనె – మూడు టేబుల్ స్పూన్లు; ఉప్పు – రుచికి సరిపడా; కొత్తిమీర తరుగు – గార్నిష్‌కు సరిపడా.

తయారీ: ● చికెన్ ఖీమాను శుభ్రంగా కడిగి పక్కన పెట్టుకోవాలి ● బాణలిలో నూనె వేసి కాగనివ్వాలి. వేడెక్కిన నూనెలో ఆవాలు, మినపగుళ్లువేసి వేయించాలి ● ఇప్పుడు పచ్చిమిర్చి, ఉల్లిపాయను ముక్కలు తరగి వేయాలి ● ఉల్లిపాయ ముక్కలు వేగాక ఖీమా, కొద్దిగా ఉప్పువేసి మూత పెట్టి ఐదు నిమిషాలు మగ్గనివ్వాలి ● సగం ఉడికిన ఖీమాలో పసుపు, జీలకర్ర పొడి, గరం మసాలా, మిరియాల పొడి వేసి కలపాలి ● ఖీమా పూర్తిగా ఉడికేంత వరకు మూత పెట్టి మగ్గనివ్వాలి ● ఖీమా ఉడికిన తరువాత గుడ్లసొనను వేసి రెండు నిమిషాలు పెద్ద మంట మీద తిప్పుతూ వేయించాలి ● ఇప్పుడు రుచికి సరిపడా ఉప్పు, కరివేపాకు వేసి మూతపెట్టి మగ్గనివ్వాలి ● గుడ్ల సొన చక్కగా వేగి నూనె పైకి తేలుతున్నప్పుడు కొత్తిమీర చల్లుకుని దించేయాలి ● అన్నం, చపాతీ,రోటీలకు ఇది మంచి సైడ్ డిష్.

ఎగ్ పనియారం



కావలసినవి: గుడ్లు – నాలుగు; మిరియాలపొడి – అరటీస్పూను; ఉప్పు – రుచికి సరిపడా; ఉల్లిపాయ – ఒకటి; పచ్చిమిర్చి – ఒకటి; క్యాప్సికం – ఒకటి; క్యారట్ – ఒకటి; బంగాళ దుంప – ఒకటి; కారం – అరటీస్పూను; ధనియాల పొడి – అరటీస్పూను; పసుపు – చిటికెడు; గరంమసాలా – పావు టీస్పూను; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూను; నూనె – మూడు టేబుల్ స్పూన్లు.

తయారీ: ● క్యారట్, పచ్చిమిర్చి, క్యాప్సికం, ఉల్లిపాయ, బంగాళ దుంపలను సన్నని ముక్కలుగా తరిగి పక్కన పెట్టుకోవాలి ● బాణలిలో టేబుల్ స్పూను నూనె వేసి కాగనివ్వాలి. బాగా వేడెక్కిన నూనెలో ఉల్లి, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేయించాలి ● ఉల్లిపాయ వేగాక క్యారట్, బంగాళ దుంప ముక్కలు వేసి కలియబెట్టాలి. మూతపెట్టి ఐదు నిమిషాలు మగ్గాలి ● తరువాత క్యాప్సికం ముక్కలు వేసి 5 నిమిషాలు వేయించాలి ● ఇప్పుడు కారం, ధనియాలపొడి, పసుపు, గరంమసాలా, రుచికి సరిపడా ఉప్పు వేసి పచ్చివాసన పోయేంత వరకు వేయించాలి ● ముక్కలన్నీ చక్కగా మగ్గాక కొత్తిమీర తరుగు వేసి మరోసారి కలిపి దించేయాలి ● ఒకగిన్నెలో గుడ్లసొన, మిరియాల పొడి వేసి నురగ వచ్చేంతవరకు కలుపుకోవాలి ● ఇప్పుడు చల్లారిన ముక్కల మిశ్రమం గుడ్లసొనలో వేసి కలపాలి ● పనియారం ప్లేటులో నూనెవేసి వేడెక్కనివ్వాలి. బాగా కాగిన నూనెలో గుడ్ల మిశ్రమం వేసి మూతపెట్టాలి ● సన్నని మంటమీద మూడు నిమిషాలు కాల్చాలి. తరువాత రెండోవైపు తిప్పి నిమిషం పాటు కాల్చితే వేడివేడి ఎగ్ పనియారం రెడీ.

ఎగ్‌మటన్ నర్గీసి కోఫ్తా



కావలసినవి: ఉడికించిన గుడ్లు – ఆరు; మటన్ ఖీమా – అరకేజీ; కారం – టీస్పూను; పసుపు – పావు టీస్పూను; అల్లం వెల్లుల్లి పేస్టు – టీస్పూను; గరం మసాలా – టీస్పూను; మిరియాల పొడి – టీస్పూను; కొత్తిమీర తరుగు – మూడు టేబుల్ స్పూన్లు; పచ్చిమర్చి తరుగు – రెండు టేబుల్ స్పూన్లు; పుదీనా తరుగు – టేబుల్ స్పూను; బ్రెడ్ ముక్కల పొడి – రెండు టేబుల్ స్పూన్లు; ఉప్పు – రుచికి సరిపడా; నూనె –డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ● శుభ్రంగా కడిగిన మటన్ ఖీమాను మిక్సీజార్‌లో వేయాలి ● దీనిలో ఉప్పు, కారం, పసుపు, అల్లం వెల్లుల్లి పేస్టు, గరం మసాలా, మిరియాల పొడి, పుదీనా, కొత్తిమీర, పచ్చిమిర్చి, బ్రెడ్ ముక్కల పొడి, టేబుల్ స్పూను నూనె వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి ● గ్రైండ్ అయిన మిశ్రమాన్ని ఒక మాదిరి పరిమాణంలో ఉండలుగా చుట్టుకోవాలి ● ఇప్పుడు ఉడికించిన గుడ్ల పెంకు తీసేయాలి ● ఖీమా ఉండను తెరిచి గుడ్డును లోపలపెట్టి ఖీమా మిశ్రమంతో కోఫ్తాలా వత్తుకోవాలి ● ఇలా ఆరు గుడ్లను కోఫ్తాలా తయారు చేసుకున్నాక, సన్నని మంటమీద డీప్‌ఫ్రైచేయాలి ● కోఫ్తా బంగారు వర్ణంలోకి మారేంత వరకు వేయించితే ఎగ్‌మటన్ నర్గీసి కోఫ్తా రెడీ ● కోఫ్తాను మధ్యలో రెండు సగాలుగా కట్ చేసి నచ్చిన సాస్‌తో సర్వ్‌చేసుకోవాలి.

బ్రకోలి మఫిన్స్



కావలసినవి: బ్రకోలి తరుగు – కప్పు; ఎర్రక్యాప్సికం – ఒకటి; క్యారట్ – ఒకటి; ఉల్లిపాయ – ఒకటి; గుడ్లు – ఎనిమిది; ఛీజ్ – ముప్పావు కప్పు; ఉప్పు – టీస్పూను; మిరియాల పొడి – అరటీస్పూను;

తయారీ: ● క్యాప్సికం, ఉల్లిపాయ, క్యారట్‌ను సన్నగా తరగాలి ● పెద్ద గిన్నెలో బ్రకోలి తరుగు, క్యారట్, క్యాప్సికం, ఉల్లిపాయ ముక్కలను వేసి చక్కగా కలపాలి ● ఈ ముక్కలను మఫిన్ ట్రేలో సమానంగా వేసుకోవాలి ● ఇప్పుడు గుడ్లసొనను ఒకగిన్నెలో వేసి, ఉప్పు, మిరియాలపొడి పోసి నురగ వచ్చేంతవరకు కలుపుకోవాలి ● మఫిన్ ట్రేలో వేసిన బ్రకోలి మిశ్రమంపై గుడ్లసొనను పోసుకోవాలి ● అన్నింటిలో పోశాక ఇరవై నిమిషాలపాటు బేక్ చేస్తే బ్రకోలి మఫిన్స్ రెడీ.

బనానా ఆమ్లెట్



కావలసినవి: అరటి పండు – ఒకటి; గుడ్లు – రెండు; ఉప్పు – రుచికి సరిపడా; మిరియాల పొడి – టీస్పూను;కారం – అరటీస్పూను; నూనె – ఆమ్లెట్ వేయించడానికి సరిపడా.

తయారీ: ● అరటిపండును ముక్కలుగా తరగాలి ● మిక్సీజార్‌లో అరటిపండు ముక్కలు, గుడ్ల సొన, మిరియాలపొడి, రుచికి సరిపడా ఉప్పు వేసి నురగ వచ్చేంత వరకు గ్రైండ్ చేయాలి ● ఇప్పుడు పెనం మీద నూనె వేసి గ్రైండ్ చేసిన మిశ్రమాన్ని ఆమ్లెట్‌లా పోసుకోవాలి ● సన్నని మంట మీద రెండు వైపులా చక్కగా కాల్చుకుంటే బనానా ఆమ్లెట్ రెడీ.

పాలకూర చికెన్ ఎగ్ బైట్స్



కావలసినవి: పాలకూర – రెండు కప్పులు; గుడ్లు – పది; పాలు – ముప్పావు కప్పు; చీజ్ తరుగు – అరకప్పు; ఉడికించిన చికెన్ ముక్కలు – పది; ఉప్పు, మిరియాలపొడి – రుచికి సరిపడా.

తయారీ: ● పాలకూర, చికెన్ ముక్కలను సన్నగా తరిగి పెట్టుకోవాలి ● పెద్దగిన్నెలో గుడ్ల సొన వేయాలి. దీనిలో పాలు, చికెన్, పాలకూర ముక్కలు వేసి కలపాలి ● చివరిగా రుచికి సరిపడా, ఉప్పు, మిరియాల పొడి వేసి నురగ వచ్చేంత వరకు బాగా కలపాలి ● ఇప్పుడు ఈ మిశ్రమాన్ని స్కూప్‌లతో మఫిన్ ట్రేలో వేసి అరగంటపాటు బేక్ చేస్తే పాలకూర చికెన్ ఎగ్ బైట్స్ రెడీ.

యువర్స్

● ఇన్నోవేషన్


హర్షిత్ - అభిక్ సాహా

స్కూల్ రోజుల్లో కంప్యూటర్ సైన్స్ యూనిట్ టెస్ట్‌లో ఫెయిలైన ఏకైక విద్యార్థికి సాంకేతికతపై పట్టు సాధించాలనే పట్టుదల పెరిగితే ఎలా ఉంటుంది? అచ్చం... అభిక్ సాహా లా ఉంటుంది. పశ్చిమబెంగాల్‌కు చెందిన అభిక్ సాహా పదిహేను సంవత్సరాల వయసులోనే దేశీ సెర్చ్ ఇంజిన్‌ను డెవలప్ చేసి భేష్ అనిపించుకున్నాడు. స్నేహితుడు హర్షిత్ జైన్‌తో కలిసి మొదలు పెట్టిన డీ సెంట్రలైజ్‌డ్ క్లౌడ్ గేమింగ్ ప్లాట్‌ఫామ్ 'వోర్లీ గేమ్' విజయపథంలో దూసుకుపోతోంది.

ది కింగ్ ఆఫ్ టెక్నో

విజయానికి తొలి మెట్టు పట్టుదల

కంప్యూటర్ సైన్స్ యూనిట్ టెస్ట్‌లో ఫెయిల్ అయిన ఏకైన విద్యార్థి అభిక్ సాహా. అది తనపై బలమైన ప్రభావం చూపించింది. సాంకేతికతపై పట్టు సాధించాలనే పట్టుదలను పెంచింది. కంప్యూటర్ లాంగ్వేజ్‌లను నేర్చుకోవడాన్ని ఒకప్పుడు బోర్‌గా ఫీలైన సాహా ఆ తరువాత వాటిపై పట్టు సాధించాడు.

ఇంటర్నెట్‌ను విశ్వవిద్యాలయం చేసుకున్నాడు.

ఆన్‌లైన్ ట్యుటోరియల్ ద్వారా నేర్చుకోవడం మొదలు పెట్టాడు. బేసిక్ సాఫ్ట్‌వేర్ నుంచి వెబ్‌సైట్ బ్లాకింగ్ వరకు ఎన్నో విషయాలపై పట్టు సాధించాడు. పదమూడవ పుట్టిన రోజు సందర్భంగా తండ్రి తనకు స్మార్ట్‌ఫోన్ గిఫ్ట్‌గా ఇచ్చాడు. ప్రపంచ సాంకేతికతపై అవగాహన పెంచుకోవడానికి, రకరకాల మొబైల్ అప్లికేషన్‌లను క్రియేట్ చేయడానికి ఈ స్మార్ట్‌ఫోన్ ఉపయోగపడింది.

పదిహేను సంవత్సరాల వయసులో వినూత్నమైన దేశీ సెర్చ్ ఇంజిన్ 'ఒరిగాన్'ను డెవలప్ చేయడం ద్వారా వార్తల్లోకి వచ్చి 'భేష్' అనిపించుకున్నాడు అభిక్ సాహా. పశ్చిమ బెంగాల్‌లోని చల్స పట్టణానికి చెందిన సాహా హైస్కూల్ రోజుల్లోనే మొబైల్ అప్లికేషన్‌లు, వెబ్‌సైట్ బిల్డింగ్, కంప్యూటర్ ప్రోగ్రామింగ్ అండ్ డెవలపింగ్ లాంగ్వేజిలపై ఉచిత వీడియో ట్యుటోరియల్స్ నిర్వహించడంలో తలమునకలై ఉండేవాడు.

•••

> "కంప్యూటర్ లాంగ్వేజ్‌లను నేర్చుకోవడాన్ని ఒకప్పుడు బోర్‌గా ఫీలైన సాహా ఆ తరువాత వాటిపై పట్టు సాధించాడు. ఇంటర్నెట్‌ను విశ్వవిద్యాలయం చేసుకున్నాడు. ఆన్‌లైన్ ట్యుటోరియల్ ద్వారా నేర్చుకోవడం మొదలు పెట్టాడు."

ఇండియన్ ఇ-స్పోర్ట్స్ వృద్ధిరేటు ఆశాజనకంగా, ఉత్సాహంగా ఉందని, 2027 కల్లా భారీ వృద్ధిరేటు కనిపిస్తుందని కంపౌండెడ్ యాన్యువల్ గ్రోత్ రేట్ (సీఏజీఆర్) రిపోర్ట్ తెలియజేస్తుంది. స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా రకరకాల టోర్నమెంట్స్‌ను నిర్వహిస్తున్నారు. వీటిని ప్రపంచ వ్యాప్తంగా కోట్లాదిమంది వీక్షిస్తున్నారు. మన దేశంలో ఇ-గేమ్స్‌కు పెరుగుతున్న పాపులారిటీని గమనించి హర్షిత్ జైన్, అభిక్ సాహా డీసెంట్రలైజ్‌డ్ క్లౌడ్ గేమింగ్ ప్లాట్‌ఫామ్ 'వోర్లీ ప్లే' ప్రారంభించారు.

దీన్ని 'నెక్స్ట్ బిగ్ వోటీటీ' లక్ష్యంగా మొదలు పెట్టారు.

గేమ్ ఆడాలనే ఉత్సాహం ఒక కోణం అయితే ఖర్చును దృష్టిలో పెట్టుకొని దూరంగా ఉండడం మరో కోణం. పీసీ, కీబోర్డ్, హై-కంప్యూటింగ్ సీపీయూ సెటప్ వరకు ఎంతో ఖర్చు అవుతుంది. అయితే క్లౌడ్ గేమింగ్ ప్లాట్‌ఫామ్ 'వోర్లీ ప్లే'తో యూజర్‌లు మంత్లీ ప్లాన్ రూ.499 ద్వారా డిఫరెంట్ స్టోర్స్ నుంచి ఎన్నో టైటిల్స్‌తో యాక్సెస్ కావచ్చు. హై-ప్రాసెసింగ్ సీపీయూలాంటి అడ్వాన్స్‌డ్ గేమింగ్ ఎక్విప్‌మెంట్ అవసరం లేదు.

యూజర్స్ తమ దగ్గర ఉన్న ఏ డివైజ్ ద్వారా అయినా గేమ్స్‌తో యాక్సెస్ కావచ్చు.

'ఒక విధంగా చెప్పాలంటే ఇది సైబర్ కేఫ్‌లాంటిది అనుకోవచ్చు. నిర్ణీతమైన టైమ్‌కు కొంత డబ్బు చెల్లించి ఇంటర్నెట్‌తో యాక్సెస్ కావడంలాంటిది' అంటాడు కంపెనీ కో-ఫౌండర్, సీయివో హర్షిత్ జైన్.

బేరింగ్ క్యాపిటల్, ఇన్‌ఫ్లెక్షన్ పాయింట్ వెంచర్స్ 'వోర్లీ ప్లే'కు సీడ్ ఫండింగ్ చేశాయి. కునాల్ షా, సూరజ్ నళిన్, అమృత్ శ్రీవాస్తవ, జితేంద్ర గుప్తా ఏంజెల్ ఇన్వెస్టర్‌లు. గత నెలలో అధికారికంగా లాంచ్ అయిన 'వన్ ప్లేయర్'కు 27,000 రిజిస్టర్డ్ యూజర్‌లు, 5,000 ప్లేయింగ్ సబ్‌స్క్రైబర్‌లు ఉన్నారు.

'కేవలం గేమ్స్ ఆడడం మాత్రమే కాదు క్లౌడ్‌లో ప్రతీది చేయవచ్చు. ఉదాహరణకు 3డీ సాఫ్ట్‌వేర్‌ను రన్ చేయడం లాంటివి' అంటున్నాడు కంపెనీ కో-ఫౌండర్, సీటీవో అభిక్ సాహా.

● టెక్.. టాక్

గూగుల్ హై-క్వాలిటీ స్టిల్ ఇమేజ్ కాపీ ఫీచర్



క్రోమ్ బ్రౌజర్ కోసం గూగుల్ కొత్త ఫీచర్‌ను ప్రకటించింది. దీని ద్వారా యూజర్‌లు యూట్యూబ్, ఇతర సైట్‌ల నుంచి హై-క్వాలిటీ స్టిల్ ఇమేజ్‌లను కాపీ చేసుకోవచ్చు. స్టూడెంట్స్‌ను దృష్టిలో పెట్టుకొని దీన్ని రూపొందించారు. ఈ ఫీచర్‌ని ఉపయోగించడానికి...

- వీడియోను పాజ్ చేసి....రైట్-క్లిక్
- మెనూ నుంచి 'కాపీ వీడియో ఫ్రేమ్' సెలెక్ట్ చేసుకోవాలి.
- కాపీడ్ ఫ్రేమ్ సోర్స్ వీడియోలాగే సేమ్ రిజల్యూషన్‌తో ఉంటుంది.

ఇన్‌ఫినిక్స్ జీరో 30

డిస్‌ప్లే: 6.78 అంగుళాలు బరువు: 185 గ్రా.
రిజల్యూషన్: 1080×2400 పిక్సెల్స్
వోఎస్: ఆండ్రాయిడ్ 13
మెమొరీ: 256జీబి 8జీబి/12జీబి ర్యామ్
బ్యాటరీ: 5,000 ఎంఏహెచ్ కనెక్టివిటీ: 5జీ



మోటోరోలా మోటో జీ84 5జీ

డిస్‌ప్లే: 6.55 అంగుళాలు రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్
బ్యాటరీ: 5,000 ఎంఏహెచ్ స్టోరేజ్: 12జీబి ర్యామ్ అండ్ 256జీబి రిజల్యూషన్: 2400×1080 పిక్సెల్స్
రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్ సపోర్ట్: 5జీ, జీపీఎస్, బ్లూటూత్, ఎన్ఎఫ్‌సీ, యుఎస్‌బీ



రీల్ పరిమితి 3 నుంచి 10



మెటా వారి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఇన్‌స్టాగ్రామ్ 'రీల్' పరిమితిని 3 లేదా 10 నిమిషాలకు పెంచడానికి సంబంధించి పరీక్షిస్తున్నారు. దీని ద్వారా ఎడ్యుకేషన్, స్కిట్స్, మేకప్ ట్యుటోరియల్, వంటలు... మొదలైన వాటికి సంబంధించి కంటెంట్ క్రియేటర్‌లకు ఉపయోగపడుతుంది. ఈ నెలలో ఇన్‌స్టాగ్రామ్ 'యాడ్ యూజర్స్ స్టిక్కర్'లాంటి ఫీచర్స్‌ని తీసుకువచ్చింది.

● ఇంగ్లిష్ ఇడియమ్స్

బీ బార్కింగ్ అప్ ది రాంగ్ ట్రీ



ఏదైనా విషయంలో పొరబడడం, తప్పుగా అర్థం చేసుకోవడం, తప్పుదోవ పట్టడం...ఇలాంటి సందర్భంలో ఉపయోగించే మాట....

'బీ బార్కింగ్ అప్ ది రాంగ్ ట్రీ'

ఉదా: ఇఫ్ యూ ప్లాన్ టు బికమ్ ఏ రైటర్ బికాజ్ ఇట్ విల్ మేక్ యూ లాట్ ఆఫ్ మనీ, యూ ఆర్ బార్కింగ్ అప్ ది రాంగ్ ట్రీ

ఆకాశమే మృత్యుపాశమై...

రోల్-ప్లేయింగ్ వీడియో గేమ్ బాల్డర్స్ గేట్-3 విడుదల అయింది. 'బాల్డర్స్ గేట్' సిరీస్‌లో ఇది థర్డ్ మెయిన్ గేమ్. సింగిల్-ప్లేయర్ అండ్ కోఆపరేటివ్ మల్టీప్లేయర్ ఎలిమెంట్ ఉన్న ఈ గేమ్‌లో ప్లేయర్ ఒకటికి మించి క్యారెక్టర్లు సృష్టించవచ్చు. సిరీస్‌లో గత గేమ్‌లలాగే బాల్డర్స్ గేట్-3 టర్న్-బేస్‌డ్ కంబాట్ గేమ్. 'బాల్డర్స్ గేట్-2' తరువాత 120 సంవత్సరాలకు చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో సాగే ఆట ఇది.

జానర్స్: రోల్-ప్లేయింగ్
మోడ్స్: సింగిల్-ప్లేయర్, మల్టీ ప్లేయర్
ప్లాట్‌ఫామ్స్: విండోస్, ప్లేస్టేషన్5, ఎక్స్ బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

● గేమింగ్



● మ్యూజిక్ వరల్డ్

నీ గానం వెన్నెల వాన


రవీనా అరోర

టీనేజ్‌లో న్యూయార్క్‌కు వెళ్లిన రవీనా అరోరా సింగర్, సాంగ్ రైటర్‌గా మంచి పేరు తెచ్చుకుంది 'స్వీట్ టైమ్' 'టెంప్టేషన్' 'హనీ' పాటలతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకుంది. ఇక లైవ్ షోలలో పాశ్చాత్య ప్రేక్షకులను హిందీ సాంగ్స్‌తో అలరిస్తుంటుంది. స్టేజీ మీద ఉన్నట్టుండీ...'వుయ్ ఆర్ గోయింగ్ టు సింగ్ ఇన్ హిందీ నౌ' అని ప్రకటిస్తుంది. ఆడిటోరియమ్ కేకలతో నిండిపోతున్న సమయంలో 'ఏక్, దో, తీన్, చార్, చలోనా, మేరె సాత్' అంటూ హిందీ పాట అందుకుంటుంది. 60,70లలోని హిందీ చిత్రాల పాటలను పాడుతూ కూడా ఈతరం కుర్రకారును ఆకట్టుకుంటుంది.

'సంగీతంలో భిన్న ధోరణులను అన్వేషించడం ఇష్టం' అంటున్న అరోరాకు లతా మంగేష్కర్, ఆశా భోంస్లేలా స్వరం ఇష్టం. భావగర్భితమైన పాట ఇష్టం. రవీనా పాటలు 'ఆహా, ఓహో'లకు పరిమితమైన పసందైన పాటలు కాదు. ఎన్నో సామాజిక సమస్యలు ఆమె పాటలో భాగమై ఉంటాయి.

'ఇతరులకు స్ఫూర్తినిచ్చేలా, తమను తాము ప్రేమించుకునేలా, తమను తాము స్పష్టంగా అర్థం చేసుకునేలా, ఆత్మవిశ్వాసం పెంపొందించుకునేలా నా పాట ఉండాలనుకుంటాను' అంటోంది రవీనా అరోరా.

సినిమా


● నిఖిల్

చలో వియత్నామ్

హీరో నిఖిల్ సిద్ధార్థ వియత్నామ్‌లో వాలిపోయారు. ఏదో వెకేషన్‌కి వెళ్లంటారేమో అనుకుంటే పొరబడినట్టే. తన తాజా పాన్ ఇండియా చిత్రం 'స్వయంభూ' కోసం నెల రోజులు ప్రత్యేక శిక్షణ తీసుకునేందుకు వియత్నామ్ వెళ్లారాయన. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహించనున్న మూవీ 'స్వయంభూ'. ఠాగూర్ మధు సమర్పణలో భువన్, శ్రీకర్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. యుద్ధం నేపథ్యంలో రూపొందనున్న ఈ సినిమాలో యోధునిగా కనిపించనున్నారు నిఖిల్. ఈ పాత్రకు సంబంధించి ఆయుధాలు, మార్షల్ ఆర్ట్స్, గుర్రపు స్వారీలో శిక్షణ తీసుకుంటున్నారు. సైగాన్‌లోని కొంతమంది బిగ్గెస్ట్ స్టంట్ మాస్టర్‌లు 'స్వయంభూ' యూనిట్లో భాగంగా ఉండి యాక్షన్ సీక్వెన్స్‌ల కోసం నిఖిల్‌కి శిక్షణ ఇస్తారు. నెల రోజుల పాటు శిక్షణ తీసుకోనున్నారు నిఖిల్. ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్, కెమెరా: మనోజ్ పరమహంస, సహనిర్మాతలు: విజయ్ కామిశెట్టి, జీటీ ఆనంద్.


● మాల్వీ, రాజ్‌తరుణ్

చాలా బాగుందే...

రాజ్ తరుణ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'తిరగబడర సామీ'. ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మాల్వీ మల్హోత్రా, మన్నారా చోప్రా హీరోయిన్లు. మల్కాపురం శివకుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జేబీ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'చాలా బాగుందే...' అంటూ సాగే పాటని విడుదల చేశారు. ఈ పాటకు శ్రీమణి సాహిత్యం అందించగా, చైతు సత్సంగి, లిప్సిక పాడారు. "పూర్తి వినోదాత్మకంగా రూపొందుతున్న చిత్రం 'తిరగబడర సామీ'. రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రాలపై వచ్చే 'చాలా బాగుందే..' పాట మనసుని హత్తుకునే అద్భుతమైన మెలోడీగా సాగుతుంది" అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: జవహర్ రెడ్డి యంఎన్.

యువత గెలవాలి

- సిద్ధార్థ్


● అభయ్ నవీన్, సిద్ధార్థ్

"రామన్న యూత్ టైటిల్ బాగుంది. అభయ్ నాకు ఇష్టమైన నటుడు. ఈ సినిమాలో ఒక కథను కాకుండా తన జీవితంలో చూసిన ఊరి అనుభవాలను తెరకెక్కించాడు. ట్రైలర్‌లో వినోదం, భావోద్వేగాలు కనిపిస్తున్నాయి. ఎక్కడైనా యువత గెలవాలి.. అలా ఈ 'రామన్న యూత్' కూడా గెలవాలి" అని హీరో సిద్ధార్థ్ అన్నారు. అభయ్ నవీన్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'రామన్న యూత్'. ఫైర్ ఫ్లై ఆర్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 15న విడుదలవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ను సిద్ధార్థ్ విడుదల చేశారు. అభయ్ నవీన్ మాట్లాడుతూ– "ఒక ఊరిలో రాజకీయ నాయకుడిగా ఎదగాలనుకుని రాజు అనే యువకుడు చేసిన ప్రయత్నాలు అతని జీవితాన్ని ఎలా మార్చాయి? అనేది సినిమాలో చూపిస్తున్నాం. గ్రామీణ నేపథ్యంలో సాగే పొలిటికల్ ఎంటర్‌టైనర్ చిత్రమిది" అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: కమ్రాన్, కెమెరా: ఫహాద్ అబ్దుల్ మజీద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శివ ఎంఎస్‌కే.

రుద్రంకోట నేపథ్యంలో...


● అనిల్, విభీష

అనిల్ ఆర్క కండవల్లి హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'రుద్రంకోట'. నటి జయలలిత ఓ కీలక పాత్రలో నటించి, చిత్ర సమర్పకురాలిగా వ్యవహరించారు. రాము కోన దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో విభీష, రియా హీరోయిన్లు. ఏఆర్‌కే విజువల్స్ పతాకంపై రూపొందిన ఈ సినిమాని ఈ నెల 22న స్క్రీన్ మాక్స్ పిక్చర్స్ సంస్థ ద్వారా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. హీరో, నిర్మాత అనిల్ ఆర్క కండవల్లి మాట్లాడుతూ– "స్మశాన వాటికలో పెరిగిన ఓ యువకుడి ప్రేమకథా చిత్రమిది. భద్రాచలం దగ్గర రుద్రంకోట అనే ఊరి నేపథ్యంలో కథ నడుస్తుంది. ప్రముఖ సంగీత దర్శకుడు కోటిగారు మా చిత్రానికి అద్భుతమైన నేపథ్య సంగీతం అందించారు" అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: ఆదిమల్ల సంజీవ్, సంగీతం: సుభాష్ ఆనంద్, నిరంజన్.

నిర్మాత కావాలన్నదే లక్ష్యం


● నవీన్

"కృష్ణ, చిరంజీవిగార్ల సినిమాలు చూసి హీరో అవుదామని ఇండస్ట్రీకి వచ్చాను. కోట శ్రీనివాసరావు, బ్రహ్మానందం, తనికెళ్ల భరణి, అలీగార్ల స్ఫూర్తితో హాస్య నటుడిగా నాకంటూ గుర్తింపు తెచ్చుకున్నందుకు సంతోషంగా ఉంది. నిర్మాత కావాలన్నదే నా లక్ష్యం.. అలాగే ఒక సింగిల్ స్క్రీన్ థియేటర్ నిర్మించాలన్నది నా కల" అని నటుడు గడ్డం నవీన్ అన్నారు. రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్', వెంకటేష్ 'సైంధవ్' చిత్రాలతో పాటు 'భైరవ కోన', 'మిస్టరీ', 'వృషభ', 'చూ మంతర్', 'భూతద్దం భాస్కర్' వంటి పలు సినిమాల్లో నటిస్తున్న ఆయన మాట్లాడుతూ– "ఇప్పటి వరకూ 150 సినిమాలు చేస్తే, వాటిలో 90 చిత్రాల్లో మంచి పాత్రలొచ్చాయి. ఈ ఏడాది సంతృప్తికరమైన ప్రయాణం సాగుతోంది" అన్నారు.

యాక్షన్ మాత్రమే కాదు.. కొందరు స్టార్స్‌లో డైరెక్షన్ చేసే టాలెంట్ కూడా ఉంటుంది. అయితే యాక్షన్ ఫ్రంట్ సీట్.. డైరెక్షన్ బ్యాక్ సీట్‌లో ఉంటుంది. అందుకే డైరెక్షన్‌కి గ్యాప్ ఇచ్చి, యాక్షన్‌కి మాత్రం నో గ్యాప్ అంటారు. అలా కొందరు హీరోలు డైరెక్షన్ సీట్‌కి చాలా సంవత్సరాలు గ్యాప్ ఇచ్చారు. ఇప్పుడు మళ్లీ మెగాఫోన్ పట్టుకుని 'స్టార్ట్ కెమెరా.. యాక్షన్' అంటున్నారు. కొందరు స్టార్స్ ఇటు కెమెరా వెనకాల డైరెక్షన్ చేస్తూ అటు కెమెరా ముందు యాక్షన్ చేస్తున్నారు. ఆ చిత్రాల గురించి తెలుసుకుందాం.


● సుదీప్ ● ధనుష్ ● ఉపేంద్ర

డైరెక్షన్.. యాక్షన్...

ఆరేళ్లకు...

కెరీర్‌లో 50వ సినిమా అంటే ఏ ఆర్టిస్టుకైనా ప్రత్యేకమే. కోలీవుడ్ హీరో ధనుష్ కూడా తన 50వ సినిమాని చాలా స్పెషల్ అనుకున్నారు. అందుకే తన హాఫ్ సెంచరీ సినిమాలో తానే నటిస్తూ, దర్శకత్వం కూడా వహిస్తున్నారు. హీరోగా దాదాపు 30 సినిమాల్లో నటించిన తర్వాత 'పా. పాండి' (2017) చిత్రం కోసం తొలిసారి ధనుష్ దర్శకుడిగా మెగాఫోన్ పట్టారు. ధనుష్ నటించి, దర్శకత్వం వహించిన ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి చెప్పుకోదగ్గ ఆదరణ లభించింది. దీంతో 2019లో దర్శకుడుగా ధనుష్ మరో మూవీని తెరకెక్కించాలనుకున్నారు. కానీ ఎందుకో కుదర్లేదు. అయితే ఈ ఏడాది జూలైలో తన దర్శకత్వంలోని రెండో చిత్రం సెట్స్‌పైకి వెళ్లినట్లుగా ధనుష్ వెల్లడించారు. ఇలా దాదాపు ఆరేళ్ల తర్వాత దర్శకుడిగా మరోసారి మెగాఫోన్ పట్టారు. ఇక నార్త్ చెన్నై బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామాలో సందీప్ కిషన్ ఓ కీ రోల్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోంది. ఈ చిత్రంలో అనిఖా సురేంద్రన్, ఎస్‌జే సూర్య, విష్ణు విశాల్, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారని టాక్.

ఏడేళ్ల తర్వాత...

యాక్టర్‌గా తెలుగు ప్రేక్షకుల్లో కన్నడ స్టార్ ఉపేంద్రకు ఎంత పాపులారిటీ ఉందో, ఆయన దర్శకత్వంలో వచ్చిన చిత్రాలకూ అంతే క్రేజ్ ఉంది. 'ష్..! (1993)', 'ఓం (1995)', 'ఉపేంద్ర (1999)' వంటి సినిమాల్లో నటించి, దర్శకత్వం వహించారు ఉపేంద్ర. కన్నడంలో ఆయన దర్శకత్వంలో రూపొందిన కొన్ని సినిమాలు తెలుగులో అనువాదపై, ఇక్కడి ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అయితే 2015లో వచ్చిన 'ఉప్పి 2' తర్వాత దర్శకుడిగా ఉపేంద్ర గ్యాప్ తీసుకున్నారు. ఏడేళ్ల తర్వాత 2022లో 'యూఐ' సినిమా వర్క్స్‌ను మొదలు పెట్టారు ఉపేంద్ర. ఆయన నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం ఇది. సాంకేతికంగా ఉన్నత ప్రమాణాలతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లుగా ఉపేంద్ర అండ్ టీమ్ పేర్కొంది. కన్నడ, తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ ఈ చిత్రాన్ని రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

పదేళ్లకు...

కన్నడ స్టార్ హీరోల్లో ఒకరైన సుదీప్ దర్శకుడిగా ఆరు సినిమాలను తెరకెక్కించారు. కానీ ఈ ఆరూ రీమేక్ చిత్రాలే కావడం విశేషం. తమిళ 'ఆటోగ్రాఫ్'ని కన్నడంలో 'మై ఆటోగ్రాఫ్' (2006)గా రీమేక్ చేసి, నటించారు సుదీప్. అలాగే దర్శకుడిగా తెలుగు హిట్ ఫిల్మ్ 'మిర్చి (2013)' కన్నడ రీమేక్ 'మాణిక్య (2014)'లో టైటిల్ రోల్ చేసి, ఈ సినిమాకు దర్శకత్వం వహించారు సుదీప్. ఈ సినిమా తర్వాత సుదీప్ మళ్లీ మెగాఫోన్ పట్టలేదు. మళ్లీ దశాబ్దం తర్వాత అంటే... 2024లో సుదీప్ నటించి, దర్శకత్వం వహించనున్న 'కేకే' (వర్కింగ్ టైటిల్) సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది. ఆల్రెడీ ఈ సినిమాను అధికారికంగా ప్రకటించారు. 'దేవుడు క్షమిస్తాడు.. నేను కాదు...!' అనే క్యాప్షన్‌తో ఉన్న ఈ సినిమా గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో సాగే కథతో సాగనున్నట్లుగా తెలుస్తోంది. ఇక దర్శకుడిగా ఇప్పటివరకూ రీమేక్ చిత్రాలే చేసిన సుదీప్.. ఈ ఏడవ సినిమాని స్ట్రయిట్ కథతో తీయనున్నారా లేక రీమేకా? అనేది తెలియాల్సి ఉంది. ఇక 'ఈగ', 'బాహుబలి: ది బిగినింగ్', 'సైరా: నరసింహారెడ్డి' చిత్రాలతో సుదీప్ తెలుగు ప్రేక్షకులకు సుపరిచితుడే.


● ఫర్హాన్ అక్తర్

పుష్కర కాలం తర్వాత...

'దిల్ చాహ్ తా హై' (2001) చిత్రంతో రచయితగా, దర్శకుడిగా కెరీర్ ఆరంభించారు ఫర్హాన్ అక్తర్. 'డాన్: ది చేజ్ బిగిన్స్', 'డాన్ 2: ది కింగ్ ఈజ్ బ్యాక్' చిత్రాలతో దర్శకుడిగా తనదైన పేరు సంపాదించారు. అయితే 2011లో వచ్చిన 'డాన్ 2: ది కింగ్ ఈజ్ బ్యాక్' చిత్రం తర్వాత నటుడిగా కాస్త బిజీ అయిన ఫర్హాన్ మరో సినిమాకు దర్శకత్వం వహించలేదు. పదేళ్ల తర్వాత 2021 ఆగస్టులో 'జి లే జరా' చిత్రానికి దర్శకత్వం వహించనున్నట్లు ఫర్హాన్ వెల్లడించారు. ఆలియా భట్, ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్ లీడ్ రోల్స్ చేయనున్న ఈ సినిమా షూటింగ్ కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. దీంతో తన డైరెక్షన్‌లోనే 'డాన్ 3' సినిమాను ప్రకటించారు ఫర్హాన్. అయితే ఈ సినిమాలో ఆయన నటించడం లేదు. రణ్‌వీర్ సింగ్ హీరోగా నటించనున్నారు. ఈ ఏడాది చివర్లో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది. ఇలా ఫర్హాన్ దర్శకత్వంలోని మరో సినిమా సెట్స్‌పైకి వెళ్లడానికి పుష్కరకాలం అంటే పన్నెండేళ్లు పట్టిందని చెప్పొచ్చు. 'డాన్ 3' చిత్రం 2025లో విడుదల కానుంది.

ఇలా కొంత విరామం తర్వాత దర్శకులుగా మెగాఫోన్ పట్టిన స్టార్స్ ఇంకొందరు ఉన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	385	66,266
నిఫ్టీ ▲	116	19,727

విదేశీ సూచీలు (తొలి రెండు శుక్రవారం ముగింపు)

నాస్‌డాక్	13,738	▽	135
డోజోన్స్	34,520	▲	77
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,442	▲	16
డాక్స్	15,719	▽	23
షాంఘై	3,122	▽	36
నికాయ్	32,991	▽	249

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	59,329	▲	27
బంగారం (99.5 స్వచ్ఛత)	59,091	▲	27
వెండి (కేజీ)	72,065	▲	166

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒక్కటి	82.35	84.02
£	బ్రిటన్ పౌండ్	ఒక్కటి	102.31	105.72
€	యూరో	ఒక్కటి	87.69	90.81
¥	జపాన్ ఎన్ (100)	ఒక్కటి	55.50	57.23
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒక్కటి	51.92	54.91
S$	సింగపూర్ డాలర్	ఒక్కటి	60.04	61.95
SAR	సౌదీ రియాల్	[illegible]	21.23	22.86
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.76	23.55
¥	చైనా యువాన్	[illegible]	10.23	12.31

అయిదో రోజూ లాభాల జోరు

- 66 వేల పైకి సెన్సెక్స్
- 19,700 ఎగువకు నిఫ్టీ
- క్రూడ్ ధరలు తగ్గిన నేపథ్యం

ముంబై: దలాల్ స్ట్రీట్‌లో అయిదో రోజూ లాభాల జోరు కొనసాగింది. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్‌అండ్‌టీ, ఎస్‌బీఐ షేర్లు 2% రాణించాయి. ఇటీవల పది నెలల గరిష్టానికి ఎగబాకిన క్రూడాయిల్ ధరలు దిగివచ్చాయి. అమెరికా బాండ్లపై రాబడులు తగ్గుముఖం పట్టాయి. ఫలితంగా వారాంతపు ఎక్స్‌పైరీ ముగింపు రోజైన గురువారం సెన్సెక్స్ 385 పాయింట్లు బలపడి 66,000 స్థాయి పైన 66,266 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 65,672 వద్ద కనిష్టాన్ని, 66,297 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 116 పాయింట్లు పెరిగి 19,700 స్థాయి ఎగువన 19,727 వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న బలహీన సంకేతాల దృష్ట్యా ఉదయం సెషన్‌లో సూచీలు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే ద్వితీయార్థంలో క్యాపిటల్ గూడ్స్, బ్యాంకులు, విద్యుత్, రియల్టీ రంగాల షేర్లు డిమాండ్ లభించడంతో ఆరంభ నష్టాలు భర్తీ చేసుకొని ఇంట్రాడే గరిష్టం వద్ద ముగిశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.759 కోట్ల షేర్లను అమ్మేయగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.28 కోట్ల ఈక్విటీలు కొన్నారు. రూపాయి విలువ పది పైసలు పతనమై జీవితకాల కనిష్టం 83.23 స్థాయి వద్ద స్థిరపడింది.



మార్కెట్లో మరిన్ని సంగతులు

- సెన్సెక్స్ 5 రోజుల్లో 1,434 పాయింట్లు ర్యాలీతో బీఎస్‌ఈలో రూ.9.50 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ జీవిత కాల గరిష్ట స్థాయి రూ.319.10 లక్షల కోట్లకు చేరింది.
- నిఫ్టీ 50 సూచీలో కోల్ ఇండియా(7%), ,ఎల్ అండ్‌టీ(4%), టెక్ మహీంద్రా(2%), హెచ్‌సీఎల్(1.50%), ఎన్‌టీపీసీ(1%) షేర్లు ఇంట్రాడే ట్రేడింగ్‌లో ఏడాది గరిష్టాన్ని అందుకున్నాయి.
- బ్లాక్ డీల్ ద్వారా 12 లక్షల ఈక్విటీలు చేతులు మారడంతో బీఎస్ఈలో జొమాటో షేరు 2% లాభపడి రూ.100 వద్ద స్థిరపడింది.
- బస్తా ధరల పెంపుతో ఇటీవల ర్యాలీ చేసిన సిమెంట్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది.



బ్యాంక్‌లు మారాలి.. లేదంటే మూత: కేవీ కామత్

ముంబై: బ్యాంక్‌లు ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ తమను తాము కొత్తగా ఆవిష్కరించుకోవాలని.. విధానాలు, పని నమూనాలను కాలానికి అనుగుణంగా పనిచేసేలా చూసుకోవాలని వెటరన్ బ్యాంకర్ కేవీ కామత్ అభిప్రాయపడ్డారు. ఈ విధంగా చేయలేని బ్యాంక్‌లు వాటి దుకాణాలను మూతేసుకోవాల్సి వస్తుందని కొంత హెచ్చరికగా పేర్కొన్నారు. గ్లోబల్ ఫిన్‌టెక్ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. బ్యాంక్‌లు నూతనతరం ఫిన్‌టెక్ కంపెనీలతో కలసి పనిచేయాలన్నారు.

విజయవాడలో కార్స్24 హబ్

- 2025 నాటికి తొలి స్థానం
- లగ్జరీ విభాగంలోకి ఎంట్రీ
- కంపెనీ కో–ఫౌండర్ గజేంద్ర



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆటోటెక్ కంపెనీ కార్స్24 వచ్చే నెలలో విజయవాడలో హబ్‌ను ప్రారంభిస్తోంది. 200 కార్లు పార్క్ చేయగలిగే సామర్థ్యంతో ఈ కేంద్రం రానుందని కార్స్24 కో–ఫౌండర్ గజేంద్ర జంగిడ్ సాక్షి బిజినెస్ బ్యూరోకు తెలిపారు. 'దేశవ్యాప్తంగా పాత కార్ల క్రయవిక్రయాల్లో 8 శాతం వాటాతో ఆంధ్రప్రదేశ్–తెలంగాణ మార్కెట్ 8వ స్థానంలో ఉంది. కార్స్24 వ్యాపారంలో ఢిల్లీ రాజధాని ప్రాంతం, మహారాష్ట్ర, కర్ణాటక తర్వాత తెలుగు రాష్ట్రాలు 15 శాతం వాటాతో నాల్గవ స్థానంలో ఉన్నాయి. కొత్త కార్లకు రుణం సులభంగా లభిస్తుంది. పాత కార్ల విషయంలో రుణ లభ్యత అంత సులువు కాదు. యూజ్డ్ కార్ల రంగంలో విలువ ఉందని గ్రహించాం. సులభ వాయిదాల్లో వినియోగదార్లకు రుణం అందించాలన్న ధ్యేయంతో 2019లో నాన్‌–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ) లైసెన్స్ దక్కించుకున్నాం. కంపెనీ కస్టమర్లలో దేశవ్యాప్తంగా 55 శాతం మంది రుణం ద్వారా కార్లు కొనుగోలు చేస్తున్నారు. ఏపీ, తెలంగాణలో ఈ సంఖ్య 65 శాతం ఉంది' అని వివరించారు.

కంపెనీ వృద్ధి 50 శాతం..

ఏడాది వారంటీతో సర్టిఫైడ్ కార్లను మాత్రమే విక్రయిస్తున్నామని గజేంద్ర తెలిపారు. 'కారుకు 140 క్వాలిటీ చెక్ పాయింట్ల ద్వారా మరమ్మతులు చేపడతాం. కారు నచ్చకపోతే ఏడు రోజుల్లో వెనక్కి ఇవ్వొచ్చు. అర్హత కలిగిన వినియోగదార్లకు జీరో డౌన్ పేమెంట్ సౌకర్యమూ ఉంది. కస్టమర్లలో 15% మహిళలు ఉన్నారు. పరిశ్రమ 15 శాతం వృద్ధి చెందితే, కార్స్24 ఏకంగా 50% నమోదు చేస్తోంది. వ్యవస్థీకృత రంగంలో రెండవ స్థానంలో ఉన్నాం. 2025 నాటికి తొలి స్థానం లక్ష్యంగా చేసుకున్నాం. ప్రస్తుతం యూజ్డ్ కార్స్ విపణిలో 5% వాటా సొంతం చేసుకున్నాం. వచ్చే ఏడాది రూ.30–50 లక్షల ధరల శ్రేణి విభాగంలోకి ఎంట్రీ ఇస్తాం. ఇప్పటి వరకు భారత్‌లో 8 లక్షల కార్లు విక్రయించాం. 2022–23లో ఈ సంఖ్య 2.5 లక్షల యూనిట్లు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 30% వృద్ధి ఆశిస్తున్నాం' అని వెల్లడించారు.

- **ఆర్‌ఆర్ కేబుల్స్ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ ఈ నెల 13న మొదలు కానుంది. తాజా ఈక్విటీ జారీని రూ.225 కోట్ల నుంచి రూ.180 కోట్లకు కంపెనీ తగ్గించుకుంది. ఇష్యూ 15న ముగుస్తుంది. ఈక్విటీ జారీ ద్వారా వచ్చే మొత్తం నుంచి రూ.136 కోట్లను రుణ భారం తగ్గించుకునేందుకు కంపెనీ వినియోగించనుంది.**

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
8-9-2023	
విశాఖ	500–00
చిత్తూరు	483–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	495–00
విజయవాడ	495–00
7-9-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	455–00
వరంగల్	457–00

నజారాలో ఎస్‌బీఐ ఎంఎఫ్ రూ.410 కోట్ల పెట్టుబడి

ముంబై: ప్రముఖ గేమింగ్, ఈ స్పోర్ట్స్ సేవల కంపెనీ నజారా టెక్నాలజీస్‌లో ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ భారీ పెట్టుబడులు పెట్టనుంది. నజారా టెక్నాలజీస్ ప్రిఫరెన్షియల్ అలాట్‌మెంట్‌లో పాల్గొని రూ.410 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. నజారా టెక్నాలజీస్ రూ.4 ముఖ విలువ కలిగిన 57,42,296 షేర్లను, ఒక్కోటీ రూ.714 చొప్పున జారీ చేయనుంది. ఈ విలువ రూ.409.90 కోట్లు, ఎస్‌బీఐ మల్టీక్యాప్ ఫండ్, ఎస్‌బీఐ మాగ్నమ్ గ్లోబల్ ఫండ్, ఎస్‌బీఐ టెక్నాలజీస్ అపార్చునిటీస్ ఫండ్ ద్వారా ఎస్‌బీఐ ఫండ్ ఈ ఇన్వెస్ట్ చేయనుంది. ఈ నెల 4న జెరోదా వ్యవస్థాపకులైన నితిన్, నిఖిల్ కామత్ సోదరులు సైతం ఒక్కో షేరుకు ఇదే ధరపై రూ.100 కోట్లు ఇన్వెస్ట్ చేయడం గమనార్హం.

భారత్‌లో ఫాక్స్‌కాన్ ఈవీ ప్లాంట్!

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తైవాన్‌కు చెందిన చిప్ తయారీ సంస్థ ఫాక్స్‌కాన్ భావిస్తోంది. అయితే ఫాక్స్‌కాన్ ఇతర ఈవీ కంపెనీల కోసం కాంట్రాక్ట్ తయారీ చేపడుతుందా లేదా సొంత బ్రాండ్ కింద మోడళ్లను విక్రయించబోతోందా అనే విషయంలో ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి తమిళనాడును తమ స్థావరంగా ఉపయోగించుకోవాలని ఫాక్స్‌కాన్ చైర్మన్ చర్చించినట్లు తెలుస్తోంది. ఫాక్స్‌కాన్ మాతృ సంస్థ హాన్ హాయ్ టెక్నాలజీ గ్రూప్ చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ యంగ్ లేయో యూఎస్‌లోని ఓహియోతోపాటు థాయ్‌లాండ్‌లో ఈవీ ప్లాంటు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని అలాగే అతి త్వరలో భారత్‌లో కూడా ఈవీ ఫ్యాక్టరీని నిర్మిస్తాం అని తెలిపారు.

జనాదరణ పథకాలకు ఆర్‌బీఐ డబ్బు

- రూ.3 లక్షల కోట్ల బదిలీకి కేంద్రంలో కొందరి విఫల యత్నం
- 2018 సార్వత్రిక ఎన్నికల ముందు విషయాన్ని బయటపెట్టిన మాజీ డిప్యూటీ గవర్నర్ విరాల్ ఆచార్య



న్యూఢిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మాజీ డిప్యూటీ గవర్నర్ విరాల్ వి. ఆచార్య తన పుస్తకం కొత్త ఎడిషన్ 'ముందు మాట'గా రాసిన కొన్ని అంశాలు తాజాగా ఆసక్తికరంగా మారాయి. ''2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు 2018లో ఆర్‌బీఐ బ్యాలెన్స్ షీట్ నుంచి జనాదరణ పథకాల వ్యయాలకు రూ. 2 నుంచి 3 లక్షల కోట్లను పొందాలని కేంద్ర ప్రభుత్వంలోకి కొందరు చేసిన ప్లాన్ (రైడ్)ను సెంట్రల్ బ్యాంక్ ప్రతిఘటించింది. ఇది స్పష్టంగా ప్రభుత్వం– ఆర్‌బీఐ మధ్య విభేదాలకు దారితీసింది. సెంట్రల్ బ్యాంక్‌కు సంబంధిత ఆదేశాలు జారీ చేయడానికి భారతీయ రిజర్వ్ బ్యాంక్ చట్టంలోని ఎన్నడూ ఉపయోగించని సెక్షన్ 7ను అమలు చేయాలని ఆలోచించే స్థాయికి పరిస్థితి వెళ్లింది'' అని రాసిన అంశాలు ఆసక్తికరంగా మారాయి.'క్వెస్ట్ ఫర్ రీస్టోరింగ్ ఫైనాన్షియల్ స్టెబిలిటీ ఇన్ ఇండియా' శీర్షికతో ప్రజల ముందు ఉంచిన తన పుస్తకం తాజా ఎడిషన్ ముందు మాటలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ''కేంద్ర ఆర్థిక లోటు భర్తీకి బ్యాక్‌డోర్ మానిటైజేషన్'' అని ఆయన ఈ వ్యవహారాన్ని అభివర్ణించడం గమనార్హం. 2017 జనవరి 20వ తేదీ నుంచి 2019 జూన్ వరకూ దాదాపు రెండున్నర సంవత్సరాల పాటు విరాల్ ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించారు. అప్పట్లో ఆయన డిప్యూటీ గవర్నర్‌గా మానిటరీ పాలసీ, ఫైనాన్షియల్ మార్కెట్లు, ఫైనాన్షియల్ స్థిరత్వం–రిసెర్చ్ విభాగం ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. ఆరు నెలల ముందుగానే ఆయన అప్పట్లో రాజీనామా చేశారు.

విరాల్ రాసిన అంశాల్లో కొన్ని...

- ఆర్‌బీఐ ప్రతి సంవత్సరం తన లాభంలో కొంత భాగాన్ని ప్రభుత్వానికి అందజేస్తుంది. 2016 డిమోనిటైజేషన్‌కు ముందు మూడేళ్లలో ప్రభుత్వానికి రికార్డు లాభాలను బదిలీ చేసింది.
- నోట్ల రద్దు సంవత్సరంలో కరెన్సీ ముద్రణకు అయ్యే ఖర్చును కేంద్రానికి చేసిన బదిలీల నుంచి మినహాయించింది. ఫలితంగా 2019 ఎన్నికలకు ముందు ప్రభుత్వ నిధుల అవసరాలు మరింత పెరిగాయి. ఈ మొత్తాలను ఆర్‌బీఐ నుంచి పొందాలని బ్యూరోక్రాట్లు కొందరు ప్రయత్నించారు.
- స్వల్పకాలిక ప్రజాకర్షక వ్యయాల కోసం సెంట్రల్ బ్యాంక్ బ్యాలెన్స్ షీట్‌పై దాడి చేసే ప్రణాళికలను పదేపదే ప్రతిపాదించినప్పుడు.. సహేతుకమైన సంస్థలతో కూడిన ప్రజాస్వామ్యయుతంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌ను కలిగి ఉన్న దేశంలోని ఏ ప్రభుత్వమైనా బలీయమైన ప్రతిఘటనను ఎదుర్కొనకుండా ముందుకు సాగలేదు. ఇలాంటి సందర్భాలే ఒక సహేతుక వ్యవస్థ ఏర్పాటుకు దారితీస్తాయి. ఆర్‌బీఐ బ్యాలెన్స్ షీట్ల నుండి ప్రభుత్వానికి భవిష్యత్తులో బదిలీల కోసం సహేతుకమైన ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించడానికి మాజీ గవర్నర్ బిమల్ జలాన్ ఆధ్వర్యంలో ఒక కమిటీ ఏర్పాటు కావడం ఇలాంటిదే. ఆర్‌బీఐ బ్యాలెన్స్ షీట్ నుంచి భారీ నిధులు పొందాలని భావించిన వ్యక్తుల్లో పలువురిని ప్రభుత్వం పక్కన బెట్టడం కూడా జరిగింది.

2018లోనే 'విరాల్' వెల్లడి..

నిజానికి 2018 అక్టోబర్ 26న ఏడీ ష్రాఫ్ స్మారక ఉపన్యాసం సందర్భంగానే విరాల్ 'కేంద్రం– ఆర్‌బీఐ మధ్య విభేదాల విభేదాల అంశాన్ని మొదటిసారి సూచనప్రాయంగా ప్రస్తావించారు. తాజాగా అందుకు సంబంధించి మరిన్ని వివరాలు వెల్లడించారు. ''కేంద్ర బ్యాంకు స్వాతంత్ర్యాన్ని గౌరవించని ప్రభుత్వాలు తక్షణం లేదా అటు తరువాత ఆర్థిక మార్కెట్ల ఆగ్రహానికి గురవడం ఖాయం. ఆయా పరిణామాలు ఆర్థిక అనిశ్చితికి, రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్ దెబ్బతినే ప్రమాదానికి దారితీస్తాయి'' అని ఆయన అప్పట్లో పేర్కొన్నారు.

ఉర్జిత్ పటేల్ రాజీనామా ఇందుకేనా..?

తాజా అంశాలను విశ్లేషిస్తే...సెంట్రల్ బ్యాంక్ గవర్నర్‌గా 2018 డిసెంబర్‌లో ఉర్జిత్ పటేల్ రాజీనామాకు.. తాజాగా విరాల్ లేవనెత్తిన అంశానికీ ఏదైనా సంబంధం ఉందా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. అప్పట్లో ఉర్జిత్ పటేల్ ''వ్యక్తిగత కారణాలతో'' సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ బాధ్యతలకు రాజీనామా చేశారు. అప్పట్లో కేంద్రం–ఆర్‌బీఐ మధ్య తీవ్ర విభేదాలు తలెత్తాయన్న వార్తలు గుప్పుమన్నప్పటికీ దీనికి స్పష్టమైన కారణాలు తెలియలేదు. మూడేళ్ల పదవీ కాలం ముగిసేలోగా తన బాధ్యతలను మధ్యలోనే వదిలేసిన గవర్నర్‌గా పనిచేసిన అరుదైన సందర్భం ఆయనది.



ఫైనల్లో ఆకాశ్ కుమార్

ముస్తఫా హజ్రులాహోవిచ్ స్మారక అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత బాక్సర్ ఆకాశ్ కుమార్ (57 కేజీలు) ఫైనల్లోకి దూసుకెళ్లాడు. బోస్నియా అండ్ హెర్జెగోవినా రాజధాని సారాయెవోలో జరుగుతున్న ఈ టోర్నీ సెమీఫైనల్లో ఆకాశ్ 5–0తో పాలస్తీనాకు చెందిన వసీమ్ అబుసాల్‌ను ఓడించాడు. భారత్‌కే చెందిన మనీశ్ కౌశిక్ (63.5 కేజీలు), మంజు రాణి (50 కేజీలు) సెమీఫైనల్లోకి ప్రవేశించారు.

'బలోన్ డోర్' అవార్డు రేసులో మెస్సీ



ప్రతియేటా అత్యుత్తమ ఫుట్‌బాలర్లకు ఇచ్చే 'బలోన్ డోర్' పురస్కారం రేసులో అర్జెంటీనా స్టార్ మెస్సీ, ఫ్రాన్స్ కెప్టెన్ ఎంబాపెతో సహా 30 మంది ఉన్నారు. 2003 తర్వాత తొలిసారి పోర్చుగల్ స్టార్ ప్లేయర్ రొనాల్డో ఈ అవార్డు రేసులో లేకపోవడం గమనార్హం. అక్టోబర్ 30న విజేతను ప్రకటిస్తారు.


నెదర్లాండ్స్ ప్రపంచకప్ జట్టులో తేజ నిడమనూరు



అమ్‌స్టర్‌డామ్: భారత్ వేదికగా వచ్చే నెలలో జరిగే వన్డే ప్రపంచకప్‌లో పాల్గొనే నెదర్లాండ్స్ క్రికెట్ జట్టును ప్రకటించారు. 15 మంది సభ్యులతో కూడిన జట్టుకు స్కాట్ ఎడ్వర్డ్స్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తేజ నిడమనూరు ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొనే నెదర్లాండ్స్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. 29 ఏళ్ల తేజ 1994లో విజయవాడలో పుట్టాడు. విద్యాభ్యాసం కోసం న్యూజిలాండ్ వెళ్లి అక్కడ కొన్నాళ్లు క్లబ్ క్రికెట్ ఆడాడు. ఆ తర్వాత ఉద్యోగరీత్యా నెదర్లాండ్స్‌కు వెళ్లిన అతను జాతీయ జట్టులోకి ఎంపికయ్యాడు. ఇప్పటి వరకు తేజ నెదర్లాండ్స్ తరఫున 20 వన్డేలు ఆడి ఒక సెంచరీ సహాయంతో 511 పరుగులు చేశాడు. ఆరు అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు కూడా ఆడాడు. ఐదోసారి వన్డే ప్రపంచకప్‌లో ఆడుతున్న నెదర్లాండ్స్ గతంలో గ్రూప్ దశలోనే నిష్క్రమించింది. నెదర్లాండ్స్ తొలి రెండు మ్యాచ్‌లను హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో (అక్టోబర్ 6న పాకిస్తాన్‌తో; అక్టోబర్ 9న న్యూజిలాండ్‌తో) ఆడనుంది.

నెదర్లాండ్స్ జట్టు: స్కాట్ ఎడ్వర్డ్స్ (కెప్టెన్), మాక్స్ ఒడౌడ్, బస్ డె లీడి, విక్రమ్ సింగ్, తేజ నిడమనూరు, ఆర్యన్ దత్, మీకెరెన్, ఆకెర్‌మన్, వాన్ డెర్ మెర్వ్, లోగాన్ వాన్ బీక్, రియాన్ క్లెయిన్, వెస్లీ బారెసి, సాకిబ్, షారిజ్ అహ్మద్, ఎంజెల్‌బ్రెక్ట్.

శ్రీజకు నిరాశ



ప్యాంగ్‌చాంగ్ (దక్షిణ కొరియా): ఆసియా టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో జాతీయ చాంపియన్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ మహిళల సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ విభాగాల్లో రెండో రౌండ్‌ను దాటలేకపోయింది. సింగిల్స్ రెండో రౌండ్‌లో శ్రీజ 5–11, 6–11, 9–11తో ఇటో మిమా (జపాన్) చేతిలో ఓడిపోయింది. డబుల్స్‌లో తొలి రౌండ్‌లో 'బై' పొందిన శ్రీజ–దియా (భారత్) జోడీ రెండో రౌండ్‌లో 7–11, 6–11, 6–11తో సన్ యింగ్షా–వాంగ్ యిది (చైనా) జంట చేతిలో ఓటమి పాలైంది. మిక్స్‌డ్ డబుల్స్ రెండో రౌండ్‌లో శ్రీజ–హర్మీత్ జోడీ 6–11, 7–11, 8–11తో తొమోకాజు–హినా హయాటా (జపాన్) జంట చేతిలో ఓడిపోయింది.

అల్‌కరాజ్ అలవోకగా...

- వరుస సెట్‌లలో జ్వెరెవ్‌పై విజయం
- సెమీస్‌లో మాజీ విజేత మెద్వెదెవ్‌తో 'ఢీ'
- యూఎస్ ఓపెన్ టోర్నీ



అల్‌కరాజ్



మెద్వెదెవ్

న్యూయార్క్: గత పదిహేనేళ్లుగా యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో వరుసగా రెండేళ్లు ఒకే ప్లేయర్‌కు టైటిల్ దక్కలేదు. ఈ ఘనత సాధించేందుకు ప్రపంచ నంబర్‌వన్ కార్లోస్ అల్‌కరాజ్ చేరువయ్యాడు. సీజన్ నాలుగో గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఈ స్పెయిన్ స్టార్ అలవోక విజయంతో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. 12వ సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో అల్‌కరాజ్ 2 గంటల 30 నిమిషాల్లో 6–3, 6–2, 6–4తో గెలుపొందాడు. మూడు ఏస్‌లు సంధించిన అల్‌కరాజ్ మూడు డబుల్ ఫాల్ట్‌లు కూడా చేశాడు. నెట్‌వద్దకు 35 సార్లు దూసుకొచ్చిన అతను 28 సార్లు పాయింట్లు గెలిచాడు. నాలుగుసార్లు జ్వెరెవ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన అల్‌కరాజ్ తన సర్వీస్‌ను ఒక్కసారి కూడా కోల్పోలేదు. 2020లో ఈ టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన జ్వెరెవ్ నాలుగు డబుల్ ఫాల్ట్‌లు, 35 అనవసర తప్పిదాలు చేశాడు. మరో క్వార్టర్ ఫైనల్లో మూడో సీడ్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా) 6–4, 6–3, 6–4తో ఎనిమిదో సీడ్, తన దేశానికే చెందిన ఆంద్రీ రుబ్లెవ్‌ను ఓడించి ఈ టోర్నీలో నాలుగోసారి సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. ఫైనల్లో చోటు కోసం డిఫెండింగ్ చాంపియన్ అల్‌కరాజ్‌తో మెద్వెదెవ్ తలపడతాడు. 2021లో చాంపియన్‌గా నిలిచిన మెద్వెదెవ్... 2020లో సెమీఫైనల్లో, 2019లో ఫైనల్లో ఓడిపోయాడు.

వొండ్రుసోవాకు కీస్ షాక్

మహిళల సింగిల్స్ విభాగంలో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్, ఈ ఏడాది వింబుల్డన్ చాంపియన్ మర్కెటా వొండ్రుసోవా (చెక్ రిపబ్లిక్) పోరాటం ముగిసింది. 17వ సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా) 6–1, 6–4తో వొండ్రుసోవాను బోల్తా కొట్టించి ఈ టోర్నీలో 2018 తర్వాత మళ్లీ సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. 86 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో కీస్ మూడుసార్లు వొండ్రుసోవా సర్వీస్‌ను బ్రేక్ చేసింది. సెమీఫైనల్స్‌లో రెండో సీడ్ సబలెంకా (బెలారస్)తో కీస్; ముకోవా (చెక్ రిపబ్లిక్)తో కోకో గాఫ్ (అమెరికా) తలపడతారు.



రోహన్ బోపన్న   మాథ్యూ ఎబ్డెన్

ఫైనల్లోకి ప్రవేశించి బోపన్న రికార్డు

పురుషుల డబుల్స్ విభాగంలో ఆరో సీడ్ రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ టైటిల్ పోరుకు అర్హత సాధించింది. గురువారం జరిగిన సెమీఫైనల్లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 7–6 (7/3), 6–2తో పియరీ హ్యూజ్ హెర్బర్ట్–నికోలస్ మహుట్ (ఫ్రాన్స్) జంటను ఓడించింది. 94 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న జోడీ తన ప్రత్యర్థి జంట సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. రాజీవ్ రామ్ (అమెరికా)–సాలిస్‌బరీ (బ్రిటన్); ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా)–ఆస్టిన్ క్రాయిసెక్ (అమెరికా) మధ్య రెండో సెమీఫైనల్ విజేతతో ఫైనల్లో బోపన్న జంట తలపడుతుంది. తాజా ఫలితంతో 43 ఏళ్ల బోపన్న ఓపెన్ శకంలో గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఫైనల్ చేరిన పెద్ద వయస్కుడిగా రికార్డు నెలకొల్పాడు. తన కెరీర్‌లో పురుషుల డబుల్స్ విభాగంలో బోపన్న గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఫైనల్‌కు చేరడం ఇది రెండోసారి మాత్రమే. 2010లో ఐజామ్ ఖురేషి (పాకిస్తాన్)తో జతకట్టి యూఎస్ ఓపెన్‌లోనే ఫైనల్ చేరిన బోపన్న తుది పోరులో బాబ్ బ్రయాన్–మైక్ బ్రయాన్ (అమెరికా) ద్వయం చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచాడు.

ప్రజ్ఞానందకు మూడో స్థానం



కోల్‌కతా: టాటా స్టీల్ ఇండియా చెస్ ర్యాపిడ్ ఓపెన్ టోర్నీలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. పది మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య నిర్ణీత తొమ్మిది రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో ప్రజ్ఞానంద, అలెగ్జాండర్ గ్రిషుక్ (రష్యా), విదిత్ సంతోష్ గుజరాతి (భారత్) ఐదు పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచారు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించారు. ప్రజ్ఞానందకు మూడో ర్యాంక్, గ్రిషుక్‌కు నాలుగో ర్యాంక్, విదిత్‌కు ఐదో ర్యాంక్ లభించాయి. గురువారం జరిగిన చివరి మూడు రౌండ్‌లలో 18 ఏళ్ల ప్రజ్ఞానంద సహచరులు విదిత్, ఇరిగేశి అర్జున్‌లపై గెలిచి భారత నంబర్‌వన్ దొమ్మరాజు గుకేశ్ చేతిలో ఓడిపోయాడు. 4.5 పాయింట్లతో గుకేశ్ ఆరో స్థానంలో నిలిచాడు. 3 పాయింట్లతో అర్జున్ తొమ్మిదో స్థానంలో, పెంటేల హరికృష్ణ 2.5 పాయింట్లతో చివరిదైన పదో స్థానంలో నిలిచారు. 7 పాయింట్లతో ఫ్రాన్స్ గ్రాండ్‌మాస్టర్ మాక్సిమి వచీర్ లాగ్రెవ్ చాంపియన్‌గా అవతరించగా... 5.5 పాయింట్లతో తైమూర్ రజబోవ్ (అజర్‌బైజాన్) రన్నరప్‌గా నిలిచాడు. నేడు, రేపు బ్లిట్జ్ ఫార్మాట్‌లో టోర్నీ జరుగుతుంది.

'షూటౌట్'లో భారత్ ఓటమి



చియాంగ్ మాయ్ (థాయ్‌లాండ్): కింగ్స్ కప్ అంతర్జాతీయ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో భారత జట్టు మూడో స్థానం కోసం పోటీపడనుంది. ఇరాక్ జట్టుతో గురువారం జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టు 'పెనాల్టీ షూటౌట్'లో 4–5 గోల్స్ తేడాతో ఓడిపోయింది. నిర్ణీత సమయం ముగిసేసరికి రెండు జట్లు 2–2తో సమంగా నిలిచాయి. టోర్నీ నిబంధనల ప్రకారం అదనపు సమయం ఆడించకుండా నేరుగా 'షూటౌట్' ద్వారా ఫలితాన్ని నిర్ణయించారు. 'షూటౌట్'లో తొలి షాట్‌ను భారత ప్లేయర్ బ్రాండన్ ఫెర్నాండెజ్ గోల్ పోస్ట్‌కు కొట్టాడు. ఆ తర్వాత సందేశ్ జింగాన్, సురేశ్, అన్వర్ అలీ, రహీమ్ అలీ గోల్స్ చేశారు. ఇరాక్ తరఫున ఐదుగురు ఆటగాళ్లు గోల్స్ సాధించడంతో భారత్‌కు ఓటమి తప్పలేదు. అంతకుముందు భారత్ తరఫున మహేశ్ 16వ నిమిషంలో తొలి గోల్ చేశాడు. 28వ నిమిషంలో కరీమ్ అలీ గోల్‌తో ఇరాక్ స్కోరును 1–1తో సమం చేసింది. 51వ నిమిషంలో ఇరాక్ కెప్టెన్ జలాల్ హసన్ సెల్ఫ్ గోల్‌తో భారత్ 2–1తో ఆధిక్యంలోకి వెళ్లింది. 79వ నిమిషంలో అయ్‌మెన్ గోల్‌తో ఇరాక్ 2–2తో స్కోరును సమం చేసింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 70వ స్థానంలో ఉన్న ఇరాక్‌పై భారత్ ఏనాడూ గెలవలేదు. ఇప్పటి వరకు రెండు జట్లు ఏడుసార్లు తలపడ్డాయి. ఆరు మ్యాచ్‌ల్లో ఇరాక్ నెగ్గగా, మరో మ్యాచ్ 'డ్రా' అయింది. లెబనాన్, థాయ్‌లాండ్ జట్ల మధ్య రెండో సెమీఫైనల్ పరాజిత జట్టుతో మూడో స్థానం కోసం భారత్ తలపడుతుంది.

ఈనెల 21 నుంచి ఐఎస్‌ఎల్

న్యూఢిల్లీ: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) 2023–2024 సీజన్‌కు ఈ నెల 21న తెర లేవనుంది. కొచ్చిలో కేరళ బ్లాస్టర్స్, బెంగళూరు ఎఫ్‌సీ జట్ల మధ్య మ్యాచ్‌తో ఐఎస్ఎల్ పదో సీజన్ మొదలవుతుంది. డిసెంబర్ 29 వరకు తొలి అర్ధభాగం మ్యాచ్‌లను నిర్వహిస్తారు. మొత్తం 12 జట్లు బరిలో ఉన్నాయి. అయితే ఆసియా క్రీడలు జరిగే సమయంలోనే ఈ లీగ్ జరుగుతుండగా... ఆసియా క్రీడల్లో పాల్గొంటున్న 22 మంది సభ్యులతో కూడిన భారత జట్టులో ఐఎస్ఎల్‌లోని 10 క్లబ్‌లకు చెందిన ఆటగాళ్లు ఉన్నారు. ఆసియా క్రీడల కోసం తమ ఆటగాళ్లను విడుదల చేసేందుకు కొన్ని క్లబ్‌లు విముఖత వ్యక్తం చేస్తున్నాయని తెలిసింది. ఆసియా క్రీడలు సెప్టెంబర్ 23న మొదలవుతున్నా... ఫుట్‌బాల్ మ్యాచ్‌లు మాత్రం సెప్టెంబర్ 19 నుంచి జరుగుతాయి. భారత్ తమ గ్రూప్ లీగ్ మ్యాచ్‌లను సెప్టెంబర్ 19న చైనాతో, 21న బంగ్లాదేశ్‌తో, 24న మయన్మార్‌తో ఆడుతుంది.

క్లుప్తంగా...

పీజీ మెడికల్ యాజమాన్య కోటా సీట్లకు మరోసారి కౌన్సెలింగ్

24 గంటల్లో వెబ్ ఆప్షన్లు నమోదుకు ఆదేశం

సాక్షి, అమరావతి: 2023–24 విద్యా సంవత్సరానికి పీజీ మెడికల్ యాజమాన్య కోటా సీట్ల భర్తీకి ఇటీవల నిర్వహించిన రివైజ్డ్ కౌన్సెలింగ్‌ను రద్దు చేసినట్టు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం గురువారం ప్రకటించింది. యాజమాన్య కోటా సీట్ల ప్రవేశాల కోసం మళ్లీ వెబ్‌ఆప్షన్లు స్వీకరిస్తూ గురువారం రాత్రి నోటిఫికేషన్ జారీ చేసింది. నీట్ పీజీ అర్హత సాధించిన అభ్యర్థులు 24 గంటల్లోగా ఆప్షన్లు నమోదు చేసుకోవాలని సూచించింది. అనివార్య కారణాలతో ఎవరైనా అభ్యర్థులు ఆప్షన్లు నమోదు చేసుకోకపోతే గతంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు వారు నమోదు చేసుకున్న ఆప్షన్లను పరిగణనలోకి తీసుకుంటామని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) పేరిట శాంతీరామ్, జీఎస్ఎల్, మహారాజా కళాశాలల్లో పీజీ సీట్ల పెంపునకు నకిలీ అనుమతులు వెలువడిన నేపథ్యంలో తొలుత నిర్వహించిన కౌన్సెలింగ్‌ను యూనివర్సిటీ రద్దు చేసి, రివైజ్డ్ కౌన్సెలింగ్ నిర్వహించింది. ఆ తర్వాత రాజమండ్రి జీఎస్ఎల్ కళాశాలలో రేడియో డయగ్నోసిస్‌లో 14 పీజీ సీట్లకు నకిలీ అనుమతులు వెలువడినట్టు ఎన్ఎంసీ మంగళవారం ప్రకటించింది. ఇదే కళాశాలలో ఎమర్జెన్సీ మెడిసిన్‌లో మరో రెండు సీట్లకు నకిలీ అనుమతులు వచ్చినట్లు గురువారం తెలిపింది. దీంతో యాజమాన్య కోటా రివైజ్డ్ ఫేజ్–1 కౌన్సెలింగ్‌ను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని ప్రభుత్వం విశ్వవిద్యాలయాన్ని ఆదేశించింది.

తుంగభద్ర బోర్డు కార్యదర్శిగా ఓఆర్కే రెడ్డి

సాక్షి, అమరావతి: తుంగభద్ర బోర్డు కార్యదర్శిగా కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) బెంగళూరు కార్యాలయంలో ఎస్ఈగా పనిచేస్తోన్న ఓఆర్కే రెడ్డిని కేంద్ర జల్‌శక్తి శాఖ నియమించింది. బోర్డు కార్యదర్శిగా పనిచేస్తోన్న నాగమోహన్‌ను సీడబ్ల్యూసీ బెంగళూరు కార్యాలయంలో ఎస్ఈగా నియమిస్తూ ఉత్తర్వులిచ్చింది.

బాలామృతం సరఫరా టెండర్లకు అనుమతి

సాక్షి, అమరావతి: అంగన్‌వాడీల ద్వారా బాలామృతం సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ చేసిన ప్రతిపాదనల మేరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు 9 ప్రమాణాలతో బాలామృతం ఉత్పత్తుల సరఫరాకు చర్యలు చేపట్టింది. ఇందుకోసం టెండర్లు పిలిచేందుకు, జ్యూడిషియల్ ప్రివ్యూకు పరిపాలనాపరమైన అనుమతి ఇస్తున్నట్టు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి గురువారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అంగళ్లు అల్లర్ల కేసులో టీడీపీ మాజీ సర్పంచ్‌కు రిమాండ్

మదనపల్లి: మాజీ సీఎం చంద్రబాబు 'యుద్ధభేరి' పేరుతో చేపట్టిన ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా తంబళ్లపల్లె నియోజకవర్గం అంగళ్లులో ఆగస్టు 4న జరిగిన అల్లర్లకు సంబంధించి ముదివేడు పోలీసులు నమోదు చేసిన కేసులో నిందితుడిగా ఉన్న టీడీపీ మాజీ సర్పంచ్ పఠాన్ ఖాదర్‌ఖాన్ గురువారం ముదివేడు పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. పఠాన్ ఖాదర్‌ఖాన్‌కు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించిన అనంతరం విచారణ నిమిత్తం డీఎస్పీ కార్యాలయానికి తరలించారు. అక్కడ నుంచి జడ్జి ఇంటికి తీసుకువెళ్లి హాజరుపరచగా, రిమాండ్ విధించారు.

రాష్ట్రంలో గాడిదల వధను అడ్డుకోండి

హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం


సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గాడిదల వధను అడ్డుకోవడంతో పాటు ఈ విషయంలో చట్టనిబంధనలను అమలు చేయడంలో విఫలమైన అధికారులపై చర్యలు తీసుకునేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. గాడిద మాంసం తినడం మంచిదంటూ సమాజంలో ఉన్న ప్రచారానికి అడ్డుకట్టవేయడంతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి గాడిదల దిగుమతులను నిరోధించేందుకు చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించాలంటూ జంతుహక్కుల ఉద్యమకారులు శశికళ, జాగు సురేశ్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై బుధవారం న్యాయమూర్తులు జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి, జస్టిస్ రావు రఘునందన్ రావు ధర్మాసనం విచారించింది. పిటిషనర్ల న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. గాడిద మాంసం తింటే శరీర సౌష్టవం పెరుగుతుందన్న అపోహతో రాష్ట్రంలో విచక్షణారహితంగా గాడిదలను వధిస్తున్నారని తెలిపారు. ప్రకాశం ,గుంటూరు, కృష్ణా, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో గాడిద మాంసం విక్రయం భారీస్థాయిలో జరుగుతోందని చెప్పారు. ఇంత జరుగుతున్నా పోలీసులు నామమాత్రంగానే కేసులు నమోదు చేస్తున్నారని తెలిపారు. గాడిదలను అక్రమంగా నిర్బంధించిన వారిపై కేసులు నమోదు చేసేలా ఆదేశాలివ్వాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. భారత జంతు సంక్షేమ బోర్డు చైర్మన్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, పశుసంవర్ధకశాఖ ముఖ్య కార్యదర్శి తదితరులకు నోటీసులు జారీచేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని వారిని ఆదేశించింది. విచారణను అక్టోబర్ 4వ తేదీకి వాయిదా వేసింది.

మీ నిర్లక్ష్యంతోనే నవ్వుల పాలు!

వర్సిటీల్లో 1,383 పోస్టుల భర్తీకి బాబు అస్తవ్యస్త చర్యలు

నాడు పోస్టులలో భారీగా కోతపెట్టినా నోరెత్తని రామోజీ

సాక్షి అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొంటున్న ప్రత్యేక శ్రద్ధతో మన విద్యారంగం పలు రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు పునాదులు బలంగా మారుతున్నాయి. ముఖ్యంగా ప్రతి ఉన్నత విద్యా సంస్థ అత్యున్నత ప్రమాణాలతో న్యాక్, ఎన్బీఏ, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులను సాధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వర్సిటీల్లో, కాలేజీల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచింది. దశాబ్దాలుగా భర్తీ కాని డిగ్రీ కాలేజీల్లో లెక్చరర్ పోస్టులను భర్తీ చేశారు. గతంలో చంద్రబాబు హయాంలో వర్సిటీలలో అధ్యాపక పోస్టుల నియామకాల్లో పలు అక్రమాలు చోటు చేసుకున్నాయి. యూజీసీ నిబంధనలకు వ్యతిరేకంగా, రోస్టర్ పాయింట్లలో అవకతవకలు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వర్గాలకు పోస్టులు రాకుండా కుట్రలు చేశారు. అక్రమాలతో పోస్టుల హేతుబద్ధీకరణ చేసి గత ఎన్నికల ముందు నోటిఫికేషన్లు ఇచ్చారు. వీటిపై పలువురు కోర్టులను ఆశ్రయించడంతో నియామకాలు గందరగోళంగా మారాయి. ఇప్పుడు ప్రభుత్వం ఈ పోస్టుల భర్తీకి ప్రయత్నాలు చేసినా కోర్టుల్లో కేసులు ఉండడంతో ఆటంకాలు తప్పడంలేదు. వాటిని పరిష్కరించి నియామకాలు చేపట్టేందుకు కోర్టు నుంచి సానుకూల ఆదేశాలు తీసుకుని ప్రభుత్వం ముందుకు వెళ్తుంటే ఈనాడు యథాప్రకారం బురద చల్లుతోంది.



- ఉన్నత విద్యా వ్యవస్థలో కాలానుగుణంగా చోటు చేసుకునే మార్పులను అనుసరించి రేషనలైజేషన్‌కు యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్లకు పూర్తి అధికారాలున్నాయి. 2015లో ప్రొఫెసర్ రాఘవులు నేతృత్వంలో ఏర్పాటైన హైపవర్ కమిటీ సరైన విధానాలను పాటించకుండా రేషనలైజేషన్ ప్రక్రియ చేయటంతో కోర్టులో రిట్ పిటిషన్లు దాఖలై నియామకాలు చేపట్టలేని పరిస్థితులు నెలకొన్నాయి. 2018లో 1,711 పోస్టులు ఖాళీలు ఉండగా కేవలం 1,383 మాత్రమే భర్తీ చేయాలని గత ప్రభుత్వం ప్రతిపాదించినప్పుడు ఈనాడు ఏం చేస్తున్నట్లు? ఇప్పుడు విశ్వవిద్యాలయాల్లో 3,295 పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే కడుపుమంట ఎందుకు? ఇవే కాకుండా ఆర్జీయూకేటీకి 420 పోస్టులు, వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి 138 పోస్టులు, జేఎన్టీయూ గురజాడ విజయనగరం యూనివర్సిటీకి 104 పోస్టులను అదనంగా మంజూరు చేయడం కనపడటం లేదా? ఇవేమీ కొత్త పోస్టులు కాదు.. సర్దుబాటే అనే తరహాలో ఎందుకీ విష ప్రచారం?
- హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలోని 16 యూనివర్సిటీలు రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టాయి. యూజీసీ నిబంధనలకు అనుగుణంగా వర్క్ లోడ్, కేడర్ రేషియో ఆధారంగా అధ్యాపక పోస్టుల అవసరాన్ని అంచనా వేశారు. ఈ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాయి. అడ్వైజరీ కమిటీ సహకారంతో రేషనలైజేషన్ ప్రతిపాదనలను ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్లలో ఆమోదించి ప్రభుత్వానికి అందచేశాయి. ఉన్నత విద్యా మండలి సలహాతో వివిధ వర్సిటీలకు ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది.
- ఆంధ్ర విశ్వవిద్యాలయానికి రేషనలైజేషన్ అనంతరం 726 పోస్టులను మంజూరు చేశారు. గతంలో వర్సిటీకి మంజూరైన 926 పోస్టులలో 200 అవసరం లేదని గుర్తించారు. దీనికి కారణాలేమిటంటే అధ్యాపకులు ఒక వారంలో ఎన్ని గంటల పాటు బోధించాలనే విషయంలో యూజీసీ 1996 తర్వాత మార్పులు చేసింది. దీంతో శాస్త్రీయంగా లెక్కించి ఖాళీలను భర్తీ చేస్తున్నారు. అంతేగానీ ఆంధ్రా యూనివర్సిటీని తక్కువ చేయటం గానీ వర్సిటీ అభివృద్ధికి ఆటంకం కలిగించేలా ఎలాంటి నిర్ణయాలనుగానీ తీసుకోలేదు. ఇక్కడ మిగిలిన పోస్టులను రాష్ట్రంలో ఇతర వర్సిటీలకు సర్దుబాటు చేస్తున్నారు. అదే విధంగా శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 150 అధ్యాపక పోస్టుల విషయంలో హేతుబద్ధీకరణ జరిగింది.
- బ్యాక్ లాగ్ పోస్టులను ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా ఆయా వర్సిటీల్లో భర్తీ చేస్తారు. మూసివేసిన విభాగాలలో కూడా బ్యాక్ లాగ్ వేకెన్సీ ఉంటే ప్రస్తుత నిబంధనల ప్రకారం నింపుతారు.

విద్యుత్ కొరతపై రాష్ట్రాలకు హెచ్చరిక

సెప్టెంబర్, అక్టోబర్‌లోనూ విద్యుత్ కొరత తప్పదన్న కేంద్రం

- వాతావరణ పరిస్థితుల వల్ల భారీగా తగ్గిన ఉత్పత్తి
- నెలాఖరు నాటికి బొగ్గు దిగుమతులు పెంచుకోవాలని సూచన



సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా ఏర్పడ్డ విద్యుత్ కొరత పరిస్థితులు సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లోనూ కొనసాగుతాయని, ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలను హెచ్చరించింది. రానున్న గడ్డు పరిస్థితుల కోసం ఇప్పుడే అప్రమత్తం కావాలని, థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని పెంచుకోవడానికి ఈ నెలాఖరు నాటికి బొగ్గును దిగుమతి చేసుకోవాలని సూచించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి తాజాగా ఓ లేఖ పంపింది. ఈ ఏడాది ఆగస్టులో గరిష్ట డిమాండ్‌లో కొరత 23 శాతంగా ఉందని, ఇది ప్రపంచంలోనే అత్యధికమని కేంద్రం తెలిపింది. కొన్ని రాష్ట్రాలు విద్యుత్ డిమాండ్‌ను తీర్చలేకపోయాయని చెప్పింది. నిజానికి ఈ ఏడాది ఆగస్టు 15 తరువాత బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి యూనిట్లను నిషేధించామని, పరిస్థితులు చక్కబడకపోవడంతో నిషేధాన్ని పక్కనపెట్టి అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగించుకోవాలని వివరించింది. ఈ ఏడాది రుతుపవనాలు ఇప్పటివరకు సాధారణం కంటే తక్కువగా ఉన్నందున సెప్టెంబర్‌లోనూ వర్షాలు ఆశించినంతగా లేనందున రిజర్వాయర్లలో నీటి మట్టాలు క్షీణించాయని, దానివల్ల గత ఏడాది 45 గిగావాట్లుగా ఉన్న గరిష్ట హైడ్రో పవర్ ఉత్పత్తి ఈ ఏడాది 40 గిగావాట్ల కంటే తక్కువగా ఉందని వెల్లడించింది. పవన ఉత్పత్తిలో కూడా ఇదే ధోరణి కనిపిస్తోందని, సెప్టెంబర్–అక్టోబర్ కాలంలో రుతుపవనాల ఉపసంహరణతో జల, గాలి ఉత్పత్తి మరింత క్షీణిస్తుందని అంచనా వేసినట్టు కేంద్రం తెలిపింది. థర్మల్ ప్లాంట్లు కూడా పూర్తి సామర్థ్యంతో నడవకపోవడం వల్ల 12–14 గిగావాట్ల థర్మల్ విద్యుత్ అందుబాటులో లేదన్నారు. వెంటనే వాటిని అందుబాటులోకి తేవాలని ఆదేశించింది. అలాగే థర్మల్, సోలార్, విండ్ వంటి కొత్త యూనిట్లను త్వరితగతిన ప్రారంభించాలని కోరింది. విద్యుత్ డిమాండ్ తీర్చేందుకు కొనుగోలు ఒప్పందాలు(పీపీఏ)లు కుదుర్చుకోవాలని, స్వల్పకాలిక టెండర్ల ద్వారా విద్యుత్‌ను బహిరంగ మార్కెట్ ద్వారా సమకూర్చుకోవాలని సూచించింది.

లోకేశ్ పాదయాత్ర వెలవెల

జనం రాకపోవడంతో పార్టీ నేతలపై లోకేశ్ ఆగ్రహం

నరసాపురం రూరల్/పాలకొల్లు అర్బన్ : పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం, పాలకొల్లు నియోజకవర్గాల్లో నారా లోకేశ్ గురువారం నిర్వహించిన పాదయాత్రకు జనస్పందన కరువైంది. నరసాపురం నియోజకవర్గంలో జనం లేక పాదయాత్ర వెలవెలబోయింది. దీంతో స్థానిక టీడీపీ నేతలపై లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. పాలకొల్లు మండలం దిగమర్రు నుంచి పెదమామిడిపల్లి వరకు నిర్వహించిన పాదయాత్రకు జన స్పందన కరువైంది. దిగమర్రు మూడు రోడ్ల కూడలిలో ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన మహిళలతో ఖాళీ బిందెలు ప్రదర్శించి మంచినీటి సమస్య ఉన్నట్టుగా బిల్డప్ ఇచ్చారు. దిగమర్రు గ్రామంలో కల్లుగీత కార్మికులతో మాట్లాడారు. పెదమామిడిపల్లి చేరుకునేసరికి చీకటి పడింది. దీంతో టీడీపీ కార్యకర్తలు కాగడాలు వెలిగించి ఆగస్టులో కూడా విద్యుత్ కోతలంటూ దుష్ప్రచారం చేశారు. కార్యకర్తలకు పెట్రోల్ కోసం రూ.100, మగవారికి రూ.500, ఆడవారికి రూ.300 చెల్లించి పాదయాత్రకు తరలించినట్టు సమాచారం. పాదయాత్రలో జై బాలయ్య, జై జై నిమ్మల అనే నినాదాలే వినిపించాయి. ఎక్కడా లోకేశ్‌కు అనుకూల నినాదాలు చేయకపోవడం గమనార్హం.



నరసాపురంలో జనం లేక వెలవెలబోతున్న లోకేశ్ పాదయాత్ర

లోకేశ్ టీమ్ నిర్లక్ష్యంతో దంపతులకు గాయాలు

యువగళం బృందం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల పాదయాత్ర సందర్భంగా ఓ దంపతులు గాయాల పాలయ్యారు. నరసాపురం మండలం చిట్టవరం వద్ద లోకేశ్ టీమ్‌కు చెందిన కారు డోరు ఒక్కసారిగా తెరవడంతో నరసాపురం వైపు వస్తున్న మోటార్ బైక్‌కు బలంగా తగిలింది. బైక్‌పై ప్రయాణిస్తున్న కడలి మోహనరావు, సరోజిని దంపతులు కిందపడిపోయి గాయాలపాలయ్యారు. పోలీసులు వెంటనే వారిద్దరినీ వాహనంలో తీసుకెళ్లి పాలకొల్లులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు.

బెంగళూరు విమానాశ్రయంలో పట్టివేత

సూట్‌కేసుల్లో కింగ్ కోబ్రాలు, కోతులు



సాక్షి బెంగళూరు:బ్యాంకాక్ నుంచి బెంగళూరు కెంపేగౌడ విమానాశ్రయంలో దిగిన ప్రయాణికుని లగేజ్ బ్యాగ్‌లో 78 ప్రాణులు లభించాయి, ఇందులో 20 వరకు విషపూరిత కింగ్ కోబ్రాలు కూడా ఉండటంతో విమానాశ్రయ సిబ్బంది భయపడిపోయారు. వివరాలివీ.. ఈ నెల 6న రాత్రి 10.30 గంటలకు బ్యాంకాక్ నుంచి ఎయిర్ ఏసియా విమానంలో వచ్చిన ఓ ప్రయాణికుడి సూట్‌కేసులను తనిఖీ చేశారు. వాటిలో ప్రాణంతో ఉన్న 20 కింగ్ కోబ్రా పాములు కనిపించాయి. వీటితో పాటు 55 ఇతర పాములు, ఆరు కోతులు ఉన్నాయి. మొత్తం 78 ప్రాణులను ఆ ప్రయాణికుడు అక్రమంగా బ్యాంకాంగ్ నుంచి బెంగళూరుకు తరలిస్తూ కస్టమ్స్ అధికారులకు పట్టుబడ్డాడు. నిందితుణ్ణి అరెస్ట్ చేసి ప్రాణులను సంరక్షణ కేంద్రానికి తరలించారు. కాగా, బెంగళూరు విమానాశ్రయం కేంద్రంగా వన్యజీవుల స్మగ్లింగ్ ముఠాలు నిషిద్ధ జంతువులను చేరవేస్తున్నట్టు అనుమానాలున్నాయి. గత నెలలో 230కి పైగా బల్లులు, పాములు, ఒక కంగారూ పిల్ల తదితరాలతో కూడిన లగేజీ పట్టుబడింది.

పరిటాల వారి నకిలీ ఓట్ల రాజకీయం

రాప్తాడు నియోజకవర్గంలో భారీగా కర్ణాటక ఓట్లు

- ఎన్నికల సమయంలోనే వచ్చే ఓటర్లు.. ఐదేళ్లు అదృశ్యం
- 'పరిటాల' కనుసన్నల్లో దశాబ్దాలుగా నకిలీ ఓట్ల దందా
- దొంగ ఓట్లు, రిగ్గింగ్‌తోనే అరకొర మెజార్టీతో విజయం
- గెలుస్తామనే నమ్మకం కోల్పోయిన పరిటాల సునీత, ఆమె కుమారుడు శ్రీరామ్
- అందుకే దొంగ ఓట్ల తొలగింపుపై అనవసర రాద్ధాంతం

- శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం నసనకోట పంచాయతీలో ఇంటి నంబరు 8–63లో 12 ఓట్లు ఉన్నాయి. అందులో ఆరుగురు స్థానికులే. మరో ఆరుగురు కర్ణాటకకు చెందిన వారు. వాళ్లంతా పోలింగ్ రోజునే ఇక్కడికి వస్తారు. ఓటు వేసి వెళ్లిపోతారు. మళ్లీ ఎన్నికలొచ్చినప్పుడు ఓట్లేయడానికే తప్ప ఇటు వైపు కన్నెత్తి కూడా చూడరు.
- కర్ణాటకకు చెందిన కె.ప్రతాప్ (48), బి.రమేశ్‌కుమార్ (49), వి.నాగయ్య (73), డి.వెంకటస్వామి (71), డి.వెంకటప్ప (48), వి.వెంకటస్వామి (68) పేర్లు రామగిరి మండలం నసనకోట పంచాయతీ ఓటరు జాబితాలో ఉన్నాయి. వీళ్లందరూ ఎన్నికల రోజు మినహా మిగతా రోజుల్లో ఆంధ్రలో కనిపించరు.

...రామగిరి మండలంలో ఇలాంటి నకిలీ ఓట్లు చాలా పంచాయతీల్లో ఉన్నాయి. ప్రతి పంచాయతీలో కర్ణాటక వాసులను, ఇతర దేశాల్లో నివసిస్తున్న వారి పేర్లను ఓటరు జాబితాలో ఎక్కించి దొంగ ఓట్లు వేయించుకోవడమే పరిటాల కుటుంబం పని.

సాక్షి, పుట్టపర్తి: గత ఎన్నికల్లో ఓటమి, వచ్చే ఎన్నికల్లో గెలిచే అవకాశాల్లేవని అర్థమవడంతో 'పరిటాల' కుటుంబం దొంగ ఓట్లను కాపాడుకోవడానికి శతధా ప్రయత్నిస్తోంది. రాప్తాడు నియోజకవర్గంలో తాజా ఓటర్ల జాబితాపై లేనిపోని రాద్ధాంతం చేస్తోంది. పరిటాల రవీంద్ర టీడీపీలో ప్రవేశించినప్పటి నుంచి నకిలీ ఓట్లపైనే ఆధారపడ్డారు. అదే తరహాలో ఆయన కుమారుడు పరిటాల శ్రీరామ్ కూడా దొంగ ఓట్ల రాజకీయం చేయాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. స్థానికంగా లేని వారి ఓట్ల తొలగింపును ఆయన జీర్ణించుకోలేకపోతున్నారు. రవీంద్ర హయాంలోనే పెనుకొండ (ప్రస్తుతం రాప్తాడు) నియోజకవర్గంలో ఉన్న రామగిరి, కనగానపల్లి మండలాల్లో వేల సంఖ్యలో నకిలీ ఓట్లను చేర్పించింది పరిటాల కుటుంబం. రవీంద్రకు భయపడి అధికారులు ఎదురు మాట్లాడేవారు కాదు. దశాబ్దాలుగా దొంగ ఓట్లతో పాటు రిగ్గింగ్, దౌర్జన్యాలతో అమాయక ప్రజల ఓట్లను వారే వేసుకొనేవారు. ప్రస్తుతం ఓటమి భయం వెంటాడుతోంది. ఫలితంగా కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లోని ప్రజలకు ఆంధ్రలో ఓటరు కార్డులు ఇచ్చేందుకు టీడీపీ నేతలు శత విధాలుగా ప్రయత్నిస్తున్నారు. దొంగ ఓట్ల తొలగింపుపై పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ అనవసర రాద్ధాంతం చేస్తున్నారు. అవి దొంగ ఓట్లే అని ఒప్పుకోలేక, కాదనీ చెప్పలేక రోజుకోరకంగా మాట్లాడుతున్నారు.



పరిటాల సునీత సొంత పంచాయతీ నసనకోటలో కర్ణాటక ఓటర్లు

ఎన్నికల్లో ఢీకొనే సత్తా లేక..

నేరుగా ఎన్నికల్లో ఢీకొనే సత్తా లేక నకిలీ ఓట్లపై పరిటాల కుటుంబం ఆధారపడింది. రవీంద్ర చేసిన హత్యాకాండను ప్రజలు మరువలేదు. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు సంపూర్ణంగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో నిజాయితీగా గెలవలేక దొంగ ఓట్లపై మాజీ మంత్రి పరిటాల సునీత గతంలో నమోదు చేయించిన దొంగ ఓట్లను కాపాడుకునేందుకు శత విధాలుగా ప్రయత్నిస్తున్నారు. నకిలీ ఓట్లలో అధిక శాతం పరిటాల సునీత సొంత పంచాయతీ నసనకోటలోనే ఉన్నాయి. వాటిని తొలగించే ప్రయత్నం చేస్తుండగా.. తమ పార్టీ ఓట్లు తొలగిస్తున్నారంటూ హంగామా సృష్టిస్తున్నారు.

చెట్ల ట్రాన్స్‌లోకేషన్ విషయంలో ఏం చేస్తున్నారో చెప్పండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం.. నోటీసులు జారీ

సాక్షి, అమరావతి: రోడ్ల విస్తరణ, విద్యుత్ లైన్ల ఏర్పాటు, నిర్వహణ తదితరాల పేరుతో చెట్లను విచక్షణారహితంగా కొట్టేస్తుండడంపై హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. చెట్ల కూల్చివేతలను నిరోధించే విషయంలో రాజీపడలేమంది. వందల ఏళ్ల నాటి భారీ వృక్షాలను కూల్చివేయడం వల్ల జరిగే నష్టాన్ని.. వాటిస్థానంలో కొన్ని చెట్లు నాటడం ద్వారా పూడ్చలేమని సుప్రీంకోర్టు చెప్పిన విషయాన్ని గుర్తు చేసింది. చెట్లను కూల్చివేసే బదులు వాటిని వేర్లతో సహా పెకలించి మరోచోట నాటే (ట్రాన్స్‌లోకేషన్) విధానాన్ని అమలు చేసే విషయంలో ఏం చర్యలు తీసుకున్నారో తెలపాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలంటూ సీఎస్, పంచాయతీరాజ్, అటవీ, ఇంధనశాఖల ముఖ్య కార్యదర్శులు, ఏపీ సుందరీకరణ, పచ్చదన కార్పొరేషన్‌లను ఆదేశించింది. విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేసింది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943